


# INDIAN FREEDOM STRUGGLE: UPRISINGS OF MUSLIM PATRIOTS

**Telugu title of this book is BHARATHA SWATHANTRADYAMAM : MUSLIM PRAJA PORATALU.**

**In this book it is discussed at length on the greatest Struggles went on against British starting from 1763, in which Muslim Heroes lead the Movements or Struggles, as a part of struggle for India's Independence.**

**These famous struggles are 1. Fakirs-Sanyasis Movement, 2. Wahabi Movement, 3. Farazia Movement, 4. Mopilla Movement, 5. Kudai-khidmathgar Movement, which were not so popular like Khilafath Movement.**


**This Book contains total 178 pages of 1/8$^{th}$ Demmy Size with Multi colour. It was published in 2007. The same was Published second time in the year November, 2007**

# భారత స్వాతంత్ర్యోద్యమం

# ముస్లిం ప్రజా పోరాటాలు



సయ్యద్ నశీర్ అహమ్మద్



**సయ్యద్ నశీర్ అహమ్మద్,** డిసెంబరు 22, 1955లో నెల్లూరు జిల్లా పురిణి గ్రామంలోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. తల్లి సయ్యద్ బీబిజాన్, తండ్రి సయ్యద్ మీరామొహిద్దీన్, ప్రాథమిక విద్య పురిణి గ్రామంలో జరిగింది. ఉన్నతవిద్యను కావలి, నరసరావుపేట, భోపాల్, చిత్రదుర్గ, గుంటూరులలో పూర్తిచేశారు.

విద్యార్థి దశనుండే సమకాలీన సమాజాన్ని అధ్యయనం చేయడంద్వారా, పరిశీలనా దృష్టిని, సేవాభావాన్ని అలవర్చుకున్న ఆయన అనేక సాంఘిక, సాహితీ, సేవాసంస్థలలో బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించారు. వికలాంగులు, ప్రత్యేకంగా అంధుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, స్వయంకృషితో వారు అభ్యున్నతి దిశగా సాగేందుకు సంఘాలు ఏర్పాటు చేయించి ఆయా సంఘాలకు ప్రధాన సలహాదారునిగా చురుకైన మార్గదర్శకత్వం చేస్తున్నారు. అఖిల భారత చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, చిన్న పత్రికల మనుగడ కోసం కృషి చేశారు.

విద్యాభ్యాసం తరువాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, ఆ తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి, న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. న్యాయవాదిగా పనిచేస్తూనే, "ఉదయం" దినపత్రిక విలేఖరిగా చేరి 10 సంవత్సరాల కాలంలో ఆ పత్రిక విజయవాడ ఎడిషన్ "న్యూస్ కో-ఆర్డినేటర్" స్థాయికి ఎదిగారు. ఆతరువాత కొంతకాలం "వార్త" దినపత్రికలో గుంటూరు బ్యూరో ఇన్‌చార్జ్ గా పనిచేశారు. పలు వార, పక్ష, మాసపత్రికలకు సంపాదకత్వ బాధ్యతలను స్వీకరించి ఉచిత సేవలను అందించారు. ఆయన రాసిన పలు వ్యాసాలు, కవితలు, గేయాలు, కథలు, కథానికలు దాదాపు అన్ని ప్రముఖ తెలుగు పత్రికలలో చోటుచేసుకున్నాయి. **"భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు", "భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు", "భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు", "మైసూరు పులి : టిపూ సుల్తాన్", "షహీద్-ఏ-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్"** పుస్తకాలను రాసి ప్రచురించారు.

ప్రస్తుతం **"భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం యోధులు"** రచన పూర్తి చేశారు. **"భారతీయ ముస్లింలు"** అను పరిశోధనాత్మక గ్రంథరచన ప్రధాన లక్ష్యంగా, భారతీయ ముస్లింల సామాజిక - ఆర్థిక - రాజకీయ స్థితిగతుల మీద పరిశోధన సాగిస్తున్నారు. చరిత్ర, ఆర్థిక, సామాజిక శాస్త్రాల అధ్యయనం పట్ల ఆసక్తి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో సభ్యునిగా పలు సభలు, సమావేశాలు, సదస్సులలో పాల్గొన్నారు. మంచి వక్త. భారతదేశంలోని అన్ని సాంఘిక జన సముదాయాల మధ్య స్నేహం, సామరస్యం, సుహృద్భావ వాతావరణం మరింతగా విలసిల్లాలని ఆకాంక్షించే మానవతావాది. లౌకిక ప్రజాసామ్యవాది.

భారత స్వాతంత్ర్యోద్యమం

# ముస్లిం ప్రజాపోరాటాలు

సయ్యద్ నశీర్ అహమ్మద్
M.Com; LL.B; D.J; D.P.M; D.L.L
Sahithya Rathna ( Hindi )

**ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్**
3-506, అప్సాఘర్, ఉండవల్లి సెంటర్-522501,
తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.
08645-272940, 9440241727
e-mail : naseerahamed@yahoo.com

# **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు**

Indian Freedom Movement : Uprisings of Muslim Patriots

**సయ్యద్ నశీర్ అహమ్మద్**

Syed Naseer Ahamed

ప్రచురణ సంఖ్య : 6
ప్రథమ ముద్రణ : డిసెంబర్ 2003

వెల : రు. 50-00

ముద్రణ : ముద్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ
ముఖపత్రాలంకరణ : అబ్దుల్లా, విజయవాడ

పుస్తకాలు :

**ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్**

3-506, అప్పాఘర్, ఉండవల్లి సెంటర్ - 522 501,
తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

**మరియు**

**ప్రజాశక్తి, మైత్రి, విశాలాంధ్ర, నవోదయ,**
**దిశ, సహచర, తక్షశిల, మణి** తదితర
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో లభ్యం.

# అంకితం



సయ్యద్ మీరా మోహిద్దీన్



సయ్యద్ బీబిజాన్

**చిన్ననాటనే నాన్న కన్నుమూసినా,**

**అన్నీ తానై నన్నింతటివాడ్ని చేసిన**

**అమ్మకు.**

# నామాట

ప్రపంచ చరిత్రలో అపూర్వం అనదగిన రీతిలో సాగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ రాస్తున్న పుస్తకాలకు పాఠకులు, ప్రజలు, పత్రికల నుండి లభించిన ఆదరణ, ప్రోత్సాహంతో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా, ఈ నేలతల్లి బిడ్డలైన ముస్లింల భాగస్వామ్యంతో సాగిన ప్రధాన ఉద్యమాలను ఈ గ్రంథంలో క్లుప్తంగా వివరించాను.

భరతగడ్డ మీద బ్రిటీషర్లు బలపడుతున్న సమయాన,1763 ప్రాంతంలో ప్రారంభమై 1947 వరకు సాగిన పలు ప్రజా పోరాటాలలో ముస్లింలు తమదైన పాత్ర వహించారు. ఈ పోరాటాలన్నింటిలో **ఖిలాఫత్ఉద్యమం** అగ్రభాగాన నిలచింది. ఈ ఉద్యమం ముస్లిం-ముస్లిమేతర జనసముదాయాల మధ్య ఐక్యతకు, స్నేహానికీ, సామరస్యానికి ప్రతీకగా నిలిచి, విఖ్యాతిగాంచింది. జాతీయోద్యమం ప్రథమార్థంలో ప్రారంభమై, స్వాతంత్ర్య పోరాటానికే తలమానికంగా నిలచిన, **ఖిలాఫత్ ఉద్యమం** గురించి ఈ గ్రంథంలో ప్రస్తావించటంలేదు. మరొక ప్రత్యేక గ్రంథం రాస్తే తప్ప, ఆ ఉద్యమ చరిత్రకు సరైన న్యాయం జరగదు.

ప్రస్తుత గ్రంథంలో ఐదు ఉద్యమాల గురించి ప్రస్తావించాను. అవి **ఫకీర్ల తిరుగుబాటు, వహాబీల పోరాటం, ఫరాజీల ఉద్యమం, మోప్లాల తిరుగుబాటు, ఖుదా-యే-ఖిద్మత్గార్‌ల అహింసా ఉద్యమం**. ఈ ప్రతి ఉద్యమం గురించి ఒక ప్రత్యేక పుస్తకం రాయాల్సినంతగా ప్రజల సాహసం, త్యాగం, ఆత్మార్పణలు ఇమిడి ఉన్నాయి. నాకున్న పరిమితుల మేరకు ఆ వివరాలను రేఖా మాత్రంగా పేర్కొన్నాను.

ఈ అమూల్యమైన సమాచారాన్ని పుస్తక రూపంలో మీ ముందుంచగలిగే అవకాశం నాకు లభించినప్పటికీ, ఈ కృషిలో సమాచారం కోసం నేను సంప్రదించిన పలు గ్రంథ రచయితల, ప్రముఖుల పరోక్ష భాగస్వామ్యం ఉన్నందున, ఆ మహనీయులందరికీ నా ప్రత్యేక కృతజ్ఞతలు. నేను కోరగానే ముందుమాట రాసిచ్చిన గురుతుల్యులు, **'ఆంధ్రజ్యోతి'** దినపత్రిక ప్రధాన సంపాదకులు **కె. రామచంద్రమూర్తి** గారికి, పరిచయ వాక్యం రాసిన ప్రముఖ దళిత ఉద్యమకారులు, బహుగ్రంథ రచయిత **కత్తి పద్మారావు** గారికి, ఈ సమాచారాన్ని ధారావాహికంగా ప్రచురించిన **'గీటురాయి'** వారపత్రిక సంపాదకులు **యన్.యం. మల్లిక్** గారికి, చిత్తు ప్రతిని చదివి, పలు సూచనలు చేసిన ప్రముఖ సాహితీవేత్త **కొత్తపల్లి రవి బాబు** గారికి, కవర్ డిజైన్ చేసిన ప్రముఖ చిత్రకారుడు **అబ్దుల్లా** గారికి, పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన **ముద్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్**, విజయవాడ వారికి, నా ప్రయత్నాలకు అన్ని సమయాలలో ప్రేరణగా నిలచి, ప్రోత్సహిస్తున్న నా జీవిత భాగస్వామి **షేక్ రమిజా భాను**కు నా ధన్యవాదాలు.

**సయ్యద్ నశీర్ అహమ్మద్**
01-12-2003

**అక్షాఫర్**
**ఉండవల్లి సెంటర్** - 522 501

We are very much grateful to our patrons
without whose valuable cooperation
we could not have brought out this book.



**Dr. M. EJAJ ALI** M.S
National President :
All India United Muslim Morcha
Chief Editor : Sangam Urdu Daily
**PATNA - 800 006**, Bihar State.



**Dr. UMAR ALISHA** M.D (A.M)
Peetaadhipathi
Sri Viswa Viznana Vidya Aadyathmika
Peetham
**PITHAPU[illegible]50**



**Sri. REKHA KRISHNARJUNA RAO**
Founder : Bowdha Sangham
**MANGALAGIRI - 522 503**
Guntur Dist. A.P



**Sri. KOLLI LAKSHMA REDDY**
**Managing Director**
Cake Group of Bakeries
Kothapet, **GUNTUR**

**Janab Md. YUSUF**
Chairman : DATA CREATIONS
Rahaman Street, Arundelpet,
**VIJAYAWADA - 2**

**Azad House of Publications**
Undavalli Centre - 522 501

# విషయ సూచిక


ముందుమాట
**కె. రామచంద్రమూర్తి**
పరిచయ వాక్యం
**కత్తి పద్మారావు**

01 బ్రిటీషర్ల మీద తొలి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన బెబ్బులులు
**బెంగాల్ ఫకీర్లు**
**1763 - 1800** 14-31

02 చెరసాలలు, ఉరికొయ్యలకు వెరవక విక్రమించిన
**వహాబీ వీరులు**
**1820 - 1870** 32-57

03 దోపిడీ శక్తుల గుండెల్లో భయోత్పాతం సృష్టించిన
**ఫరాజీ యోధులు**
**1830 - 1900** 58-77

04 స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కలకలం రేపిన
**మోప్లా మొనగాళ్ళు**
**1800 - 1922** 78-116

05 అహింసా మార్గాన ఆత్మార్పణలకు సిద్ధపడిన
**ఖుదా-యే-ఖిద్మత్‌గార్ వీరులు**
**1929 - 1948** 117-158

❖ ఆధార గ్రంథాల పట్టిక 159-160
❖ రచయిత గ్రంథాల మీద
ప్రముఖుల - పత్రికల స్పందన 161-172



## ముందుమాట


## కె. రామచంద్రమూర్తి

సంపాదకులు

ఆంధ్రజ్యోతి, దినపత్రిక


**మ**తసామరస్యం భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు తాత్త్విక ప్రాతిపదిక. భారతీయతను హిందూత్వంగా అపార్థం చేసుకొని సంకుచిత దృష్టితో నిర్వచనం చెప్పేవారున్నారు. ఈ నిర్వచనాన్ని ప్రశ్నించకుండా శిరసావహించి అల్పసంఖ్యాక వర్గాలు, అధిక సంఖ్యాకుల అభీష్టానికి అనుకూలంగా మసలుకోవాలని కోరేవారు హిందువులలో కొందరు ఉన్నారు. తాము నిజంగానే భారత జీవన ప్రధాన స్రవంతిలో భాగం కామనీ, కాబోమనే ఆత్మన్యూనతాభావనతో దూరం దూరంగా జరిగే అల్ప సంఖ్యాక వర్గాల వారూ ఉన్నారు. ఈ ధోరణులన్నీ భారతీయతకు వ్యతిరేకమైనవి. భారత సమాజంలో హిందువులూ, ముస్లింలూ, క్రైస్తవులూ, సిక్కులూ, పార్శీలూ, తదితర సకల మతాలవారు సమాన హక్కులతో, సమాన స్వేచ్ఛతో జీవించాలి. అదే మన తాత్త్విక పునాది. అదే మన రాజ్యాంగ నిర్మాతల సంకల్పం.

ముస్లింలు ఇక్కడివారు కారనీ, ఎక్కడి నుంచో వచ్చినారనీ, ఎక్కడికో వెళ్ళవలసినవారనీ, ఒకవేళ ఇక్కడ ఉండదలచుకుంటే మాత్రం హిందువుల ఇష్టాయిష్టాలను గౌరవించాలని భావించే హిందువులు కానీ, తమకు ఈ సమాజంలో స్థానంలేదని, తమను ప్రధాన స్రవంతిలో కలవనివ్వరనీ, ద్వితీయ శ్రేణి పౌరులుగానే శాశ్వతంగా మిగిలిపోవాలనీ తలపోసే మైనారిటీ వర్గాలవారు కానీ, చరిత్రను సవ్యంగా అర్థం చేసుకోవడంలో విఫలమైనవారని గుర్తించాలి. ఎవరు ఎక్కడి నుంచి వచ్చినా తరతరాలుగా ఈ నేలను నమ్ముకొని ఇక్కడ పుట్టి ఇక్కడ మట్టిలో కలిసిపోయేే వారంతా భారతీయులేనన్న ప్రాథమిక అవగాహన సహజీవన సిద్ధాంతానికి స్ఫూర్తి. విభిన్న జాతుల, భాషల, సంస్కృతుల సమాహారమే భారత జాతి. '**భిన్నత్వంలో ఏకత్వం**' మన ప్రత్యేకత. మనది బహుముఖీనమైన సమాజం. పూలతోటలో ఎన్ని రకాల, ఎన్ని రంగుల పూలు ఉంటాయో నవభారత బృందావనంలోనూ అన్ని రకాల, అన్ని రంగుల, అన్ని ధోరణుల మనుషులు ఉంటారు. మొగలు సామ్రాజ్య నిర్మాణం తర్వాత ముస్లింలు భారతదేశంలో స్థిరపడిపోయారు. ఇక్కడి జీవన స్రవంతిలో కలిసిపోయారు. గత ఏడు

శతాబ్దాలుగా హిందువులతో కలిసి సుఖదుఃఖాలు పంచుకుంటున్నారు. ఉభయ మతాలవారిదీ ఇన్నేళ్ళూ ఒకే చరిత్రా, ఒకే భాషా, ఒకే సంస్కృతీ. హిందూ నాయకులలాగానే ముస్లిం నాయకులు కూడా ప్రజలలో ఆధునిక దృక్పథాన్ని ప్రోత్సహించడానికీ, జాతీయ భావాన్నీ పాదుకొల్పడానికీ, లౌకిక తత్వాన్ని జీవన విధానంగా మలచడానికీ అహర్నిశం కృషిచేశారు. హిందువులు అధిక సంఖ్యాకులైనప్పటికీ వారికీ, ముస్లింలకూ, ఇతర అల్పసంఖ్యాక వర్గాలకూ మధ్య సౌభ్రాతృత్వం వెల్లివిరిసింది. శాంతియుత సహజీవనం ద్వారా సమిష్టి ప్రయోజనాలు సాధించుకోవడం ఎలాగో అన్ని మతాలవారూ నేర్చుకున్నారు. బ్రిటీష్ పాలనను ఐక్యంగా ప్రతిఘటించారు. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సమరంలో హిందువులు, ముస్లింలు కలసి వీరోచితంగా పోరాడారు.

విభజించి పాలించే సిద్ధాంతాన్ని అమలుపరచిన బ్రిటీష్ పాలకులు బుద్ధిపూర్వకంగా హిందువులూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించి, వాటిని పెంచి పోషించి, దేశ విభజనకు దారితీశారు. ఈ దుర్మార్గమైన క్రీడలో బ్రిటీష్ పాలకులకు తోడుగా బ్రిటీష్ చరిత్రకారులు, అధికారులు నిలిచారు. మొగలు సామ్రాజ్యం పతనమయ్యే వరకూ, ప్రథమ స్వాతంత్ర్య సమరం విఫలమయ్యేవరకూ, బ్రిటీష్ వారి విచ్ఛిన్న రాజకీయాలు సాగలేదు. బ్రిటీష్‌వారి కుట్ర ఫలితంగా కొందరు ముస్లింలు తాము భిన్నమైనవారమనే ధోరణిలో ఆలోచించడం ప్రారంభించారు. భారత జీవన ప్రధాన స్రవంతి నుంచి క్రమంగా దూరం కాసాగారు.

మతభావనలకు ప్రాధాన్యం పెరిగింది. హిందువులలో మూఢాచారాలు తొలగించడానికీ, ఆధునిక దృష్టిని ప్రోత్సహించడానికీ రామమోహనరాయ్, స్వామీ వివేకానంద, దయానంద సరస్వతి వంటి సంస్కర్తలు కృషి చేసినట్టే ముస్లింలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికీ సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ వంటివారు ఉద్యమాలు నడిపారు. బద్రుద్దీన్ త్యాబ్జీవంటి సంస్కర్తలు ఈ ఉద్యమాన్ని జయప్రదం చేసేందుకు శ్రమించారు. మహమ్మదాలీ జిన్నా ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలని కోరినప్పటికీ అనేకమంది ముస్లిం నాయకులు గాంధీనే తమ నాయకుడిగా పరిగణించి స్వాతంత్ర్య సమరంలో త్యాగాలు చేశారు. విభజనను వ్యతిరేకించారు. అయినప్పటికీ దేశ విభజన జరిగింది. విభజన తర్వాత తమ వాయవ్య సరిహద్దు ప్రాంతం పాకిస్థాన్‌లో భాగంగా ఉండడం ఇష్టంలేని **సరిహద్దు గాంధీ** ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, గాంధీతో మాట్లాడుతూ ' **మమ్మల్ని తోడేళ్ళ పాలు చేశారు** ' అంటూ బాధను వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ ఏర్పడిన తర్వాత కూడా కోట్లాది ముస్లింలు భారతదేశంలో ఉండిపోయారు. పాకిస్థాన్‌లో కంటే ఇండియాలోనే ఎక్కువమంది ముస్లింలు ఉన్నారు. ప్రపంచంలో ఇండోనేషియా తర్వాత అత్యధిక సంఖ్యలో ముస్లింలు ఉన్న దేశం భారత్. దేశవ్యాప్తంగా వారు గ్రామాలలో, పట్టణాలలో సమాజంలో భాగమై పాలలో నీళ్ళలాగా కలిసిపోయి జీవిస్తున్నారు. స్వార్థపరులైన కొందరు రాజకీయవాదులూ, వ్యాపారులూ హిందువులలో, ముస్లింలలో మతావేశాన్ని రగిలించి తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాలు నెరవేర్చుకునే క్రమంలో మతకలహాలూ, మారణహోమాలు జరిగాయి, జరుగుతున్నాయి.

కానీ సాధారణ హిందువులూ, సాధారణ ముస్లింలూ శాంతియుత సహజీవనం కోరుకుంటున్నారు. పేదరికం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషి చేయాలని ఆశిస్తున్నారు. అందరూ కలసి ప్రగతి పథంలో సాగిపోవాలని అభిలషిస్తున్నారు. మతోన్మాదులు అన్ని మతాలలోనూ ఉన్నారు. వారు శక్తివంచనలేకుండా విషబీజాలు నాటుతూనే ఉన్నారు. నరమేధానికి కత్తులు నూరుతూనే ఉన్నారు.

భారత్‌లో కాంగ్రెస్ పార్టీ, ఇతర లౌకిక పార్టీల వైఫల్యం కారణంగా హిందూత్వ శక్తులు విజృంభించాయి. శ్రీ లాల్ కృష్ణ అద్వానీ సోమనాథ్ నుంచీ అయోధ్యకు రథయాత్ర సాగించడం దేశవ్యాప్తంగా హిందువులలో మతాభిమానం, ముస్లింలలో అభద్రతాభావం పెరగడానికి దారితీసింది. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసంతో మెజారిటీ మతస్థులు మైనారిటీల మనోభావాలను పట్టించుకునే రోజులు పోయాయనే అభిప్రాయం ముస్లింలలో ప్రబలింది. ఆ తర్వాత కూడా మతావేశాన్ని ఎన్నికలలో ప్రచారాంశం చేయడంతో హిందూత్వవాదుల వేదిక అయిన భారతీయ జనతా పార్టీ ప్రాబల్యం విశేషంగా పెరిగింది. కాంగ్రెస్‌ను ద్వేషించే కొందరు నాయకుల సారధ్యంలోని కొన్ని లౌకిక పార్టీలు సహకరించడంతో బి.జె.పి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. రాజ్యాధికారం దక్కగానే హిందూత్వ శక్తులు మరింత శక్తిమంతమైనాయి. ఆ విధంగా దేశంలోని రెండు ప్రధానమైన మతాలకు చెందిన ప్రజలలో మతావేశం హద్దుమీరింది. అయితే అది మతావేశంతో అశాంతిగా ఉన్న కొన్ని వర్గాలకే పరిమితం. మతాభిమానం మతోన్మాదంగా మారితే ప్రమాదమనే అవగాహన భారత ముస్లింలలో ఉన్నది.

**‘ హేతువే సేతువుగా మనగలిగే ఆధునిక సమాజంలో ప్రతి మతంలోని ప్రతి సిద్ధాంతం హేతు పరీక్షకు నిలబడి విశ్వజనీనమైన న్యాయానికి అనుగుణంగా ఉన్నప్పుడే విశ్వవ్యాప్తమైన ఆమోదం పొందగలుగుతుంది ’** అని మహాత్మాగాంధీ చెప్పిన సూక్తి అన్ని మతాలకూ వర్తిస్తుంది. ప్రాణులకూ, స్త్రీలకూ, పిల్లలకూ రక్షణ కల్పించడం ఇస్లామ్ పరమోద్దేశం. ఇందుకు భిన్నంగా ఇస్లాంకు ఏమి ఆపాదించినా అది కల్పితమేనన్న స్పృహ భారత ముస్లింలలో ఉంది. అలీ సోదరులు, హసన్ అహ్మద్ మదాని, అష్ఫాఖుల్లాఖాన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, జాకీర్ హూస్సేన్ వంటి అనేకమంది స్వాతంత్ర్య సమరయోధుల నిరంతర కృషి ఫలితంగా భారత ముస్లింలలో వాస్తవిక దృష్టి, సహజీవనాభిలాష హృదయంగతమైనాయి. హిందువులలో కూడా అత్యధికులు, లౌకికవాదాన్నీ, సహజీవన సిద్ధాంతాన్నీ విశ్వసిస్తున్నవారే. అందుకే మతవాదులు తాత్కాలికంగా ఆధిక్యం సంపాదించినా వారి ఆటలు ఎక్కువ కాలం సాగడంలేదు. ఈ శక్తుల ఆట కట్టించి దేశంలోని అన్ని మతాల వారూ సమిష్టిగా అభ్యుదయ పథంలో సాగిపోవాలంటే ఒకరి గురించి మరొకరు క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఒకరినొకరు గౌరవించడం నేర్చుకోవాలి. ఒకరిపట్ల ఒకరికి సహిష్ణుతా, ఆదరాభిమానాలూ ఉండాలి. స్వాతంత్ర్య పోరాటంలో

హిందువులూ, ముస్లింలూ, సిక్కులూ, పార్శీలూ, ఇతరులూ నిర్వహించిన పాత్రను అందరూ అధ్యయనం చేయాలి. అప్పుడే పరస్పర అవగాహన పెరుగుతుంది. సమైక్య గీతాలాపన అపస్వరం లేకుండా హృద్యంగా సాగుతుంది. ముఖ్యంగా ముస్లిం యోధుల దేశభక్తినీ, ధీరోదాత్తతనూ ముస్లింలు తెలుసుకుంటే ఆత్మన్యూనతాభావం, అభద్రతాభావం పోయి ఆత్మవిశ్వాసం, భద్రతాభావం పెరుగుతాయి. ఈ చరిత్రను హిందువులు అధ్యయనం చేస్తే బ్రిటీష్ చరిత్రకారులు చేసిన మోసం ఏమిటో తెలిసిపోతుంది. మతోన్మాదుల ప్రబోధాలలోని వైమనస్యం వెల్లడవుతుంది. విశ్వాసరాహిత్యం తొలగిపోతుంది. లౌకికభావాలు బలపడినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టం అవుతుంది. ఈ జాతి భవిష్యత్తు యావత్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడపైనే ఆధారపడి ఉంది.

ఈ మేరకు అటువంటి నిర్మాణాత్మక కార్యక్రమానికి దోహదం చేసే రచన, మిత్రుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ **' భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు '** అను ఈ చారిత్రక గ్రంథంలో ముస్లిం జనసముదాయాలు ప్రధాన భాగస్వామ్యం వహించిన ఐదు పోరాటాల గురించి వివరించారు. 1760 ప్రాంతంలో ఆరంభమైన బెంగాల్ ఫకీర్ల తిరుగుబాటు నుంచి స్వాతంత్ర్యం సిద్ధించేంత వరకూ దేశ విమోచనోద్యమంలో ముస్లింలు సాగించిన పలు ప్రజా పోరాటాలను కళ్ళకు కట్టినట్టు రచించిన రచయిత అభినందనీయుడు. బ్రిటీషర్ల ఆధిపత్యాన్ని తొలిసారిగా వ్యతిరేకించిన ముస్లిం ఫకీర్ల గురించి, ఆ ఫకీర్లు హిందూ సన్యాసులతో కలిసి ఐక్యంగా పరపాలకుల మీద తిరగబడిన తీరు గురించి, బ్రిటీష్ పాలకులను ఎదిరించి పోరాడిన వహాబీ వీరుల గురించీ, పాలక వర్గాలకు వ్యతిరేకంగా దోపిడీ శక్తుల మీద కత్తిపట్టిన ఫరాజీ యోధుల గురించీ, బ్రిటీషర్ల దోపిడి, జమీందార్ల దాష్టీకాలను ఎదిరించి నిలవటమే కాక, జాతీయోద్యమంలో భాగస్వాములై త్యాగాలకు, ఆత్మార్పణలకు సిద్ధపడిన మలబారు మోప్లా వీరుల గురించి మనకు దొరకని అరుదైన సమాచారాన్ని నశీర్ గ్రంథరూపంలో అందించారు. **' సరిహద్దు గాంధీ '** గా విఖ్యాతుడైన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలోని ఖుదా-యే-ఖిద్మత్‌గార్ అహింసోద్యమాన్నీ, ఆ త్యాగమూర్తుల అపూర్వ బలిదానాలను స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఈ పుస్తకమే కాదు, భారత స్వాతంత్ర్య సమరంలో ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ, ఆ యోధానుయోధుల జీవిత చరిత్రలను రేఖామాత్రంగా పేర్కొంటూ, ఆయన పలు వ్యాసాలు రాసారు. ప్రామాణిక చరిత్ర గ్రంథాలు ప్రచురించారు. నవభారత నిర్మాణంలో ముస్లింల పాత్రను విభిన్న దృష్టికోణాల నుంచి ప్రజలకు తెలిపే రచనలు చేశారు, చేస్తున్నారు. స్వయంగా సమర్థుడైన పత్రికా రచయిత, న్యాయవాది కనుక సులభగ్రాహ్యమైన శైలిలో సత్యనిష్టతో రచన చేయగలగటం నశీర్ అహమ్మద్ ప్రత్యేకత. ఈ కారణంగా ఆయన రచనలకు విశ్వసనీయత పెరిగింది. మిత్రుడు నశీర్ మరిన్ని పరిశోధనాత్మక రచనల ద్వారా సామాన్య జనబాహుళ్యానికి అందుబాటులో లేని అనేక విషయాలను వెలుగులోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను.

◆◆◆



## పరిచయ వాక్యం

**- కత్తి పద్మారావు**

**ప్రముఖకవి, రచయిత**

**పొన్నూరు, గుంటూరు జిల్లా.**

## ఇది చరిత్ర రచన కాదు...చరిత్ర నిర్మాణం

**భా**రతదేశ చరిత్రలో ప్రధాన వాహికలు రెండు. ఒకటి మనువాద చరిత్ర, మరొకటి జాతీయవాద చరిత్ర. మనువాదులు ఈ భూమిపై నివసించే ప్రజలను వర్ణ, మత దృక్పథాలతో చూసి రాస్తారు. జాతీయవాదులు ఈ భూమిపై పుట్టిన వారందర్ని సమతుల్యంగా భావించి రాస్తారు. మొదటిది అమానవవాద చరిత్ర అయితే, రెండవది మానవవాద చరిత్ర. చరిత్ర రచన సత్యనిష్టతో కూడుకున్నది. సామాజిక సాంస్కృతిక ఆర్థిక, తాత్విక అంశాల పట్ల శాస్త్రీయ అవగాహన లేనిదే చరిత్ర రచన సాధ్యం కాదు.

సయ్యద్ నశీర్ అహమ్మద్‌గారు జాతీయవాద చరిత్రకారులు. ముస్లింలు ఈ నేల బిడ్డలని, జాతి వారసులని, ఈ సంస్కృతి పునాదులు వారి సాహస చర్యలతో నిర్మితమైనవని, ఈ నేల వారి శ్రమశక్తి ద్వారా ఈనిందని, ఈ దేశ కళలు వారి మహోన్నత ఔదార్యంతో వికసించాయని, ఈ రాజ్యవ్యవస్థ వారి కనుసన్నల్లో పరిప్లవించిందని, ఈ నేల పోరాటాలలోని రక్త స్రవంతులు వారి దేహం నుండి స్రవించినవని, సారంగా ఈ మట్టి నుండి పుట్టిన వారు, ఈ మట్టి కోసం త్యాగపూరితంగా జీవితాలను ధారపోసారని ఆయన సప్రమాణంగా, సాధికారికంగా ఓ యోధునిగా నిరూపిస్తూ వెళతారు.

జీవితాన్ని, సామాజిక చరిత్రను సమన్వయించే క్రమంలో నశీర్ గారు నేటివిటీకి ఆయువు పోస్తారు. భారతీయ ముస్లింలు వందకు వందపాళ్ళు ఈ దేశవాసులేనన్నది ఆయన సిద్ధాంతం. భారతదేశంలోని ప్రతి పోరాటం వారి రుధిర తర్పణలేక జరగలేదని ఆయన వాదం. భారతీయుడంటే ఎవరు ? దేశానికి, దేశ రక్షణకు, దేశ భవితవ్యానికి అసువులు అర్పించేందుకు ఎవరు వెనుకాడరో వారే అని చెప్పేటప్పుడు, 1770 ప్రాంతంలో బ్రిటీష్ తుపాకి గుండ్లకు ఒకేసారి ప్రాణాలర్పించిన 150 మంది బెంగాల్ ముస్లిం ఫకీర్ల ఉదంతాన్ని మన ముందుంచి, ఇప్పుడు చెప్పండి, ఎవరు నిజమైన దేశభక్తులో అని అడుగుతున్నారు. It is true. It is relevant. ఈ భారతదేశాన్ని ఆత్మీయం చేసుకున్న వారిలో ముస్లింలు మొదటి స్థానంలోకి వస్తారు. ఈ రెండవ ప్రశ్న నశీర్ ప్రతిభకు గీటురాయి. రచయిత గుండెల్లో దాగివున్న అగ్గి మంటకు ఇదొక ఉదాహరణ మాత్రమే.

భారతదేశ చరిత్ర ఎంతో తవ్వాల్సింది, ఎంతో పూడ్చాల్సివుందన్న మాట నిజం. రచయిత ఈ పనిని సమర్థవంతంగా చేశారు కాబట్టే ఆయన ఆధునిక భారత చరిత్రకారుడిగా మన ముందుకు వచ్చారు. He is a

thoughtful person from all angles. ఈయన రచనలో హృదయానికి హృదయానికి మధ్య ఒక బీట్ ఉంది. హృదయ సంఘర్షణను ఆయన ఆవాహన చేస్తారు. చరిత్ర చెబుతూ చెబుతూనే తాత్వికుడిగా మారతారు. మెదడుకు హృదయానికి అనుసంధానం కూర్చుతారు. చరిత్రలోని మూల భూతాంశాలన్నీ తానే అనుభూతం చేసుకుని పాత్ర ద్వారా పలవరిస్తారు. చరిత్రలోని కాలమానాలను దాటి జీవన వ్యవస్థల్ని దృశ్యీకరింప చేసి మనిషికి మనిషికి, మనిషికి వ్యవస్థకి మధ్య దాగిన సున్నితాంశాలను ఆయన రికార్డు చేస్తారు.

ఈ రచయిత కొందరికి సంఘటనల సముచ్ఛయకర్తగా కన్పిస్తారు. మరి కొందర్ని వెన్ను మీద పిడికిలితో గుద్ది మరీ నడిపిస్తారు. ఈయన రచనలోని ఆత్మ Self Respect. ఈయన చూసే చూపులో కొత్తదారి ఉంది. ఒక న్యూనతాభావాన్ని జయించేందుకు ఈయన కలం పట్టారు. ' **జన్మభూమి** ' ఈయన కార్యక్షేత్రం. ' **మాతృభూమి** ' ఈయన నినాదం. ముస్లింలు జాతీయవాదులే కాదు, భరతభూమిని తరతరాలుగా అమ్ముకుంటున్న శక్తులపై పోరాడుతున్న సామాజిక శక్తులని నిరూపిస్తున్నారు. ఆయన కలానికి ఉన్న మరో పదును authenticity. ఏది చెప్పినా, ప్రమాణబద్ధంగా, చరిత్ర నికషోపలంగా చెబుతారు.

ఆయన రచనా శైలి పరిపక్వమైనది. తెలుగు నుడికారం లోని సొబగు, పలుకుబడిలోని విన్నాణం ఆయన రచనకు ప్రవాహశీలతను, ప్రజ్వలన శక్తిని తెచ్చింది. The most irridict writer. జ్ఞానపూర్వకమైన ఆయన కథనంలో స్వాతంత్ర్యసమరయోధులు శిల్పాకృతి దాల్చి మన గుండెల మీద నడుస్తారు. గుర్రాలు, ఏనుగులు, కత్తులు, కటార్లు, తుపాకులు, ఫిరంగులకు ఎదురు నిలబడి జాతీయతను ప్రకటిస్తారు. ఆయుధం పట్టుకున్న వాడు ఫకీరా ? సన్యాసియా ? అన్నది కాదు. ఆయన చూపు మాత్రం దేశం కోసం పోరాడుతున్నాడా ? లేదా ? అనే. Brilliant insight నశీర్‌లో కన్పిస్తుంది. గెరిల్లా పోరాటం జరిగినప్పుడు ఆయనే కందకాలు తీస్తూ, ఆయుధాలు కూర్చుతూ, సమాచారం అందిస్తూ శత్రు నిర్భేద్యమైన కోటల మీద దాడి చేస్తున్నాడా ? అన్పిస్తుంది. It's not just writing. It's deep involvement. నశీర్ గారిని నేను పూర్తిగా చదవలేక పోయాను. ఈ **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు** ఎల్లడలా నన్ను ఒక యోధుడిగా మార్చివేసింది. నేను చాలాసార్లు ఊపిర్లు పీల్చాను. పిడికిళ్ళు బిగించాను. దాస్య విముక్తి పోరాట వీరుల్లో మనల్ని తాదాత్మం చేయగలిగిన ఒక గొప్ప రచనా క్రమం, శిల్ప నైపుణ్యం ఇందులో మనకు కన్పిస్తుంది. ఈ పుస్తకంలోని ఫకీర్ యోధుల మహాసేనాని మజ్నూ షా ఫకీర్ అయినా, ఫిరంగీయుల మీద తిరగబడ్డ వహాబి పులి మీర్ నిస్సార్ అలీ అయినా, ఫరాజి ఉద్యమ నేత దూదు మియా కాని, శతాబ్దానికి పైగా వలసపాలకుల మీద పోరాడిన మలబారు మోప్లాల ప్రతినిధి మౌల్వీ అలీ ముస్సలియార్ గాని, అహింసాయుధంతో బ్రిటీషర్లను తరిమికొట్టిన పఠాన్ యోధుడు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ కాని మనల్ని ఆవహిస్తారు. ఆ పోరాటాలలోని యోధులంతా, తరతరాలుగా మన మెదళ్ళకు పట్టిన తుప్పును వారి కత్తి పిడులతో వదలగొట్టి మనల్ని గుబ్బపుస్వారి చేయిస్తారు. ఆత్మీయత కోసం, వ్యక్తిత్వం కోసం, జాతీయత కోసం, మాతృత్వం కోసం, మాతృభూమి కోసం మనల్ని యుద్ధ సన్నద్ధులను చేస్తారు. ఆనాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదుల మీద పోరాడిన త్యాగాల నుండి పుట్టిన మనం ఈనాటి సాంప్రదాయ సామ్రాజ్యవాదం మీద పోరాడేందుకు నైతికశక్తి నిస్తారు. We are not just soldiers, we are warriors and liberators also.

నశీర్ మన భుజాలపై రెండు చేతులు వేసి ఊపుతున్నట్టు అన్పిస్తుంది. మన

రైతులను పీడించిన, మన కుల, చేతి వృత్తిదారులను హరించిన, మన భూములను ఆక్రమించిన, మన స్త్రీలను అవమానపర్చిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల మీద ఆనాడు మన ముస్లిం పోరాటయోధుల సాగించిన పోరాటాల ఉదంతాలను కళ్ళకు కట్టినట్టు వివరిస్తూ, ఈనాటి సంప్రదాయ భావజాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజాసామ్య లౌకిక దృక్పథంతో మనం పోరాడాల్సిన బాధ్యత లేదా? అంటూ మర్మంగా ప్రశ్నిస్తారు. నాటి చరిత్ర జ్ఞాపకాలతో నేటి సమాజాన్ని కుదుపుతూ ఆయన నడుస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే Alex Haily రాసిన ROOTS కు ఉన్న శక్తి ఈయన **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు** కు ఉంది. ఈ పుస్తకానికే కాదు, ఆయన భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల భాగస్వామ్యాన్ని దృశ్యీకరిస్తూ మనకందించిన ప్రతి పుస్తకంలో అ శక్తి నర్మగర్భమైంది. ఆయన ఆవేదన, ఆయన సంఘర్షణ ఆయా పుస్తకాలలోంచి, మనల్ని పలకరించే పాత్రల్లోంచి మనకు విన్పిస్తారు.

ఆయన నిజజీవితంలోకి వస్తే, ఆయన పుట్టిన నాటి నుండే సంఘర్షితుడు. ఆయన అధ్యయనం, ఆయన రచన, దృశ్యీకరణ, సమాజాన్ని ఫోటో తీయడం దగ్గర నుండి ఎక్స్‌రే తీసి స్కానింగ్ చేసే దాకా ఎదిగింది. ఆయన ప్రతి అక్షరం వెనుక ఒక ఫీలింగ్ ఉంది. ఆవేదన ఉంది. ఈ సమాజాన్ని పునర్నిర్మించే క్రమంలోనే చెబుతారాయన. నేను ఆయనను చరిత్ర రచయితగా చూడలేకపోతున్నాను. ఈ సమాజాన్ని పునర్మించే యోధుడు కావాలి. మహాత్మా పూలే, సర్ సయ్యద్ అహమ్మద్, డాక్టర్ అంబేద్కర్, పెరియార్, వీరందరూ చరిత్ర రచయితలే కాదు, చరిత్రను పునర్నిర్మించిన వారు కూడా.

మతం వ్యక్తిని నిర్మిస్తుంది, చరిత్ర జాతిని నిర్మిస్తుంది. మతం పేరుతో జాతిని అణిచివేస్తున్నారు. ఆందుకాయన ఎన్ని రాత్రులు నిద్రపోలేదో ! ఎన్ని వేదనలు ఆయన గుండెలను తొలిచాయో ! మన కళ్ళ ముందే ఎన్ని కట్టడాలు కూలిపోతున్నాయి ! ఎంత చరిత్ర భగ్నమౌతోంది ! Now it is irrelevant అంటారాయన. To built and to rebuilt అంటారు. **' నేను రచయితనే కాదు. యుద్ధ యోధుడ్ని కూడా. నా జాతి పట్ల, నాదేశం పట్ల, నా ప్రజల పట్ల నేను ప్రేమికుడ్ని, గాఢ ప్రేమికుడ్ని. ఆ ప్రజానీకం విముక్తి కోసం నేను కలం యోధుడ్ని అవుతున్నాను '** అని నినదిస్తున్నారు. ఆయన కలం రాల్చిన ఇంకు చుక్కలకు, భారతదేశాన్ని పరాయి పాలకుల కబంధ హస్తాల నుండి మాతృదేశాన్ని విముక్తం చేయడానికి పోరుబాట నడిచి, అగ్నియుగానికి బాటలు వేసిన మజ్నూ షా ఫకీర్, మీర్ నిస్సార్ అలీ, దూదు మియా, మౌల్వీ అలీ ముస్సలియార్ తదితరులు రాల్చిన రక్తపు చుక్కలకు ఏమాత్రం తేడా లేదు. అందరిదీ స్వేఛ్ఛా-స్వాతంత్ర్యాల కోసం సాగిన విముక్తి పోరాటమే. **' ఈ దేశాన్ని తాకట్టు పెట్టే శక్తుల పైనా నా పూర్వీకుల్లా పోరాడుతాను. ఆ కన్విక్షన్ నాకుంది '** అంటారాయన.

నిజం చెప్పమంటారా ? ఈ పుస్తకం చదువుతున్నంత సేపు నేనొక స్వాతంత్ర్య సమర యోధుడిలా స్వారీ చేశాను. నేనొక జ్ఞాన జ్యోతిగా వెలుగొందాను. నేనొక చరిత్ర నిర్మాతగా ముందుకు కదులుతున్నాను. మీరూ నాతో నడుస్తారా ? రండి. మన మాతృభూమిని రక్షించుకుందాం. మరో స్వాతంత్ర్యపోరాటానికి కేకవేస్తున్న సయ్యద్ నశీర్ ఆహమ్మద్‌తోపాటుగా...నేను....మీరు.....మనం.

◆◆◆

# 1

## బ్రిటీషర్ల మీద తొలి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన బెబ్బులులు

# బెంగాల్ ఫకీర్లు

**1763-1800**



ఇండియా మీద గ్రీకులు, శాక్యులు, యవనులు, కుషాణులు, హూణులు, తదితరులు దండయాత్రలు చేసారు. ఈ గడ్డను జయించిన విజేతలలో అత్యధికులు, స్థానికులతో కలిసిపోయినా పలువురు తిరిగి తమ స్వదేశాలకు వెళ్ళిపోయారు. అలా వెళ్ళిపోయినవారు ఈ భూమిని స్వస్థలంగా భావించలేదు. ఈ నేలను గెలుచుకున్న భూమిగానే భావించిన కారణంగా ఇక్కడి సంపద, సౌభాగ్యాన్ని అందినంత దోచుకుని పోయారు.

ఆ తరువాత మధ్య యుగాలుగా పరిగణించబడుతున్న కాలంలో ముస్లిం పాలకులు ఈ నేల మీద అడుగుపెట్టారు. పలు విజయాలు సాధించాక ఇక్కడే స్థిరపడ్డారు. ఈ నేలను తమ స్వంతగడ్డగా భావించారు. సుమారు వెయ్యి సంవత్సరాలు పాలన చేసిన పాలకుల అనేక వంశాలు ఈ మట్టిలో పుట్టి, ఈ మట్టిలో పెరిగి, ఈ మట్టిలో కలిసిపోయాయి. బ్రిటీషర్ల ఖైదీగా, రంగూన్ జైలులో గడిపిన చివరి మొగల్ చక్రవర్తి బహద్దూర్ షా జఫర్, ఈ భావనను తన కవితలో వ్యక్తంచేసాడు. **'... జఫర్ నీవెంత దురదృష్టవంతుడివిరా !**

**నువ్వెంతగానో ప్రేమించిన మాతృభూమిలో నీ సమాధి కోసం కనీసం రెండు గజాల నేలైనా మిగలలేదు నీకు ...'.** పూర్వీకులూనూ, తానూ పుట్టి పెరిగిన ఈ మట్టిలో కలసిపోవాలనుకున్న బలమైన కోరిక తీరే అవకాశం లేకపోవటంతో బహద్దూర్ షా జఫర్ ఈ మేరకు తన హృదయావేదనను వ్యక్తీకరించాడు.

వర్తకం పేరిట ఈ నేల మీద కాలుపెట్టిన బ్రిటీషర్లు, స్థానిక ప్రభువులను క్రమక్రమంగా పరాజయం పాల్జేస్తూ, ఈ భూభాగాన్ని హస్తగతం చేసుకున్నారు. సుమారు రెండు వందల ఏండ్లు పాలన సాగించినప్పటికీ, ఈ నేలను తమ దేశంగా బ్రిటీషర్లు ఏనాడు భావించలేదు. ఈ గడ్డను వలస కాలనీగా మాత్రమే పరిగణించారు. ఈ దేశం తమది కాదు కనుక, ఇక్కడ నుండి అందినంత తరలించుకుపోవటం ప్రారంభించారు. భూసంపదతోపాటు భూమి పుత్రుల సౌభాగ్యాన్ని కూడా పలు మార్గాల ద్వారా దోచుకున్నారు. భూమి ఆధారంగా ప్రారంభమైన ఈ దోపిడీ అన్ని రంగాలకు అన్ని వర్గాలకు ప్రజల వరకు సాగింది.

బ్రిటీషర్లు రాకముందు మొగల్ రెవిన్యూ పద్ధతుల ప్రకారం భూమికి రైతు ఆసామి. రక్షణ కల్పిస్తున్నందున పంటలో భాగాన్ని రైతులు పాలకులకు సమర్పించేవారు. రాజభాగం చెల్లిస్తున్నంత కాలం రైతును భూమి నుండి తొలగించే హక్కు రాజుకూ ఉండేది కాదు. ఈ విషయాన్ని Mr. Narahari Kaviraj తన Wahabi and Farazi Rebels of Bengal గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నారు. '...remuneration of sovereignty or returns for the care of royalty i.e, the protection the king was to give to the life and security of the raiyat. So the king was supposed to posses no rights of property in land beyond a definite share of its produce....'.

## దోపిడీకి అనువుగా రెవిన్యూ విధానాలు

బ్రిటీషర్లు ఈ రెవిన్యూ వ్యవస్థను తమ దోపిడీకి అనుకూలంగా మార్చుకున్నారు. పాలకులకు, రైతుకు మధ్యన రాజభాగం వసూలుచేసే వ్యక్తులను, శక్తులను రంగప్రవేశం చేయించారు. తమ చేతులకు మట్టి అంటకుండా రైతు కష్టాన్ని పట్టించుకోకుండా అందినంత తరలించుకుని పోవాలన్న ధోరణితో మధ్యవర్తికి అవకాశాలు కల్పించారు. రాజభాగం వసూలు పద్ధతులను క్రమంగా మార్చుతూ, రైతుకు భూమి మీద గల హక్కులను హరించివేస్తూ, కోరినంత రెవిన్యూ సమకూర్చగల జమీందారులకు ఆ హక్కులను ధారాదత్తం చేశారు. 1765లో బెంగాల్ ' **దివానీ** ' ఈస్ట్ ఇండియా కంపెనీ హస్తగతమైన తరువాత, ఈ పరిస్థితి మరింత ఉధృతమైంది. రైతు చెల్లించాల్సిన రెవిన్యూను కంపెనీ పాలకులు అనూహ్యంగా పెంచారు. ( "...It is now generally recognised that main thrust of the East India Company particularly after assumption of diwani in 1765 was to enhance the land revenue of the province..." - Regional Economy in Eastern India - II. by B. Choudary)

ఈ పరిస్థితులు గ్రామీణ ప్రాంతాలకు ప్రాణాంతకమయ్యాయి. రైతు జీవితం దుర్భరంగా మారింది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే వాణిజ్య పద్ధతులను

ఈస్ట్ ఇండియా కంపెనీ అనుసరించటం ప్రారంభించింది. కులవృత్తులు, చేతివృత్తులు, వ్యవసాయకూలీల జీవనం తీవ్ర సంక్షోభానికి గురైంది. కంపెనీ అనుసరిస్తున్న ఎగుమతి - దిగుమతి విధానాలు దేశీయ వర్తక-వాణిజ్యాలకు గొడ్డలిపెట్టుగా తయారయ్యాయి. ఈ భయంకర పరిస్థితులకు తోడుగా వడ్డీ వ్యాపారులు అత్యధిక వడ్డీలతో ప్రజలను దోచుకోసాగారు. గ్రామీణ వ్యవస్థ ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా అందినంత రెవిన్యూ రాబట్టుకోవాలన్న ఏకైక దృష్టితో కంపెనీ అధికారులు క్రూరంగా వ్యవహరించసాగారు. అత్యధిక రెవిన్యూను వసూలుచేసి పెట్టే నూతన జమీందారులను నియమించి, అధిక రెవిన్యూ వసూళ్ళకు మరిన్ని అవకాశాలు, అధికారాలు కల్పించి ప్రజల మీదకు పురికొల్పారు.

ఈ పరిస్థితులకు తోడుగా ఆనాడు ధార్మిక ప్రచారంగావిస్తూ దేశమంతటా తిరుగుతూ గడిపే ఫకీర్లు-సన్యాసులకు పూర్వపు పాలకులు కల్పించిన ఉచిత భూమి సదుపాయాలను, ప్రచార సౌకర్యాలను కంపెనీ పాలకులు హరించివేయటం ప్రారంభించారు. స్వదేశీ ప్రభువులు సంక్రమింప చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవటంగానీ, లేదా ఆత్యధిక రెవిన్యూ కట్టమనిగానీ వేధించసాగారు. ఆనాటి పాలకుల భూరివిరాళాలతో, భూముల ద్వారా లభించే ఆదాయంతో ధార్మిక ప్రచారం చేసుకుంటూ, ఏర్పాటు చేసుకున్న ధార్మిక వ్యవస్థల మనుగడకు కంపెనీ చేపట్టిన మార్పులు నష్ఠదాయకమయ్యాయి. ఈ చర్యలు సన్యాసులు-ఫకీర్ల ఆగ్రహావేశాలకు కారణమయ్యాయి.

## భయంకర క్షామం

1769-70లో బెంగాల్ తదితర ప్రాంతాలలో వచ్చిన భయంకర క్షామం జన జీవితాలను అతలాకుతలం చేసింది. ఆకలిదప్పులకు తాళలేక భారీ సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారు. ఆస్తిపాస్తులను అమ్ముకోవటమేకాక మనుషులను విక్రయించటం కూడా జరిగింది. మనుషులే మనుషులను పీక్కుతినే దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మూడోవంతు ప్రజలు ప్రాణాలు విడిచారు. ఆ సమయంలో కూడా కంపెనీ అధికారులు, జమీందారులు రైతులకు రెవిన్యూ వసూళ్ళ విషయంలో ఏమాత్రం మినహాయింపులు ఇవ్వకపోగా మరింత దారుణంగా వ్యవహరించారు. ఆంగ్లేయ అధికారి W.W. Hunter తన గ్రంథం The Annals of Rural Bengal (1770-1771) లో, ఆనాటి భయంకర పరిస్థితులను వివరించారు. **'...కరువు పరిస్థితి ప్రజలను అన్ని రకాలుగా పట్టి పీడిస్తున్న సమయంలో 35 శాతం ప్రజలు, 50 శాతం రైతులు నాశనమైపోగా, కంపెనీ పాలకులు మాత్రం తగ్గించాల్సిన రెవిన్యూను, 5 శాతం కూడా తగ్గించకపోగా 10 శాతం పెంచటం జరిగింద...'** ని ఆయన పేర్కొనడాన్ని బట్టి అంతటి భయానక పరిస్థితులలో కూడా బ్రిటీషర్లు ఎంత రాక్షసంగా వ్యవహరించారో అర్థమౌతుంది. ఈ పరిస్థితులను అవకాశంగా చేసుకుని మహాజనులు ( వడ్డీ వ్యాపారులు) , జమీందారులు, అధికారులు బ్రిటీష్ వర్తకులు, రైతులను, ప్రజలను పీల్చి పిప్పి చేయసాగారు.

ఆ పరిస్థితులు ఫకీర్ల - సన్యాసుల పోరాటాలకు ఊపిరి పోశాయి. పీడనకు వ్యతిరేకంగా ప్రజల అసంతృప్తి, అసహనం, ఆగ్రహం నుండి తిరుగుబాట్లు రగులుకున్నాయి.

బ్రిటీషర్లపై తొలి తిరుగుబాటుగా ఖ్యాతిగాంచిన ఈ ఉద్యమం 1761లో తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. ఈ పోరాటంలో హిందూ సన్యాసులు, ముస్లిం ఫకీర్లు చేతులు కలిపి కంపెనీ పాలకులపై ధ్వజమెత్తారు. సాంప్రదాయకమైన ఆయుధాలతో ప్రారంభమై ఆధునిక ఆయుధాలను సమకూర్చుకొని బ్రిటీష్ తొత్తులైన జమీందారులు, అధికారులను సవాల్ చేశారు. ప్రజల మీద పీడన ఎక్కడైతే పెరిగిందో అక్కడల్లా ప్రత్యక్షమౌతూ ఫకీర్లు, సన్యాసులు ప్రజల మన్నన పొందసాగారు. ఈ తిరుగుబాట్లలో ప్రజలు అత్యధికంగా పాల్గొనటంతో ఈ తిరుగుబాట్లు కాస్తా ప్రజా పోరాటాలుగా మారిపోయాయి.

## పోరాట వీరుడు మజ్నూ షా ఫకీర్

ఈ పోరాటంలో ఫకీర్లకు నాయకత్వం వహించిన మహాసేనాని మజ్నూ షా ఫకీర్. ఆయనను మంజూషా అని కూడా ప్రజలు పిలుచుకున్నారు. బెంగాల్ పరగణాలలోని కాన్పూరు సమీపానగల మాఖన్‌పూర్ గ్రామ నివాసి. బ్రిటీషర్లను తొడగొట్టి సవాల్‌చేసి పలుమార్లు పరాజితులను చేసి కంపెనీ అధికారుల గుండెల్లో గుబులు పుట్టించిన మజ్నూ షా, ధార్మిక వ్యవస్థాపరంగా చూస్తే ' **మదారి** ' సంప్రదాయానికి చెందిన ఫకీర్. మదారి తెగలో పీర్-మురీద్ సంబంధాలు ప్రధానం. **'పీర్'** అంటే గురువు. **'మురీద్'** అంటే శిష్యుడు. పీర్-మురీద్‌ల సంబంధం అంటే గురు- శిష్యుల సంబంధమన్నమాట. ఈ సంబంధం ధార్మికమైనది కనుక చాలా బలమైంది. గురువు ఆదేశిస్తే తమ ధన మాన ప్రాణాలను అర్పించడానికి శిష్యులు సర్వదా సిద్ధంగా ఉంటారు. ధార్మిక గురువులైన పీర్ పట్ల మురీదులు అత్యంత భక్తిభావం కలిగి ఉంటారు. గురువుల మాట శిష్యులకు శిరోధార్యం. గురువుల స్థిర నివాస ప్రాంతాలు శిష్యులకు పరమ పుణ్యక్షేత్రాలు. ప్రతి సంవత్సరం నిర్దేశిత సమయానికి ప్రపంచంలో ఏ ప్రాంతాన ఉన్నప్పటికీ, ఎలాంటి పరిస్థితులలో ఉన్నప్పటికీ మురీద్‌లు తమ కుటుంబాలతో సహా ఈ క్షేత్రాలకు విచ్చేసి ఉత్సవాలలో భక్తిభావనతో పాల్గొంటారు. గురువుల ఆశీస్సులు పొంది. పలు రోజుల పాటు గురువు సన్నిధిలో గడిపి తమ ప్రాంతాలకు తిరిగి వెళ్ళిపోతారు. ఈ ఉత్సవాలు ధార్మిక విషయాల వరకే పరిమితమై సాగేవి. కంపెనీ పాలకుల దాష్టీకాలు పెచ్చు పెరిగిన తరువాత, ఈ క్షేత్రాలను కంపెనీ పాలకులపై తిరుగుబాట్లను రూపొందించే కేంద్రాలుగా ప్రజలు మార్చుకున్నారు. పోరాట వ్యూహాలను తయారు చేసుకునేందుకు, ఆయుధాల సమీకరణకు, పోరాట వీరులను ఎంపికచేసుకునేందుకు, శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించుకున్నారు. ఈ పరిస్థితులను పసికట్టిన కంపెనీ పాలకులు ఫకీర్ల మీద తగు చర్యలు తీసుకునేందుకు నిశ్చయించుకుని, అనువైన పరిస్థితుల కోసం ఎదురుచూడసాగారు.

## నూటయాభై మంది ఫకీర్ల బలిదానం

ప్రతి ఏడాదిలాగే 1771లో కూడా ఫకీర్లు బెంగాల్ ప్రాంతంలో జరిగిన ఉత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కంపెనీ బలగాల మీద తిరుగుబాట్లు చేస్తూ, రెవిన్యూ వసూళ్ళకు ఆటంకాలు కలిగిస్తున్న ఫకీర్ల మీద కసి తీర్చుకునేందుకు ఎదురుచూస్తున్న కంపెనీ పాలకులకు ఈ ఉత్సవం మంచి అవకాశం కల్పించింది. ఫకీర్లు ఆయుధాలు

సమకూర్చుకుంటున్నారన్న నెపంతో కంపెనీ బలగాలు దాడి జరిపి, ఉత్సవంలో కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో 150మంది ఫకీర్లు మరణించారు.

ఈ సంఘటన రగిల్చిన ఆగ్రహజ్వాలల నుండి పుట్టుకొచ్చారు, ఫకీర్ల మహాసేనాని మజ్నూ షా ఫకీర్. అప్పటికే బ్రిటీషర్ల చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఫకీర్లు ప్రతీకారేచ్ఛతో మహాసంగ్రామానికి ఆయుధాలు చేత పట్టారు. ప్రజలను, పూర్వపు జమీందారులను కూడగట్టటం ఆరంభించారు. స్వదేశీ పాలకులకు లేఖలు రాసారు. మతంతో, మత దృక్పథంతో ప్రమేయం లేకుండా స్వదేశీ పాలకుల పట్ల గౌరవాన్ని ప్రకటించారు. **'...గత సంవత్సరం నిష్కారణంగా 150 ఫకీర్లను బలి తీసుకున్నారు ...'**, అంటూ ఆ నాటి భయానక సంఘటనను భవాని మహారాణికి వివరిస్తూ, 1772 లో రాసిన లేఖలో మజ్నూ షా ఆమె సహాయ సహకారాలు కోరారు. సన్యాసులు-ఫకీర్ల పోరాటం 1761లో ఆవిర్భవించినప్పటికీ, ఆ నాటి గ్రామీణ ప్రజల రైతుల ఇతర వర్గాల ప్రజల జీవన స్థితిగతులను పాలకులు విషమయం చేసిన తీరు, భయంకర క్షామంలో కూడా అధికారులు కర్కశంగా వ్యవహరించిన తీరుతెన్నులు, ఫకీర్లను బలి తీసుకున్న కిరాతక సంఘటనలు అటు ఫకీర్లను, ఇటు సన్యాసులను, పలు వర్గాల ప్రజలను, పూర్వపు జమీందారులను ఏకం చేసాయి. మాతృదేశం నుండి ఫిరంగీలను తరిమివేయటం ద్వారా మాత్రమే తమ ఇక్కట్లు తొలగుతాయని, సమస్యలు పరిష్కారం కాగలవని ప్రజలు భావించారు.

## జమీరుద్దీన్ దఫేదార్ రచన

ఫకీర్ల నేత మజ్నూ షాను పోరాట దిశగా నడిపించిన వాతావరణాన్ని బీర్‌భూం ( BIRBHUM ) కు చెందిన ప్రముఖ బెంగాలీ కవి జమీరుద్దీన్ దఫేదార్ ( JAMIRUDDIN DEFEDAR ) , 1887 సంవత్సరంలో రాసిన Majnu Shaher Hakikat అను పద్యకావ్యంలో వివరించారు. ఈ పద్యకావ్యం ప్రకారం, ఒకసారి మజ్నూ షా ఫకీర్ తన గురువు దర్వేష్ హమీద్ వద్దకు వెళ్ళగా, ఆనాటి భయంకర పరిస్థితులను దర్వేష్ ఈ విధంగా వివరించారు.

**'....లక్షలాది ప్రజానీకం కరువు వలన మరణిస్తున్నారు. వాళ్ళ జీవితాలను కాపాడు. కంపెనీ ఏజంట్లు, అధికార్లు అధిక రెవిన్యూ కోసం రైతులను, చేతివృత్తుల వారిని, ప్రజలను హింసిస్తున్నారు. ప్రజలు గ్రామాలు వదలి వెళ్ళిపోతున్నారు...'**

ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజల స్థితిగతులను స్వయంగా తెలుసుకునేందుకు గురువు ఆదేశాల మేరకు మజ్నూ షా పలు ప్రాంతాలను సందర్శించారు. ప్రజల కష్ట సుఖాలను ఇక్కట్లను గమనించారు. ఫిరంగీలు, ఫిరంగీల తాబేదారులైన జమీందారుల క్రూరత్వం, వడ్డీ వ్యాపారుల దోపిడీ చక్రబంధంలో విలవిలలాడుతున్న అభాగ్యులను, ఆదుకునే నాథుడు లేక అల్లాడుతున్న ప్రజలను చూసారు. ఈ పర్యటనలో మజ్నూ షా మాతృదేశాన్ని ఫిరంగీల నుండి విముక్తం చేయాల్సిన అవసరాన్ని స్పష్టంగా గుర్తించి ప్రకటించారు. కంపెనీ పాలకుల చర్యలను సహించలేని ప్రజలు ఆయన వెంట నడిచేందుకు సిద్ధమయ్యారు. ఈ శిష్యబృందంతో కలసి మజ్నూ షా గురువు వద్దకు వచ్చారు. ప్రజల దుర్భర పరిస్థితులను

వివరించారు. ప్రజల వెతలను విన్న దర్వేష్ తీవ్రంగా వ్యధ చెందారు. ఫిరంగీల మీద ఆగ్రహం వ్యక్తం చేసారు. చివరకు, **'...నాగా సన్యాసులతో కలసి ఆయుధాలు చేపట్టండి. ఆహార పదార్థాలను, పంటలను దాచిపెట్టిన గిడ్డంగుల మీద దాడులు జరపండి. ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు పంచండి. ఫిరంగీలను తరిమివేయండి అంతకంటే మరో ప్రత్యామ్నాయం లేదు. ఆయుధాలు చేపట్టండి. ముందుకు సాగండి...'** అంటూ మజ్నూ షాను కోరారు.

## ఫిరంగీలను తరిమికొట్టమని గురువు ఆదేశం

గురువు ఆదేశాలందుకున్న మజ్నూ షా తన పోరాటాన్ని ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రజలు, రైతులు, కులవృత్తుల, చేతివృత్తుల కళాకారులు, ఆయనకు తోడుగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. మజ్నూ షా తనదంటూ ఒక ప్రత్యేక దళాన్ని నిర్మించుకున్నారు. గురువు ద్వారా ప్రేరణ పొందిన మజ్నూ షా, పోరాటానికి నాయకత్వం వహించి విదేశీయులైన ఫిరంగీలను తరిమివేయటానికి కదలి రమ్మని స్వదేశీ పాలకులను అభ్యర్థించారు. మత ధర్మాలకు అతీతంగా ప్రజల పోరాటాలకు నాయకత్వం వహించమని కోరటం ద్వారా మజ్నూ షా ఆనాటి రాజధర్మాన్ని గౌరవించారు. మాతృదేశం నుండి ఫిరంగీలను తరిమివేయాలని, బాధాసర్పద్రష్టులైన ప్రజలను కంపెనీ పాలకుల దోపిడీ, దాష్టీకాల నుండి విముక్తం చేయాలన్న లక్ష్యసాధన కోసం, ఆ పోరాట వీరులు మతాలకు అతీతంగా సమైక్య పోరాటం సాగించారు.

ఈ పోరాటంలో ఫకీర్లకు నాగా సన్యాసుల స్నేహహస్తం లభించింది. ఫకీర్లు-సన్యాసులు కలిసి ఫిరంగీల మీద దాడులు చేసి అనేక విజయాలు సాధించారు. ఒకచోట సన్యాసులకు ఫకీర్లు నాయకత్వం వహిస్తే, మరోచోట ఫకీర్లకు సన్యాసులు నాయకత్వం వహించి ఈస్ట్ ఇండియా కంపెనీ బలగాలను మట్టి కరిపించి చరిత్రను సృష్టించారు. ప్రముఖ చరిత్రకారుడు Dr. Santimoy Roy చే, '... Against this ruthless invador *(British)* first flag of revolt was unfurled by Majnu Shah, the leader of a band of fakirs...' గా కీర్తించబడిన మజ్నూ షా బ్రిటీషర్ల మీద తిరుగుబాటు పతాకాన్ని తొలిసారిగా బెంగాల్ గడ్డ మీద నుండి ఎగురవేసారు.

ఆయుధబలం, అంగబలం గల శతృవుపై పోరాటం, సామాన్య విషయం కాదని గ్రహించిన మజ్నూ షా ప్రజల అండదండలతో బలమైన ప్రజా పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రజల భాగస్వామ్యంతో పటిష్టమైన పోరాట వ్యవస్థను రూపొందించేందుకు కృషి చేసారు. ఫకీర్ల ప్రాబల్యం గల ప్రాంతాలతో ప్రారంభించి, ఇతర ప్రదేశాల బాధితులను సమైక్య పర్చేందుకు ప్రయత్నించారు. పలు ప్రాంతాలలో కంపెనీ పాలకుల ఛాయలు కూడా కనిపించకుండా చేసి, ఆయా గ్రామాల ప్రజల జీవనానికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా గ్రామ కమిటీలు ఏర్పాటుచేసి గ్రామ పాలన సజావుగా సాగేట్లు చర్యలు తీసుకున్నారు. మజ్నూ షా ఫకీర్లకు తిరుగులేని నాయకుడైనప్పటికీ, పోరుబాట చాలా ప్రమాదకరం కనుక సమష్టిగా ఆలోచించించటం, పథకాలను రూపొందించటం, రూపొందించిన పథకాలను

ఖచ్చితంగా అమలు పర్చేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలలో ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యతను అప్పగించారు. ఆర్థిక వనరుల సేకరణ, పోరాట దళాల సమీకరణ, గూఢచర్య దళం ఏర్పాటు, ఆహారం, ఆయుధాల సమీకరణ - సరఫరా, ప్రజల సమస్యల పరిష్కారం తదితర వ్యవహారాల కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పడ్డాయి.

## గెరిల్లా పోరాటం

ఫకీర్లు, సన్యాసుల పోరాటాలు ప్రధానంగా గెరిల్లా పద్ధతిలో సాగాయి. శత్రువు బలంగా ఉన్నప్పుడు వెనక్కి తగ్గటం. శత్రువు ఆదమరచి ఉన్నప్పుడు దాడులు చేసే పద్ధతులను అనుసరించారు. శత్రువుతో ముఖాముఖి ఎదుర్కోక తప్పనప్పుడు ప్రాణాలకు తెగించి పోరు సల్పటం ఫకీర్ల పోరాట విధానాలు. 1761 డిసెంబరులో బరద్వాన్‌కు చెందిన పాత జమీందారుతో కలిసి కంపెనీ సాయుధ దళాల మీద తొలిసారిగా తిరగబడి తమ సుదీర్ఘ పోరుకు ఫకీర్లు శ్రీకారం చుట్టారు. అప్పటి నుండి ఫకీర్ల-సన్యాసుల పోరాటం సాగిన నాలుగు దశాబ్దాల కాలంలో ప్రతి సంవత్సరం కంపెనీ పాలకులు ఒకటి, రెండు ప్రధాన పోరాటాలను ఎదుర్కొక తప్పని పరిస్థితులను ఫకీర్లు కల్పించారు. ప్రతి ప్రధాన పోరాటంలో కనీసం 500 మంది ఫకీర్లు పాల్గొనటం విశేషం. ఫకీర్ల సేనాని మజ్నూ షా పిలుపునిస్తే, అతి తక్కువ సమయంలో 50 వేల మంది తరలి వచ్చే పరిస్థితులు నెలకొన్నాయని కంపెనీ అధికారులే తమ నివేదికలో రాసుకున్నారు.

జమీందారులు, మహాజనులు, కంపెనీ పాలకులు, అధికారుల మీద ఫకీర్లు దాడులు సాగించారు. జమీందారులకు ముందుగా తెలియజేసి దాడులు చేసిన సంఘటనలున్నాయి. అకృత్యాలకు స్వస్తి పలకమని, బలవంతపు రెవిన్యూలను ఆపమని కంపెనీ పాలకులను, జమీందారులను హెచ్చరించి, ఆ తరువాత దాడులను జరిపేవారు. ఈ విషయం కంపెనీ పాలకులకు తెలిసి బలగాలతో తరలి వచ్చేలోగా ప్రజా గూఢచారి దళం నుండి సమాచారం అందుకుని ఫకీర్లు నిరాటంకంగా దాడులు నిర్వహించి, క్షేమంగా వెళ్ళిపోయేవారు. ఫకీర్లు దాడిచేస్తారని భయం ఉన్న జమీందార్లు కంపెనీ సహాయం కోరుతూ లేఖలు రాసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. జమీందారుల వినతి మేరకు కంపెనీ పాలకులు **'..దాడులు మానమని, లేకుంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని..'** మజ్నూ షాకు హెచ్చరికలు చేసినా ఏ మాత్రం ఖాతరు చేయకుండా నిర్దేశించిన సమయానికి గమ్యం చేరుకుని, కంపెనీ సాయుధ దళాలను నిలువరించి, పనిని పూర్తి చేసుకుని చడీ చప్పుడూ లేకుండా పోరాట దళాలు నిష్క్రమించేవి. కంపెనీ సాయుధ దళాల కదలికలు అతి వేగంగా మజ్నూ షాకు ఎలా అందుతున్నాయో అర్ధంకాక అధికారులు అయోమయంలో పడేవారు. ఫకీర్ల గురించి తప్పుడు సమాచారం అందించి కంపెనీ దళాలను మార్గం మళ్ళించి, గమ్యం చేరుకోనివ్వకుండా చేసి బలగాలను ప్రజలు చికాకు పర్చేవారు. మజ్నూ షా గూఢచారులు ఎవ్వరో కాదు ఆయా గ్రామాల ప్రజలు. పసిపిల్లలు కూడా గూఢచారులుగా సహకరించారు. ఫకీర్లకు సహకరించే గ్రామీణులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వటం ద్వారా గూఢచారి వ్యవస్థను మజ్నూ షా పటిష్టంగా ఏర్పాటు చేసుకున్నారు. మజ్నూ షా దళాలు వందల

సంఖ్యలో ఫలానా చోటున సమావేశం అయ్యారని, బహుశా ఫలానా ప్రాంతం మీద దాడులు జరుపగలరని స్థానిక అధికారుల నుండి ఖచ్చితమైన సమాచారం అందిన తరువాత కూడా కంపెనీ సాయుధ దళాలు మజ్నూ షా దళాలను చేరుకోలేకపోయేవి. పటిష్టమైన వ్యూహంతో ఆంగ్లేయ అధికారులు సాయుధ బలగాలతో ఫకీర్ల సమావేశస్థలిని చేరుకునేప్పటికీ, అప్పటికే ఫకీర్లు ఆ ప్రాంతం నుండి వెళ్ళిపోయేవారు. సంఖ్యాబలం ఎంత ఉన్నా క్షణంలో గమ్యం చేరుకోవటం, మరుక్షణాన లక్ష్యాన్ని సాధించుకుని నిష్క్రమించటం ఫకీర్లకు కొట్టిన పిండిగా మారింది. గుర్రాలు, ఒంటెల మీద సంచరించే దళాలతో పాటుగా కాల్బలం కూడా ఆంగ్లేయ బలగాలకు అందనంత దూరం వెళ్ళిపోవటం ఎలా జరిగేదో అర్థంకాక, కంపెనీ పాలకులకు ఏ విధంగా సంజాయిషీ ఇచ్చుకోవాలో తెలియక అధికారులు సతమతమయ్యేవారు. ప్రతి ప్రధాన పోరాటంలో 500 మంది వరకు ఫకీర్లను సమీకరించటం, పకడ్బందీగా పథక రచన జరగటం, వ్యూహాత్మకంగా శత్రువు మీద దాడి చేయటం, క్రమశిక్షణతో ఆ పథకాన్ని అమలు జరపటం గమనిస్తే, ఫకీర్ యోధుల యుద్ధ కళాచాతుర్యం, సాహసం, మజ్నూ షా లాంటి నాయకుల సామర్థ్యం అర్థమవుతుంది.

ఫకీర్లు ప్రధానంగా కంపెనీ కచ్చేరీలు, కంపెనీ కర్మాగారాలు, కంపెనీ తొత్తుల ప్రాసాదాలు, కోటల మీద దాడులు జరిపారు. ప్రజల నుండి బలవంతంగా వసూలు చేసిన రెవిన్యూను మూటగట్టి కంపెనీకి చేరవేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారం అందగానే ఆ ప్రాంతం మీద దాడి జరిగేది. ఆ ప్రాంతంలో ప్రజలు, రైతుల నుండి వసూలు చేసిన రెవిన్యూ మొత్తాలను స్వాధీనం చేసుకుని ప్రజల అవసరాలు తీర్చి, సమస్య పరిష్కరించి ఫకీర్లు మటుమాయం అయ్యేవారు. ఈ సంఘటనలలో చంపటం, గాయపర్చటం లాంటివి జరిగేవి కావు. శత్రువు నుండి ప్రతిఘటన ఎదురైతే మాత్రం దయాదాక్షిణ్యాలు చూపేవారు కారు. ఈ హింసకు స్వపర భేదాలు వుండేవి కావు. మతం ఆసరాతో తప్పించుకోచూసిన కంపెనీకి చెందిన ముస్లిం అధికారులను ఫకీర్లు విడిచి పెట్టకుండా ప్రజలకు శత్రువా? కాదా? అనే ప్రాతిపదికన సంహరించిన శిక్షించిన సంఘటనలు ఉన్నాయి. అధికారుల వ్యవహారసరళి ఒక్కటే తమ చర్యలకు ప్రాతిపదిక తప్ప, మతం, కులం, ప్రాంతం ఫకీర్లు–సన్యాసుల ఉద్యమంలో జోక్యం చేసుకోడానికి వీలులేకుండా చర్యలు తీసుకోవడం విశేషం.

అధిక వడ్డీని గుంజుతున్న వడ్డీవ్యాపారస్తుల పట్ల మజ్నూ షా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. ప్రజల నుండి, గూఢచారి దళం నుండి సమాచారం అందగానే దాడులను నిర్వహించడం, లభించిన నగదును స్వాధీనం చేసుకోవటం, ఋణ పత్రాలను, రైతుల భూముల తనఖాపత్రాలను, భూస్వాధీన పత్రాలను తగులబెట్టేసి, భవిష్యత్తులో ఎవ్వరూ కూడా ఎటువంటి బకాయిలను మహాజనులకు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించి, మహాజనులు కూడా ఎటువంటి వసూళ్ళు చేయరాదని శాసించి ఫకీర్ల దళాలు అదృశ్యమయ్యేవి. కంపెనీ రెవిన్యూ వసూళ్లను అనేక రెట్లు పెంచి నిర్దాక్షిణ్యంగా వసూలు చేస్తున్నందున తగినంత సొమ్ము వుందని తెలియగానే మజ్నూ షా ఆ ప్రాంతపు కచ్చేరి మీద దాడి చేసి సొమ్మును స్వాధీనం చేసుకొని, రెవిన్యూ రికార్డులను తగులబెట్టి ప్రజలను

కంపెనీకి రెవిన్యూ చెల్లించ వద్దని విజ్ఞప్తి చేసి వెళ్ళిపోయేవారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వసూచేసిన రెవిన్యూ, ఫకీర్ల పాలుకాకుండా కాపాడుకునేందుకు తమ అధికారులను, గుమస్తాలను, జమీందారులను కచ్చేరీల నుండి పారిపొమ్మని కూడా పాలకులు సలహాలిచ్చిన సంఘటలను బట్టి, కచ్చేరీల మీద ఫకీర్ల దాడి ఎంత బలంగా ఉండేదో ఊహించవచ్చు. కంపెనీ నియమించిన జమీందారులు అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్నందున ప్రతీకార చర్యగా ఫకీర్లు జమీందారుల పట్ల ఏ మాత్రం కనికరం చూపేవారు కారు. చివరకు భారీ బలగాలతో భద్రతను ఏర్పాటుచేసిన కంపెనీ కర్మాగారాల మీద కూడా ధైర్యసాహసాలతో మజ్నూ షా దళాలు దాడులు జరిపి విజయం సాధించి చరిత్ర సృష్టించాయి.

## శత్రువుల పట్ల మాత్రమే కాఠిన్యం

స్త్రీలు, వృద్ధులు, పిల్లలపట్ల ఎంతో గౌరవంగా ఫకీర్లు ప్రవర్తించేవారని కంపెనీ అధికారులు రాసుకున్న డైరీల ద్వారా తెలుస్తుంది. దాడుల సందర్భంగా కంపెనీ అధికారులు, నూతన జమీందారులు, గుమస్తాలు, కంపెనీ సిబ్బంది అడ్డుపడి, సాయుధంగా ప్రతిఘటించితే తప్ప మజ్నూ షా దళాలు ఆయుధాలకు పని కల్పించేవి కావు. ఈ దాడులలో సామాన్య ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బంది, కష్టనష్టాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు సాయుధ దళాలకు తగిన హెచ్చరికలను జారీచేయటమేకాక, ఆదేశాల ఉల్లంఘన జరిగితే ఎంతటి సన్నిహితుడికైనా శిక్ష తప్పేదికాదు. ప్రజల నుండి విరాళాలు ఆశించవద్దని ఆయన హెచ్చరించారు. ధనిక సంపన్న వర్గాల నుండి మాత్రమే విరాళాలు సేకరించాలని, ప్రజలను ఎటువంటి వత్తిడికి గురిచేయరాదని ఆదేశాలను జారీచేసి బాధిత వర్గాలకు నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని అవి ఖచ్చితంగా అమలు జరిగేలా చూసారు.

ఫకీర్లు – సన్యాసులను దోపిడీ దొంగలుగా, కంపెనీ పాలకులు ముద్రవేసారు. ఆంగ్లేయుల రికార్డులన్నిటిలో దుండగీలుగానే అటు ఫకీర్లుగానీ, ఇటు సన్యాసులుగానీ కన్పిస్తారు. అయితే ప్రజలు మాత్రం కంపెనీ పాలకుల పీడన నుండి తమను రక్షించడానికి వచ్చిన ఆపద్బాంధవులుగా ఫకీర్లను–సన్యాసులను ఆదరించారు, ఆదుకున్నారు. కదన రంగానికి వెంట నడిచారు. ఫకీర్లు వందల మైళ్ళు విస్తరించిన ప్రాంతంలో 40 సంవత్సరాలపాటు తమ ఇష్టారాజ్యం సాగించారంటే ఆ ప్రాంతపు ప్రజల చురుకైన భాగస్వామ్యం లేకుంటే సాధ్యమయ్యేదికాదు. ఫకీర్లు సామాన్య పేద వర్గాలను ఇక్కట్లు పెట్టినట్టు, ప్రజల నుండి కనీస ఆరోపణలు రాకపోవటం, ఆంగ్లేయుల రికార్డులలోనైనా నమోదుకాక పోవటం విశేషం. పేదలను పీడించే కంపెనీ తొత్తులైన ధనిక సంపన్న వర్గాల పట్ల ఫకీర్లు–సన్యాసులు కఠినంగా వ్యవహరించారు. ఆనాడు స్వదేశీ వర్తక–వాణిజ్యాన్ని నాశనం చేస్తున్న కంపెనీ వర్తకులు, వారి తొత్తులైన వర్తక–వాణిజ్య వర్గాల మీద దాడులు జరుపుతున్న సన్యాసుల నాయకులు శ్రీ భవాని పాఠక్‌తో ఫకీర్లు సత్సంబంధాలను సాగించారు. సన్యాసులతో కలసి ఫకీర్ల దళాలు, పలు దాడులలో పాల్గొన్నాయి. మతంతో ప్రమేయం లేకుండా సాగిన ఈ పోరాటాలలో సన్యాసుల దళానికి ఫకీర్లు నాయకత్వం

వహించిన సంఘటనలున్నాయి. సన్యాసుల దళానికి స్వయంగా మజ్నూ షా నాయకత్వం వహించిన సందర్భాలున్నాయి. కంపెనీ బలగాలపై జరిగిన అనేక భారీ దాడులలో ఫకీర్లు, సన్యాసులు కలిసి పాల్గొన్నారని, అధికారుల నివేదికలు బహిర్గతం చేస్తున్నాయి.

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను సవాల్ చేస్తూ సాగిన తిరుగుబాటులలో కంపెనీ సాయుధ దళాల ఉన్నతాధికారులు జనరల్ మెకంజీ, లెఫ్టినెంట్ టైలర్, లెఫ్టినెంట్ బ్రివాన్స్, కమాండర్ కెనిత్, కెప్టన్ రాటన్, మేజర్ బుచ్చన్, రాబర్ట్సన్ తదితరులను, పలువురు ప్రాంతీయ కలక్టర్లను మజ్నూ షా పరాజితులను చేసారు. 1769లో జరిగిన పోరాటంలో కమాండర్ కెనిత్ హతమయ్యాడు. కంపెనీ సాయుధ దళాలు పలాయనం చిత్తగించటం సర్వసాధారణమైంది. చివరకు కంపెనీ పాలకులే తమ బలగాలను పారిపోయి ప్రాణాలు దక్కించుకోమని కోరిన విచిత్ర సంఘటనలూ ఉన్నాయి.

కంపెనీ రెవిన్యూ వసూళ్ళకు భారీ నష్టం కలిగించటమేకాక, సాయుధ బలగాలకు తీరని ప్రాణనష్టం కలిగించిన మజ్నూ షాను బంధించడానికి ఎంతగా ప్రయత్నించినా కంపెనీ పాలకులు విజయం సాధించలేకపోయారు. ప్రజలకు ఎన్ని ఆశలు చూపినా, హింసలు పెట్టినా, జమీందారులు ఎంతగా ప్రయత్నాలు చేసినా ఒక కట్టడితో సాగిన ఫకీర్లను గాని, వారికి కవచంలా నిలబడిన గ్రామీణ ప్రజలను గాని చీల్చటం కంపెనీ పాలకులకు సాధ్యం కాలేదు. ఆయుధబలం, అంగబలం కలిగిన ఈస్ట్ ఇండియా కంపెనీకి ఆనాడు ఫకీర్లు-సన్యాసులు పెను సవాలుగా మారి ముప్పతిప్పలు పెట్టి చరిత్ర సృష్టించటం అపూర్వమైన విషయం. ప్రజల ప్రధాన భాగస్వామ్యంతో పటిష్టమైన నిర్మాణ ఎత్తుగడలను అవలంబించడం వలన ఫకీర్లు కంపెనీ పాలకులను సవాల్ చేయగలిగారని బ్రిటీష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్ కూడా అంగీకరించాడు.

## విస్తరించిన పోరాటం

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, పాలకుల తాబేదార్లు, మహాజనుల దుష్కృత్యాలు, మజ్నూ షా లాంటి సమర్థులైన నేతల సారధ్యంలో సాగుతున్న రాజీలేని పోరాటం, ఫకీర్ల-సన్యాసుల ఐకమత్యం ఫలితంగా బెంగాల్, బీహార్, అస్సాం, ప్రస్తుత భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాలకు వ్యాపించింది. ప్రధానంగా మేమ్ సింగ్, ధక్కా, రంగాపూర్, బొగ్రా, రాజాషాహి, బీనాజ్ పూర్, మాల్దా, కోచ్ బీహార్, ముషీరాబాద్. బరద్వాన్, బీరంపూర్ లాంటి ప్రధాన జిల్లాల్లో ఫకీర్లు సమాంతర ప్రభుత్వాలను నడిపారు. ఈ ప్రాంతాలలో నూతన జమీందార్ల స్థానంలో ఫకీర్లు ప్రజల నుండి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు. కంపెనీ సాయుధ బలగాల నుండి, వడ్డీ వ్యాపారుల నుండి, కంపెనీ అధికారుల నుండి ప్రజలకు రక్షణ కల్పించారు. ఫకీర్లకు లభిస్తున్న ఆదరణ, పెరుగుతున్న ప్రజాబలం, కంపెనీ అధికారుల పరాజయాల పరంపర వలన కంపెనీచే నియమితులైన జమీందారులు, బ్రతికి ఉంటే బలుసాకు తిని బ్రతకవచ్చని, జమీందారీలను వదులుకుని వలస వెళ్ళాల్సిన పరిస్థితులను ఫకీర్లు-సన్యాసుల ఉద్యమం కల్పించింది.

## ఫకీర్ల రాజధాని మస్తాన్ ఘర్

నాలుగు దశాబ్దాల పాటు విరామమెరుగక సాగిన ఫకీర్ల పోరాటానికి మస్తాన్ ఘర్ ప్రాంతం కేంద్ర స్థానమై దేదీప్యమానంగా వెలిగింది. మస్తాన్ పీర్ గౌరవార్థం ఏర్పాటు చేసిన మస్తాన్ దర్గా, మురీదులైన ఫకీర్లకు పుణ్యక్షేత్రంగా మారింది. అందువలన ఈ ప్రాంతాన్ని మజ్నూ షా ఫకీర్ల రాజధానిగా తీర్చిదిద్దారు. ఫకీర్లకు మస్తాన్ ఘర్ పెట్టని కోటగా తయారైంది. ప్రతి సంవత్సరం ఈ ప్రాంతానికి అసంఖ్యాకంగా ఫకీర్లు వచ్చేవారు. సంవత్సరమంతా నిర్వహించవలసిన కార్యక్రమాలు, సమకూర్చుకోవాల్సిన ఆయుధాలు, పోరాట వీరులకు శిక్షణ తదితర కార్యక్రమాలను ఇక్కడే రూపొందించుకొనడం జరిగేది. 1776 ప్రాంతంలో మజ్నూ షా ఫకీర్ ఇక్కడ బలిష్టమైన కోటను నిర్మించారు.

ఈ ప్రాంతంనుంచే కంపెనీ పాలకులను పరాజితులను చేయడానికి తమతో చేతులు కలపాల్సిందిగా నాటోర్ మహారాణి భవానికి ఆయన లేఖ రాసారు. అయితే స్వదేశీ పాలకుల నుండి ఎటువంటి అనుకూల స్పందన లభించలేదు. ( "...He even sent an urgent appeal to Rani-Bhabani of Natore to make common cause to drive away the *firings*. But it evoked no response..." Freedom Movement and Indian Muslims, - Dr. Santimoy Ray ). ప్రతికూల పరిస్థితులున్నా, స్వదేశీపాలకుల నుండి ఎటువంటి చేయూత లభించకున్నా మజ్నూ షా చివరి వరకూ ఫిరంగీలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించారు.

## చరిత్ర సృష్టించిన పోరు

ఫకీర్ల ఉద్యమం 1776 నవంబరు మాసంలో మరొక చరిత్ర సృష్టించింది. బొగ్రా వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మజ్నూ షా అనుచరులను లెఫ్టినెంట్ రాబర్ట్‌సన్ నాయకత్వంలో కంపెనీ సాయుధ బలగాలు చుట్టుముట్టాయి. ఆకస్మికంగా శత్రువు వచ్చి పడటంతో విజయమో-వీరస్వర్గమోనంటూ ఫిరంగీల సాయుధ బలగాలను ఫకీర్లు ఎదుర్కొన్నారు. వీరవిహారం చేస్తున్న ఫకీర్ల ప్రతాపం ముందు రాబర్ట్‌సన్ దళాలు నిలువలేక పోయాయి. ఫకీర్లు పోరుకు సిద్దంగా లేనందున పోరాటం చేస్తూనే వెనక్కి తగ్గి అటవీ ప్రాంతంలోకి క్రమక్రమంగా నిష్క్రమించారు. ఆధునిక ఆయుధాలను కలిగియున్న కంపెనీ బలగాలకు అతి చేరువగా వుండి కూడా కత్తులు, కటార్లులాంటి సంప్రదాయక ఆయుధాలతో శత్రువును దరిచేరనీకుండా నిరోధించడంలో ఫకీర్లు విజయం సాధించిన సంఘటన కంపెనీ పాలకులలో కలవరం కలిగించింది.

ఈ సంఘటనలో మజ్నూ షా శత్రువును నిరోధిస్తూ, కంపెనీ బలగాలను హతమార్చుతూ తప్పించుకున్నారని లెఫ్టినెంట్ రాబర్ట్‌సన్, ఫ్రాన్సిస్ గ్లాడ్విన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నాడు. ఈ చారిత్రక సంఘటనలో వందలాది కంపెనీ సాయుధులు హతమయ్యారని లెఫ్టినెంట్ రాబర్ట్ సన్ బొగ్రా కలక్టర్‌కు 1776 నవంబరు 14న రాసిన లేఖలో వివరించాడని శ్రీ శాంతిమోయ్ రాయ్ తన **'ఫ్రీడం మూవ్‌మెంట్ అండ్ ఇండియన్ ముస్లిమ్స్'** అను గ్రంథంలో వివరించారు. ఈ సంఘటనతో కంపెనీ సాయుధ బలగాలు ఖంగుతినగా, ఫకీర్లు మాత్రం ద్విగుణీకృత ఉత్సాహంతో కంపెనీ బలగాల మీద విరుచుకుపడ్డారు.

## పోరుబాటలో అపశృతులు

1761లో ప్రారంభమైన ఫకీర్ల-సన్యాసుల పోరాటం, కాలం గడిచే కొద్ది ఉధృతమై పలు విజయాలు సాధించింది. అణచివేత, దోపిడీ, పెత్తందారీతనానికి వ్యతిరేకంగా ప్రత్యేక పరిస్థితులలో ఉనికిలోకి వచ్చిన ఉద్యమం, కాలగమనంలో పలు కారణాల వలన బలహీనపడింది. ప్రధానంగా ఫకీర్లకు ఆధునిక ఆయుధాలు తగినంతగా లేకపోవడం, పోరాట వీరులకు అవసరమైనంత శిక్షణ కరువుకావటం, ప్రజలలో అసంతృప్తిని నివారించడానికి కంపెనీ పాలకులు చర్యలు తీసుకోవటం, క్షామం తరువాత ప్రకృతి సిద్ధమైన అనుకూల వాతావరణం ఏర్పడటంతో, ప్రతికూల పరిస్థితులను ఫకీర్ల పోరాటం ఎదుర్కోవాల్సి వచ్చింది.

కంపెనీ అధికారుల దుష్ట పాలనకు వ్యతిరేకంగా తిరగబడటం మాత్రమే ఫకీర్లు చేసారు తప్ప పాలనాపరమైన వ్యవస్థను పటిష్టంగా రూపొందించాలని సంకల్పించలేదు. ఆనాటి స్వదేశీ పాలకులను గౌరవిస్తూ, పాలనాధికారాన్ని చేపట్టి ప్రజలకు చేయూతనివ్వాల్సిందిగా కోరారు గాని, తామే పాలనా వ్యవస్థను చేపట్టే ఆలోచనలు చేయలేదు. ఫకీర్ల ధార్మిక దృష్టి కూడా అందుకు అనుమతించక పోవటం వలన, కంపెనీ పాలకుల మీద సాధించిన ఘన విజయాలను వ్యవస్థాగతం చేసుకోలేదు. ఆయా ప్రాంతాలలో ప్రజల అవసరాలను బట్టి పోరాడటం, ఎక్కడికక్కడ విజయాలు సాధించి, ప్రజలను పీడన నుండి విముక్తి గావించి తృప్తిపడి సరిపెట్టుకున్నారు తప్ప, రాజ్యం రాజ్యాధికారం అను ఆలోచన చేయలేదు.

ఈ పరిణామాలకు తోడుగా కంపెనీ పాలకుల వద్దనున్న ఫిరంగుల్లాంటి ఆధునిక ఆయుధాలు, సమాచార వ్యవస్థ, సుశిక్షితులైన సాయుధ బలగాలతో సుదీర్ఘ పోరాటం చేయటం ఫకీర్లకు కష్టసాధ్యమైంది. ప్రతికూల పరిస్థితులలో కూడా సాధించిన విజయాలు సంపాదించి పెట్టిన గౌరవం, ప్రజలలో పెరిగిన పలుకుబడి, సంపాదించుకున్న సంపద, అంతర్గత విభేదాలు, కంపెనీ పాలకుల కుట్రలు అన్నీ కలిపి ఫకీర్ల ఉద్యమానికి విషమ పరిస్థితులను సృష్టించాయి. సమర్ధుడైన మజ్నూ షా ప్రతికూల పరిస్థితులన్నిటినీ చాకచక్యంగా పరిష్కరించుకుంటూ, ప్రతి ప్రతికూలతనూ అనుకూలంగా మార్చుకుంటూ అప్రతిహతంగా ముందుకు సాగారు. ప్రధానంగా పీర్-మురీద్‌ల మధ్యనున్న బలమైన ధార్మిక సంబంధం మూలంగా ఫకీర్లలో సుస్థాపితమైన ఐక్యతను శతృవు తక్షణమే గండికొట్టలేకపోయాడు. ఆ తరువాత కాలం గడిచేకొద్ది సహజంగా ఉద్యమం బలహీనపడసాగింది.

## చివరి పోరాటం

1786 డిసెంబర్ 29వ తేదీన మజ్నూ షా తన అనుచరులతో బగూరా జిల్లా ముంగ్రా గ్రామంలో విడిది చేసిన లెఫ్టినెంట్ బ్రివాన్స్ బలగాలను ఆకస్మికంగా చుట్టుముట్టారు. బలహీనపడుతున్న ఫకీర్ల ఉద్యమానికి జవసత్వాలు అందించాలని మజ్నూ షా భావించారు. కంపెనీ బలగాల మీద సాహసోపేతంగా దాడి జరిపి, అనుచరులలో నూతన ఉత్తేజం కల్పించాలని, అనుచరుల మధ్యన ఏర్పడిన వివాదాలకు స్వస్తి చెప్పాలని సాహస దాడి

జరిపారు. ఆ సమయంలో, గతంలో అనేకసార్లు తమ కళ్ళ ఎదుటనే తప్పించుకుపోయిన మజ్నూ షాను ఎలాగైనా బంధించాలనే పట్టుదలతో కంపెనీ పాలకులు, భారీ బలగాలతో ముంగ్రాలో మజ్నూ షా కోసం ఎదురుచూస్తున్నాయి.

ఆ వాతావరణంలో జరిగిన సాహస దాడి భీకరంగా సాగింది. పలువురు గాయపడ్డారు. మజ్నూ షా అతి లాఘవంతో కత్తి తిప్పుతూ, శత్రువును దరిచేరనివ్వకుండా జాగ్రత్తపడుతూ రణభూమిలో వీర విహారం చేస్తూ, అరివీర భయంకరంగా పోరాడారు. అ దాడిలో మజ్నూ షాను తుపాకీ గుండు తాకి తీవ్ర గాయమైంది. రక్తం ఓడుతున్నా లెక్క చేయక అత్యంత వేగంతో తన గుర్రం మీద దూసుకపోతున్న మజ్నూ షా కంపెనీ బలగాల ఎదురుపడిన్పటికీ, ఆయనను చుట్టుముట్టినా బంధించలేకపోయాయి. గతంలో చిక్కినట్టే చిక్కి అతి లాఘవంగా, అత్యంత వేగంతో గుర్రపు స్వారీ చేస్తూ తప్పించుకుని పోయిన మజ్నూ షా ఈసారి కూడా తమ కళ్ళ ఎదుటనే మటుమాయమయ్యారు. ఆయన ఆవిధంగా తప్పించుకుని పోవటం సహించలేని ఆంగ్లేయ అధికారి లెఫ్టినెంట్ బ్రివాన్స్ గాయపడిన మజ్నూ షాను వెంటాడాడు. అనుచరుల రక్షణ వలయం, ప్రజల సహాయంతో మజ్నూ షా ఆంగ్లేయులకు టోకరా ఇచ్చి చివరకు తప్పించుకున్నారు.

## మహా సేనాని అస్తమయం

కంపెనీ సైనికాధికారి లెఫ్టినెంట్ బ్రివాన్స్ కళ్ళుగప్పి, తాను పుట్టి పెరిగిన మాఖన్‌పూర్‌కు మజ్నూ షా సురక్షితంగా చేరుకున్నారు. బలమైన గాయాలు కావటంలో ఆయన పరిస్థితి ప్రమాదకరంగా మారింది. అనుచరులు ఆందోళన చెందారు. అనుచరులు, సహచరులు మజ్నూ షాను కాపాడుకునేందుకు శతవిధాల ప్రయత్నించారు. చికిత్స నిమిత్తం మజ్నూ షాను మరొక ప్రాంతానికి తరలించటం సాధ్యం కాలేదు. గాయాల నుండి అత్యధిక రక్తం స్రవించటం వలన మజ్నూ షా కదలలేనంతగా బలహీనమైపోయారు. కంపెనీ బలగాలను, బ్రిటీష్ సైన్యాధికారులను గడగడలాడించిన మహానాయకుడు మృత్యువుతో పోరాటం ప్రారంభించారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో శత్రువు వలయం నుండి చాకచక్యంగా పలుమార్లు తప్పించుకున్న మజ్నూ షాకు ఈసారి మృత్యువునుండి తప్పించుకునే అవకాశం లేకపోయింది. శత్రువుతో పోరాడుతూ మృత్యుముఖం చేరినా క్షేమంగా తిరిగి రాగలిగిన వీరుడు మజ్నూ షాను ఈసారి మృత్యువు వడిసి పట్టుకుంది. ఈ విధంగా బాధాసర్పద్రష్టులైన ప్రజల ముద్దుబిడ్డడు, బ్రిటీషర్ల మీద తొలి తిరుగుబాటు జెండాను ఎగురవేసిన మజ్నూ షా, చివరకు తన పూర్వీకుల గడ్డ, మాఖన్‌పూర్‌లో అస్తమించారు.

## అన్నకు తగ్గ తమ్ముడు మూసా షా

అసమాన పోరాట యోధుడు మజ్నూ షా ఫకీర్ కనుమూయగానే ఫకీర్ల ఉద్యమం అంతరించిపోయిందని సంతసించిన కంపెనీ పాలకులకు ఆ సంతోషం ఎంతో కాలం నిలువలేదు. అలుపెరుగక ఫిరంగీల మీద పోరు సల్పిన మజ్నూ షా స్ఫూర్తిని ఆయన సోదరుడు మూసా షా కొనసాగించారు. మజ్నూ షా శిష్యుడు కూడా అయినటువంటి మూసా షా పోరాట బాధ్యతలను స్వీకరించారు. అన్నకు ఏ మాత్రం తీసిపోకుండా ఫిరంగీలను ముప్పుతిప్పలు పెట్టారు. కంపెనీ పాలకులతో గెరిల్లా పోరాట పద్ధతులతో పోరు సల్పటమేకాక,

తమ బలగాల రాకను ముందుగా శత్రువుకు తెలిపి దాడులు జరిపిన సంఘటనలకు మూసా షా పేర్గాంచారు. ఆనాడు ఆయన సాగించిన పోరాటాల తీరు ఆ తరువాత కాలంలో అల్లూరి సీతారామరాజు సాగించిన మన్యం పోరును గుర్తుకు తెస్తుంది.

1787 ప్రాంతంలో ముసిద్ధా పరగణాకు చెందిన జమీందారు ప్రాసాదం మీద దాడికి మూసా షా సిద్ధం కాసాగారు. ఆ విషయం తెలిసిన జమీందారు ఆ సమాచారాన్ని ముషీరాబాద్ కలెక్టర్‌కు తెలిపాడు. మూసా షా ఏ క్షణాన్నైనా దాడిచేయవచ్చని సాయుధ దళాలను పంపి రక్షించవలసిందిగా కోరాడు. ఆ విషయం వేగుల ద్వారా మూసా షాకు తెలిసింది. జమీందారు చర్యపట్ల ఆగ్రహిస్తూ ఆయన ఒక లేఖ రాశాడు. ఆ లేఖలో **'... నా మీద ముషీరాబాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసావు. అయితే ఏమి లాభం. నేను నీ నుండి కోరిన నగదును తప్పక తీసుకుపోతాను. ధనం సిద్ధం చెయ్యి....'**, అని పేర్కొంటూ సమాచారం పంపి నిర్దేశిత సమయాన జమీందారు భవంతిని చేరుకున్నారు. ప్రకటించిన రెవిన్యూ సొమ్మును రాబట్టుకుని నిష్క్రమించిన మూసా షా కంపెనీ పాలకులకు సవాల్ విసిరారు.

ఆనాడు సామాన్య ప్రజానీకంతోపాటుగా పలువురు జమీందారులు కూడా మూసా షాకు చేయూతనిచ్చారు. ముఖ్యంగా ప్రజలు అనుక్షణం అప్రమత్తులై మూసా నేతృత్వంలోని యోధులను కాపాడుకున్నారు. 1788 జూన్ 22న ఆకస్మికంగా శత్రువు దాడిచేయగా మూసా షాను, ఆయన సహచరులను ప్రజలు ఎంత చాకచక్యంగా కాపాడింది దినాజ్‌పూర్ కలెక్టర్ రాసిన లేఖ ద్వారా బహిర్గతం అవుతుంది. మూసా షా నాయకత్వంలోని పోరాట వీరులకు పాత జమీందారులు తోడ్పాటునిచ్చారు. ప్రజల మద్ధతుతో ఏర్పాటు చేసుకున్న వేగుల ద్వారా కంపెనీ బలగాల కదలికలను పసికట్టి క్షణాలలో మటుమాయమై, ఆకస్మాత్తుగా దాడి చేసి కంపెనీ అధికారులను మట్టికరిపించటంలో మూసా షా తన అన్నను అక్షరాల అనుసరించారు. స్వదేశీ రాజులు, రాణులతో మూసా షా చేతులు కలిపారు. ఆయన సన్యాసుల నేతలు భవాని పాథక్, దేవీ చౌదరాయణ్‌లతో కలిసి పలు పోరాటాలలో పాలుపంచుకున్నారు. మజ్నూ షా సన్యాసుల దళానికి నాయకత్వం వహించిన విధంగానే మూసా షా కూడా 1786 ఫిబ్రవరి 17న 200 మంది సన్యాసుల దళానికి నాయకత్వం వహించారని కెప్టన్ అలెగ్జాండర్, రంగాపూర్ కలెక్టర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

మూసా షా తన బలగాలకు ఆధునిక శిక్షణ కల్పించారు. కంపెనీ సేవలోనున్న స్వదేశీయులలో వ్యతిరేకతను రెచ్చగొట్టి స్వపక్షంలోకి ఆకర్షించారు. ఈ బలగాలన్నిటికీ కంపెనీ బలగాల తరహాలో దుస్తులు, ఆయుధాలు ఏర్పాటు చేసారు. గూఢచారి దళాన్ని మరింత పటిష్టం చేసారు. గెరిల్లా పోరాటంలో ఆరితేరిన మూసా షా శత్రువును ఊపిరి పీల్చుకోనివ్వకుండా దాడులు చేసి చికాకు పర్చారు. భారీఎత్తున బలగాలు ఉన్నప్పటికీ కంపెనీ పాలకులకు మూసా షా తిరుగుబాట్లను నిలువరించలేకపోవటం విశేషం.

ఆనాడు పోరాట వీరులకు ఆపద సమయంలో తలదాచుకోడానికి నేపాల్ పర్వత ప్రాంతాలు బాగా ఉపయోగపడేవి. ఈ పరిస్థితిని గమనించిన కంపెనీ అధికారి వారెన్ హేస్టింగ్ నేపాల్ పర్వత సానువుల మీద దృష్టి సారించాడు. ఒక వైపు ఫకీర్లు-సన్యాసులకు నిలువ నీడలేకుండా చేయటమే కాకుండా, కంపెనీ సరుకుల ఎగుమతులు-దిగుమతులు పెంచటం కోసమంటూ నేపాల్ రాజుతో స్నేహం చేసాడు. ఒప్పందాలు కుదుర్చుకున్నాడు.

ఫలితంగా ఫకీర్లు, సన్యాసులకు నేపాల్ ప్రాంతంలో తలదాచుకునే వీలు లేకుండా పోయింది. ఫకీర్ల–సన్యాసుల పోరాటాన్ని ఎలాగైనా అణిచేయాలని నిర్ణయించుకున్న కంపెనీ పాలకులు ఫకీర్ల–సన్యాసులు చేతికి చిక్కితే ఎక్కడికక్కడ హతం చేయమని, ఉరి తీయమని, అతి కఠినంగా వ్యవహరించమని సైనికాధికారులకు ఉత్తర్వులు జారీచేసారు. ఈ పరిస్థితుల వలన ఫకీర్లకు, సన్యాసులకు కష్టకాలం దాపురించింది. అయినప్పటికీ ఆ యోధులు ఫిరంగీల మీద ప్రకటించిన పోరాటాన్ని విరమించలేదు. అవకాశం లభించిన చోటల్లా కంపెనీ పాలనను సవాల్ చేశారు. కంపెనీ అధికారులు పోరాట వీరుల పట్ల కిరాతకంగా వ్యవహరించారు. చిత్రహింసలు, ఉరితీతలు సామాన్యమైపోయాయి. మూసా షా ఫకీర్ ఎక్కడ కన్పించినా కాల్చివేయాల్సిందిగా, ఆయన చేతజిక్కినట్టయితే తక్షణమే ఉరి తీయాల్సిందిగా కంపెనీ అధికారి మేజర్ మైట్‌లాండ్‌కు కంపెనీ పాలకుల నుండి ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయి. అటువంటి ప్రమాదకర వాతావరణంలో మరణం తప్ప మరొక బహుమతి లభించదని తెలిసి కూడా అత్యంత ధైర్యసాహసాలతో ఫిరంగీలతో పోరాడుతూ మూసా షా ఫకీర్ 1792 మార్చిలో తుపాకీ గుళ్ళకి బలయ్యారు.

## గురువుకు తగ్గ శిష్యుడు చిరాగ్ అలీ షా

మజ్నూ షా నాయకత్వంలో రాటు తేలిన మరొక నాయకుడు చిరాగ్ అలీ షా. ఫిరంగీలను తరిమి కొట్టడమే సమస్యలకు పరిష్కారంగా భావించిన చిరాగ్ అలీ షా గురువు బాటలో నడిచారు. చిరాగ్ అలీ కంపెనీ దళాలమీద దాడులు జరిపి, పలుమార్లు పరాజితులను చేసారు. ఆయన కూడా గెరిల్లా పోరాటాన్ని అనుసరించారు. 1793లో మాల్దా వద్ద జరిగిన పోరాటంలో కంపెనీ బలగాలు అత్యధికం కావటంతో చిరాగ్ అలీ తన బలగాలను తోడ్కొని అనూహ్యరీతిలో అదృశ్యమైనారని కంపెనీ అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ ఉన్నత అధికారులకు సమాచారం అందించారు. ఈ సంఘటనలను బట్టి చిరాగ్ అలీ షా శక్తి సామర్థ్యాలు వెల్లడవుతాయి. చిరాగ్ అలీ షాతో పాటుగా ఆయన జట్టులో మరొక వీరుడు ఫీరా గుల్ షా ఫకీర్ కూడా ప్రధాన పాత్ర నిర్వహించారని డా॥ శాంతిమోయ్ రాయ్ పేర్కొన్నారు. ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం సన్యాసుల నాయకులతో కలిసి చిరాగ్ అలీ షా ఐక్యపోరాటాలు సాగించారు. 1790లో చిరాగ్ అలీ సన్యాసుల నేతలు మోహన్ గిరితో కలిసి భారీ బలగాలతో దాడులకు సిద్ధం అవుతున్నారని మైమ్ సింగ్ కలెక్టర్ ఈస్ట్ ఇండియా కంపెనీకి సమాచారం అందించాడు. అంతేకాదు వారన్ హేస్టింగ్స్ కూడా, చిరాగ్ అలీ సన్యాసుల నాయకులతో కలిసి చేసిన పోరాటాలను సవివరంగా పేర్కొన్నాడు.

ఆ తరువాతి కాలంలో సన్యాసుల–ఫకీర్ల మధ్యన అభిప్రాయభేదాలు పొడచూపాయి. ఈ విభేదాలు ఎంత దూరం వెళ్ళాయంటే చిరాగ్ అలీ లాంటి నాయకుల మరణానికి కారణమయ్యాయి. ఆ సమయంలో సన్యాసుల దళాలకు మోతి సింగ్ గిరి నాయకత్వం వహిస్తున్నారు. బకాయిల వసూలు విషయంలో ఆయనకు చిరాగ్ అలీకి మధ్యన మనస్పర్థలు ఏర్పడ్డాయి. 1792 ప్రాంతంలో బకాయిలు డిమాండ్ చేస్తూ పంపిన

తన మనుషులను చిరాగ్ అలీ అగౌరవపర్చారంటూ ఆగ్రహించిన మోతీసింగ్ గిరి, ఆ రాత్రికి రాత్రే చిరాగ్ అలీ దళాల మీద దాడిచేసాడు. ఆ దాడిలో చిరాగ్ అలీ షా హతమయ్యాడని కంపెనీ అధికారుల రికార్డులు వెల్లడిచేసాయి.

చిరాగ్ అలీ హత్యతో మజ్నూ షా కాలంలో ఫకీర్లు-సన్యాసుల మధ్య ఏర్పడిన పటిష్టమైన సంబంధాలలో పగుళ్ళు కన్పించి క్రమక్రమంగా బలహీన పడ్డాయి. సన్యాసుల నాయకులు జమీందారులకు రుణసౌకర్యం కల్పించటం, ఆ బకాయిల వసూలు విషయంలో కఠినంగా వ్యవహరించటం, తదితర చర్యల వలన ఆనాటి ఐక్యత, ఉమ్మడి పోరాటాలు, ఉమ్మడి లక్ష్యాల వాతావరణం కనుమరుగైపోయింది.

## ఐక్యత కోసం యత్నించిన శోభన్ అలీ షా

చిరాగ్ అలీ తరువాత ఆ స్థాయి కలిగిన నాయకుడు శోభన్ అలీ షా. మజ్నూ షా చూపిన మార్గాన పోరుబాటన నడిచిన శోభన్ అలీ తనదైన చిన్న దళాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఆయన ప్రధానంగా కంపెనీ కచ్చేరీల మీద దాడులు జరిపారు. చిరాగ్ అలీ మరణం తరువాత కకావికలైన ఫకీర్ యోధులను ఒకచోట చేర్చి పోరుబాటన నడిపించేందుకు, ఫకీర్లు-సన్యాసుల మధ్యన కనుమరుగైన ఐక్యతను పునరుద్ధరించేందుకు విశేష కృషి సల్పారు. బాధిత ప్రజలు, ప్రధానంగా రైతుల పక్షాన పలు పోరాటాలు సాగించారు. ఈ కృషిలో శోభన్ అలీ షాకు అముదీ షా, పీరుగుల్లా షా, మోతిపుల్లా, నేగూ షా, బుద్దూ షా, ఇమాం షా, తదితరులు సహకరించారు. బలగాలను సమీకరించుకున్నాక శోభన్ అలీ కంపెనీ కచ్చేరీల మీదనే కాకుండా, స్వదేశీ వర్తకాన్ని నాశనం చేసిన కంపెనీ వాణిజ్య సంస్థల మీద దాడులు జరిపారు.

1794లో రాంగంజ్ వాణిజ్య సంస్థ మీద దాడిచేసి ఆరువేల రూపాయల నగదును, నలుగురు సిపాయిలను ఖైదీలుగా ఫకీర్లు తీసుకుపోయారనీ కంపెనీ అధికారులు పేర్కొన్నారు. శత్రువు ఇంటనే గూఢచర్యం జరపాలన్న ఎత్తుగడలతో శోభన్ అలీ స్వదేశీయులైన కంపెనీ అధికారులను వశం చేసుకుని ఫకీర్లకు వ్యతిరేకంగా కంపెనీ పాలకులు తీసుకునే నిర్ణయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అందుకు అనుగుణంగా ఎత్తులు వేస్తూ కంపెనీ బలగాలను చిత్తు చేసారు. శోభన్ అలీకి సహకరించిన మిత్రుడు శ్రీ దేవ్‌సింగ్ ద్వారా ఈ రహస్యం 1774లో బహిర్గతమైంది. అనంతర కాలంలో సమకూరిన కంపెనీ రెవిన్యూ పంపకంలో ఫకీర్ల నేతల మధ్యన వివాదం తలెత్తటంతో శోభన్ అలీకి కష్టకాలం ప్రారంభమైంది. ఈ వివాదాల వలన బలహీనపడిన ఫకీర్లను మరింత బలహీనపర్చేందుకు కంపెనీ పాలకులు కుట్రపూరిత చర్యలు తీసుకున్నారు. శోభన్ అలీ షాను పట్టిచ్చినవారికి నాలుగువేల రూపాయల బహుమతిని ప్రకటించారు. దాడులను అధికం చేసారు. శత్రువు బారిన పడటం, శత్రువు తుపాకి గుళ్ళకు గురికావటం, అంతర్గత సంఘర్షణల మూలంగా కాలగమనంలో పోరాటం బాగా బలహీనపడింది. ఆ తరువాత సంవత్సరకాలంలోనే పోరాటాలకు తెరపడింది.

## చారిత్రక పోరాటం సమాప్తం

ప్రధాన ఫకీర్ నాయకులు, ప్రజల అభిమానం సంపాదించుకున్న నేతలు, సానుభూతిపరులు అంతరించాక కూడా మజ్నూ షా స్ఫూర్తితో పలువురు ఫకీర్ నేతలు

తిరుగుబాటు వేదిక మీద కన్పించారు. ఎవరు ఏ విధంగా రంగం మీదకు వచ్చినా అందరూ ఫిరంగీల పెత్తనం నుండి జన్మభూమిని విముక్తం చేయటం, కంపెనీ పాలకుల, ఆ పాలకుల తొత్తుల పీడన నుండి ప్రజలకు రక్షణ కల్పించటం, వడ్డీ వ్యాపారులు, జమీందారుల దోపిడీని నిరోధించటం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని పోరుబాటన సాగారు. ఐక్యంగా పోరాటం సాగినప్పటి కంటే కంపెనీ బలం మరింత పెరిగిన తరువాత, ఫకీర్ల బలగాలు తగ్గటంతో ఫకీర్ల ఉద్యమం వరుస పరాజయాలను చవిచూడాల్సి వచ్చింది. ప్రధానంగా రంగాపూర్, మైమ్‌సింగ్ ప్రాంతాలలో జరిగిన పోరాటాలు ఫకీర్లను నిర్వీర్యులను చేశాయి. ఈ పరిస్థితులలో నాయకత్వం లక్షణాలు గల నేతలు వేర్వేరు దళాలను ఏర్పాటు చేసుకున్నారు. పరిమిత శక్తియుక్తులతో తమ పరిధులలో ఫిరంగీల మీద పోరాటం సాగించారు.

చిరాగ్ అలీ, ఫిరాగ్ అలీల తరువాత అదే విధంగా రాంజానీ షా, జహౌరి షాల జంట ఉనికిలోకి వచ్చింది. ఈ జంట అస్సాం వైపుగా సాగి అక్కడ తమ స్థావరాలను ఏర్పర్చుకుంది. అయితే ఈ దళంలో కూడా అంతర్గత సంఘర్షణలు మితిమీరటం వలన కంపెనీ బలగాలదే పైచేయి అయ్యింది. ఈ ప్రతికూల పరిస్థితులలో కూడా సాహసులైన ఫకీర్లు పలు దళాలలను నిర్మించారు. ఆ దళాలకు పటిష్టమైన స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినా మునుపటి శక్తిసామర్థ్యాలను ఫకీర్లు కోల్పోయారు.

ఈ వాతావరణం కంపెనీ పాలకులకు ఉత్సాహం కలిగించింది. మజ్నూ షా తరువాత భారీ బలగాలతో ఫకీర్లు దాడులు జరిపిన సంఘటనలు పెద్దగా లేనప్పటికీ దశాబ్దాల తరబడి తమ అధికారాన్ని సవాల్ చేయటాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ, సహించలేకపోయింది. అంతకు ముందు ఇచ్చిన అధికారాల కంటే మరింత తీవ్ర చర్యలతో ఫకీర్లను, సన్యాసులను అణచివేయటానికి అధికారులకు కంపెనీ స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. తిరుగుబాటు అణచివేతకు భారీగా బలగాలను రంగంలోకి దించింది. ఒకవైపు కంపెనీ తన పూర్తి శక్తి సామర్థ్యాలతో ముందుకు రాగా, ఫకీర్ల–సన్యాసుల ఉద్యమం అంతర్గత సమస్యలతో, విచ్ఛిన్నమైన ఐక్యతతో, చిన్న చిన్న దళాల స్థాయికి చేరి అంతిమ ఘడియలను లెక్కపెట్టసాగింది. ఈ నూతన పరిణామాల వలన కంపెనీ బలగాలను ఎదుర్కోవడానికి తగినంత శక్తి, సామర్థ్యం నాయకులలో లేకపోవడంతో ఫకీర్ల స్థావరాలన్నీ త్వరితగతిన కంపెనీపరమైపోయాయి.

1987లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రచురించిన INDIA'S STRUGGLE FOR FREEDOM - An Album లో, ఆ నాడు కంపెనీ బలగాలు, అధికారులు జరిపిన కిరాతక చర్యలను రచయితలు ఈ విధంగా వివరించారు. **'... గ్రామాలను తగులబెడ్తూ, ప్రజలను అడ్డంగా నరికివేస్తూ, ఫకీర్ల– సన్యాసుల తిరుగుబాట్లను అణచి వేయడానికి, బ్రిటీషర్లకు కనీసం ఒక దశాబ్దం పట్టింది...'** ( ..It took the British at least a decade of burning villages and slaughtering the people before they could suppress the uprisings..). ఫకీర్లు – సన్యాసుల తిరుగుబాటులో ప్రధాన పాత్ర వహించిన మజ్నూ షా ఫకీర్, చిరాగ్ అలీ షా, మూసా షా అలీ, శోభన్ అలీ షాల మార్గంలో పోరుబాటును ఎన్నుకుని, చరిత్రలో చిరస్మరణీయమైన ఖ్యాతిని గడించిన కరీం షా ఫకీర్,

రోషన్ అలీ, ఇమాం బక్ష్ మక్ధూం షా జలాల్, మోతిపుల్లా తదితరులు చరిత్ర పుటలలో అంతర్ధానమయ్యారు. ఈ నేతలంతా ఫకీర్ల మహాసేనాని మజ్నూ షా బాటన నడిచి తిరుగుబాటు ఉద్యమాలకు ప్రాణాలు పోసి మరణాన్ని ఆనందంగా కౌగిలించుకున్న యోధులు.

ఈ విధంగా ఫిరంగీలకు వ్యతిరేకంగా, భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో తొలి తిరుగుబాటు పతాకాన్ని ఎగురవేసిన ఘన చరిత్రను సృష్టించుకున్న ఫకీర్ల తిరుగుబాట్లు సమసిపోయాయి. నాలుగు దశాబ్దాలపాటు సాగిన ఈ పోరాటాలు, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చోటు చేసుకున్న అన్ని రకాల విముక్తి పోరాటాలకు, వీర కిశోరాలకు స్ఫూర్తిదాయకమయ్యాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ పెత్తనాన్ని సవాల్ చేసి దశాబ్దాల పాటు నిలచి పోరాడిన ఫకీర్ల ఉద్యమం గురించి గవర్నర్ జనరల్ వారెన్‌హేస్టింగ్స్ రాసుకున్న స్మృతులలో ప్రస్తావిస్తూ, యాభైవేలకు పైగా గల తిరుగుబాటుదారులను అణచివేసేందుకు కంపెనీ సాగించిన ప్రయత్నాలలో పలువురు ఆంగ్లేయాధికారులను, అనేక కంపెనీ సాయుధ బలగాలను కోల్పోటం, అనేక పరాజయాలను చవిచూడటం జరిగిందని పేర్కొన్నాడు.

ఈ పోరాటాలు చివరకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోరుకుంటూ భారతీయులు సాగించిన సుదీర్ఘ విప్లవ పోరాటాలకు ఆదర్శమయ్యాయని Dr. Santimoy Ray తన Freedom Movement and Indian Muslims లో ప్రశంసించాడు. ఫకీర్ల - సన్యాసుల తిరుగుబాట్లు విఫలం చెందినప్పటికీ, పందొమ్మిది, ఇరవై శతాబ్దాలలో సాగిన స్వాతంత్ర్య సంగ్రామం మీద, ప్రధానంగా వహాబీలు, తీవ్రవాదులుగా పిలువబడిన ఆగ్నియుగం నాటి విప్లవకారుల మీద చెరగని ముద్రలు వేసిందన్నారు. ( Inspite of its falilure the revolt of the Fakirs and Sanyasis left an indelible imprint upon the future struggle for freedom during the nineteenth and twentieth centuries, particularly upon the Wahabis and revolutionaries of Agni Yug-known as terrorists ). నాలుగు దశాబ్దాల పాటు బ్రిటీష్ సైన్యాలను ఉరుకులు పరుగులు పెట్టించి, కంపెనీ పాలకులను తొడగొట్టి సవాల్ చేసిన ఫకీర్ల-సన్యాసుల పోరాటాలను ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ తారాచంద్ **'... పర్యవసానం ఎలాగున్నా అనేక సంవత్సరాలపాటు తమ ప్రభావాన్ని చూపాయి...'** అంటూ ఆ పోరాటాల ప్రాధాన్యతను వెల్లడించారు.

1810లో లార్డ్‌మింటో ఈ తిరుగుబాట్లను ప్రస్తావిస్తూ, , ".. In truth the sirdars or captains of the band were esteemed and even called the Hakim or Ruling Power, while the Government did not possess either authority or influence enough to obtain from the people the smallest and towards their own protection..", అని ఆనాటి ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన దుస్థితి మీద వ్యాఖ్యానించాడు. ఫిరంగీల దాస్యం నుండి భరతభూమిని విముక్తం చేయడానికి సాగిన సుదీర్ఘ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో తనదంటూ ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుని, మహత్తర లక్ష్య సాధనా దిశగా సాగిన వహాబీల, ఫరాజీల పోరాటాలకు స్ఫూర్తిగా, పోరాట వీరులకు ప్రేరణగా నిలచిన ఫకీర్ల - సన్యాసుల తిరుగుబాట్ల చరిత్ర నాలుగు దశాబ్దాల తరువాత 1800లో ముగిసింది. ◆

**2**

## చెరసాలలు, ఉరికొయ్యలకు వెరవక విక్రమించిన

# వహాబీ వీరులు

**1820-1870**



**భా**రతదేశంలో వలసవాదుల పాలన ప్రారంభమైన మొదటి రోజు నుండి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా చరిత్రకెక్కిన తిరుగుబాటు వరకు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఎన్నో సాయుధ తిరుగుబాట్లు జరిగాయి. బ్రిటీష్ పాలన వలన పదవులు పోగొట్టుకున్న స్వదేశీ పాలకులు, భూస్వాములు, పాలెగాండ్లు తిరుగుబాట్లకు తొలుత నాయకత్వం వహించారు. ఆ తరువాత ప్రజల నుండి పుట్టుకొచ్చిన నాయకులు ఆ కార్యభారాన్ని స్వీకరించారు. ప్లాసీ యుద్ధం తరువాత **' బెంగాల్ దివానీ '** మీద పెత్తనం సంపాదించిన ఈస్ట్ ఇండియా కంపెనీ, భరత భూమి నుండి అందినంత దోచుకుపోవాలన్న దుష్ట సంకల్పంతో, వినూత్న రెవిన్యూ పద్దతులను ప్రవేశపెట్టింది. ఈ పద్ధతుల వలన గ్రామీణ వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. ప్రజానీకం పలు ఇక్కట్లకు గురయ్యారు. కంపెనీ పాలకులు, పాలకుల తొత్తులు, ఆ తొత్తుల మద్దతుదారులు ప్రజానీకాన్ని దోచుకుంటూ సంపన్నులు కాసాగారు.

బ్రిటీషర్ల శాశ్వత పన్ను విధానం (Permanent Settlement) వలన ఈ దుస్థితి ఉత్పన్నమైంది. వ్యవసాయిక దేశంలో రైతుకు భూమి మీద హక్కు లేకుండా చేయటం ద్వారా వలస పాలకులు క్రూరమైన రెవిన్యూ విధానాలకు శ్రీకారం చుట్టారు. జమీందారులకు

భూముల మీద శాశ్వత అధికారం కట్టబెట్టి, అత్యధిక మొత్తాలలో సాంవత్సరిక లబ్ధిని రాబట్టుకుంటూ , రైతులను జమీందారుల దయాదక్షిణ్యాల పాల్జేసారు. కంపెనీ పాలకులకు అత్యధిక మొత్తాలను చెల్లించవలసి రావడంతో రైతు నుండి అత్యధిక పంట భాగాన్ని జమీందారులు పిండుకోవడం ప్రారంభించారు.

ఈ వాతావరణంలో గ్రామీణ ప్రాంతాల పరిస్థితి దారుణంగా తయారయ్యింది. వడ్డీ వ్యాపారులైన మహాజనులు గ్రామస్థులను పీడించ సాగారు. కంపెనీ వర్తకులు, వ్యాపారులు, అధికారులు స్వదేశీ వాణిజ్యం మీద పెత్తనం చలాయించటం ఆరంభించారు. అధికారుల జులుం మితిమీరింది. ఈ పరిస్థితికి తోడుగా బెంగాల్ ప్రాంతంలో వచ్చిన తీవ్ర దుర్భిక్షం ప్రజానీకాన్ని పలు వెతల పాల్జేసింది. ఆకలిదప్పులతో అలమటిస్తూ తండోపతండాలుగా ప్రజలు మరణిస్తున్నా, కంపెనీ పాలకులు, జమీందారులు, మహాజనులు పరమ కిరాతకంగా వ్యవహరించారు.

ఈ దుర్భర పరిస్థితుల నుండి, పాలకుల పీడన నుండి విముక్తి కోరుతూ, కంపెనీ పాలకుల పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ తిరుగుబాట్లు ప్రజ్వరిల్లాయి. 1760 నుండి 1800 వరకు బెంగాల్ ప్రాంతం ముస్లిం ఫకీర్లు, నాగా సన్యాసులు కలసి, విడివిడిగా పోరాడారు. ఆయుధ బలం, అంగ బలం, అర్ధబలం గల కంపెనీ పాలకులు, ఈ తిరుగుబాటును నాలుగు దశాబ్దాల తరువాత గానీ జయించలేకపోయారు. ఫకీర్ల తిరుగుబాటు ముగిసిన మూడు దశాబ్దాల తరువాత భరత గడ్డ మీద మరొక మహత్తర పోరాటం రూపుదిద్దుకుంది. ఈ పోరాటాన్ని మహత్తర **' వహాబీ ఉద్యమంగా '** చరిత్ర నామకరణం చేసింది. ఈ ఉద్యమం 1820 నుండి 1870 వరకు అర్ధశతాబ్ది పాటు సాగి, దేశంలో రగిలిన విముక్తి పోరాటాలకు స్ఫూర్తిదాయకమైంది.

**వహాబీ** అను పదం ఉద్యమకారులు ఎన్నుకున్నది కాదు. బ్రిటీషర్ల పెత్తనాన్నీ, ఆధిపత్యాన్నీ తొడగొట్టి సవాల్ చేసి, వలస పాలకులను ముప్పుతిప్పలు పెట్టిన ఉద్యమకారుల మత సంబంధమైన సంప్రదాయాలను ఆధారంగా చేసుకొని, ముస్లిం సమాజం నుండి వారిని వేరు చేయాలన్న కుయుక్తులతో వహాబీలు **మార్గభ్రష్టత్వం చెందిన ముస్లింలని** బ్రిటీషర్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ అచారాలను పాటించేవారిని **వహాబీలు** గా నామకరణం చేసి అసత్యాలను ప్రచారంలో పెట్టారు. ఈ ప్రచారం వెనుకగల కుట్రను గుర్తించని కొందరు మౌల్వీలు, ఉలేమాలు వహాబీలకు వ్యతిరేకంగా ఫత్వాలు కూడా జారీచేసారు.

### వహాబీలు ఎవరు?

అరేబియాకు చెందిన సంస్కర్త అబ్దుల్ వహాబ్, ఇస్లాం మత సిద్ధాంతాలకు భాష్యం చెప్పి, సంస్కరించి శుద్ధ తత్వాన్ని ప్రవేశపెట్టారు. ఆయన ప్రబోధించిన తాత్విక ధోరణి, ఆచార సంప్రదాయాలను అనుసరించిన ముస్లింలను **వహాబీలు** అన్నారు. ఇస్లాం మతానుయాయులు ఇస్లాం నిర్దేశించిన, మహమ్మద్ ప్రవక్త చూపిన దారి తప్పి పయనిస్తున్నారని భావించి, ప్రవక్త నిర్దేశించిన బాటలో, ఇస్లాం ఆవిర్భవించిన నాటి సంప్రదాయాల మార్గాన ముస్లిం సమాజాన్ని నడిపించటానికి ప్రయత్నాలు ప్రారంభించారు. స్వచ్ఛత, సమానత్వం,

సౌభ్రాతృత్వం, సదాచారం, సచ్ఛీలత, లక్ష్యాలుగా ఈ ఉద్యమం ఆరంభమైంది. ( ".. The founder was the Arab theologian Mohammed Bin Abdul Wahad, who preached a revival of pure Islam and a campaign for genuine monotheism..", - A Dictionary for Believers and Non-believers, Progress Publishers, Moscow, 1889 )

ఈ సంప్రదాయాన్ని **' తరీఖా-ఏ-మహమ్మదీయా '** ( Tariqa-I-Muhammadiya) అని వహాబీ తత్త్వవేత్తలు పిలుచుకున్నారు. అబ్దుల్ వహాబ్ నిర్దేశించిన సంప్రదాయాలు, సంస్కరణల అనుసరణలో చాలా నిక్కచ్చిగానూ, కఠినంగానూ వ్యవహరించటం వహాబీల ప్రత్యేకత. వహాబీలు తమ వస్త్రధారణ, ఆచార-సంప్రదాయాలలో సామాన్య ముస్లింల కంటే భిన్నంగా కన్పించసాగారు. తమ ఆలోచనలతో, ఆచార సాంప్రదాయాలతో ఏకీభవించని తోటి మతస్థులను **' ముష్రిక్కులు '** గా పరిగణించటంతో, సామాన్య జనావళిలో అపోహలు అపార్థాలకు అస్కారం ఏర్పడింది. అయినప్పటికీ అచిరకాలంలోనే వహాబీ తత్త్వం, సంప్రదాయాలు బాగా ప్రచారం పొందాయి. ఆ తరువాత ధార్మిక ఆలోచనలకు తోడుగా ఆర్థిక, రాజకీయ అవసరాలు, భావనలు వహాబీ ఉద్యమాన్ని పెనవేసుకుపోవడంతో వహాబీ ఉద్యమం చరిత్రలో ప్రత్యేక స్థానం పొందగలిగింది.

## ఉద్యమ నిర్మాత సయ్యద్ అహమ్మద్ బరేల్వి

అరేబియాలో ఆవిర్భవించిన వహాబీ సంప్రదాయాన్ని భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయబరేలికి చెందిన సయ్యద్ అహమ్మద్ బరేల్వి. 1803లో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆయన టోంక్ నవాబు అమీర్‌ఖాన్ సైన్యంలో చేరారు. సైనిక శిక్షణ పొందారు. అమీర్‌ఖాన్ బ్రిటీష్ పాలకుల ఆధిపత్యాన్ని అంగీకరించటంతో, అక్కడ ఉండలేక 1817లో పదవీ విరమణ చేశారు. ఆనాడు ఇస్లామిక్ పునరుద్దరణ ఉద్యమాలను సాగించిన ప్రముఖ ఇస్లామిక్ తత్త్వవేత్తలు షా వలియుల్లా (1703-62), ఆయన కుమారుడు అబ్దుల్ అజీజ్ (1746-1823) ల తాత్త్విక సిద్ధాంతాలకు ఆయన ఆకర్షితుడయ్యారు. ఆ సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తూ పలు ప్రాంతాలు పర్యటించారు. ఈ ప్రచారం కార్యక్రమంలో ఆయనకు పెద్ద శిష్యవర్గం ఏర్పడింది.

1821లో ఆయన ఎనిమిది వందల శిష్యులతో హజ్ యాత్ర చేసారు. ఆ సమయంలో అబ్దుల్ వహాబ్ గురించి విన్నారు. అరేబియాలో ఆయనకు వహాబీ సంప్రదాయం పరిచయమైంది. ఆ తాత్త్విక సిద్ధాంతానికి ప్రభావితుడయ్యారు. 1824లో మక్కా నుండి స్వదేశం చేరుకున్నారు. భారతదేశంలోని పరిస్థితులను గమనించారు. వహాబీ తత్త్వశాస్త్రం ప్రకారంగా శుద్ధ ఇస్లాంను, మహమ్మద్ ప్రవక్త మార్గాన్ని ముస్లింలు తు.చ. తప్పకుండా అనుసరించేలా, ఆచరించేలా చూడాలంటే, అది ఇస్లామిక్ రాజ్యంలో మాత్రమే సాధ్యమని సయ్యద్ అహమ్మద్ భావించారు. స్వదేశంలో బ్రిటీషర్ల పెత్తనాన్ని సహించలేకపోయారు. బ్రిటీషర్లను తరిమివేయాలని సంకల్పించారు.

ఇస్లామిక్ రాజ్యస్థాపనకు భారీ సంఖ్యలో వహాబీ కార్యకర్తలను సమకూర్చుకునేందుకు పలు పర్యటనలు చేసారు. తాత్త్విక, ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాలను, విధానాలను ప్రజలకు వివరించారు. ప్రతిచోట ఆయనకు ఘనంగా స్వాగతం లభించింది.

భారీ అనుచరవర్గం ఏర్పడింది. ఈ పర్యటనల సందర్భంగా పలుచోట్ల వహాబీ కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఆ కేంద్రాలకు సమర్ధులైన నిర్వాహకులను నియమించి, వహాబీ తత్త్వ ప్రచారం చేయాల్సిందిగా ఉద్బోధించారు. ఆ తరువాత మతపరమైన, రాజకీయ విధానాలను అమలు పర్చేందుకు సరైన స్థావరం కోసం అన్వేషణ సాగించారు. ఈ ఆలోచనల పర్యవసానంగా వాయవ్య సరిహద్దులోని పర్వత ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. అక్కడ ఉన్న పఠాన్ జాతుల ప్రజానీకాన్ని వహాబీ సిద్ధాంతాలతో ప్రభావితం చేసి, సరిహద్దు అవతలి వైపు నుండి కూడా సహాయం పొందవచ్చని ఆశించారు. స్వదేశంలోని కార్యకర్తలను, అనుచరులను వాయవ్య సరిహద్దు కేంద్రానికి తరలి రమ్మని పిలుపు ఇచ్చారు. ఆ పిలుపు మేరకు భారీ సంఖ్యలో ఆయన వెంట నడిచిన అనుచరులతో, పది మాసాల పాటు మూడు వేల మైళ్ళు ప్రయాణించి గమ్యస్థానం చేరుకున్నారు. స్థావరాలు ఏర్పాటు చేసుకుని పోరాటం ప్రారంభించి, పెషావర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగానే సయ్యద్ అహమ్మద్ వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని పఠాన్‌లకు శుద్ధ ఇస్లాం గురించి బోధిస్తూ, ఇస్లాంకు వ్యతిరేకమైన మూఢాచారాలను విడనాడమని ప్రచారం చేసారు. ఈ మార్పులు నచ్చని పఠాన్‌లు ఆయనకు తోడ్పాటు ఇవ్వలేదు. సయ్యద్ అహమ్మద్ సాగించిన ధార్మిక ప్రచారం పలు ప్రాంతాలలో విజయాలు సాధించినా పూర్తి పట్టు లభించలేదు. ఆయనకు కొన్ని ప్రాంతంలో స్థిరత్వం లభించాక ముస్లింల మీద కత్తిగట్టిన సిక్కుల మీద యుద్ధం ప్రకటించారు. చివరకు 1831లో బాల్‌కోట్ వద్ద మహరాజా రంజిత్ సింగ్‌తో జరిగిన యుద్ధంలో సయ్యద్ అహమ్మద్, ఆయన ప్రధాన అనుచరుడు మహమ్మద్ ఇస్మాయిల్ అమరులయ్యారు. ఈ యుద్ధంలో పరాజయం పాలుగావటం వహాబీలు సహించలేకపోయారు. ఆ తరువాత సిక్కులు బ్రిటీషర్లకు తలవంచి, వలసవాదుల పెత్తనాన్ని స్వీకరించారు. ఈ పరిణామంతో సయ్యద్ అహమ్మద్ అనుచరవర్గమైన వహాబీలు, తమ ఆయుధాలను వలసపాలకుల దిశగా గురిపెట్టారు.

## తిరగబడ్డ పులి మీర్ నిస్సార్ అలీ

వహాబీ సిద్ధాంతాలను భారతదేశంలో బహుళ ప్రచారం గావించిన సయ్యద్ అహమ్మద్ విజయయాత్రల నుండి ఉత్తేజం పొంది బ్రిటీషర్ల మీద తిరుగుబాటు జెండాను ఎగురవేసిన పోరాట వీరుడు మీర్ నిస్సార్ అలీని టిటూ మీర్, టిటూ మియా అని కూడా పిలిచేవారు. బెంగాల్‌లోని నర్కేల్‌బరియా సమీపాన గల చాంద్‌పూర్‌లోని మధ్యతరగతి రైతు కుటుంబాన 1782లో ఆయన జన్మించారు. చిన్నతనం నుండే వ్యాయామం, కుస్తీపట్ల మక్కువ చూపి మంచి వస్తాదుగా ఖ్యాతిగాంచారు. కలకత్తా వెళ్ళి పలు కుస్తీ పోటీలలో పాల్గొన్నారు. 1815లో తిరిగివచ్చి నాడియా జమీందారు కొలువులో చేరారు. ఈ సందర్భంగా నాడియాలో జరిగిన ఒక దొమ్మిలో పాల్గొన్నారు. ఆ సంఘటనలో ఆయనకు శిక్ష పడింది. ఈ సంఘటన తరువాత జమీందారు కొలువును వదిలి పెట్టారు. అనంతరం కలకత్తాలోని కులీన సంపన్న వర్గానికి చెందిన ఓ కుటుంబం కొలువులో చేరారు. ఈ కొలువు ఆయన జీవితాన్ని పెను మార్పులకు గురిచేసింది. సామాన్య కుస్తీ వస్తాదు లోని ఆధ్యాత్మికవేత్తను, ప్రజల కోసం ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధపడే తిరుగుబాటు వీరుడ్ని మేల్కొల్పింది.

1823 ప్రాంతంలో ఆయన హజ్ యాత్రకు మక్కా వెళ్ళారు. ఆ సమయాన సయ్యద్ అహమ్మద్ బర్వేలి, ఫరైజీ ఉద్యమ నాయకుడు షరియతుల్లా కూడా మక్కాలో ఉండటం తటస్థించింది. ఈ నాయకులు ముగ్గురూ కలుసుకోవటమేకాక, స్థానిక వహాబీ నాయకులతో కూడా సంబంధాలు ఏర్పర్చుకున్నారు. మక్కా నుండి తిరిగి వచ్చాక కొంతకాలం కలకత్తాలో గడిపి నర్కేల్‌బరియా సమీపాన గల హైదర్‌పూర్ వెళ్ళి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. వహాబీ తత్త్వప్రచారం తన జీవితాశయంగా నిర్ణయించుకుని, ఆ దిశగా ప్రయాణం ప్రారంభించారు. గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ ప్రజలకు నైతిక, ధార్మిక బోధనలు చేయసాగారు. ఈ బోధనలు త్వరలోనే ప్రజలను ఆకర్షించాయి. పేద రైతులు, చేతి వృత్తులవారు, చేనేత పనుల వారు ఆయన వెంట నడుస్తూ, వహాబీ సంప్రదాయానికి అనుగుణంగా తమ జీవితాలను మార్చుకున్నారు. పరిసర ప్రాంతాలలో ఆయనకు పెద్ద అనుచర వర్గం ఏర్పడింది. ఆయన మార్గం అనుసరించే వారంతా ఒక ప్రత్యేక సమూహంగా తయారయ్యారు. ఈ పర్యటనల సందర్భంగానే నిస్సార్ అలీ సామాన్య ప్రజానీకం పడుతున్న బాధలను గమనించారు. కంపెనీ అధికారులు, జమీందారులు, మహాజనులు సాగిస్తున్న దోపిడీని చూసారు. ప్రజల ఆక్రందనలు విన్నారు. వలస పాలకుల దోపిడీని నిరోధించాలనుకున్నారు. ఆ దిశగా ఆయన ఆలోచనలు సాగుతున్న సమయంలో వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో సయ్యద్ అహమ్మద్ బర్వేలి విజయాలు ఆయనను ఉత్తేజపరిచాయి. ఆ బాటలో ప్రజలను సమాయత్తం చేసేందుకు తనతో కలసి వచ్చిన ఫకీర్లతో పలు పర్యటనలు జరిపారు. ఈ పర్యటనలు రానున్న కాలంలో ప్రారంభం కానున్న పోరాటాలకు ఊపిరిపోశాయి.

ఈ పరిస్థితులు ఇలా ఉండగా కంపెనీ పాలకులు ముస్లింల జీవితాలను పెనుమార్పులకు గురిచేయగల పలు చర్యలను అమలులోకి తెచ్చారు. రాజభాగం ఏమీ ఆశించకుండా పూర్వపు పాలకులు ధార్మిక సంస్థలకు ఉచితంగా ఇచ్చిన భూములను కంపెనీ పాలకులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఆ కంపెనీ పాలకుల అడుగులకు మడుగులొత్తే నూతన జమీందారులను రంగంలోకి తీసుకురావటంతో పాత జమీందారులు ఒక్కసారిగా బజార్న పడ్డారు. రాజ భాషగా వెలిగిన పర్షియన్ భాష స్థానంలో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టడంతో ముస్లిం విద్యావంతులు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులయ్యారు. అప్పటివరకూ న్యాయస్థానాలలో ముస్లింలు చలాయించిన ఆధిక్యతను కోల్పోయారు. ఈ పరిణామాల మూలంగా ముస్లిం సమాజంలో తీవ్ర నిరాశ నిస్పృహలు వ్యాపించాయి. కంపెనీ పాలకులు ప్రవేశ పెట్టిన శాశ్వత సెటిల్‌మెంట్ రెవిన్యూ విధానంతో రైతు భూమి మీద హక్కులను కోల్పోయాడు. పంటలో అత్యధిక భాగాన్ని రాజభాగంగా కంపెనీకి తొత్తులైన జమీందారుల పరం చేయాల్సి వచ్చేసరికి రైతుకు కష్టం-నష్టం తప్ప మిగిలేది ఏమీ లేకపోయింది. ఆ పరిస్థితులు సృష్టించిన నిరాశ నిస్పృహల నేపథ్యంలో మీర్ నిస్సార్ అలీ బోధనల వలన, బెంగాల్‌లోని పలు జిల్లాల్లో వహాబీల ప్రాబల్యం బాగా పెరిగింది. వహాబీలంతా ఒక జట్టు-కట్టు కావటంతో, తామంతా ఒకే సమూహమన్న చైతన్యం పెరిగి, పీడనకు, దోపిడికి వ్యతిరేకంగా పోరాడాలన్న ఆలోచనలు అంకురించాయి.

## తిరుగుబాటుకు బీజం వేసిన జమీందారు దుశ్చర్య

ఈ పరిస్థితులు బెంగాల్ అంతటా ఉండగా క్రూరుడు, విలాసపురుషుడైన ' **పూర్వా** ' గ్రామం జమీందారు మరొక అడుగు ముందుకువేసి, వహాబీలను నిరుత్సాహపర్చేందుకు అమానుష చర్యలు అమలులోకి తెచ్చాడు. ముస్లిమేతరుల పండుగలకు ముస్లింల ముక్కుపిండి విరాళాలు వసూలు చేయడం ప్రారంభించాడు. నిరాకరించిన వారిని హింసించడటం, నిర్బంధించడం, అవమాన పర్చటం నిత్యకృత్యమైంది. అధికారుల ఆజ్ఞలను గాని, జమీందారు ఆదేశాలను గానీ శిరసావహించని వ్యక్తుల జీవితాలు దుర్భరమైపోయాయి. అసత్య ఆరోపణలు చేయటం, పంచాయతీ పెట్టడం, కచ్చేరీకి రప్పించి, తన మనుషుల చేతనే ఆరోపణలు చేయించి, వాటిని ఋజువు చేయించి, నేరస్థులుగా ముద్రవేసి పరువు తీయటం లాంటి కుయుక్తులతో వహాబీలను శారీరకంగా, మానసికంగా హింసించ సాగాడు. ఈ వాతావరణాన్ని సహించలేని వహాబీలు జమీందారు చర్యలను నిరసించారు. గ్రామంలోని వహాబీలలో కన్పించిన ఈ మార్పును గమనించిన జమీందారు కృష్ణదేవరాయ్, వహాబీ పెద్దలను పిలిపించి హెచ్చరికలు చేశాడు. ఈ హెచ్చరికలను పెడచెవిన పెడితే చేదు పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని బెదిరించాడు. ఆ సమయంలో జమీందారు మీద ఆగ్రహావేశాలు కలిగినా, అనువుగాని సమయమని వహాబీలు మౌనం నటించారు. ఈ మౌనాన్ని విజయంగా భావించిన జమీందారు మరింత విజృంభించాడు.

వహాబీలు తమ ప్రత్యేక ఆచార సంప్రదాయాలను తు.చ. తప్పక అనుసరించటమే కాకుండా, తల నున్నగా గీయించుకుని గడ్డం పెంచేవారు. జమీందారు కృష్ణ దేవరాయ్ చూపు వహాబీల గడ్డం మీద పడింది. చైతన్యవంతులౌతున్న వహాబీలను నిరుత్సాహపర్చాలని అనుకున్న జమీందారు, వహాబీలు గడ్డం తీసివేయాలని లేదా గడ్డం పెంచినందుకు రెండు రూపాయల ఎనిమిది అణాలను ' **గడ్డం పన్ను** ' గా కట్టాలని ఆదేశించాడు. ఈ మొత్తాన్ని పన్ను రూపంగానే కాకుండా జరిమానాగా వసూలు చేయించాడు. ఈ పన్నును చెల్లించడానికి వహాబీలు నిరాకరించారు. జమీందారు ఏజెంట్లు గడ్డం పన్నును వసూలు చేయటానికి వహాబీల గడ్డాలు పట్టుకుని గుంజి అవమాన పర్చసాగారు. ( "...Some complained that the fine was not only realised from them but their beards were plucked by the zamindar"s agents..." - Wahabi and Farazi Rebels of Bengal, Narahari Kaviraj, PPH - 1982 New Delhi ) ఈ పన్ను విధింపు, వసూలు విధానం వహాబీలలో ఆగ్రహాన్ని రగిలించింది. ఏది ఏమైనా పన్ను చెల్లించేది లేదని వహాబీలు ప్రకటించారు.

వహాబీల ఉమ్మడి నిర్ణయంతో మండిపడ్డ జమీందారు మూడు వందల మంది సాయుధులైన అనుచరులతో తరలివచ్చి, గడ్డం పన్నును చెల్లించాలని, నిరాకరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. అయినప్పటికీ తిరస్కారం ఎదురుకావటంతో, గ్రామంలోని మసీదు మీద దాడిచేసి, మసీదును తగలబెట్టించాడు. ఈ విషయాన్ని 1831 జూన్ 27న బరాసత్ మేజిస్ట్రేట్‌కు పంపిన రిపోర్టులో బషీర్‌హట్ ఠాణా గుమస్తా స్పష్టంగా తెలిపాడు. ఈ సంఘటనల తరువాతి పరిణామాల నుండి తప్పించుకోవడానికి, బషీర్‌హట్ పోలీసు స్టేషన్ అధికారితో జమీందారు లాలూచీ పడి,

వహాబీలే తమ మసీదును తాము తగులబెట్టుకున్నారని, జమీందారు తప్పులేదని రిపోర్టు తయారు చేయించుకున్నాడు. ఈ సంఘటనలో మీర్ నిస్సార్ అలీ, ఆయన ప్రధాన సలహాదారుడు గులాం మాసూంలు జమీందారుకు వ్యతిరేకంగా రైతులను, ప్రజలను రెచ్చగొట్టారని నివేదికలో రాయించాడు. ఈ వ్యవహారాన్ని వహాబీలు జాయింట్ మేజిస్ట్రేటు దృష్టికి తీసుకువెళ్ళారు. ఆ అధికారి జమీందారుతో రాజీపడమని వహాబీలకు సలహా ఇచ్చాడు. వహాబీలు నిరాకరించారు. తన సూచనను అంగీకరించలేదని, జమీందారుకు అనుకూల సాక్ష్యాలతో నివేదిక నమోదు చేసిన, ఆ అధికారి వహాబీల ఫిర్యాదును కొట్టివేసాడు. ఈ వ్యవహారాన్ని అంతటితో వదలరాదనుకున్న వహాబీలు కలకత్తాలోని కమీషనర్ వద్ద అప్పీల్ చేసారు. వహాబీల పక్షాన మొహమ్మద్ మసూద్ అను న్యాయవాది కేసును నడిపాడు. వహాబీలకు న్యాయం జరుగలేదు. జమీందారు మరింత రెచ్చిపోయాడు. నిస్సహాయులైన గ్రామ రైతుల మీద పగబట్టాడు. ఈ సంఘటనలో జమీందారుకు వ్యతిరేకంగా నిలిచిన పేద వహాబీలను, రైతులను వేధింపులకు, హింసలకు గురిచేసాడు. పంట భాగం తక్షణమే కట్టాలని నిర్బంధించాడు. గృహాల మీద దాడులుచేసి ఏదుంటే అది ఎత్తుకు రమ్మని అనుచరులకు ఆదేశాలిచ్చి కిరాతకంగా వ్యవహరించాడు. వహాబీలను నిర్బంధించి దస్తావేజుల మీద బలవంతంగా సంతకాలు చేయించుకున్నాడు.

**తిరగబడ్డ వహాబీలు**

జమీందారు ఆగడాలు మితిమీరటంతో వహాబీలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. తమను ఘోరంగా అవమానపర్చిన జమీందారు మీద ప్రతీకారం తీర్చుకునేందుకు సమాయత్తమయ్యారు. గ్రామీణులకు మీర్ నిస్సార్ ఆలీ నాయకత్వం వహించాడు. ఆయన గ్రామానికి చెందిన రైతులు, మైజుద్దీన్ బిస్వాస్, చేనేత పనివారైన బలాయ్ జులాహ, డాకూ కారీగార్, దీమ్ కారిగార్, ఖాదార్ బక్ష్ కారీగార్, పూజత్ మల్లిక్ తదితరులు వెంట నడిచారు. ఈ సందర్భంగా 1763-1800 నాటి ఫకీర్ల పోరాటంలో పాల్గొన్న నేతల వారసుడైన ఫకీర్ కురజాన్ షా తన అనుచరులతో మీర్ నిస్సార్ అలీతో చేతులు కలిపారు. వహబీలు నర్కేల్‌బరియా గ్రామం చేరుకున్నారు. సంప్రదాయక ఆయుధాలను సమకూర్చుకుని, పోరుకు సిద్ధమయ్యారు. 1831 నవంబర్ 6 న సుమారు 500 మంది పూర్వా గ్రామం మీద దాడి చేసారు. ఈ దాడి విషయాన్ని పసిగట్టిన జమీందారు, ధనిక సంపన్న వర్గాలు గ్రామం విడిచి పారిపోయారు. జమీందారు దొరకకపోవటంతో ఆగ్రహావేశాలకు లోనైన వహాబీలు విజ్ఞత కోల్పోయారు. అనుచిత చర్యలకు పాల్పడ్డారు. వహాబీలకు అడ్డులేకుండా పోయింది. ప్రతిఘటన లేని ఈ విజయం వహాబీలను ఉత్తేజపరిచింది.

కంపెనీ పాలకుల, అధికారుల నిరంకుశ పాలన, జమీందారుల దాష్టీకాలతో విసిగిపోయిన ప్రజలు తిరగబడిన వహాబీల వెంట సాగేందుకు ముందుకు వచ్చారు. పూర్వా గ్రామం తరువాత నాడియా జిల్లాలోని లోగహట్టీ గ్రామం మీద దాడి జరిగింది. ఆ గ్రామానికి చెందిన శ్రీ హరదేవరాయులు వహాబీలను ఎదుర్కొన్నాడు. ఆ పోరులోనూ వహాబీలదే పై

చేయి అయ్యింది. ఈ దాడిలో దేవనాధ్ అను వ్యక్తి మరణించగా పలువురు గాయపడ్డారు. ప్రధమ దశ దాడుల తరువాత వహాబీలు తమ కేంద్ర స్థావరం నర్కెబల్ బరియా చేరుకున్నారు. అక్కడ నుండి తిరిగి రామచంద్రపూర్ తదితర గ్రామాలలోని జమీందార్లు, కంపెనీ పాలకులు, ధనిక సంపన్నులైన వడ్డీ వ్యాపారుల మీద దాడులు జరిపారు. ఈ దాడులను నిరోధించగల స్థాయి ప్రతిఘటన కంపెనీపాలకుల, జమీందారుల నుండి లేకపోవటంతో వహాబీలలో ఆత్మస్థైర్యం బాగా పెరిగింది.

ఈ సందర్భంగా ముస్లిమేతర జన సముదాయాల మీద వహాబీలు దాడులకు పాల్పడటం పలు విమర్శలకు గురయ్యింది. పంజాబ్‌కు చెందిన మోల్లా మిష్కిన్ షా అను వ్యక్తి దుర్బోధల వలన రెచ్చిపోయిన వహాబీలు తొలి దశలో అవాంఛనీయ దాడులకు పాల్పడ్డారు. (".. It is probable that during intermediary stage of revolt some excesses were committed by the followers of Titu Mir under the instigation of Mollah Mishkin Shah, a native from Punjab.." - Freedom Movement and Indian Muslims, Dr. Santimoy Ray, PPH, 1983) ఈ పరిస్థితిని గమనించిన నిస్సార్ అలీ ప్రతిఘటించిన వారిని తప్ప ఇతర ప్రజలకు ఏవిధంగా నష్టం కల్గించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీచేసారు. ఆ ఆదేశాలు ఖచ్చితంగా అమలు జరిగేట్టుగా ఆయన పలు చర్యలు తీసుకున్నారు.

అచార సంప్రదాయాలను అవమానపర్చారన్న కసితో ప్రారంభమైన దాడులు క్రమంగా దిశను మార్చుకున్నాయి. ప్రజల సామాజిక, ఆర్థిక కడగండ్లను మీర్ నిస్సార్ అలీ పరిగణనలోకి తీసుకున్నారు. ఈ మార్పు వలన, మతాలతో సంబంధం లేకుండా క్రమక్రమంగా అన్ని మతాల, వర్గాల, జాతుల పేద ప్రజానీకం మహమ్మద్ నిస్సార్ అలీ బలగాలలో చేరారు. భారీసంఖ్యలో బలగాలు చేకూరటంతో, నర్కెల్ బరియాలో వెదురు కర్రలతో పటిష్టమైన, విశాలమైన కోటను నిర్మించారు. ఈ కోటలలో ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క ప్రత్యేక గది ఏర్పాటుచేశారు. ఆయుధాల గది, ఆహారపదార్ధాల గది, కార్యాలయ గది, తదితర ప్రత్యేక ఏర్పాట్లను కల్పించారు. ఆయుధాలను, ఆహారపదార్ధాలను భారీగా సేకరించారు. బలగాలకు పోరాటంలో మంచి శిక్షణ ఇప్పించారు.

ఈ మేరకు ఆరంభంలో మతపరమైన సంస్కరణల దిశగా దృష్టిసారించిన ఉద్యమం, స్థానిక పరిస్థితుల నేపధ్యంలో త్వరితగతిన ఆర్థిక, రాజకీయ లక్ష్యాల వైపుగా దిశను మార్చుకుంది. ఈ లక్ష్య సాధన దిశగా సాగుతున్న మీర్ నిస్సార్ అలీకి, లక్ష్యసాధన కోసం పోరుబాటను ఎంచుకున్న వహాబీలకు బెంగాల్‌లోని గ్రామీణ ప్రజల, రైతుల, చేతి, కుల వృత్తిదారుల తోడ్పాటు అపారంగా లభించింది.

## ఆధికారులను పరుగులెత్తించిన వహాబీలు

మీర్ నిస్సార్ అలీ దాడులను తొలుత కంపెనీ అధికారులు పట్టించుకోలేదు. పూర్వా గ్రామం మీద దాడి జరుగక ముందే దాడి సమాచారం అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. ఆ తరువాత క్రమక్రమంగా తిరుగుబాటు దళాలు బలపడే కొద్ది పోలీసు అధికారుల నుండి, బ్రిటీష్ ప్లాంటర్ల నుండి ఫిర్యాదులు రావటంతో కంపెనీ

అధికారులు మేల్కొన్నారు. ఈ తిరుగుబాటును అణచివేయడానికి బరాసత్ జాయింట్ మేజిస్ట్రేట్‌కు కలకత్తా కమీషనర్ ప్రత్యేక ఆదేశాల్ని పంపారు. వహాబీలను ఎదుర్కొనే సంగతి తరువాత, అసలు నిలువరించటమే చేతకాక, అధికారి పలాయనం చిత్తగించాడు.

ప్రారంభ దశలో లభించిన విజయాల ఉత్సాహంతో ఉన్న మీర్ నిస్సార్ అలీ బలగాలు ఆత్మవిశ్వాసంతో మరింత విజృంభించాయి. ఈ అనుకూల వాతావరణానికి, మీర్ నిస్సార్ అలీ, ఆయన అనుచరుల ధైర్య సాహసాలు తోడుకావటంతో తిరుగుబాటు దళాలకు అడ్డూ అపూ లేకుండాపోయింది. ఆత్మ విశ్వాసం నిండిన బలగాలు విజయ పరంపరను కొనసాగించాయి. కంపెనీ పాలకులచే పంపబడిన పోలీసు అధికారులు, కంపెనీ సాయుధ బలగాలు, తుపాకులు, ఫిరంగులతో దాడులు చేసినా వహాబీ దళాలు విక్రమించి పోరాడాయి. కంపెనీ బలగాలను, అధికారులను తరిమికొట్టాయి. తిరుగుబాటును అణచివేయడానికి వచ్చిన కంపెనీ అధికారి అలెగ్జాండర్ చావు తప్పి కన్నులొట్టపోయి బ్రతుకు జీవుడా అంటూ పారిపోయాడు. ఈ తిరుగుబాటు దళాల ధైర్య సాహసాలను వర్ణిస్తూ , **కంపెనీ బలగాలు పెద్ద సంఖ్యలో దాడి చేసి తుపాకులు ఎక్కుపెట్టినా, తిరుగుబాటు వీరులు వెనుకంజ వేయకుండా, ముందుకు దూసుకు వచ్చేవారని** నాడియా జిల్లా మేజిస్ట్రేట్ ఆశ్చర్యం వ్యక్తం చేసిన సంఘటనలు తిరగబడిన గ్రామీణుల శౌర్యపరాక్రమాలకు అద్దం పడతాయి. ( "..they approached within the reach of our fire in a most bold and determined way, nor did the fall of one or two of their foremost by our shot, deter the rest from advancing...", -- Wahabi and Farazi Rebels of Bengal, Shri Narahari Kaviraj, Page 48 ) అంతేకాదు తన బలగాలు పారిపోయాయని, తాను కూడా పలాయనం చిత్తగించి ప్రాణాలు కాపాడుకోవడం జరిగిందని,తరుముకువస్తున్న తిరుగుబాటుదారుల నుండి తప్పించుకోవటానికి 5 మైళ్ళు పరిగెత్తానని ఆ ఆంగ్ల అధికారి ఉన్నతాధికారులకు రాసుకున్న నివేదికలో స్వయంగా వివరించాడు. ( "...almost every person on my side was running away and I also obliged to run for my life, the insurgents pursuing me with drawn swords. After running 5 miles ..." - Wahabi and Farazi Rebels of Bengal, page 40)

ఒకవైపు బ్రిటీషర్ల దాడులను ఎదుర్కొంటూనే, గ్రామీణ ప్రజల మీద జులుం ప్రదర్శిస్తున్న ప్లాంటర్ల మీద తిరుగుబాటు దళాలు దాడులు ప్రారంభించాయి. బలమైన రక్షణ వ్యవస్థ కలిగిన ప్లాంటర్లు, తిరుగుబాటు దళాలను ఎదుర్కొనలేక ఆత్మ రక్షణార్థం కర్మాగారాలు, విలాసవంతమైన తమ భవనాలు వదిలి సమీప నగరాలకు పారిపోయారు. జమీందారులు, ప్లాంటర్లు మాత్రమే కాకుండా బ్రిటీషర్లకు, జమీందారులకు మద్దతిస్తున్న గ్రామంలోని ధనిక వర్గాల పట్ల కూడ మీర్ నిస్సార్ అలీ నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హిందూ-ముస్లిం తేడాలను పూర్తిగా విస్మరించారు. ప్రారంభదశలో మతపరమైన సంబంధాలు తిరుగుబాటు వీరుల మీద కొంత మేరకు ప్రభావం చూపినా, పోరాటం ఉధృతమై, విస్తరించే కొద్ది ఆ సంబంధాలు రూపు మాసిపోయాయి. ఒక సందర్భంలో షేర్‌పూర్ గ్రామానికి చెందిన యార్ మొహమ్మద్ అను సంపన్నుడు, జమీందారుకు వత్తాసు పలుకగా ఆయన ఇంటిమీద దాడి జరిగింది. మరో సందర్భంలో నిస్సార్ అలీతో

చేతులు కలుపగలనంటూ, బూష్నా జమీందారు శ్రీమనోహర్ రాయ్, బ్రిటీషర్లను బెదిరించిన సంఘటన కూడా ఉంది. తిరుగుబాటు రూపుమారేకొద్దీ లక్ష్యం కూడా మారి, చివరకు ఫిరంగీలను తరిమికొట్టడమే అంతిమ లక్ష్యంగా స్థిరపడిపోయింది.

ఆంగ్లేయ అధికారులను, కంపెనీసేనలను తిప్పికొడుతూ నిస్సార్ అలీ బలగాలు బెంగాల్‌లోని, బరాసత్, నాడియా జిల్లాలు, ఆ పరిసరప్రాంతాల మీద బాగా పట్టు సాధించాయి. ఈ ప్రాంతాలలో నిస్సార్ అలీ, ఆయన అనుచరులదే చివరి మాట అయింది. కంపెనీ పాలన, జమీందారుల పెత్తనం దాదాపుగా కనుమరుగైంది.

## నిస్సార్ అలీ చివరి పోరు

తిరుగుబాటును అణిచివేయటానికి వెళ్ళి, పారిపోయివచ్చిన అధికారుల, ఆయా ప్రాంతాల పోలీసు అధికారుల నివేదికలను , జమీందారుల ఫిర్యాదులను పరిశీలించాక , మీర్ నిస్సార్ అలీ, ఆయన బలగాల పట్ల కఠినంగా వ్యవహరించాలని కంపెనీ పాలకులు నిర్ణయించారు. ఈ దాడులను నిర్వహించేందుకు కలకత్తా కమీషనర్‌కు ప్రత్యేక అధికారాలు కల్పించి , ఆయనకు స**హా**యంగా సైన్యాన్ని రంగంలోకి దించారు. మేజర్ స్కాట్ నేతృత్వంలో పది రెజిమెంట్ల కాల్బలం, గుర్రపుదళం, ఫిరంగి దళం, ప్రత్యేక రక్షణ దళాలను పంపారు. మేజర్ స్కాట్‌కు సహకరించేందుకు గతంలో నిస్సార్ అలీ చేతులో పరాజయం పాలైన అలెగ్జాండర్, కెప్టెన్ సదరన్‌లాండ్‌లను కూడ పంపారు.

ఆ సమయంలో మీర్ నిస్సార్ అలీ తన బలగాలతో నర్కేల్ బరియాలో వున్నారు. ఈ సారి ఎలాగైన విజయం సాధించాలన్న పట్టుదలతో, గతంలో అవమానాలకు గురైన కంపెనీ అధికారులంతా పకడ్బంధీ పథకంతో 1832 నవంబర్ 19వ తేదిన, భారీ బలగాలతో వహాబీల కోటను అన్ని వైపుల నుండి ముట్టడించారు. కంపెనీ బలగాలు ఆధునిక ఆయుధాలతో చుట్టుముట్టినా, ఏమాత్రం అధైర్యపడని తిరుగుబాటు వీరులు శత్రువును ఎదుర్కొన్నారు. చక్కని క్రమ శిక్షణతో శత్రువు మీద విరుచుకుపడ్డారు. కంపెనీ సైన్యాలు కాల్పులు జరుపుతున్నా, వహాబీ యోధులు నిర్భయంగా ముందుకు రావటం ఆంగ్లేయ అధికారులను ఆశ్చర్యపరిచింది. తుపాకులు, ఫిరంగులను ఉపయోగిస్తున్న సుశిక్షితులైన కంపెనీ సైన్యాలు, అధికారుల యుద్ధ ఎత్తుగడల ముందు సంప్రదాయక ఆయుధాలతో పోరాడుతున్న తిరుగుబాటు యోధులు నిలవలేకపోయారు. శౌర్యపరాక్రమాలే ఆయుధాలుగా గల వహాబీ వీరులు క్రమక్రమంగా కూలిపోసాగారు.

ప్రతికూల పరిస్థితులు చుట్టుముట్టుతున్నా, మీర్ నిస్సార్ అలీ తన అనుచరులను, ఉత్తేజపరుస్తూ , బ్రిటీష్ సైనికుల మీద తుపాకీ గుళ్ళను కురిపించసాగారు. గురి తప్పకుండా ఆయన జరుపుతున్న కాల్పులకు కంపెనీ బలగాలు చెల్లాచెదురు కాసాగాయి. ఆ సందర్భంగా ఆంగ్లేయాధికారులు నిస్సార్ అలీని గుర్తించారు. ఆయన మీద దృష్టిని కేంద్రీకరించి, ఆయుధాలను గురిపెట్టారు, ఆయనను పడగొట్టాలని శత విధాల ప్రయత్నించారు. సహచరులు కవచంలా కాపాడుతుండగా, ఆయనను నేలకూల్చడం కంపెనీ సేనలకు సాధ్యంకాలేదు. ఆంగ్ల సైనికుల తుపాకి గుళ్ళకు తిరుగుబాటు వీరులు ఒక్కొక్కరూ నేలకూలడం చూసి, అనుచరులతోపాటే తానూ అంటూ నిస్సార్ అలీ మరింత ముందుకు దూసుకు

వచ్చారు. ఆ అవకాశం కోసం ఎదురుచూస్తున్న అధికారులు సమీపం నుండి గురి తప్పకుండా ఆయన మీద కాల్పులు జరిపారు. ఈ కాల్పులకు నిస్సార్ అలీ కూలిపోయారు. ఈ విధంగా తిరుగుబాటు వీరుడు మీర్ నిస్సార్ అలీ 1832 నవంబర్ 19న యుద్ధరంగంలో శత్రువుతో పోరాడుతూ అమరత్వం పొందారు. ఈ అమరవీరుడి భౌతికకాయానికి తాము స్వయంగా అంత్యక్రియలు జరుపుకుంటామని గ్రామస్థులు అభ్యర్థించినా, అంగీకరించక మత సాంప్రదాయాలకు విరుద్ధంగా మిగిలిన మృతులతో పాటు ఆయన మృతదేహాన్ని కంపెనీ అధికారులే దహనం చేయించారు.

## ముగిసిన పోరాట చరిత్ర

ఈ రణంలో మరో 50 మంది తిరుగుబాటు వీరులు అమరులయ్యారు. విజయం కంపెనీ సొంతమైంది. నర్కేల్ బరియా స్థావరంలో మిగిలిన నాయకులను, దళాలను కంపెనీ సైన్యం నిర్బంధంలోకి తీసుకుని, అలీపూర్ జైలులో బంధించింది. ఆనాడు **అలీపూర్ విచారణ** గా ప్రఖ్యాతిగాంచిన విచారణ తంతును జరిపి, నిస్సార్ అలీ ప్రధాన అనుచరుడు గులాం మాసుంకు ఉరిశిక్ష విధించారు. ఉరిశిక్ష తరువాత నర్కేల్ బరియా గ్రామంలోని నడివీధిలో ఆ పోరాటయోధుడి భౌతికకాయాన్ని రోజుల తరబడి వేలాడదీసారు. ఈ పోరులో తీవ్రంగా గాయపడిన నిస్సార్ అలీ కుమారులు తోరబ్ అలీ, గౌహర్ అలీకు శిక్షలు పడ్డాయి. ఈ సంఘటనలో మొత్తం 197 మందికి కఠిన కారాగార శిక్షలు, ద్వీపాంతర శిక్షలు విధిస్తూ విచారణ సంఘం తీర్పు చెప్పటంతో, భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో **' బరాసత్ తిరుగుబాటు '** గా ప్రసిద్ధి చెందిన వహాబీల పోరాటం ముగిసింది. ఈ తిరుగుబాటును నడిపి, వహాబీ జనసముదాయాలను బ్రిటీషర్లుకు వ్యతిరేకంగా మోహరింపచేసిన మహానేత మీర్ నిస్సార్ అలీ చరిత్ర ముగిసింది.

## బీహార్‌కు మారిన పోరాట వేదిక

భారతదేశంలో వహాబీ ఉద్యమానికి ఆద్యుడు, బ్రిటీష్ వలస పాలకులకులకు వ్యతిరేకంగా ఆయుధాన్ని చేపట్టి, ఆ దిశగా వహాబీలను నడిపించిన మహానాయకుడు సయ్యద్ అహమ్మద్ బరేల్వి బాటలో గ్రామీణ ప్రజానీకాన్ని కదలించి కదం తొక్కించిన మీర్ నిస్సార్ అలీ అమరత్వం పొందాక, వహాబీల పోరాట కేంద్రం బెంగాల్ నుండి బీహార్‌కు మారింది. సయ్యద్ అహమ్మద్ వాయవ్య సరిహద్దు ప్రాంతంలో తన పోరాట స్థావరం ఏర్పాటు చేసుకోకముందే, బీహార్‌లోని పాట్నాను వహాబీల వెలుగులను ప్రసరింపచేయగల ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని దీక్షతో కొనసాగించడానికి సమర్థులైన నాయకులను కూడా ఎంపిక చేసి సిద్ధంగా ఉంచారు. ఆ నాడు సిత్నా కేంద్రంగా బ్రిటీషర్లమీద యుద్ధం ప్రకటించినప్పుడే అవసరమగు ఆహారపదార్థాలు, ఆయుధాలు, కార్యసాధకులను సమీకరించి పాట్నానుండి పంపడం జరిగేది. ఆ సమయంలో బెంగాల్‌లోని 10 జిల్లాల్లో ఉధృతంగా సాగిన బరాసత్ తిరుగుబాటు గురించి బీహార్ ప్రాంతానికి అంతగా సమాచారం లేదు. తిరుగుబాటు ముగిసాక మీర్ నిస్సార్ అలీ ఆయన సహచరుల త్యాగపూరిత బలిదాన చరిత్రలు అన్ని ప్రాంతాలకు

చేరుకున్నాయి. బీహార్ రాష్ట్రంలోని వహాబీలు బెంగాల్ నేతలనుండి స్ఫూర్తిని పొందారు. ఆ ప్రేరణతో బీహార్‌లో వహాబీ ఉద్యమాన్ని సజీవంగా నిలిపి దేశవ్యాప్తంగా చేయడానికి ఒక సోదరద్వయం, తమ సంపూర్ణ జీవితాలను అంకితం చేసింది. ప్రస్తుత బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలోని సాధిఖ్‌పూర్ కేంద్రంగా మహమ్మద్ విలాయత్ అలీ, మహమ్మద్ ఇనాయత్ అలీలు తమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

## కార్యసాధకుడు విలాయత్ అలీ

మౌల్వీ మహమ్మద్ విలాయత్ అలీ 1791లో బీహార్ రాష్ట్రం పాట్నాలో జన్మించారు. వహాబీ తాత్త్విక సిద్ధాంతాల ఆచరణ వలన ఆకర్షితుడైన ఆయన కుటుంబ సభ్యులంతా అహమ్మద్ బర్వేలికి ప్రధాన అనుచరులయ్యారు. వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో పోరాట స్థావరం ఏర్పాటు చేసినప్పుడు విలాయత్ అలీ ఆర్థిక సహాయం అందించటమేకాక, కార్యకర్తలను సమీకరించి పంపించే బాధ్యతలను స్వీకరించి సమర్థవంతంగా నిర్వహించారు. విలాయత్ అలీ లక్నోలో విద్యాభ్యాసం చేస్తుండగా సయ్యద్ అహమ్మద్ బరేల్వితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ఆయనను వహాబీగా మార్చివేసింది.

అలీ నిబద్ధత, కార్యదీక్షను గమనించిన బరేల్వి పాట్నాలోని వహాబీల కేంద్రానికి ఆయనను తన ప్రతినిధిగా నియమించారు. ఆ బాధ్యతలను స్వీకరించిన విలాయత్ అలీ తన సోదరులైన ఇనాయత్ అలీతో కలసి ఆ కార్యభారాన్ని నిర్వహించారు. వహాబీల ఉద్యమానికి ఒక సంస్థాగత రూపం కల్పించి, సంస్థకు అవసరమగు పటిష్టమైన నిర్మాణం, నిజాయితీ, నిబద్ధత, సమర్థత గల కార్యకర్తలను తయారుచేసే విధానాన్ని అమలులోకి తెచ్చారు. ప్రజాస్వామిక రూపం కలిగిన ఈ వ్యవస్థను ఎంత పటిష్టంగా రూపకల్పన చేసారంటే, ఆయన తరువాత కూడా వహాబీల వ్యవస్థ పలు ఆటు పోట్లకు గురైనప్పటికీ ఏమాత్రం చెక్కుచెదరక లక్ష్యసాధన దిశగా ముందుకు సాగిపోయింది.

1849లో వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో సయ్యద్ అహమ్మద్ బరేల్వి ఏర్పాటు చేసిన సిత్నా స్థావరాన్ని సందర్శించి బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలకు ఆయన జీవం పోసారు. బ్రిటీష్ బలగాల మీద వహాబీల గెరిల్లా దాడులు జరిపారు. పంజాబ్, ఆఫ్ఘనిస్తాన్‌లలో పోరాటాల ఉధృతాన్ని గమనించిన బ్రిటీష్ పాలకులు విలాయత్ అలీ, ఆయన సోదరులు ఇనాయత్ అలీలను అరెస్టు చేసారు. ఈ సోదరులను నాలుగు సంవత్సరాలపాటు పాట్నా వదిలి బయటకు వెళ్ళరాదని ఆంక్షలు విధిస్తూ, పది వేల రూపాయల బాండ్ తీసుకుని బ్రిటీష్ ప్రభుత్వం బెయిల్ ఇచ్చింది. ఆ ఆంక్షలను విలాయత్ అలీ ఖాతరు చేయలేదు. బెంగాల్‌లో వహాబీల ఉద్యమాన్ని పునరుద్ధరించాలని అక్కడికి వెళ్ళి ప్రయత్నాలు సాగించారు.

వహాబీల ఉద్యమానికి పాట్నా కేంద్రం బాగా పటిష్టం కావటంతో అక్కడ తన అవసరం లేదనుకున్న మౌల్వీ అలీ మరోచోటకు వెళ్ళదలిచారు. ఆయన పాట్నాల నుండి మరోమారు సిత్నాకు తరలి వెళ్ళారు. అక్కడ మళ్ళీ తన బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలను ఉధృతం చేసి, వహాబీల మహానాయకుడిగా ఖ్యాతిగాంచిన మౌల్వీ విలాయత్ అలీ 1853లో కన్నుమూసారు.

## విప్లవ యోధుడు ఇనాయత్ అలీ

వహాబీల ఉద్యమ దిశను మాత్రమే మార్చటం కాకుండా, మహర్దశ కలుగచేసిన నాయకులలో ప్రముఖులు మౌల్వీ ఇనాయత్ అలీ. బీహార్ రాష్ట్రం పాట్నా నగరంలోని, షాదిఖ్‌పూర్‌లో ఆయన జన్మించారు. విద్యార్థి దశలోనే సయ్యద్ అహమ్మద్ బరేల్వి ప్రభావానికి లోనయ్యారు. ఆ తరువాత మౌల్వీ విలాయత్ అలీ మార్గనిర్దేశకంలో ఉద్యమ కార్యక్రమాలలో ప్రవేశించారు. సయ్యద్ అహమ్మద్ బరేల్వి స్వయంగా ఆయనను తన ప్రతినిధిగా నియమించారు. ఆ తరువాత సయ్యద్ బరేల్వితో కలసి 1825లో ఆయన ఆఫ్ఘనిస్తాన్‌కు తరలి వెళ్ళారు. 1829లో వహాబీ ఉద్యమాన్ని పునరుద్ధరించి, వ్యాప్తి చేయడానికి మౌల్వీ విలాయత్ అలీ ఆయనను బెంగాల్ పంపారు. బెంగాల్‌లో మీర్ నిస్సార్ అలీలాంటి పోరాట వీరుల త్యాగాల నేపథ్యం ఉన్నందున అచిరకాలంలోనే అక్కడ ఆయనకు అపార అనుచరవర్గం ఏర్పడింది.

బెంగాల్‌లో ఆయన నిర్వహించిన కార్యక్రమాల సరళిని దృష్టిలో ఉంచుకుని మౌల్వీ విలాయత్ అలీ 1839లో ఆయనను తమ ప్రధాన స్థావరమైన సిత్నాకు పంపారు. పంజాబ్, ఆఫ్ఘనిస్తాన్‌లో సాగిన పోరాటాలలో పాల్గొని ఆయన బాగా రాటుతేలారు. ఆయన కార్యక్రమాల నిర్వహణా దక్షతను గమనించి, ప్రమాదం పసిగట్టిన బ్రిటీష్ అధికారులు ఆయన సంచారం మీద నిషేధం విధించి, పాట్నాకు తరలించారు. నాలుగు సంవత్సరాలపాటు పాట్నా విడిచి ఎక్కడకూ వెళ్ళరాదని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అరెస్టు చేసి పదివేల రూపాయల పూచీకత్తు మీద విడుదల చేసింది. ఆయన ఆ ఆంక్షలను ఖాతరు చేయలేదు. బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలతో పాటుగా వహాబీ ఉద్యమ విస్తరణకు నిరంతరం కృషి సాగించారు. ఇనాయత్ అలీ మరోమారు బెంగాల్ వెళ్ళగా ఆయన మీద నిఘా ఉంచిన ప్రభుత్వం బెంగాల్ నుండి బహిష్కరించి, పాట్నాకు తరలించింది. మళ్ళీ పాట్నాను వీడరాదన్న ఆంక్షలు విధిస్తూ, నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే, ఈసారి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వం హెచ్చరించింది. బ్రిటీష్ వ్యతిరేక పోరాటమే ఊపిరిగా భావించిన మౌల్వీ ఆ ఆంక్షలను తుంగలో తొక్కి, అధికారుల కళ్ళు గప్పి, వాయవ్య సరిహద్దు ప్రాంతాలకు వెళ్ళారు. అక్కడ మళ్ళీ పోరాట కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ బ్రిటీష్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆ సమయంలో ఆయన మార్గనిర్దేశకుడు, అగ్రజుడైన మౌల్వీ విలాయత్ అలీ మరణించారు. అన్న మరణం ఇనాయతుల్లాను బాగా కృంగదీసింది. వహాబీ ఉద్యమ బాధ్యతలన్నీ మౌల్వీ ఇనాయత్ అలీ భుజస్కంధాల మీద పడ్డాయి. ఆయన వహాబీ ఉద్యమాన్ని మరింత పటిష్టం చేసేందుకు పూనుకున్నారు. సయ్యద్ అహమ్మద్ బరేల్వి రూపకల్పన చేసిన **ఖలీఫా** పద్ధతికి మెరుగులుదిద్ది, మరింత ప్రజాస్వామికం చేసారు. నిబద్ధత గల నేతలతో కమిటీలు ఏర్పరచి, బాధ్యతలు అప్పగించారు. కమిటీల అభిప్రాయాల మేరకు ఖలీఫా తగు నిర్ణయాలు చేయాల్సి ఉంటుంది.

ఈ రకంగా వహాబీ ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ వ్యక్తులైన సయ్యద్ మహమ్మద్ హుసైన్, అక్బర్ అలీ, సయిజ్ అలీ, యయ్యా అలీ, వాజల్ హఖ్, ముస్తాక్ అలీ, అహమ్మదుల్లా, అబ్దుల్ రహీం, ముబారక్ అలీ, ఫర్హత్ హుసైన్, మహమ్మద్ ఇబ్రహీం అబ్దుల్లా, అబ్దుల్

అజీజ్ తదితరులకు ఆయన ఉద్యమ బాధ్యతలను అప్పగించారు. మౌల్వీ ఇనాయత్ అలీ నేతృత్వంలో కార్యదక్షత గల నేతల కృషి ఫలించి, వహాబీ ఉద్యమం భారతదేశం అంతటా వ్యాపించింది. మౌల్వీ సాగించిన నిరంతర కృషి వలన వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని పఠాన్‌లు వహాబీలకు మద్దతు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. గతంలో సయ్యద్ అహమ్మద్ బరేల్వి సాగించిన కృషికి తగిన ఫలితాన్ని రాబట్టగలిగారు. ఆ సమయంలో భారతీయ సిపాయిలు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి కదలి రావాల్సిందిగా పిలుపునిచ్చారు. బ్రిటీషర్లను మాతృదేశం నుండి తరిమికొట్టేందుకు ఇది మంచి అవకాశమని ఇనాయత్ అలీ భావించారు.

ఈ పరిస్థితులను, వహాబీ నేతల ఆలోచనలను పసిగట్టిన ప్రభుత్వం వహాబీల మీద గట్టి నిఘా ఉంచింది. అయినా వహాబీలు ఈ సంగ్రామంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఢిల్లీ, ఆగ్రా, హైదరాబాద్, పాట్నాలు ఆ నాడు తిరుగుబాటు వీరులకు కేంద్రాలయ్యాయి. భోపాల్, జైపూర్, హిస్సార్, తదితర ప్రాంతాల నుండి వహాబీ దళాలు తిరుగుబాటులో పాల్గొనేందుకు ఢిల్లీకి ప్రయాణం కట్టాయి. ఒక దశలో వహాబీలే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి కారకులని బ్రిటీష్ అధికారులు భావించే స్థాయిలో వీరు బహుముఖ పాత్రను నిర్వహించారు. (...Even in the case of the Mutiny, *Sir John Kaye* tells us that undoubtedly the prime movers in the rebellion (*of 1857* ), and those who most zealously fanned its sparks into flames, were *Musalmans* and those *Musalmans* were undoubtedly ***Wahabis***..." THE COMMUNAL TRIANGLE IN INDIA - Ashok Mehata and Achyut Patwardhan, Kitabistan, Allahabad 1942, page 96 ).

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో సిత్నాలో ఉన్న ఇనాయతుల్లా పఠాన్ నేతల సహకారంతో తిరుగుబాటులో పాల్గొన్నారు. ఈ పరిణామాల ఫలితంగా పోరాట వీరులకు ఆహార, ఆయుధ సహాయం అందకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. పర్యవసానంగా వాయవ్య సరిహద్దు ప్రాంతాలకు పాట్నా నుండి ఎటువంటి సహాయం అందకుండా పోయింది. మౌల్వీ ఇనాయత్ అలీ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అరోగ్యం కుదుటపడే అవకాశాలు సన్నగిల్లటంతో చింగ్‌హాయ్ నుండి సూరత్ చేరుకున్నారు. సూరత్ చేరుకున్న తరువాత అనారోగ్యాన్ని కూడా లెక్కచేయక వహాబీల పోరాట కార్యక్రమాలకు మార్గదర్శకం వహిస్తూ 1858లో ఆయన కన్ను మూసారు.

మౌల్వీ విలాయతుల్లా, మౌల్వీ ఇనాయతుల్లాల అస్తమయం తరువాత ఆ స్థాయి శక్తి సామర్థ్యాలుగల నాయకులు వహాబీ ఉద్యమానికి కరువయ్యారు. అయితే ఆ మహానాయకుల బాటలో నడిచి, ఉద్యమాన్ని తమదైన తీరులో నడిపించి, త్యాగాలకు సంపూర్ణ సమర్పణలకు పెట్టింది పేరుగా వహాబీలు ఖ్యాతిగాంచారు.

## సాహసి అహమ్మదుల్లా

అలీ సోదరుల తరువాత అంతటి స్థాయి గల వహాబీ నేతగా ఖ్యాతిగాంచిన మౌల్వీ అహమ్మదుల్లా 1806లో పాట్నాలో జన్మించారు. ఆయన అసలు పేరు అహమ్మద్ బక్ష్. సయ్యద్ అహమ్మద్ బరేల్వి నుండి ప్రేరణ పొందిన ఆయన తన పేరును గురువు

ఆదేశాల మేరకు అహమ్మదుల్లాగా మార్చుకున్నారు. సయ్యద్ బరేల్వి మార్గాన్ని స్వీకరించిన కుటుంబంలోని ఆయన వహాబీ నాయకుడు మౌల్వీ విలాయతుల్లాకు స్వయాన బావ. విద్యాభ్యాసం తరువాత ఉన్నతాధికారిగా పలు పదవులు నిర్వహించిన అహమ్మదుల్లా సాంఘిక సేవా కార్యక్రమాలలో అమితాసక్తి చూపుతూ, ప్రజల సేవలో ఎక్కువ కాలం గడిపారు. 1823ప్రాంతంలో సయ్యద్ బరేల్వి పాట్నా సందర్శించినప్పుడు ఆయన కుటుంబమంతా ఆయన ప్రబోధాలకు ప్రభావితమైంది. ఆ తరువాత క్రమంగా వహాబీ ఉద్యమ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఆ కుటుంబ సభ్యులు ప్రముఖ స్థానాన్ని పొందారు. మౌల్వీ అహమ్మదుల్లా స్వయంగా బరేల్వి ద్వారా ఖలీఫాగా నియమితులయ్యారు. వహాబీల ఉద్యమానికి ఆర్థిక సహకారాన్ని సమీకరించేందుకు ఏర్పాటుచేసిన కమిటీకి **అమీర్**గా బాధ్యతలను నిర్వహించారు. ఆయన నాయకత్వం లోని కమిటీలో ముబారక్ అలీ, ఇద్రతా హుస్సేన్ సభ్యులు. ఆయన స్వయంగా పలు కమిటీలలో సభ్యులుగా, సలహాదారులుగా వ్యవహరించారు. సమర్థుడైన కార్యనిర్వాహకుడిగా ప్రసిద్ధి పొందారు. ఆనాడు వహాబీలంతా వాయవ్య సరిహద్దులలోని సిత్నాకు వెళ్ళగా అహమ్మదుల్లా వెళ్ళలేదు. ఆయన పాట్నాను విడిచి వెళ్ళకుండా ఆక్కడి పోరాట దళాలకు ఇక్కడి నుండే ఆహార పదార్థాలు, ఆయుధాలు, కార్యకర్తలను పంపించి బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలకు జీవం పోసారు.

1857లో సాగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం సమయంలో వహాబీలు పెద్ద ఎత్తున తిరుగుబాటులో పాల్గొనవచ్చునని అనుమానించిన పాట్నా చీఫ్ కమీషనర్ టైలర్ అహమ్మదుల్లా, మరో నేత షా మహమ్మద్ హుస్సేన్‌ను 1857 జూన్ 19న అరెస్టు చేసాడు. మూడు మాసాల తరువాత ప్రభుత్వం ఆ నాయకులను విడుదల చేసింది. మౌల్వీ ఇనాయతుల్లా కన్నుమూసాక, పాట్నా కేంద్రం బాధ్యతలన్నీ మౌల్వీ అహమ్మదుల్లా స్వీకరించారు. బ్రిటీష్ ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా పనిచేసిన అనుభవం దృష్ట్యా, ఆయన వహాబీ ఉద్యమ నిర్మాణ స్వరూపాన్ని పూర్తిగా మార్చివేశారు. ఈ మేరకు ఆయన కార్యలాపాల మీద ప్రత్యేకంగా నిఘా విధించిన బ్రిటీష్ ప్రభుత్వం మౌల్వీని నిర్బధించేందుకు పలు ప్రయత్నాలు చేసింది.

వహాబీల బ్రిటీష్ వ్యతిరేకత, సమరశీలత దృష్ట్యా 1863లో వహాబీల అణిచివేతలకు ప్రభుత్వం పథకం సిద్ధం చేసింది. పలు అమానుష చట్టాలను అమలులోకి తీసుకు వచ్చింది. వహాబీల పట్ల కిరాతకంగా వ్యవహరించింది. అక్రమ నిర్బంధాలు, అరెస్టులు, లాఠీచార్జీలు ఉధృతంగా సాగాయి. ఆయన సోదరుడు యహ్యా అలీ, మేనల్లుడు అబ్దుల్ రహీం లాంటి ప్రముఖ నేతలను నిర్బంధంలోకి తీసుకుంది. అహమ్మదుల్లాను 1864 నవంబర్ 5న అరెస్టు చేసి, ప్రఖ్యాత **' అంబాల విచారణ '** లో నిందితుడ్ని చేసి విచారణ జరిపించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆయనను అన్ని పదవుల నుండి తొలగించింది. రాణికి వ్యతిరేకంగా యుద్ధం సాగించేందుకు కుట్ర పన్నారని ( for conspiracy to wage war against Queen ) ఆరోపించింది. ఆ విచారణలో ఆయనకు వ్యతిరేకంగా ప్రజల చేత సాక్ష్యం చెప్పించడానికి ప్రభుత్వం శత విధాల ప్రయత్నించి విఫలమైంది. అయినా రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? అన్నట్టు 1865 ఫిబ్రవరి 27న ఆయనకు ప్రభుత్వం మరణ దండన విధింపచేసింది.

ఈ తీర్పుపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేయగా మరణశిక్ష స్థానంలో ఆజన్మ ద్వీపాంతరవాసం ఖరారైంది. ఆయన ఆస్తిపాస్తులన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వహాబీ నాయకుల కేంద్రాలుగా విలసిల్లిన ఆయన గృహాలను ధ్వంసం చేసింది. అరెస్టు తదుపరి పరిణామాలను ముందుగానే ఊహించిన ఆయన, అరెస్టుకు ముందు తన భార్య **మహర్** చెల్లింపుకు గాను కేటాయించిన ఆస్తి పాస్తులను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అన్ని లాంఛనాలు పూర్తి చేసి 1865 ఏప్రిల్‌లో అహమ్మదుల్లా షాను అండమాన్ ద్వీపాలలోని పోర్టు బ్లెయిర్ జైలుకు పంపారు. ద్వీపాంతర వాస శిక్షను అనుభవిస్తూ కూడా, జైలులో గల దేశభక్తులతో కలసి విముక్తి పోరాట ఆలోచనలు చేస్తూ గడిపిన ఆయన పోర్టు బ్లెయిర్ జైలులో బ్రిటీష్ పోలీసులు పెట్టే శారీరక , మానసిక హింసలను భరిస్తూ 1881 నవంబరు 2న కన్ను మూసారు. మౌల్వీ అహమ్మదుల్లా షాను అండమాన్ దీవులలోని వైపర్‌లో ఖననం చేసారు.

## సమరశీలుడు యహ్యా అలీ

సమరశీలుడు యహ్యా అలీ 1828 పాట్నాలో జన్మించారు. ఆయన తండ్రి ఇలాహీ బక్ష్. వహాబీ ఉద్యమాన్ని ఆధునిక నిర్మాణ రీతులలో తీర్చిదిద్దిన కార్యదక్షుడుగా ఖ్యాతివహించిన మౌల్వీ అహమ్మదుల్లాకు యహ్యా అలీ సోదరుడు. వహాబీ ఉద్యమ వీరుల కుటుంబీకుడు కావటంతో సోదరునిలాగే చిన్నతనంలోనే వహబీ ఉద్యమం పట్ల ఆకర్షితుడయ్యారు. మౌల్వీ ఇనాయత్ అలీ ఏర్పాటు చేసిన వహాబీ ఉద్యమ కమిటీలలో ఆయన ప్రధాన పాత్ర నిర్వహించారు. సయ్యద్ మహమ్మద్ హుస్సేన్ నాయకత్వంలోని కమిటీలో ఆయన సభ్యుడే కాక, స్వయంగా ఆర్థిక కమిటికి నాయకత్వం వహించారు. వహాబీ ఉద్యమ నిర్మాణానికి, వ్యాప్తికి, బ్రిటీష్ వ్యతిరేక పోరాటాల నిర్వహణకు ఆయన సమీకరించిన నిధులు ఎంతో తోడ్పడ్డాయి. ఆయన ఈ కృషిలో ఉండగా, వహాబీల ఉద్యమాన్ని అణిచివేయాలనుకున్న బ్రిటీష్ ప్రభుత్వం ఉద్యమానికి వచ్చిచేరుతున్న ఆర్థిక వనరుల ప్రవాహం మీద గట్టి నిఘా ఉంచి శతవిధాల అడ్డుకుంది.

1863లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రముఖ వహాబీ నేతలను నిర్బంధించింది. ఈ నాయకులను అంబాలా మిలటరి కంటోన్మెంటుకు విచారణ నిమిత్తం తరలించింది. అక్కడ యహ్యా అలీతో పాటుగా మహమ్మద్ జాఫర్, మహమ్మద్ షఫీ, అహమ్మదుల్లాతోపాటు పలువురి మీద 1864లో జరిపిన ఈ విచారణ **'అంబాల విచారణ'** గా ప్రసిద్ది చెందింది. బ్రిటీష్ రాణి పాలనకు వ్యతిరేకంగా ప్రజలను వహాబీ వీరులు పోరాటానికి రెచ్చకొట్టారని ప్రభుత్వం ఆరోపించింది. సామ్రాజ్యవాదులను వ్యతిరేకిస్తున్న యహ్యా అలీ పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి ఏర్పరచుకుంది. ప్రముఖ చరిత్రకారుడు Dr. Santimoy Roy తన Freedom Movement and Indian Muslims లో **'...యహ్యా అలీ స్థాయి సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవకారుడు పందొమ్మిదవ శతాబ్దంలో లేర..'**నడాన్ని బట్టి ఆయన నిబద్ధత తేట తెల్లమవుతుంది. అతి సామాన్యమైన వ్యక్తిగా తన కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించే కార్యదక్షుడైన యహ్యా అలీని, అంబాల విచారణ సందర్భంగా బ్రిటీష్ అధికారులే ప్రశంసించక తప్పలేదు. అంబాల విచారణ తర్వాత ప్రకటించిన తీర్పులో ఆయన గురించి పేర్కొన్న

అంశాలను పరిశీలిస్తే ఆయన సమరశీలత బోధపడుతుంది. బ్రిటీష్ అధికారి, చరిత్రకారుడు, William Hunter ఆయన గురించి వ్యాఖ్యానిస్తూ," ...Who made no pretention to loyalty and sought nothing at our hands..." అన్నాడు.

**'...ఈ విచారణకు కారణమైన భయంకర కుట్రకు యహ్యా అలీ ప్రధానం. ఆయన తన దేశస్థులను వందల వేల సంఖ్యలో రెచ్చకొట్టి కుట్రకు పురికొల్పాడు. కుతంత్రాలు పన్ని బ్రిటీష్ ఇండియా ప్రభుత్వాన్ని యుద్ధంలోకి దింపి వందలాది జీవితాలు అంతం కావడానికి కారణమయ్యాడు. అతను ఉన్నత విద్యావంతుడు. అతను తనకేమి తెలియదని, అజ్ఞానాన్ని ప్రదర్శించి తప్పుకోడానికి వీలు లేదు. అతను చేసేదంతా దురాలోచనతో తెలిసి చేసిందే. అది భయంకర కుట్ర, రాజ ద్రోహమంటూ...'** అంబాల విచారణలో పాల్గొన్న ఆంగ్లేయ న్యాయాధికారులు పేర్కొన్నారు. విచారణ తరువాత యహ్యా అలీకి మరణ దండన విధించారు. ఆయన మరణ శిక్షను ఆనందంగా ఆహ్వానించగా, మరణ శిక్ష విధిస్తే అమర వీరుడుగా ఆయనను కీర్తించటం జరుగుతుందని భావించిన బ్రిటీషర్లు దుర్బుద్ధితో ఆ ఖ్యాతి దక్కనివ్వరాదని, మరణ శిక్షను కాస్తా ద్వీపాంతరవాస శిక్షగా మార్చారు. (The Govt wished to deny the Wahabi leaders the chance of becoming martyrs. - A History of Freedom Movement in Bihar Vol. 1, page 88). అనంతరం మిగతా వహాబీ నేతల ఆస్తిపాస్తులను జప్తు చేసినట్టుగానే యహ్యా అలీ ఆస్తులను పూర్తిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అన్న అహమ్మదుల్లా షా లాగే శిక్షను అనుభవిస్తూ ఆయన కంటే ముందుగా 40 ఏండ్ల వయస్సులో నూరేళ్ళ జీవితం ముగించి 1868లో యహ్యా అలీ ఆండమాన్ దీవులలో కన్నుమూసారు.

ప్రసిద్ధి చెందిన ఆనాటి వహాబీ ఉద్యమ నిర్మాతల, పోరాట యోధుల ఆత్మబలిదానాలతో ప్రేరణ పొందిన వహాబీలు తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి, చెరసాలలు, ఉరికొయ్యలు, తుపాకి గుళ్ళకు వెరవక బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాడుతూ అమరులయ్యారు. అండమాన్‌లోని భయంకర పోర్టుబ్లెయిర్ జైలుకు పంపబడిన ప్రప్రథమ భారతీయ విప్లవకారులుగా వహాబీలు ఖ్యాతిగాంచారు. ఈ మేరకు పలు త్యాగాలతో వహాబీల చరిత్రను సుసంపన్నం చేసిన నాయకులలో ఫయాజ్ అలీ, వాజిల్ హఖ్, మస్కర్ అలీ, అబ్దుల్ రహీం, ఈరాదత్ హుస్సేన్, మహమ్మద్ ఇబ్రహీం అబ్దుల్లా, కరామత్ అలీ, అబ్దుల్ అజీజ్ రహమాబాది, షేర్ అలీ, పీర్ అలీ, మహమ్మద్ జాఫర్, మహమ్మద్ షఫీ, ముబారక్ అలీ తదితరులున్నారు. ఈ నేతలే కాకుండా ఆనాడు సామాన్య వహాబీ కార్యకర్తలు కూడా అసమాన త్యాగాలతో పుడమి తల్లి రుణం తీర్చుకున్నారు. ఆ పౌరులందరి చరిత్రలు అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న వహాబీ యోధులలో కొందరు.

## పులి బిడ్డ మహమ్మద్ అబ్దుల్లా

పులిబిడ్డగా ఖ్యాతిగాంచిన మహమ్మద్ అబ్దుల్లా పంజాబ్ రాష్ట్రం పెషావర్‌లో జన్మించారు. వహాబీల పాఠశాలలో విద్యాభ్యాసం సాగింది. ఆ విద్యాసంస్థల నుండి బయటకు వచ్చిన యువతలాగే అబ్దుల్లా కూడా వహాబీ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అచిరకాలంలోనే నిబద్ధతగల వహాబీ కార్యకర్తగా రూపొందారు. వహాబీలను అణిచివేసేందుకు

బ్రిటీష్ ప్రభుత్వం కిరాతంగా వ్యవహరించి Detention Regulation Act, అను చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని ఉపయోగించి వహాబీలను అణచివేసేందుకు బ్రిటీష్ పోలీసులు కుట్ర పన్నారు. బ్రిటీష్ న్యాయవ్యవస్థ పోలీసులతో మిలాఖత్ అయ్యింది. వహాబీలను అరెస్టు చేసి విచారణ లేకుండా హింసలకు గురిచేయసాగారు. 1869 జూలైలో అమీర్ ఖాన్, హస్మత్ ఖాన్ అను వహాబీ నేతలను అరెస్టు చేసారు. ఆ నాయకులలో అమీర్ ఖాన్ నిర్బంధంలో మృతిచెందారు. పోలీసు చిత్రహింసల ఫలితంగా హస్మత్ కన్ను మూసారు. పలువురు వహాబీలు ద్వీపాంతరవాస శిక్షలకు గురయ్యారు. ఈ శిక్షలతో వహాబీలు ఆగ్రహంతో రగిలిపోయారు. ఈ కేసులను ఉన్నత న్యాయస్థానానికి అప్పీల్ చేసుకోగా, కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నార్మన్ అప్పీలును కొట్టివేశాడు. పలువురు ప్రముఖ నేతలు నిందితులుగా నున్న చారిత్రాత్మక పాట్నాకేసు అప్పీలును కూడా నార్మన్ వివక్షతో వ్యవహరించి దారుణమైన ప్రవాస శిక్షలను ఖాయం చేశాడని వహాబీలు భావించారు. ఈ శిక్షలు, అప్పీళ్ళ పర్యవసానాన్ని ఊహించిన మహమ్మద్ అబ్దుల్లాలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఆది 1871వ సంవత్సరం. సెప్టంబర్ 20 తేది. కలకత్తా ఉన్నత న్యాయస్థానం వద్ద నార్మన్ కోసం మహమ్మద్ అబ్దుల్లా ఎదురు చూస్తున్నారు. మాతృదేశ విముక్తి కోసం పోరాడుతున్న వహాబీ వీరుల శిక్షలను ఖాయపర్చిన నార్మన్ న్యాయస్థానం మెట్లు దిగుతూ కంటపడ్డారు. ఆలస్యం చేయకుండా అబ్దుల్లా దూసుకుపోయాడు. జస్టిస్ వెంటనున్న రక్షణ వలయాన్ని చేధించుకుంటూ ముందుకెళ్ళి నార్మెన్‌ను హతమార్చారు. అబ్దుల్లాను పోలీసులు పట్టుకున్నారు. విచారణ జరిగింది. మాతృదేశ దాస్య విముక్తి కోసం పాటుపడుతున్న ఉద్యమకారులను బలిగొన్న విదేశీయుడ్ని అంతం చేయటం తన విధిగా భావించినట్టు అబ్దుల్లా వెల్లడిస్తూ, లక్ష్యం నెరవేరినందున తనకు ఏ శిక్ష విధించినా చింత లేదన్నాడు. అబ్దుల్లాను అంతం చేశారు. ఆయన మృతదేహాన్ని అంత్యక్రియల కోసం అప్పగించమని బంధువులు కోరినప్పటికీ పోలీసులు నిరాకరించి, ఖననం చేయాల్సిన ఆ వీరుడి భౌతికకాయాన్ని తగులబెట్టి, తమ రాక్షస ప్రవృత్తిని ప్రకటించుకున్నారు.

## ఉరిని ముద్దాడిన మహమ్మద్ ' షేర్ ' అలీ

వహాబీ ఉద్యమం లో రాటు దేలిన మరొక వీరుడు మహమ్మద్ షేర్ అలీ, తన పేరులోనే **' షేర్ '** (పులి) ని దాచుకున్న ఆయన నిజజీవితంలో పులిలాగే వ్యవహరించి అమరుడయ్యారు. వహాబీ ధార్మికతత్త్వాన్ని చిన్న నాటే వంటబట్టించుకుని, వహాబీ పోరాటాలతో ఉత్తేజితులయ్యారు. వహాబీ ఉద్యమకారులకు సహాయ సహకారాలు అందిస్తూ ఆ క్రమంలో వహాబీ అయ్యారు. ఆయన పంజాబ్ రాష్ట్ర వాసి. పెషావర్ ఆయన జన్మస్థానం. తండ్రి చిరుద్యోగి. షేర్ అలీ కూడా తొలుత బ్రిటీష్ ఉద్యోగిగా పనిచేసాడు. ఆ ఉద్యోగం రీత్యా పలుప్రాంతాలు తిరిగి 1863లో అంబాల వచ్చి స్థిరపడ్డారు. కుటుంబ కలహాల మూలంగా జరిగిన కొట్లాటలో షేర్ అలీ చేతిలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఆ చర్యను ఆధారం చేసుకుని ఆయనను భయంకర నేరస్థుడిగా చిత్రించి, ద్వీపాంతరవాస శిక్షపడేట్టుగా చేసారు. ఆయనను 1869లో అండమాన్ జైలుకు పంపారు.

వహాబీ ఉద్యమ కార్యకర్తగా తాను దేశం కోసం, స్వజనం కోసం ఏమీ చేయలేక పోయానన్న బాధతో జైలులో షేర్ అలీ కుమిలి పోసాగారు. ఫిరంగీలు తమకు శత్రువులు కనుక ఈ శత్రువర్గం నుండి కనీసం ఒక్కరినైనా పరిమార్చాలని ఆయన నిశ్చయించుకున్నారు. అదనుకోసం ఎదురుచూడసాగారు. జైలులో సంకెళ్ళ మధ్యన జీవిస్తున్న ఆయనకు లక్ష్యసాధన అసాధ్యమన్పించసాగింది. పథకం రూపొందించుకుని, ఎత్తుగడ మార్చారు. జైలులో మంచిగా ప్రవర్తిస్తూ , అధికారులకు సన్నిహితులయ్యారు. షేర్ అలీకి కొంత స్వేచ్ఛ లభించింది. తన పథకంలో భాగంగా, జైలులోని ఖైదీలకు క్షవరం చేసేందుకు అంగీకరించారు. అందుకు అవసరమైన సామాగ్రి ఆయనకు దొరికింది. అందులో పదునైన కత్తి కూడా ఉంది. 1872 ఫిబ్రవరి 8వ తేదీన బ్రిటీష్ వైస్రాయ్ లార్డ్ మేవ్ అండమాన్ జైలుకు వచ్చాడు. అలీ తన వద్దనున్న ఆయుధాన్ని సిద్ధం చేసుకున్నారు. షేర్ అలీ ' **షేర్** ' లాగా వేట కోసం ఎదురు చూడసాగారు. లార్డ్ మేవ్ జైలు సందర్శనానికి వచ్చాడు. అదను దొరికింది. షేర్ అలీ తనవద్దనున్న కత్తితో లార్డ్ మేవ్‌పై దాడి చేసి, ఆంగ్లేయాధికారిని హతమార్చి తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు.

ఆ తరువాత విచారణ సాగింది. ఆ విచారణలో లార్డ్ మేవ్‌ను అంతం చేసింది తానేనని అంగీకరించారు. కోర్టులో ఆ ' **పులి** ' పలికిన పలుకులు భావితరాల విప్లవకారులకు ఉత్తేజాన్ని ఇచ్చాయి. ఆనాడు తానెందుకు మేవ్‌ను చంపాడో చెబుతూ **"...నా మాతృభూమి విముక్తి కోసం ఏనాడయితే నేను పోరాట దీక్ష చేపట్టానో, ఆనాడే నా ప్రాణం మీద తీపిని వదలుకున్నాను... మన శత్రువులలో ఒకరిని నేను అంతం చేసాను... నేను నా కర్తవ్యాన్ని నిర్వహించాను...నా పవిత్ర కార్యంలో భగవంతుని వద్ద మీరంతా నాకు సాక్ష్యం...'** అన్నారు. విచారణ తంతు పూర్తిచేసి షేర్ అలీకి మరణదండన విధించారు. ఉరిశిక్ష అమలు సమయంలో ఎంతో ఉద్వేగంతో మాట్లాడుతూ, **నేను చేసిన పని పట్ల కించిత్తు కూడా నేను బాధపడటంలేదు. నిజమైన వతాన్‌గా ఎంతో గర్విస్తూ, మరణాన్ని స్వీకరిస్తున్నాను,** అన్నారు. ఉరి వేదిక వద్ద ఖురాన్ గ్రంథంలోని ఆయత్‌లను మననం చేసుకుంటూ ఉరితాడు స్వీకరించి ఆయన అమరుడయ్యాడు. వలస పాలకుల నుండి మాతృదేశ విముక్తి కోసం పోరాడిన ప్రతి విప్లవకారుడు షేర్ అలీ ధైర్యసాహసాలను, నిబద్ధతను ఆదర్శంగా తీసుకున్నారని, ప్రముఖ చరిత్రకారుడు శ్రీ శాంతిమోయ్ రాయ్ తన Freedom Movement and Indian Muslims గ్రంథంలో వ్యాఖ్యానిస్తూ , ఆ వీరునికి ఘనంగా నివాళులు అర్పించారు.

## షహీద్ పీర్ అలీ

పీర్ అలీ బీహార్ రాష్ట్రానికి చెందిన అజీమాబాద్ నివాసి. చిన్ననాటనే ఆయన వహాబీ ఉద్యమంతో ప్రభావితుడయ్యారు. ఆనాటి ప్రముఖ వహాబీల వారసుడుగా పీర్ అలీ 1857లో బ్రిటీషర్లపై తిరగబడ్డారు. ఈ పోరులో భాగంగా ఆత్మగౌరవం, తిరుగుబాటు తత్వం గల స్వదేశీ పాలకులను, నాయకులను సమైక్యం చేసేందుకు ఆయన కృషి సల్పారు. స్వదేశీయుల సమైక్యత, సమన్వయంతో మాత్రమే బ్రిటీషర్లను తరిమివేయగలమని నమ్మిన పీర్ అలీ అందుకు ప్రయత్నించారు. తిరుగుబాటు కార్యకలాపాలను సమన్వయపర్చేందుకు

ప్రయత్నాలు చేసారు. స్వదేశీ పాలకులు తమకు తామే గొప్పవారమనుకోవడం, తమ రాజ్యాలే చాలా ఘనమైనవిగా, తమ రాజ్య భూభాగమే పరమ పవిత్రమైనదిగా గర్వపడటం, స్వదేశీ ప్రభువుల మధ్య పరస్పరం విశ్వాసం, నమ్మకం లేకపోవటం వలన పీర్ అలీ ప్రయత్నాలు ఫలించలేదు.

ఆయినా పీర్ అలీ పట్టు విడువక ప్రయత్నాలు చేసి చివరకు తనతో కలసి వచ్చిన వారితో 1857 జూలై 30న తిరుగుబాటు పతాకాన్ని ఎగురవేసారు. ఆయన నాయకత్వంలోని దళం బ్రిటీషర్ల ఆయుధాగారం మీద దాడిచేసి ధ్వంసం చేసింది. అందుకు ఆగ్రహించిన బ్రిటీష్ సైనికాధికారులు పీర్ అలీ దళాన్ని మట్టుపెట్టేందుకు కంకణం కట్టుకున్నారు. గాలింపు ప్రారంభమైంది. పీర్ అలీ సైనిక అధికారులకు చిక్కలేదు. బ్రిటీష్ పాలకుల పంచన చేరి, వారి కరుణాకటాక్షాల కోసం వెంపర్లాడే తొత్తులు, పీర్ అలీ దళం సమాచారాన్ని బ్రిటీషర్లకు అందించారు. బ్రిటీష్ సైనిక మూకలు ఒక్కసారిగా దాడిచేసి, ముట్టడించి పీర్ అలీ దళాన్ని అరెస్టు చేసాయి. ఆయన కళ్ళ ఎదుటే సహచరులందర్ని ఉరి తీసారు. ఆ దృశ్యాలు పీర్ అలీలో కసి, ద్వేషాన్ని పెంచాయి. సంకెళ్ళతో బంధించబడిన పీర్ అలీ సింహంలా గర్జించారు. చివరకు పీర్ అలీకి ఉరిశిక్ష విధించేందుకు సర్వం సిద్ధమైంది. ఆ సమయంలో ఆయన పరిస్థితి ఎలాగుందో, ఆంగ్లేయ అధికారి విలియం టేలర్ కళ్ళకు కట్టినట్టుగా వివరించారు. ఆయన కథనం ప్రకారం, **'... పీర్ అలీని ఉరిశిక్ష విధించటానికి ముందు ఒక గదిలోకి తీసుకువచ్చారు. ఆయన పూర్తిగా సంకెళ్ళ చేత బంధించబడి ఉన్నాడు. శరీరం రక్తసిక్తమై ఉంది. అయినా అతని కళ్ళల్లో కాంతి తగ్గలేదు. పట్టుదల అతని కన్నుల్లో కన్పించింది. నిర్భయంగా ఉన్నాడు...'.**

ఉరిశిక్షకు ఎప్పటినుండో సిద్ధంగా ఉన్నట్టు పీర్ అలీ ముందుకు వచ్చారు. తిరుగుబాటు దళాల రహస్యాలు తెలిపి తమతో సహకరిస్తే లక్షణంగా జీవించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని బ్రిటీష్ పాలకులు హామీలు కురిపించారు. బ్రిటీషర్ల కుతంత్రాలు తెలిసిన ఆయన ఏ మాత్రం చలించలేదు. బ్రిటీష్ సైన్యాధికారుల వైపు తిరస్కారంగా చూసారు. తనను, తన దేశభక్తిని అంత తక్కువగా అంచనా కట్టిన బ్రిటీష్ సైనికాధికారుల నైచ్యాన్ని అసహ్యించుకుంటూ, ఆగ్రహంతో **'... ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కొక్కసారి ప్రాణాలను రక్షించుకోడానికి తెలివిగా ప్రవర్తించాల్సిన అవసరం వస్తుంది. కాని అన్ని సమయాలలో ప్రాణాలు కాపాడుకోవటమే ప్రధానం కాదు. కొన్ని సమయాలలో ఆశయాల కోసం, మాతృభూమి గౌరవప్రతిష్ఠల కోసం బలికావటం, తన దేశం పట్ల ప్రేమకు నిదర్శనం అవుతుంది. నా సహచరులను నా కళ్ళ ఎదుటే ఉరితీసారు. ఇంకా చాలమందిని ఉరి తీయగలరు. నన్నూ చంపగలరూ. అయితే ఒక విషయం గుర్తుంచుకోండి, బలమైన స్వేచ్ఛా కాంక్షతో, స్వాతంత్ర్యం కోసం రక్తతర్పణలకు సిద్ధమౌవుతున్న ఈ పుడమి తల్లి పుత్రులను నిలువరించటం మీకు కాదుకదా, మరే శక్తికి సాధ్యం కాదు. మా నెత్తురు మండించే అగ్నిజ్వాలల్లో మీరూ, మీ ప్రభుత్వం మాడి మసైపోవటం తథ్యం...'** అంటూ పీర్ అలీ నిప్పులు కురిపిస్తూ, ఫిరంగీయుల భవిష్యత్తును ఆనాడే స్పష్టంగా ప్రకటించారు. చివరకు

మాతృభూమిని విముక్తం చేసేందుకు మరణాన్ని ప్రేమగా అలింగనం చేసుకునేందుకు సిద్ధమైన పీర్ అలీని చాంకీపురాలో 1857 జూలై 7వ తేదిన ఉరితీసారు.

## సకల సంపదలను ధారపోసిన అమీరుద్దీన్

ఉత్తుంగ తరంగమై సాగుతున్న వహాబీ ఉద్యమాన్ని పటిష్టంచేయడానికి తన సకల సంపదలతో పాటుగా ప్రాణాలను సైతం అర్పించిన యోధుడు అమీరుద్దీన్. పాట్నాకు చెందిన సంపన్న కుటుంబంలో 1790లో జన్మించిన ఆయన భోగభాగ్యాలను త్యజించి ఉద్యమానికి పూర్తిగా అంకితమయ్యారు. 1869లో బ్రిటీష్ ప్రభుత్వం వహాబీ నాయకుల అరెస్టులు సాగించినప్పుడు అమీరుద్దీన్‌ను కూడా అరెస్టు చేసింది. బ్రిటీష్ రాణికి వ్యతిరేకంగా కుట్రపన్నారని, ప్రజలను రాణి పాలనకు వ్యతిరేకంగా రెచ్చకొట్టి రాజద్రోహానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ప్రఖ్యాత **'మాల్దా విచారణ'** జరిపించింది. మూడు సంవత్సరాలపాటు సాగిన ఈ విచారణలో అంతా ఊహించిన విధంగానే వహాబీ నేతలకు మరణ శిక్షలు, ద్వీపాంతరవాస శిక్షలు, జీవిత శిక్షలు విధిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం తీర్పు చెప్పింది. అమీరుద్దీన్‌కు ద్వీపాంతరవాస శిక్ష పడింది. ఈ శిక్షను ప్రకటించినంతనే ఆయన సంతోషం వ్యక్తంచేస్తూ, **' బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో మరణం లభించినా సంతోషంగా స్వీకరించడానికి సిద్ధమని ',** ప్రకటించాడు. ఆయన ఆస్తిపాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇంట్లోని **' పర్దానషీ '** మహిళలను కూడా వీధి పాల్జేసింది. అండమాన్ దీవులకు తరలించబడిన అమీరుద్దీన్ స్వతంత్ర భారతాన్ని కలలుగంటూ పోర్టుబ్లెయిర్‌లో 1877లో మరణించారు.

## చిత్రహింసలు సహించిన ముబారక్ అలీ

బ్రిటీష్ పోలీసుల చిత్రహింసలను చిరునవ్వుతో సహించి వహాబీ ఉద్యమానికి శక్తివంతమైన నాయకత్వం అందించాడు ముబారక్ అలీ. ఆయన బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా హాజిపూర్‌లో జన్మించాడు. ప్రముఖ వహాబీ నేత మౌల్వీ ఇనాయతుల్లా ప్రధాన సహచరుడిగా ఉద్యమ కార్యకలాపాలను నిర్వహించేందుకు ఆయన పాట్నా తరలి వెళ్ళారు. పాట్నాలో మౌల్వీ అహమ్మదుల్లాతో కలిసి వహాబీ ఉద్యమాన్ని పటిష్టపర్చటంలో భాగస్వామి అయ్యారు. ఉద్యమానికి అర్థిక వనరులు సమీకరించే కమిటీకి ఆయన బాధ్యత వహించారు. మౌల్వీ అహమ్మదుల్లా అరెస్టు తరువాత ఉద్యమ నాయకత్వాన్ని ఆయన చేపట్టారు. 1865 నాటి పాట్నా విచారణలో నాయకులందరికీ భయంకర శిక్షలు పడినా, ఏమాత్రం తొణకకుండా విప్లవపోరాట కార్యక్రమాలను రూపొందించి, మార్గదర్శకత్వం వహించి, అమలుచేసి పాలక వర్గాలను హడలెత్తించారు. ఈ పోరాటాలను ప్రభుత్వం క్రూరంగా అణచివేసింది. ముబారక్ అలీని 1871 మార్చి మాసంలో ప్రభుత్వం నిర్బంధించగలిగింది. బ్రిటీష్ పోలీసులను ముప్పుతిప్పలు పెట్టినందుకు కక్షకట్టిన పోలీసులు నిర్బంధంలో ఆయనను క్రూరంగా హింసించారు. అమానవీయ పద్ధతులన్నీ ప్రయోగించారు. అమానుషంగా వ్యవహరించినా, ఉద్యమకారుల రహస్యాలు బహిర్గతం చేయటంగానీ, తనబాట సరికాదని గానీ, ఆయనచేత చెప్పించటం పోలీసులకు సాధ్యం కాలేదు. ఆయన శరీరంలోని అవయవాలన్నీ నుజ్జు నుజ్జు అయిపోయాయి. పోలీసులు సాగించిన చిత్రహింస ఫలితంగా పెద్ద వయస్సులోనున్న ఆయన

తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చివరకు ఒకవైపు విచారణ తంతు జరుగుతుండగానే చిత్రహింస మూలంగా ముబారక్ అలీ 1871 సెప్టెంబర్ 20న కన్నుమూసారు.

## యువకిశోరం పర్వత్ హుస్సేన్

ఒక ప్రక్క ప్రముఖ వహాబీ నాయకులు నేలరాలి పోతున్నా, బ్రిటీషర్లు తమ ఉక్కుపాదాల క్రింద ఉద్యమకారులను నలిపివేస్తూ, పరమ కిరాతక చర్యలకు పాల్పడుతున్నా, మొక్కవోని ధైర్యంతో పోరాటాలను సాగించిన యువ నాయకుడు పర్వత్ హుస్సేన్. పోరాట కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ, పథకాలను రూపొందించే కమిటీకి నాయకత్వం వహించిన పర్వత్ హుస్సేన్ తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, బ్రిటీష్ పాలకులకు తలనొప్పిగా తయారయ్యారు. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సమరం తరువాత వహాబీలను అణచివేసేందుకు పాలకవర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన అజ్ఞాతవాసానికి వెళ్ళారు. తిరుగుబాటు విఫలం కావటంతో నిరాశకు గురైన దేశ ప్రజలలో నూతన ఉత్తేజం తీసుకురావడానికి, బ్రిటీష్ పోలీసుల కళ్ళుగప్పి, సాయుధ దళాలను నిర్మించారు. బ్రిటీష్ బలగాల మీద దాడులు జరుపడానికి సిద్ధమయ్యారు. అంబలా సైనిక స్థావరం మీద దాడి జరిపి ప్రతీకారం తీర్చుకోవాలని, సంచలనం సృష్టించాలని బహువిధాల ప్రయత్నించగా, ఆ ప్రయత్నాలు ఏవీ కలిసిరాలేదు.

పోలీసులకు చిక్కకుండా సంవత్సరాలపాటు, రహస్య కార్యకలాపాలను సాగించిన యువకిశోరం పర్వత్‌ను ప్రభుత్వం చిట్ట చివరకు నిర్బంధించగలిగింది. రాజద్రోహానికి పాల్పడ్డారన్న ఆరోపణల మీద, ' **రాజమహల్ విచారణ** ' కేసులో నిందితుడిగా ప్రకటించి విచారణ జరిపి, యధాప్రకారంగా శిక్షలు విధించి, ఆయనను అండమాన్ దీవులకు పంపింది. ఆ తరువాత ఆయన ఆస్తిపాస్తులతో పాటుగా, కుటుంబీకుల ఆస్తిపాస్తులను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

## దక్షిణ భారతదేశంలో వహాబీ వీరులు

ఉత్తర హిందూస్థానంలో పటిష్టమైన పునాదులు నిర్మించుకున్న వహాబీ ఉద్యమం దక్షిణ భారతదేశానికి ఆనాడే ప్రయాణం కట్టింది. ధార్మిక పరిశుద్ధతను ప్రబోధించిన వహాబీల బోధనలు ప్రజలను, ప్రభువులను సమానంగా ఆకట్టుకున్నాయి. ఆ ప్రభావంతో వహాబీలు ధార్మిక పరిశుద్ధతను పాటిస్తూ రాజకీయ పోరాటాల మీద దృష్టి సారించారు. నిజాం, కర్నాటక, మద్రాస్ ప్రెసిడెన్సీలలో వహాబీల కేంద్రాలు ఏర్పడ్డాయి. బ్రిటీషర్ల పెత్తనాన్ని సహించని వహాబీలు దక్షిణ భారతంలో కూడా తిరగబడ్డారు. నిజాం రాజ్యంలో వహాబీ బీజాలు పడటం వలన ఆనాడు రాజకుటుంబీకులు బ్రిటీషర్ల బానిసత్వం నుండి విముక్తి కోసం తిరుగుబాటు చేసారు. 1857 కంటే ముందు బ్రిటీషర్ల ఆధిపత్యాన్ని అంగీకరించలేక తిరగబడిన ఘన చరిత్ర దక్షణాది వహాబీలకుంది. ప్రథమ స్వాతంత్ర్య సమరంలోనే కాకుండా, ఆ తరువాత కూడా దాస్య విముక్తి కోసం సాగిన ఉద్యమాలలో వహాబీలు చురుగ్గా పాల్గొన్నారు. బ్రిటీషర్ల పెత్తనం సహించలేక తిరగడబడిన తెలుగు బిడ్డలలో ముబారిజుద్దౌలా, నవాబ్ రసూల్ ఖాన్ ప్రముఖులు.

## తిరగబడిన తెలుగు బిడ్డడు ముబారిజుద్దౌలా

వహాబీ తత్వంతో ప్రభావితుడై బ్రిటీషర్లను వ్యతిరేకించిన తెలుగు బిడ్డలలో ముబారిజుద్దౌలా ప్రముఖులు. ఆయన మూడవ నిజాం నవాబ్ సికిందర్ షా బహుదూర్ కుమారుడు. ఆయన అసలు పేరు మీర్ ఘౌర్ అలీఖాన్. చిన్ననాటనే ఆయన పర్షియన్, అరబిక్, భాషలలో మంచి పాండిత్యాన్ని సంపాదించారు. నిజాం దర్బారులోని బ్రిటీష్ వ్యతిరేక వర్గానికి ఆయన నాయకుడు. 1815లో బ్రిటీష్ రెసిడెన్సీని తీవ్రంగా వ్యతిరేకించటం వలన తొలిసారిగా ఆయన 5 సంవత్సరాలపాటు గోల్కొండ కోటలో నిర్బంధానికి గురయ్యారు. అయినప్పటికీ ఫిరంగీల అధిపత్యం, జోక్యాన్ని సహించని ఆయన నిర్బంధాలను లెక్కచేయలేదు. బ్రిటీషర్లను తరిమివేయాలని సంకల్పించి, 1830 ఏప్రిల్ 19వ తేదిన అరబ్బు, ఆఫ్ఘన్ జాతీయులతో కలసి బ్రిటీషర్ల మీద తిరగబడ్డారు. నిజాం, బ్రిటీషర్ల సంయుక్త బలగాలకు వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన పోరాటం ఊపిరి పీల్చుకోలేకపోయింది. అనుచరులతో సహా ఆయన నిర్బంధానికి గురయ్యారు. పలుమార్లు నిర్బంధాలకు గురైనప్పటికి, ముబారిద్దౌలా బ్రిటీష్ వ్యతిరేక వైఖరి విషయంలో రాజీ పడలేదు. ఆ సమయంలో సయ్యద్ అహమ్మద్ బరేల్వి వహాబీ తత్వం ఆయనకు పరిచయమైంది. ధార్మికంగా చూస్తే శుద్ధ ఇస్లాంను, మహమ్మద్ ప్రవక్త సంప్రదాయాలను తు.చ. తప్పక పాటించటం, రాజకీయంగా, బ్రిటీషర్లను తరిమికొట్టాలన్నా వహాబీల ఆలోచనలు ఆయనను బాగా ఆకట్టుకున్నాయి. ఆ ప్రభావంతో వహాబీ ధార్మిక, ప్రాపంచిక సంప్రదాయాలను ముబారిజుద్దౌలా స్వీకరించారు.

1839లో ఆయన తన వహాబీ సహచరులతో కలిసి బ్రిటీషర్లకు వ్యతిరేకంగా మరో తిరుగుబాటుకు ప్రయత్నం చేశారు. ఆయనకు విజయం దక్కలేదు. ఈ సంఘటనను పురస్కరించుకుని బ్రిటీష్ రాణికి వ్యతిరేకంగా కుట్ర పన్నారని నేరారోపణ చేసి ముబారిజుద్దౌలాను, ఆయన అనుచరులను నిర్బంధించారు. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఆయనకు జీవితఖైదును శిక్షగా విధించారు. చిట్టచివరకు ముబారిజుద్దౌలా గోల్కొండ కోటలో 1854 జూన్ 25న అమరత్వం పొందారు.

## రణశూరుడు రసూల్ ఖాన్

ఆనాడు ముబారిద్దౌలా ప్రారంభించిన ఉద్యమంలో కర్నూలు జిల్లా నవాబు గులాం రసూల్ ఖాన్ పాల్గొన్నారు. ముబారిజుద్దౌలాతో చేతులు కలిపి, బ్రిటీషర్లకు వ్యతిరేకంగా జరిగిన కుట్రలో ఆయన భాగస్వామి అయ్యారు. తన సంస్థానంలోని పలు భవనాలు, తోటలను, తుపాకులు, మందుగుండు సామగ్రిని తయారుచేసే కర్మాగారాలుగా, గిడ్డంగులుగా మార్చివేసారు. ఈ విషయాన్ని పసికట్టిన బ్రిటీష్ ప్రభుత్వం, ఆంగ్లేయాధికారి టి. యల్.బ్లేన్‌ను విచారణ కోసం నియమించింది. ఆ విచారణ తరువాత 1839 అక్టోబర్ 18న ఎ.బి.డైన్ అను సైన్యాధికారి నాయకత్వంలో ఆంగ్ల సైన్యం కర్నూలు నవాబు సంస్థానం మీద దాడి చేసింది. జోహరాపురం అను ప్రాంతంలో ఇరు పక్షాలకు భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో గులాం రసూల్‌ఖాన్‌ను విజయలక్ష్మి వరించలేదు. వహాబీ వీరుడు రసూల్‌ను

అరెస్టు చేసి తిరుచునాపల్లి జైలుకు తరలించారు. చివరకు నవాబు రసూల్ ఖాన్ అక్కడే కన్నుమూసారు.

## వహాబీల బహుముఖ పాత్ర

ఈ విధంగా అసమాన ధైర్యసాహసాలు, శౌర్య పరాక్రమాలు ప్రదర్శిస్తూ, వహాబీ వీరులు ఆ నాడు పలు బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్నారు. ధార్మికపరమైన అంశాలతో తొలుత ప్రారంభమైనప్పటికీ, ఆ నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ వాతావరణానికి అతీతంగా వహాబీలు ఉండలేకపోయారు. ధార్మిక ప్రచారంతో పాటుగా వహాబీలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్న ఇతర సామాజిక, రాజకీయ, ఆర్థిక వాస్తవాలను విస్మరించలేకపోయారు. నిర్దేశించుకున్న ధార్మిక జీవనాన్ని అనుసరించాలన్నా, ఆ మేరకు తగిన వాతావరణం సమాజంలో ఉండాలని, అందుకు తగిన రాజ్యవ్యవస్థ కూడా ఎంతో అవసరమని వహాబీ సిద్ధాంతకర్తలు భావించారు. ఆ దిశగా కార్యాచరణను రూపొందించారు. ఆ లక్ష్యసాధన దిశగా పయనిస్తున్న వహాబీలకు ఒంటరిగా ముందుకు సాగటం ఆసాధ్యం అన్పించింది. స్వదేశంలోని ఇతర సాంఘిక జనసముదాయాలతో మమేకమై శత్రువును పరాజితుడ్ని చేయాలనుకున్నారు. అక్కడి నుండి వహాబీ ఉద్యమం మలుపు తిరిగి మరొక మార్గం ఎంచుకుంది. ఈ విధంగా సంతరించుకున్న అనుభవాల మార్గనిర్దేశకత్వంలో జనజీవనంలో వహాబీలు బహుముఖ పాత్రను నిర్వహించారు.

## తిరుగుబాటుకు సంకేతం వహాబీలు

ప్రథమ స్వాతంత్ర్య సమరానికి పూర్వమే బ్రిటీషర్ల మీద కత్తి దూసిన సయ్యద్ అహమ్మద్ అలీ బరేల్వి నుండి వహాబీల ధార్మిక , రాజకీయ, ఆర్థిక పోరాటాలు ప్రారంభమై పీడిత రైతాంగం, చేనేత పనివారు, గ్రామీణ ప్రజానీకం పక్షాన, ప్రజా నాయకుడు మీర్ నిస్సార్ అలీ విక్రమించారు. అ నాటి వహాబీల మహాప్రస్థానం ప్రథమ స్వాతంత్ర్య సమరంలో అధిక పాత్ర వహించింది. తిరుగుబాటు ప్రజ్వరిల్లిన ప్రతిచోట వహాబీల పాత్ర ఉందని ఆంగ్ల అధికారులు ప్రకటించి, ఆ మేరకు వహాబీల పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించారంటే, ఈ తిరుగుబాట్లలో వహాబీల భాగస్వామ్యం ఎంత మేరకు ఉందో గ్రహించవచ్చు. ఆనాడు పలు ప్రాంతాల నుండి సాయుధులైన వహాబీ దళాలు ఢిల్లీకి చేరుకున్నాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ దళాలను తరిమికొట్టిన తిరుగుబాటు దళాలలో వహాబీలు ప్రధాన పాత్ర వహించారని చరిత్ర చెబుతుంది. ప్రథమ స్వాతంత్ర్య సమరం తరువాత కూడా బ్రిటీషర్ల అహంకారపూరిత పెత్తనాన్ని ఏ మాత్రం సహించని వహాబీలు పలు పోరాటాలు సాగించారు. 1857 తరువాత బలగాలన్నిటినీ సమీకరించుకునేందుకు సాగిన ప్రయత్నాలలో భాగంగా పాట్నా, భోపాల్, రంగూన్, షాహమాద్ తదితర ప్రాంతాల నుండి వహాబీలు ధార్మిక ప్రచార దళాల ముసుగులో బ్రిటీష్ వ్యతిరేక కార్యకలాపాలను ఉధృతం చేసారు. ఈ దళాలు బ్రిటీష్ సైనిక పటాలాలను కూడా ఆకర్షించేందుకు పలుసార్లు

ప్రయత్నం చేసాయి. ఈ సాహసోపేత చర్యలు చేపట్టిన నాయకులలో మౌల్వీ ఇలాయత్ అలీ కుమారుడు మహమ్మద్ హసన్, పండ్ల వ్యాపారి అబ్దుల్లా, భోపాల్‌కు చెందిన మున్షీ జమాలుద్దీన్, సాదిఖ్ హుస్సేన్, ఢాకాకు చెందిన అబ్దుల్ హకీం ముఖ్యులని చరిత్రకారులు శ్రీ ఈశ్వరీప్రసాద్ రచనల వలన తెలుస్తుంది. ఆనాడు భోపాల్ బేగం కూడా భూరి విరాళాలతో వహాబీ విప్లవకారులకు ఆర్థిక సహకారం అందించారు. ఒకవైపు పలు విచారణల పేరుతో వహాబీ నేతలందర్నీ అరెస్టులు చేసి, నిర్బంధంలోకి తీసుకొని మరణశిక్షలు, ఉరిశిక్షలు, ద్వీపాంతరవాస శిక్షలు, ఆజన్మాంత ఖైదు, సుదీర్ఘ జైలు శిక్షలు విధిస్తూ, బ్రిటీష్ ప్రభుత్వం కరాళ నృత్యం చేస్తున్నప్పటికీ, మొక్కవోని ధైర్యం, పట్టుదలతో వహాబీ తిరుగుబాటు దళాలు బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలను కొనసాగించాయి.

బలమైన ధార్మిక సిద్ధాంత పునాదిగా, పటిష్టమైన నాయకత్వం, త్యాగమూర్తులు, సమరశీలురైన నాయకుల మార్గదర్శకత్వంలో వహాబీ ఉద్యమం, పోరాట మార్గం స్వీకరించి ఉత్తర భారతదేశంలో పాట్నా, వారణాశి, కాన్పూరు, ఢిల్లీ బొంబాయి, థానేశ్వరం, అంబాల, అమృతసర్, భోపాల్, అటు వాయవ్యసరిహద్దు ప్రాంతాలకు విస్తరించి జీలం, రావల్పిండి, పెషావర్ తదితర ప్రాంతాలలో బలమైన కేంద్రాలను ఏర్పాటు చేసుకుంది. ఈశాన్య రాష్ట్రాలలో కూడా వహాబీలు కాలుమోపారు. సిల్హట్, త్రిపుర తదితర ప్రాంతాలలో వహాబీ ఖలీఫాలు బ్రిటీషర్లుకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడంలో ప్రముఖ పాత్ర వహించారు. ఈ ప్రాంతాలలో జరిగిన అన్ని విముక్తి పోరాటాలలో వహాబీలు పాల్గొన్నారు. ఆ తరువాత కాలంలో వహాబీలు జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. గాంధేయ మార్గాన సాగిన అహింసాయుత ఉద్యమంలో, విప్లవకారుల నాయకత్వంలో సాగిన సాయుధ పోరాటంలో, బ్రిటీష్ వ్యతిరేక పోరాటాల వారసత్వం వీడకుండా వహాబీలు పాల్గొన్నారు.

## అపార్థాల మబ్బుల్లో వహాబీ సూర్యులు

రాజకీయ రణరంగాన ఎంతటి త్యాగాలు చేసినా సామాజిక రంగంలో వహాబీలు పలు అపార్థాలకు గురయ్యారు. ప్రాథమిక దశలో సామాన్య ముస్లింలు కూడా వహాబీ సంప్రదాయాలను ససేమిరా అంగీకరించలేదు. ఈనాటికీ అదే భావన కొనసాగుతుంది. ఈ పరిస్థితులకు స్వయంగా వహాబీలే కారణం. వహాబీల ధార్మిక ఆచార సంప్రదాయాల ఆచరణ విషయంలో, సామాన్య ముస్లిం జనసముదాయాలతో కొందరు వహాబీలు అనుసరించిన మొరటు వైఖరి, తమ **'తరీఖా'**ను (పద్దతులను) అనుసరించని ఇతర జన సముదాయాలను చిన్నచూపు చూడటం, అక్కడక్కడ శత్రువైఖరి వహించటం వలన అంతరం ఏర్పడింది. ఈ పరిస్థితులకు మరింత ఊతం ఇస్తూ బ్రిటీషర్లు సాగించిన దుష్ప్రచారం వహాబీల పట్ల వ్యతిరేకత బలపడడానికి ఆ వాతావరణం తోడ్పడింది. వహాబీలు అంటే ఇస్లాంకు వ్యతిరేకులని, వహాబీలు ముస్లింలు కారని ఆంగ్లేయులు పనికట్టుకుని ప్రచారం సాగించారు.

ఈ పరిస్థితులే కాదు త్యాగపూరిత చరిత్ర గల వహాబీలు ప్రగతి పథాన పయనించడంలో కూడా వెనుక బడ్డారు. ఈ వాతావరణానికి వహాబీల వ్యవహార సరళి

కూడా ప్రధాన కారణం. వహాబీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విజ్ఞాన సాంకేతిక రంగాలలో దూసుకువస్తున్న మార్పులను అంగీకరించలేదు. మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నించలేదు. బ్రిటీషర్ల పట్ల గుడ్డి వ్యతిరేకతతో ఆంగ్ల భాషను విస్మరించారు. విద్యా-వికాస కార్యక్రమాలను, విధానాలను వ్యతిరేకించారు. ప్రపంచంలో సంభవిస్తున్న నూతన పరిణామాలను తమ జీవన పరిస్థితులకు అన్వయించుకోకపోవటం లాంటి విధానాల ఫలితంగా ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకు వహాబీలు సామాన్య జనజీవన స్రవంతికి దూరంగా తమదైన గూటిలో ఉండిపోయారు.

## చరిత్రలో సుస్థిర స్థానం

ఆ తరువాత కూడా ఆనాటి గూటిలోనే వహాబీలు మిగిలిపోలేదు. నూతన తరం భవిష్యత్తు గురించి ఆలోచించింది. స్వదేశీ, విదేశీ, విశ్వవ్యాపిత పరిణామాలను వహాబీలు అధ్యయనం చేసారు. పూర్వీకుల స్ఫూర్తిని విస్మరించకుండా సామాజిక వాస్తవాల ఆధారంగా తమ కార్యక్షేత్రాన్ని, లక్ష్యాన్ని, లక్ష్య సాధనా మార్గాలను నిర్దేశించుకుని మాతృదేశ సేవలో ప్రయాణం సాగించారు. ఆచార, సంప్రదాయాల పరంగా ఎలాగున్నా బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో మాత్రం అపూర్వమైన, అనితర సాధ్యమైన త్యాగాలతో వహాబీలు మాతృదేశం రుణం తీర్చుకున్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో వహాబీ యోధులు సుస్థిరస్థానం సంపాదించుకున్నారు. ◆


## ' చరిత్ర సృష్టించిన ముస్లిం మహిళలు '

భారతదేశ సుదీర్ఘ చరిత్రలో బహుముఖ పాత్ర వహించి, జనజీవన స్రవంతి లోని అన్ని రంగాలలో తమదైన ప్రతిభాకౌశల్యంతో ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్న ముస్లిం మహిళల ఉదాత్త జీవిత విశేషాలను పాఠకులకు పరిచయం చేసే గ్రంథం **చరిత్ర సృష్టించిన ముస్లిం మహిళలు.** సయ్యద్ నశీర్ అహమ్మద్ కలం నుండి జాలువారనున్న ఈ గ్రంథంలో అన్ని ప్రజా జీవన రంగాలలో తమదైన ముద్రతో అయా రంగాలను సుసంపన్నం చేసి చరితార్థులైన సుమారు 100 మంది మహిళా మణుల జీవిత రేఖాచిత్రాలను పొందుపర్చాలన్నది ఉద్దేశ్యం.

**పండితులకు, పాఠక మిత్రులకు వినతి.**

ఈ గ్రంథాంశానికి సంబంధిచిన సమాచారం, చిత్రాలు, ఫోటోలు ఏవైనా పాఠక మిత్రుల దృష్టికి వచ్చినట్లయితే, ఆయా వివరాలను మాకు గాని, రచయిత దృష్టికి గాని తీసుకొచ్చి మా ప్రయత్నాలకు చేయూతనివ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**– అజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్**

3

# దోపిడీశక్తుల గుండెల్లో భయోత్పాతం సృష్టించిన
# ఫరాజీ యోధులు
## 1830-1900

బ్రిటీషర్లు ప్రప్రథమంగా బెంగాల్‌లో తమ పునాదులను ఏర్పాటుచేసుకున్నారు. అక్కడి నుండే దోపిడీ ప్రారంభించారు. ఆధిపత్యం సాగించారు, పెత్తనం చలాయించారు. అవిభక్త బెంగాల్, బీహార్ తదితర ప్రాంతాలలో సాగుతున్న అంతులేని పాలకవర్గాల దోపిడీని ప్రజలు సహించలేకపోయారు. పోరుకు సిద్ధపడ్డారు. ఈ పోరాటాలు రైతాంగ తిరుగుబాట్లుగా ప్రసిద్ధి చెందాయి. బ్రిటీషర్లు తొలుత తమ దృష్టిని రెవిన్యూ విధానాల మీద సారించటంతో, ఆ నిరంకుశ దోపిడీ విధానాలతో తీవ్రంగా ప్రభావితులైన గ్రామీణ రైతులు, చేతివృత్తులవారు, స్వదేశీ వర్తకులు, ఆ తరువాతి కాలంలో కష్ట నష్టాలకు గురైన స్వదేశీ పాలకులు బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ ఉద్యమాల తొలి దశలో మతం, ఆచార సంప్రదాయాలు ప్రాధాన్యత సంతరించుకుని ప్రజలను సంఘటిత పర్చడానికి సహాయపడగా, ఆ తరువాత ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలు ఆధిపత్యం వహించి, ఆ దిశగా పోరాటాలు జీవం పోసుకున్నాయి.

ఈ పోరాటాలను ప్రారంభించిన ముస్లిం నాయకులు, ఇస్లాం ప్రబోధించిన మార్గం నుండి ప్రజలు తప్పిపోయారని, మార్గం తప్పిన జనసముదాయాలు ఇస్లాం నిర్దేశించిన మార్గంలో నడిపించాలన్న లక్ష్యంతో తొలి దశలో ఉద్యమించారు. ఆ తరువాత రెండవ తరం నాయకులు సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకుని, తమ ప్రాంతాలలోని సాంఘిక జనసముదాయాలను కలుపుకొని ఐక్య పోరాటాలకు శ్రీకారం చుట్టారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, పాలక వర్గాల తొత్తులు, ఈ పోరాటాలకు మతం రంగు పులిమి నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నారు. ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం సాగించిన పోరులో ప్రజలు మతాలను అంతగా పరిగణనలోకి తీసుకోలేదు. తిరుగుబాటు సమయంలో తమ మార్గానికి ఏ మతస్థులు అడ్డు వచ్చినా ఉద్యమకారులు సహించలేదు.

ఆ కారణంగా బ్రిటీషర్లు ఈ పోరాటాలన్నిటినీ బ్రిటీష్ రాణికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టిన విద్రోహ చర్యలుగా, మతం ముసుగులోని తిరుగుబాట్లుగా చిత్రించారు.

ఉద్యమకారులను, పోరాట వీరులను, శత్రువులుగా పరిగణించి రాక్షసంగా వ్యవహరించారు. బ్రిటీషర్లు ఎంత కిరాతకంగా వ్యవహరించినా, పేదలను, రైతులను దోపిడి నుండి రక్షించుకోవడానికి, తెల్లవారిని తరిమికొట్టాలన్న ప్రగాఢ వాంఛ ప్రజలను పోరాట దిశగా నడిపించటంతో, ఆ తిరుగుబాట్లు రాజకీయ స్వభావాన్ని సంతరించుకున్నాయి. వలస పాలకులకు వ్యతిరేకంగా భారతీయులు సాగించిన తిరుగుబాట్లలో, ముస్లిం జనసముదాయాల నాయకత్వంలో సాగిన పోరాటాల పరంపరలో భాగంగా వహాబీల తిరుగుబాటు ఉధృతంగా సాగుతున్న సమయంలోనే ' **ఫరాజీల** ' పోరాటం ఉద్భవించింది. వహాబీలు, ఫరాజీలు కలసి పోరాడక పోయినా ఫరాజీల పోరాటాలు కూడా బాగా ప్రసిద్ధి చెందాయి. ఈ రెండు తిరుగుబాట్ల మధ్యన స్వల్ప తేడాలున్నా, బ్రిటీష్ వ్యతిరేకత విషయంలో విభేదం లేకుండా సాగాయి.

## ఫరాజీలు అంటే ఎవరు?

**'ఫర్జ్'** అంటే ఎటువంటి మినహాయింపు లేకుండా, తు.చ. తప్పకుండా నిర్వర్తించాల్సిన బాధ్యత అని అర్థం. ఇస్లాం నిర్దేశించిన విధి విధానాలను, సంప్రదాయాలను, ఖచ్చితంగా అనుసరించే వ్యక్తిని **'ఫరాజీ'** అన్నారు. బహువచనంలో వారు **'ఫరాజీలు'** అయ్యారు. భగవంతుని ఆజ్ఞలను (ordinance of God or commandments of Allah) ఏ మాత్రం సడలింపు లేకుండా ఫరాజీలు అనుసరించారు. అల్లాహ్ ఖురాన్ గ్రంథం ద్వారా నిర్దేశించిన ఆదేశాలను తప్ప మరి దేనికీ ఫరాజీలు ప్రాధాన్యత ఇవ్వలేదు. మానవుని జీవిత గమనానికి ఖురాన్ గ్రంథం ఒక్కటే మార్గదర్శకమని ఫరాజీల విశ్వాసం. గ్రంథంలో పేర్కొనబడని నమ్మకాలు, ఆచారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలను అనుసరించటం, అనుకరించటం నిషిద్ధమని ఫరాజీలు భావించారు. ఈ విశ్వంలోని ప్రజలంతా ఒక్కటేనన్న భావనతో, సుఖ-దు:ఖాలను, కష్ట- సుఖాలను ప్రతి ఒక్కరూ సమానంగా అనుభవించాలన్నది ఫరాజీల ప్రగాఢ విశ్వాసం. ఈ విశ్వాసం గ్రామీణ ప్రజలను అమితంగా ఆకర్షించింది. ధార్మిక పరిశుద్ధత, పవిత్రత, సమానత అను మూడు మూల సూత్రాలు ఫరాజీల సంఖ్య అసంఖ్యాకంగా పెరగడానికి కారణమయ్యాయి.

## ఫరాజీ ఉద్యమ నిర్మాత హాజీ షరియతుల్లా

భారతదేశ స్వాతంత్ర్య సమరోజ్వల చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించి, జాతీయోద్యమకారులకు స్ఫూర్తిదాయకంగా నిలచిన ఫరాజీ ఉద్యమానికి హాజీ షరియతుల్లా అంకురార్పణ చేసారు. తూర్పు బెంగాల్‌లోని ఫరీద్‌పూర్ జిల్లా, బహుదూర్‌పూర్ గ్రామాన 1764లో ఆయన జన్మించారు. తల్లిదండ్రులు చేనేత పనివారు. చిన్ననాటినుండే ఆధ్యాత్మిక చింతన అలవడిన షరియతుల్లా 18వ ఏటనే హజ్ యాత్రకు వెళ్ళి, మక్కాలో సుదీర్ఘకాలం గడిపి 1802లో స్వదేశానికి తిరిగి వచ్చారు. ఆయన మక్కాలో ధార్మికగ్రంథాలను కఠోరశ్రమతో అధ్యయనం చేసి మంచి ఆధ్యాత్మిక పండితుడిగా ఖ్యాతి గడించారు. మక్కాలో చారిత్రక వహాబీ ఉద్యమ నిర్మాత సయ్యద్ అహమ్మద్ బరేల్వి, వహాబీ పోరాట వీరుడు మీర్ నిస్సార్ అలీలను కలుసుకోవటం జరిగింది. ఆనాడే మార్గం మళ్ళిపోతున్న ముస్లింలను సరైన దారిలో నడిపించడానికి చేయవలసిన కృషిని, ఆ ప్రయత్నాలకు అడ్డుకాగల **'ఫిరంగీ'**

ల మీద చేయాల్సిన **'జిహాద్'** (ధర్మ పోరాటం) గురించి చర్చించి మార్గం నిర్ణయించుకున్నారు.

స్వదేశానికి రాగానే సాగిన చర్చలు, ఎంచుకున్న జీవిత లక్ష్యాలకు అనుగుణంగా హాజీ షరియతుల్లా ధార్మిక బోధన ప్రారంభించారు. తూర్పు బెంగాల్ ప్రాంతంలోని అనేక గ్రామాలను సందర్శించారు. పలు పర్యటనలు జరిపారు. ఆయన ప్రబోధిస్తున్న పరిశుద్ధ ఇస్లాం, సమానత్వం, సామాజిక న్యాయం అనే సూత్రాలు గ్రామీణ పేదవర్గాలను అమితంగా ఆకర్షించాయి. ఆ ప్రబోధాల మూలంగా గ్రామీణ ప్రాంతాలలో ఆయనకు భారీ శిష్యగణం ఏర్పడింది. భారతదేశంలోని యితర సాంఘిక జనసముదాయల సంస్కృతి, సభ్యత, సంప్రదాయాల ప్రభావం వలన ముస్లిం సమాజంలోకి చొచ్చుకు వచ్చిన ఇస్లాం వ్యతిరేక ఆచార సంప్రదాయాలను తీవ్రంగా ఖండించారు. ముస్లింల నడకకు, నడతకు ఖురాన్ గ్రంథం మాత్రమే ప్రధాన ప్రాతిపదిక అని ప్రకటించారు. ఆ మేరకు ప్రచారం చేసారు. గ్రంథంలో ప్రస్తావించని ప్రతి విషయం నిషిద్ధన్నారు. సకారాత్మకంగా ఎటువంటి విధి విధానాలను, ఆచారాలను పాటించాలో స్పష్టంగా పేర్కొన్నారు. భగవంతుని ఆజ్ఞల సముదాయమైన ఖురాన్ గ్రంథానికి మించి, ముస్లింల జీవితాలకు మహత్తర మార్గదర్శకం మరొకటి లేదన్నారు. ఇస్లాం మతం బోధించిన సమానత్వం, సోదరభావాన్ని విస్మరించటం సరికాదన్నారు.

స్వదేశం విదేశీయుల పాలనలో ఉన్నందున, ఈ దేశాన్ని శత్రువు దేశంగా (Dar-ul -harb) ప్రకటించి, అది విదేశీయుల నుండి విముక్తం అయ్యేంతవరకు, శుక్రవారం నాటి ప్రత్యేక ప్రార్థనలు చేయరాదని, ముస్లింల రెండు ప్రధాన పండుగలను కూడా జరుపుకోరాదన్నారు. ఈ దేశాన్ని శత్రుదేశం నుండి స్వదేశంగా (Dar-ul -Islam) మార్చాలని ఆయన నిర్ణయించారు. ఈ గడ్డ మీద నుండి ఫిరంగీల పాలనకు చరమగీతం పాడేందుకు సమాయత్తం కావాలని, ఆ లక్ష్య సాధనకు ఫరాజీలంతా కృషి సాగించాలని హాజీ షరియతుల్లా ఆదేశించారు. ఈ విషయాన్ని ఆంగ్ల రచయిత Wilfred Cantwel Smith రాసిన Modern Islam in India లో, ... they drew political conclusion that to convert this land as a dar-ul - Islam the rule of firingi came to an end.., అని పేర్కొన్నారు.

హాజీ షరియతుల్లా సాగించిన పర్యటనలు, ప్రబోధాలన వలన ఫరీద్‌పూర్, బాఖర్‌గంజ్, మైమ్‌సింగ్ తదితర ప్రాంతాలలో మంచి అనుచరవర్గం ఏర్పడింది. ఆయా ప్రాంతాలలోని ముస్లింలు షరియతుల్లా అనుచరులుగా దీక్ష స్వీకరించారు. ఆయన ఆదేశిస్తే ధనమాన ప్రాణాలను అర్పించడానికి సిద్ధపడ్డారు. ఆయన ఆదేశాలను అనుసరించడానికి సదా సిద్ధంగా ఉన్న అమితోత్సాహులైన కొందరు ఫరాజీలు పలు ప్రాంతాలలోని ఇతర ముస్లింలతో ఘర్షణలకు పాల్పడ్డారు. గ్రామాలు, పట్టణాలలో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడింది. ఈ కారణంగా ఫరాజీల నేత హాజీ షరియతుల్లాను బ్రిటీష్ ప్రభుత్వం పలుమార్లు నిర్బంధించింది. బ్రిటీష్ వ్యతిరేకత దృష్ట్యా రెవిన్యూను జమీందారులకు చెల్లించరాదంటూ ఆయన అనుచరులను కోరారు. ఈ కారణంగా ఆయనను అరెస్టు చేయటం జరిగిందని ఆంగ్ల అధికారి జేమ్స్ టైలర్ రాసిన, A sketch of the Topography and statistics of

Dacca ( Calcutta 1840 ) లో పేర్కొన్న అంశాలను బట్టి చూస్తే స్పష్టమౌవుతుంది. జమీందారులు, ఇండిగో ప్లాంటర్లు, ఫరాజీలకు వ్యతిరేకంగా ఏకమయ్యారు. ఫరాజీల ధార్మిక ఆచార సంప్రదాయాలతో ఏకీభవించని ఇతర ముస్లింలను రెచ్చగొట్టి, ఫరాజీలకు వ్యతిరేకంగా పురికొల్పారు.

ఈ కుయుక్తుల కారణంగా 1831లో రాంనగర్ గ్రామంలో ఫరాజీలకు, జమీందారుల మద్దతుదారుల మధ్య కొట్లాట జరిగింది. ఈ సంఘటనను పురస్కరించుకుని ఇరువురు ఫరాజీలకు సంవత్సరం జైలు శిక్ష, జరిమానా విధించారు. హాజీ షరియతుల్లా మీద కూడా కేసు నమోదు చేసినా, ఎటువంటి సాక్ష్యం లేకపోవటంతో ఆయనను విడిచిపెట్టాల్సి వచ్చింది. అనంతరం ఢాకాలోని నవబారి (NAVABARI) గ్రామం నుండి ఆయనను బహిష్కరించారు. ఫరాజీలకు కేంద్రంగా మారిన నవబారిని వదిలి, పుట్టి పెరిగిన గ్రామానికి ఆయన వెళ్ళిపోయారు. ఈ సంఘటనలు ఫరాజీలను ఏ మాత్రం నిరుత్సాహపర్చలేదు. హాజీ ప్రవచనాలు, ప్రబోధం వలన, ఆయా ప్రాంతాల సామాజిక పరిస్థితుల వలన ఫరాజీల సంఖ్య అనూహ్యంగా పెరగసాగింది. ఫరాజీల సంఖ్య పెరిగేకొద్ది వారిలో ఆత్మస్థైర్యం పుంజుకోసాగింది. నిర్మాణపరంగా ఫరాజీలు సంఘటితం కాసాగారు.

జమీందారుల అకృత్యాలను సహించలేని ఫరాజీలు, శత్రువును ధైర్యంగా ఎదుర్కోటానికి సమాయత్తమయ్యారు. ఈ వాతావరణంలో జమీందారుల, కంపెనీ అధికారుల పెత్తనం దోపిడి చర్యల వలన బాధలు అనుభవిస్తున్న గ్రామీణ పేద రైతాంగం ఫరాజీల వెంట నడిచారు. ప్రమాదాన్ని పసిగట్టిన జమీందారులు ఫరాజీలను వ్యతిరేకించే ఇతర సంప్రదాయాల ముస్లిం పెద్దలను, వడ్డీవ్యాపారులను, సంపన్నులను ఏకం చేసారు. ఫరాజీలను నిలువరించకపోతే రానున్న ఇక్కట్లను గుర్తెరిగి, ఫరాజీల చర్యలను ఎదుర్కొనడానికి ఉద్యుక్తులు కాసాగారు. జమీందారులు, వడ్డీ వ్యాపారులు వీలు చిక్కినప్పుడల్లా ఏదో ఒక సాకుతో ప్రజలను హింసించసాగారు. ప్రజల మీద అణచివేత, హింస పెరిగే కొద్ది ఫరాజీ వ్యతిరేకశక్తులు ఊహించినట్టుగా కాకుండా అందుకు విరుద్ధంగా ఫరాజీల సంఖ్య, ఫరాజీలను సమర్థించే గ్రామీణ రైతుల, ప్రజల సంఖ్య పెరగసాగింది.

ఫరాజీలపై అణచివేత, నిర్బంధాలు పెరగటంతో హాజీ షరియతుల్లా తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. అనుచరుల సంఖ్య పెరిగేకొద్ది జమీందారుల అణచివేతను, హింసను సహించలేకపోవటం, శక్తిగల ప్రాంతాలలో వ్యతిరేకించటం పరిపాటయ్యింది. పలు ప్రాంతాలలో ప్రతిఘటన పెరగసాగింది. ఈవిషయాన్ని Dr. James Wise 1894 లో హాజీ షరియతుల్లా మీద రాసిన ఒక వ్యాసంలో, ' ..Persecuted the more did he ( Ishriathulla ) become the symbol of a new awakening amongst the peasantry. During the next four years he was called upon to face tyrannical indigo planters, oppressive mahajans and Zamindars, whenever there had been a case to defend.. ', అని పేర్కొన్నారు.

ఈ వాతావరణం మూలంగా గ్రామాలలో ఉద్రిక్తత ఏర్పడింది. ఆ పరిస్థితులను గమనించిన హాజీ షరియతుల్లా, ఘర్షణ వైఖరిని విరమించుకున్నారు. ఆధ్యాత్మిక వ్యవహారాల

మీదనే పూర్తిగా దృష్టినిల్పారు. ఫరాజీల సంఖ్యను పెంచేందుకు కృషిని తీవ్రతరం చేసారు. అందరికి ఆదర్శప్రాయమ్తెన జీవితాన్ని గడపసాగారు. అణచివేతను, పీడనను వ్యతిరేకించినందున, శుద్ద ఇస్లాంను, సమానత్వంను బోధించినందున, తూర్పు బెంగాల్ అంతటా ఆయన ప్రవచనాలు బాగా విస్తరించాయి. పీడిత ప్రజానీకం, రైతాంగం ఆయనను తండ్రిగా భావించారు. గౌరవించారు. ఈవిషయాన్ని డాక్టర్ జేమ్స్".. his pure and simple life dedicated to the cause of oppressed, clarity of his social philosophy, his uncomprising and gentle courage made him the beloved idol of the poor who looked upon him as their father...", అని వివరించారు.

ఈ విధంగా అతి సామాన్యమైన పేద చేనేత పనివారల కుటుంబంలో జన్మించి, అత్యున్నత స్థాయి ధార్మిక నాయకునిగా, గ్రామీణ పేదల రక్షకునిగా, అణచివేతకు, అహంకారపూరిత పెత్తనానికి, దోపిడీకి బద్ద విరోధిగా తనదైన పాత్రను హాజీ షరియతుల్లా నిర్వహించారు. శతాబ్దం పాటు తూర్పు బెంగాల్ అంతటా ఆధ్యాత్మిక, సాంఘిక రంగాలలో ప్రభావం చూపిన ఫరాజీ సంప్రదాయాల స్వరూప స్వభావాలను ఆయన తీర్చిదిద్దారు. బెంగాల్‌ను సుమారు అర్దశతాబ్దిపాటు బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలకు నిలయంగా మార్చిన రైతాంగ తిరుగుబాట్లకు జన్మనిచ్చిన ఫరాజీల ఉద్యమాన్ని పటిష్టంగా నిర్మించి, రానున్న రోజులలో ఫిరంగీలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ఆ మహానాయకుడు, తన తరువాత తరాలకు మహత్తర పోరాటాల వారసత్వాన్ని వదలి 1840లో కన్నుమూసారు.

## తండ్రిని మించిన తనయుడు దూదు మియా

చరిత్ర సృష్టించిన ఫరాజీ ఉద్యమానికి ఉన్నత దశ మాత్రమే కాకుండా మహత్తర దిశను కూడా నిర్దేశించి ఫరాజీలను పోరాట మార్గాన నడిపించిన మహాసేనాని దూదు మియా, ఫరాజీ ఉద్యమ నిర్మాత హాజీ షరియతుల్లా పుత్రుడు. ఆయన అసలు పేరు మహమ్మద్ మోసిన్. 1819లో జన్మించిన దూదు మియా తండ్రిలాగే చిన్ననాటనే మక్కాకు వెళ్ళి వచ్చారు. ధార్మిక చింతనతో పాటుగా సామాజిక, ఆర్థిక రాజకీయ పరిస్థితుల పట్ల చక్కని అవగాహన సంపాదించుకున్నారు. రెండు పదులు దాటని వయస్సులో దూదు మియా ఫరాజీ ఉద్యమ నాయకునిగా బాధ్యతలను స్వీకరించారు. ఆయన నాయకత్వం స్వీకరించేసరికి, ఫరాజీలు కేవలం ధార్మిక అంశాలనే కాకుండా అణచివేతను ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతున్నారు.

ఆ పరిస్థితులలో నాయకత్వం చేపట్టిన దూదు మియా అద్భుతమైన కార్యదక్షతతో, నిర్మాణ కౌశల్యంతో, త్యాగనిరతితో తండ్రిని మించిన తనయుడిగా ఖ్యాతిగాంచారు. హాజి షరియతుల్లా ప్రధానంగా ధార్మిక విషయాల మీద దృష్టి సారించగా, అందుకు భిన్నంగా దూదు మియా ఆనాటి ఆర్థిక, రాజకీయ పరిస్థితుల మీద దృష్టి నిలిపారు. ఆ పరిస్థితుల నేపథ్యంలో తండ్రి ప్రారంభించిన ఫరాజీ ఉద్యమాన్ని తీర్చిదిద్ది రాజకీయంగా మలుపు తిప్పారు. ఈ విషయాన్ని ప్రముఖ రచయిత S.P. RAY తన గ్రంథం Bharater Krishak Bidroh Ganatantrik Sangram లో "..Under Dudu Miah political and economical programme was combined. It brought a qualitative change in the character of movement..." అని పేర్కొన్నారు. ఆయన తన అనుచరులను సమరశీల కార్యకర్తలుగా

తీర్చిదిద్దారు. ఫరాజీల ధార్మిక-లౌకిక జీవన విధానాన్ని, హాజీ షరియతుల్లా నిర్దేశించిన మార్గాన నడిపించేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసారు. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా బ్రిటీషర్లకు, జమీందారులకు, వడ్డీ వ్యాపారులకు, కంపెనీ పాలకుల తొత్తులకు, ప్లాంటర్లకు, మహాజన్‌లకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించేందుకు పటిష్టమైన వ్యవస్థ రూపొందించారు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదుర్కోడానికి ఫరాజీలను పూర్తిగా సన్నద్ధం చేసారు.

## ఆనాటి పరిస్థితులు

తూర్పు బెంగాల్‌లో జమీందారులు, కంపెనీ అధికారులు, ఇండిగో ప్లాంటర్లు గ్రామీణ పేద రైతాంగం మీద, ప్రజల మీద సాగిస్తున్న దోపిడీ, అణచివేత చర్యలను వివరిస్తూ 1850 జనవరి 1వ తేదీన ఆయన ప్రభుత్వానికి లేఖ రాసారు. ఆ లేఖలో వివరించిన అంశాలను పరిశీలిస్తే ఆనాడు ప్రజలు పడుతున్న కష్టనష్టాలను, ఆ పరిస్థితుల మీద దూదు మియా వ్యక్తం చేసిన లౌకిక-తాత్త్విక ఆలోచనలను, అభిప్రాయాలను మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

**'.. ముస్లింలు తమ జీవన విధానం, ఆచార, సంప్రదాయాల విషయంలో బాగా దిగజారిపోయి ఉన్నారు. విగ్రహాలను ఆరాధిస్తున్నారు. తమ పూర్వీకుల పేరిట బలులు ఇస్తున్నారు. పరిశుద్ధ ఇస్లాం జీవన విధానం నుండి మార్గభ్రష్టులై దొంగతనాలు, దోపిడీలను వృత్తిగా చేసుకున్నారు. హత్యలకు పాల్పడుతూ, కష్టనష్టాలకు గురవుతూ, ఆస్తిపాస్తులను పోగొట్టుకుని, ఫౌజ్‌దారి కోర్టుల (క్రిమినల్ కోర్టులు) పాలవుతున్నారు...'**, ఈ విపత్కర పరిస్థితుల నుండి ముస్లింలను విముక్తం చేయడానికి తన తండ్రి ఉద్యమించగా, అదే బాటన తాను కూడా నడుస్తున్నానని దూదు మియా వివరించారు. **'... ఇస్లాం చూపిన మార్గం నుండి తప్పుకుని, అల్లాహ్ ఆదేశాలను విస్మరించి, పాలకుల ఆజ్ఞల ఉల్లంఘనకు పాల్పడుతున్న ప్రజలను ఇస్లాం చూపిన మార్గాన సాగేట్టుగా సంస్కరించడానికి తాము పూనుకున్నామ...'** ని పేర్కొన్నారు.

ఆనాడు జమీందారులు పలు పర్వదినాలు, పండగల పేరుతో ముస్లింల నుండి రకరకాలుగా నగదును బలవంతంగా వసూలు చేయటం జరుగుతోందని, ఇస్లాంకు వ్యతిరేకమైన ఈ చర్యలను వ్యతిరేకించిన గ్రామీణుల పట్ల జమీందారులు క్రూరంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. గ్రామీణుల వ్యవహారాలలో జమీందారుల అక్రమ జోక్యం, రైతాంగం మీద సాగిస్తున్న జులుంను నిరసిస్తూ, **'... అటు హిందూ జమీందారులు గాని, ఇటు మహమ్మదీయ జమీందారులుగాని, రైతుల మధ్యన తలెత్తిన వివాదాలలో, న్యాయాధికారులుగా తమను తాము ప్రకటించుకుని, అనవసరంగా జోక్యం చేసుకుంటూ రైతులకు శిక్షలు, జరిమానాలు విధిస్తున్నారు. ఆ జరిమానాలు చెల్లించటంలో ఆలస్యం జరిగితే తీవ్రంగా హింసిస్తున్నారు...'**, ప్రభుత్వ పాత్రను జమీందారులు నిర్వహించటం ఏంటని ప్రశ్నిస్తూ, ఈ పద్ధతి అటు ప్రభుత్వ చట్టాలకు, ఇటు భగవంతుని ఆదేశాలకు వ్యతిరేకమని విమర్శించారు.

## జమీందార్ల అక్రమాలు

జమీందారులు సాగిస్తున్న ఆర్థిక దోపిడీ వ్యవహారాల మీద దృష్టి సారిస్తూ, జమీందారులు, కంపెనీ పాలకులు సాగిస్తున్న అక్రమ వసూళ్ళను ఆయన నిశితంగా ప్రశ్నించారు. **'...ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా నిర్ణయించబడిన పన్నును ఇతర మొత్తాలను మాత్రమే జమీందారులు, రైతుల నుండి వసూలు చేయాల్సి ఉంది...'** అలా కాకుండా జమీందారులు, అధికారులు తమ విలాసాలకు అవసరమయ్యే డబ్బును మాత్రమే కాకుండా ముస్లింలకు ధార్మికంగా ఎటువంటి సంబంధంలేని పండుగలు, పబ్బాల నిర్వహణకు భారీగా వసూలు చేయటం ప్రారంభించారు.

ప్రభుత్వం విధించిన పన్నులను మాత్రమే చెల్లించడానికి సిద్ధపడిన రైతులు, అటువంటి అక్రమ చెల్లింపులను నిరాకరించారు. అలా నిరాకరించిన వారి మీద జమీందారులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, తగు విచారణ జరిపించాల్సిందిగా దూదు మియా పిటీషన్‌లో కోరారు. **'...జమీందారులు విధిస్తున్న అక్రమ పన్నుల చెల్లింపులను రైతులు వ్యతిరేకించటంతో జమీందారులు తమ అనుయాయుల సహకారంతో రైతుల మీద తప్పుడు కేసులు పెట్టించి, వేధిస్తున్నారని అందువల్ల ఫౌజ్‌దారి కోర్టులలో రైతుల మీద అధిక సంఖ్యలలో కేసులు నమోదు అవుతున్నాయి...'** అని వివరించారు. రైతుల మీద అక్రమంగా క్రిమినల్ కేసులను బనాయించి, కోర్టుల చుట్టూ తిప్పటంతో, పేద రైతులు వ్యయప్రయాసలను భరించలేక జమీందారుల ఆదేశాలకు తలవొగ్గి నడుచుకునేవారు. అందువలన ప్రతి చిన్న వ్యవహారాన్ని పెద్దది చేసి, పోలీసుల సహకారంతో రైతాంగం మీద క్రిమినల్ కేసులను నమోదు చేయించి వేధించటం జమీందారులకు పరిపాటయ్యింది.

## ఫరాజీల వ్యతిరేకత

సంఘటితమైన ఫరాజీలు ఈ అక్రమాలను ధైర్యంగా వ్యతిరేకించసాగారు. ఫరాజీల పోరాట పటిమను, న్యాయం వైపు నిలిచే ధీర గుణాన్ని గమనించిన ఫరాజీ సంప్రదాయ వ్యతిరేకులు, బాధితులైన రైతులు, సాధారణ ముస్లింలు ఫరాజీల మద్దతుతో అక్రమ వసూళ్ళను వ్యతిరేకించారు. అక్రమ పన్నుల చెల్లింపులను నిరాకరించారు. ప్రభుత్వం విధించిన పన్నులను తప్ప అధికారులు, జమీందారులు అక్రమంగా విధిస్తున్న పన్నులను ఏ పరిస్థితులలోనూ చెల్లించేది లేదని స్పష్టం చేసారు. అందుకు కట్టుబడి నిలిచి, జమీందారుల నుండి ఎదురయ్యే కష్టనష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధపడ్డారు. సామాన్యంగా అణిగిమణిగి పడిఉండే రైతులు తమ ఆదేశాలను ఖాతరు చేయకపోవటం, పన్నులను, ఇతర విరాళాలను చెల్లించబోమని ఖరాఖండిగా చెప్పటంతో జమీందారులలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గ్రామీణుల మీద, ఫరాజీల మీద కిరాతక చర్యలు ప్రారంభించారు.

ఈ విషయాలను కూడా దూదు మియా తన పిటీషన్‌లో వివరించారు. " ...the reformed Mussalmans ... refused to meet the illegal demands of the zamindars, which provoked the latter (Zamindars) to oppress the former (Farmers) most cruelly..." ( Wahabi And Farazi Rebels of Bengal-Narahari Kaviraj, PPH, 1982).

ఈ పరిస్థితులు గ్రామీణులను, రైతులను కోర్టుల పాల్జేసాయి. జమీందారులు,

అధికారులు కుమ్మక్కై బనాయించిన కేసుల నుండి విముక్తం కావడానికి పేద రైతాంగం సర్వస్వం బలిపెట్టాల్సి వచ్చింది. రైతు కుటుంబాలు బజారున పడ్డాయి. ఆరు కాలాలు కష్టపడి సంపాదించుకున్న పంట చేతికందకుండా తన్నుకుపోతున్న జమీందారులు, కంపెనీ పాలకులు క్రిమినల్ కేసులతో తమ జీవితాలను బజారుపాలు చేయటమే కాకుండా, తమ ధార్మిక ఆచార సంప్రదాయాలను కూడా వ్యతిరేకిస్తున్నందున, తిరుగుబాటు తప్ప ప్రజలకు మరో మార్గం లేకుండా పోయింది. ఈ పరిస్థితులలో జమీందారుల పట్ల, ఆంగ్ల అధికారుల పట్ల ఫరాజీల, గ్రామీణ పేదల ఆగ్రహం అధికమై చివరకు తిరుగుబాటు రూపం ధరించింది.

## అన్నార్తుల ఆపద్బాంధవుడిగా దూదు మియా

ఆ సమయంలో రంగప్రవేశం చేసిన దూదు మియా, ఫరాజీ ఉద్యమాన్ని మార్గం మళ్ళించారు. ధార్మిక సంస్కరణల మార్గం నుండి, జమీందారుల ఆర్థిక దోపిడి, బ్రిటీషర్ల అణచివేత నుండి ప్రజల విముక్తి కోసం సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూస్తున్న బాధితులకు దూదు మియా ఆపద్బాంధవునిలా కన్పించారు. ప్రఖ్యాత ధార్మిక వేత్త హాజీ షరియతుల్లా కుమారుడిగా ప్రజలలో గౌరవాభిమానాలు సంపాదించుకున్న ఆయన, తన సమరశీల ఆలోచనలతో ప్రజలకు మరింత చేరువయ్యారు. గ్రామీణులు తండోపతండాలుగా ఆయన వెంట కదిలారు. ఆయన సారథ్యంలో ఫరాజీలు సంఘటితమై ఎటువంటి శక్తినైనా ఎదుర్కొనగల ఆత్మస్థైర్యం, అంగబలం, ఆయుధబలం, ఆర్థికశక్తిని సమకూర్చుకున్నారు. జమీందారుల, అధికారుల అరాచకాలను ఇక ఏ మాత్రం సాగనివ్వమని ప్రతిన పూనారు. జమీందారులు, రైతుల మీద దుశ్చర్యలకు పూనుకోగా సమైక్యంగా ప్రతిఘటించారు. ఈ ప్రతికూల వాతావరణానికి కలవరపడిన జమీందారులు తమ కష్టాలకు కంపెనీ పాలకులకు, అధికారులకు విన్నవించుకున్నారు. పరిస్థితులు విషమించగలవని భావించిన కంపెనీ పాలకులు, తమ తొత్తులైన జమీందారుల రక్షణ కోసం బలగాలను పంపారు.

## బ్రిటీష్ అధికారులను పరుగులెత్తించిన ఫరాజీలు

ఫరాజీల నాయకత్వం చేపట్టిన దూదు మియా, తాను నాయకత్వం చేపట్టిన రోజునే తన సమరశీలతను, బలాన్ని పాలకులకు తెలియజేయాలనుకున్నారు. 1839 ఏప్రిల్ మాసంలో ఫరీద్‌పూర్‌లో జరిగిన నాయకత్వ స్వీకారోత్సవం సందర్భంగా ఫరాజీల ఆధిపత్యం గల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ఫరాజీలు వచ్చారు. భారీ సంఖ్యలో సమావేశమైన ఫరాజీలు, సంప్రదాయక ఆయుధాలు చేతబట్టి, దూదు మియా నాయకత్వం పట్ల తమ గౌరవాన్ని, అంగీకారాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఫరాజీలు తమ నిరసనను, బలాన్ని ప్రదర్శించదలిచారు. పలు కేసులు బనాయించి రైతులను ఇక్కట్ల పాల్జేస్తున్న షిబ్చూర్ (Shibchur) పోలీస్ అధికారులకు బుద్ధి చెప్పాలనుకున్నారు. ఆ పోలీసు స్టేషన్ మీద దాడిచేసారు. ఫరాజీలు ఆకస్మికంగా దాడి చేయటంతో చేష్టలుడిగిన పోలీసు అధికారులు ప్రాణభయంతో పరుగులెత్తారు. పోలీసు స్టేషన్‌ను ధ్వంసం చేసిన ఫరాజీలు పరిసరాలలోని ఏడు గ్రామాల మీద విరుచుక పడ్డారు. ఆయా గ్రామాలలో ప్రజలను, రైతులను పీడిస్తూన్న ధనికులు, మహాజనుల మీద దాడిచేసి ప్రజాకంటకుల అస్తిపాస్తుల విధ్వంసానికి పూనుకున్నారు.

ఈ దాడులు మతాతీతంగా జరిగాయి. గ్రామీణ ప్రజలకు, ఫరాజీలకు శత్రువుగా పరిగణించిన ప్రతి కుటుంబం మీద దాడి జరిగింది. దాడులలో ఫరాజీలు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. ( "..even they kidnapped and plundred such Muhammedans when they stood in their way. Muhammedans of diffrent persuations were not only persecuted by them but some times cruelly murdered.." - JUDICIAL PROCEEDINGS 16TH April 1839, - WAHABI AND FARAZI REBELS OF BENGAL) ఫరీద్‌పూర్ మేజిస్ట్రేట్ ఈ తిరుగుబాటు గురించి నివేదిక రాస్తూ, ఈ తిరుగుబాటు **1831లో వహాబీలు టిటూ మీర్ నాయకత్వంలో జరిపిన బరాసత్ రైతాంగ తిరుగుబాటును పోలి ఉన్నదని** పేర్కొన్నాడు. ఆ ఆంగ్ల అధికారి వివరణల ద్వారా ఈ తిరుగుబాటు స్వభావ, స్వరూపాలను అర్థంచేసుకోవచ్చు. ఆనాడు బరాసత్ తిరుగుబాటు విజయంతో తిరుగులేని శక్తిగా ఆవిర్భవించిన వహాబీల మాదిరిగానే షిబ్చూర్ విజయంతో ఫరాజీలకు తిరుగులేకుండా పోయింది.

దూదు మియా మార్గదర్శకంలో ప్రారంభమైన ఫరాజీల తిరుగుబాటు క్రమక్రమంగా బలం పుంజుకుంది. పలు ప్రాంతాలలో ఫరాజీలు ప్రతిఘటనలకు పూనుకున్నారు. ఈ ప్రతిఘటనలు కాలం గడిచే కొద్ది రైతాంగ తిరుగుబాట్లుగా రూపు దిద్దుకొసాగాయి. ఈ మేరకు అక్రమ వసూళ్ళను వ్యతిరేకిస్తూ పోరుబాటన నడుస్తున్న రైతులకు ఇండిగో ప్లాంటర్ల (నీలిమందు ఫ్యాక్టరీల యజమానులు) రూపంలో మరొక సమస్య వచ్చి పడింది. గ్రామీణ రైతుల భూములను తమ గుప్పెట బిగించుకుని తమ ఇష్టానుసారంగా నీలిమందు పంటను పండించాలని, తాము నిర్దేశించిన విధంగా రైతులు నడుచుకోవాలని, కాదూ కూడదంటే ఆ భూములలో పండే పంటలో ప్రధాన భాగం తమకు సంక్రమింపచేయాలని రైతులను పీడించటం ప్రారంభించారు. జమీందారుల, కంపెనీ అధికారుల, వడ్డీవ్యాపారుల దోపిడికి గురవుతూ జీవచ్ఛవాల్లా బ్రతుకులీడ్చుతూ, అనునిత్యం అణచివేతకు, పీడనకు గురవుతున్న గ్రామీణులకు, ఇండిగో ప్లాంటర్ల చర్యలు ప్రాణాంతకమయ్యాయి. ఈ పరిస్థితులను ఫరాజీలు వ్యతిరేకించారు. ప్లాంటర్ల పెత్తనాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, ఫరాజీలు రైతుల పక్షాన నిలబడటంతోనే ఇండిగో ప్లాంటర్లు కక్షబూనారు. ఈ వ్యతిరేకతను ఆదిలోనే అణిచివేయాలని నిర్ణయించుకున్న ప్లాంటర్లు, ఫరాజీలను తమ ప్రథమ శత్రువులుగా పరిగణించి ఆ దిశగా పావులను కదిపారు.

1837లోనే తూర్పు బెంగాల్ ప్రాంతంలో వందల ఎకరాల భూమిని తన ఆధిపత్యం క్రింద ఉంచుకున్న ప్రముఖ ప్లాంటర్ డన్‌లప్ మీద ఫరాజీలు దాడికి ప్రయత్నించారు. పలు గ్రామాల పంట భూముల మీద అధిపత్యం చలాయిస్తున్న డన్‌లప్ అతి కిరాతంగా వ్యవహరిస్తూ, రైతులచే వెట్టిచాకిరీ చేయించసాగాడు. ఈ చాకిరీని, ఆధిపత్యాన్ని నిరాకరించిన రైతులను రాచి రంపాన పెట్టసాగాడు. దూదు మియా ఫరాజీల నాయకత్వం చేపట్టగానే ఫరాజీల నుండి రానున్న ప్రమాదాన్ని డన్‌లప్ పసిగట్టాడు. అందుకు తగినట్టుగానే డన్‌లప్ చర్యలను ఎలాగైనా సరే అడ్డుకోవాలని ఫరాజీలు నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుండి అనేక ఫ్యాక్టరీలు, ఎస్టేట్‌లు గల సంపన్నుడైన డన్‌లప్ కార్యకలాపాలకు ఫరాజీలు అడ్డునిలువ సాగారు. అణగిమణిగి పడివున్న రైతులు తనని వ్యతిరేకించటం, ఆ ఆదేశాలను బడుగు

రైతు కూడా ఖాతరు చేయకపోవటాన్ని ఆ ఆంగ్లేయ అహంకారి జీర్ణం చేసుకోలేక పోయాడు.

## వ్యవస్థాగత పటిష్టత

దూదు మియా నాయకత్వం చేపట్టగానే ఉద్యమ వ్యవస్థను ముందుగా పటిష్టం చేయాలనుకున్నారు. శత్రువు బలాన్ని అంచనా వేసుకున్న ఆయన అందుకు తగ్గట్టుగా ఉద్యమవ్యవస్థను పునర్నిర్మించడానికి నడుంకట్టారు. ఫరాజీల ఉద్యమానికి ఒక క్రమబద్ధమైన స్వరూపం, స్వభావం కల్పించాలని సంకల్పించి, ఆ పనులలో నిమగ్నమయ్యారు. అధికార వికేంద్రీకరణతో పాటుగా అధికార కేంద్రీకరణను సమన్వయం చేస్తూ పటిష్టమైన వ్యవస్థ రూపకల్పన చేశారు. ఉద్యమ కార్యక్రమాలను ఒక నిర్దిష్ట పద్దతి ప్రకారంగా అమలు చేసేందుకు పూనుకున్నారు.

ఆ నాడు తూర్పు బెంగాల్ ప్రాంతంలో దూదు మియా అనుచరులు 50 వేల నుండి 80వేల వరకు వున్నారని, ఢాకా కమీషనర్ బెంగాల్ ప్రభుత్వానికి 1847 ఏప్రిల్ 7వ తేదిన రాసిన నివేదికలో వెల్లడించగా, మొత్తం మీద ఫరాజీలు రెండు నుండి రెండున్నర లక్షలకు పైగా ఉంటారని ఫరాజీల మీద సాగిన వివిధ కేసులలో ప్రభుత్వ సాక్షులుగా వచ్చిన ప్రజలు పేర్కొన్నారు. దూదు మియా పిలుపునిస్తే క్షణాలలో హాజరుకాడానికి 50 వేల మంది సిద్ధంగా ఉంటారని కూడా అధికారులు వెల్లడించారు. అసంఖ్యాకులైన అనుచరుల వ్యవహార సరళిని క్రమబద్ధం చేసేందుకు, శత్రువు నుండి తన వారిని తమ ఉద్యమాన్ని కాపాడుకునేందుకు తగిన యంత్రాంగంతోపాటుగా అవసరమైన జాగ్రత్తలను దూదు మియా తీసుకున్నారు. ఫరాజీల ప్రాబల్యం ఉన్న గ్రామాలలో, పట్టణాలలో ఆయన పంచాయితీ వ్యవస్థను ఏర్పాటు చేసారు. తూర్పు బెంగాల్‌ను సర్కిల్స్‌గా విభజించారు. ప్రతి సర్కిల్‌లోని గ్రామాలలో పంచాయితీలను ఏర్పాటు చేసారు. ప్రతి పంచాయితీలో రెండు విభాగాలు ఉంటాయి. ఒక విభాగం రాజకీయ, లౌకిక, ఆర్థిక వ్యవహారాలను, మరొక విభాగం ధార్మిక వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఈ వ్యవస్థను ' **ఫరాజీ ఖలీఫత్** ' అని నామకరణం చేసారు. ఈ ఖలీఫత్‌లలో తనకు నేరుగా బాధ్యత వహించగల వ్యక్తులను ఆయన నియమించారు.

ఉద్యమ నాయకుడు దూదు మియాను ' **వస్తాద్** ' లేక ' **పీర్** ' అని గౌరవంగా ఫరాజీలు పిలుస్తారు. ఆయా సర్కిల్స్‌లోని పంచాయితీలలోని వస్తాద్ ద్వారా నియమితులైన వ్యక్తులను ' **ఖలీఫా** ' లేక ' **మున్షీ** ' అని నామకరణం చేసారు. ఈ ప్రతినిధులు ఫరాజీల ధార్మిక, ఆర్థిక, లౌకిక, జీవన వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. వివాదాలను పరిష్కరిస్తారు. ఫరాజీలు అధికారుల వద్దకు గాని, ప్రభుత్వ న్యాయస్థానాలు, పోలీసుల వద్దకు గాని వెళ్ళరాదని నిర్ణయించారు. సమస్యలు గ్రామ పంచాయితీ స్థాయికి మించినట్టయితే దూదు మియా జోక్యం చేసుకొని న్యాయం చేస్తారు. నేరస్థుడికి జరిమానా విధించటం, ఆ శిక్షలను అమలుపర్చేందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించారు. దూదు మియా తీర్పులను ఫరాజీలే కాదు హిందువులు, క్రైస్తవులు, సాధారణ ముస్లింలు కూడా శిరసావహించటం ప్రారంభించారు. ఈ విచారణలో బాధితులకు నష్టం జరగకుండేందుకు ఆయన పలు

జాగ్రత్తలు పాటించారు. ఆయా మతస్థుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా తీర్పులిచ్చారు. అన్ని మతాల, సంప్రదాయాల ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు దూదు మియా ప్రత్యేకంగా న్యాయసలహా మండలిని ఏర్పాటు చేసుకున్నారు. ఆ మండలిలో హిందూ, క్రైస్తవుల చట్టాలు తెలిసిన హిందూ, క్రైస్తవ మతాలకు చెందిన పండితులను, ప్రముఖులను నియమించారు. ఈ పండితులలో ఒకరు బ్రాహ్మణుడు కాగా ఇరువురు శూద్ర కులానికి చెందిన వారుండటం విశేషం. ప్రజల వ్యక్తిగత మత విశ్వాసాలకు ఏ మాత్రం భంగం కలగకుండా న్యాయమైన తీర్పులు ప్రకటించేందుకు దూదు మియా పలు జాగ్రత్త తీసుకున్నారు.

## రాజ్యంలో రాజ్యం

శత్రువు మీద దాడులు చేసేందుకు ప్రత్యేక బలగాలను తయారు చేసుకున్నారు. ఆ బలగాలకు అన్నిరకాలుగా తగిన శిక్షణ ఇప్పించారు. ఆయుధాలను సమీకరించారు. తయారు చేయించారు. శారీరకంగా బలిష్టులైన యువకులను బలగాలలోకి ఆహ్వానించారు. శత్రువు మీద మాత్రమే దాడి చేయాలని, మిత్రులకు కించిత్తు నష్టం కల్గించరాదని ఖచ్చితమైన ఆదేశాలు జారీచేసారు. మిత్రులను శత్రువులను గుర్తించడానికి, శత్రువుల కదలికలను గమనించడానికి గూఢచారి వ్యవస్థను నిర్మించారు. రైతుల, ఫరాజీల న్యాయమైన హక్కులను హరించివేయటానికి జమీందారులు, అధికారులు కక్ష సాధింపుగా కేసులు బనాయించి కోర్టులకు లాగితే, బాధితుల పక్షాన న్యాయపోరాటం చేయడానికి, ' **ఫరాజీ టాక్స్** ' అను ప్రత్యేక పన్నును, విరాళాలను సేకరించి బాధితులను ఆదుకునే ఏర్పాట్లు చేసారు. ఈ చర్యలతో, పటిష్టమైన సంఘనిర్మాణంతో, తగిన యంత్రాంగంతో అణచివేతకు గురవుతున్న ప్రజలకు తిరుగులేని నాయకుడిగా దూదు మియా ఎదిగారు. స్వయంపాలనను ప్రారంభించారు. ఫరాజీల ప్రాబల్యం గల జిల్లాలో, ఆధిపత్యంలో గల గ్రామాలలో ప్రభుత్వ ఆజ్ఞలను ప్రజలు ఖాతరు చేయక, దూదు మియా ఆదేశాలను ఖచ్చితంగా అమలుచేయటం గమనించిన చరిత్రకారులు ఆ వ్యవస్థను రాజ్యంలో రాజ్యంగా ( State with in the State ) పరిగణించటం గమనించాల్సిన విశేషాంశం. కంపెనీ పాలకుల హుకుం నామాలను కాదంటూ తమదైన ఆదేశాలను అమలు జరుపుకుంటూ ఫరాజీలు స్వంతంత్ర ప్రభుత్వాన్ని నడపటం గమనిస్తే ఆయా ప్రాంతాలలో ఫరాజీలు ఎంతగా బలపడ్డారో అర్థం చేసుకోవచ్చు. ఒక సంఘ సంస్కర్తగా, ఫరాజీల పాలకునిగా, ప్రజలను వేధించవద్దని, అక్రమ వసూళ్ళకు పాల్పడవద్దని, ఫరాజీల ఉద్యమానికి విరాళాలు అందజేయమని, పరిసర ప్రాంతాల జమీందారులకు, ప్రముఖులకు ఆయన లేఖలు వ్రాసారు. ప్రజల మీద కిరాతకాలకు పాల్పడవద్దని, అక్రమ కేసులను బనాయించితే సహించేది లేదని హెచ్చరికలు జారీచేసారు.

దూదు మియా ప్రాబల్యం పెరగటం, ఆయన అండదండలను చూసుకొని రైతులు పేద వర్గాల ప్రజలు, ఫరాజీలు కంపెనీ పాలకులను గాని, జమీందారులను గాని, బేఖాతర్ అనటంతో ఆ వర్గమంతా మండిపడసాగింది. శత్రువు ఎత్తులను కనిపెడుతూ అప్రమత్తంగా దూదు మియా వ్యవహరించసాగారు. కంపెనీ పాలకులు, అధికారులు ఆయన మీద చర్యలు తీసుకునేందుకు అవకాశం లేకుండా పలు జాగ్రత్తలతో హెచ్చరిక లేఖలను రాయించారు.

ఉత్తరాల చివరలో **'...పేరు తెలియని అహమ్మద్...'** అని దూదు మియా సంతకం చేసేవారు. ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు పలువురు ముస్లిమేతరులను కూడా ఆయన తన కొలువులో నియమించుకున్నారు. ఫరీద్‌పూర్ కేంద్రంగా దూదు మియా తన కార్యకలాపాలను నిర్విఘ్నంగా సాగించేందుకు పటిష్టమైన వ్యవస్థను రూపొందించుకొని బ్రిటీషర్ల పెత్తనాన్ని, జమీందారులను, ఇండిగో ప్లాంటర్లను సవాల్ చేస్తూ , ఆయా ప్రాంతాలకు సర్వ స్వతంత్ర పాలకునిగా వ్యవహరించారు.

## ప్లాంటర్ల కుయుక్తులు

ఈ వాతావరణంలో, తొలినుంచి ఫరాజీల మీద కక్ష కట్టి, దూదు మియా ఆధిపత్యానికి గండికొట్టాలని, ఆయనకు వ్యతిరేకంగా హిందూ-ముస్లిం జమీందారులను, మహజనులను, ఫరాజీ సంప్రదాయాలను వ్యతిరేకించే సంపన్న ముస్లింలను, పోలీసుల బలగాలను ఏకం చేసిన ఆంగ్లేయ ఇండిగో ప్లాంటర్ డన్‌లప్, పథకాలు సిద్ధం చేయసాగాడు. ఫరాజీల మీద శరపరంపరలుగా క్రిమినల్ కేసులను నమోదు చేయించాడు. దూదు మియా మీద పలు కేసులు నమోదు అయ్యాయి. చివరకు పోలీసులతో మిలాఖతయ్యి, దుండగులను పోగేసి, 1846 సెప్టెంబరు మాసంలో భారో గ్రామంలో గల దూదు మియా గృహం మీద దాడి జరిపించాడు. ఈ సంఘటనను పురస్కరించుకుని, దూదు మియా అధికారులకు ఫిర్యాదు చేశారు. **గృహం మీద దొమ్మి జరిగిందని, దాడులు చేసి ఆస్తిపాస్తులను దోచుకున్నారని, సేవకులను హతమార్చారని,12 లక్షల రూపాయల ఆస్తిని ఎత్తుకుపోయారని,** ఫిర్యాదులో వివరించారు. దూదు మియాకు న్యాయం జరుగకపోగా, డన్‌లప్‌తో చేతులు కలిపిన ఆంగ్ల అధికారులు, పోలీసులు ఆయనకు వ్యతిరేకంగా కుట్రపూరితంగా వ్యవహరించారు. గతంలో నమోదయ్యి రుజువులు లేక మూలపడి ఉన్న అనేక కేసులను ఎత్తి చూపారు. బాధితుడైనా ఆయనను నిందితుడ్ని చేసి, పలు నిందలు మోపారు. ఈ చర్యతో దూదు మియాలో సహనం నశించింది. ఆయన అనుచరవర్గం ఆగ్రహావేశాలను వెళ్ళగక్కసాగింది. పలు ప్రాంతాలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జమీందారులు ఏ క్షణాన ఎటువైపు నుండి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడసాగారు. ఆ సమయంలో ఈ సంఘటన మీద పాలకులు విచారణ జరిపించ నిర్ణయించారు. ఆ విచారణలో దూదు మియా నిందితుడు కాదని, ఆయన మీద డన్‌లప్ తదితరులు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని, దూదు మియా గృహం మీద దాడి, దొమ్మి సంఘటన నిజమేనని, ఆయన చేసిన ఆరోపణలన్నీ యధార్థాలని విచారణ జరిపిన ఉన్నతాధికారులు నివేదిక సమర్పించారు. అయితే ఈ దాడి, దొమ్మి, దోపిడీకి, సూత్రధారి అయినటువంటి ప్లాంటర్ డన్‌లప్‌కు శిక్ష పడలేదు. ఈ సంఘటన నేపథ్యంలో ఫరాజీలు జరిపిన దాడులకు సంబంధించి నమోదైన కేసులను పరిశీలించిన న్యాయమూర్తి తన తీర్పులో, ఈ దాడులకు ప్రధాన కారణం కనీస న్యాయం కూడా లభించకపోవడమంటూ పేర్కొన్నాడు. ( I found a total absence of ordinary justice. I believe, as far as I can judge from records of the case, the outrage on Mr. Dunlop's factory originated in the total denial of ordinary justice.."). ఈ వ్యాఖ్యల ద్వారా పేద రైతుల, ప్రజల, ఫరాజీల పరిస్థితి ఎలా ఉన్నదో, ఏ వాతావరణంలో ఫరాజీలు తిరగబడ్డారో, ఆ తిరుగుబాటులో ఉన్న సహేతుకతను కొంత

వరకు అర్ధం చేసుకోవచ్చు.

## విజృంభించిన ఫరాజీలు

దూదు మియా గృహం మీద దాడి జరపటంతో, ఈ చర్య తమ అందరికి అగౌరవంగా భావించిన ఫరాజీలు కోపోద్రేకంతో రెచ్చిపోయారు. ఆయుధాలను చేతపట్టి డన్‌లప్ ఫ్యాక్టరీ మీద దాడి చేసారు. ఈ దాడులలో పలువురి ప్రాణాలు పోయాయి. ఈ సంఘటన తరువాత ఫరాజీల మీద హత్య, దోపిడీ, దాడి లాంటి కేసులు నమోదయ్యాయి. అనంతరం పలు అవాంఛనీయ సంఘటనలు జరిగాయి. ప్రతిచర్యగా ఫరాజీలు కంపెనీ పాలకుల మీద, జమీందారుల మీద, కంపెనీ మద్దతుదారుల మీద విరుచుకుపడ్డారు. ప్రతి దాడిలో దూదు మియా ఫరాజీ బలగాల వెంట ఉండటం వలన ఆయన నేతృత్వంలో ఫరాజీలు మరింతగా విజృంభించారు. అమాయకులకు, స్త్రీలకు, వృద్ధులకు, ఎటువంటి ఇక్కట్లు కలగకుండా దూదు మియా చర్యలు తీసుకోవటంతో గ్రామీణుల మద్దతు అపారంగా లభించింది. మతాలతో ఏ విధంగాను సంబంధం లేకుండా అన్ని మతాలకు చెందిన పేద ప్రజలు, రైతులు ఆయనకు అండదండలుగా నిలిచారు.

ఈ సంఘటనలతో పాలకులు ఫరాజీల మీద, ప్రజల మీద ఉక్కుపాదం మోపటంతో, ఆ ప్రాంతాలలో బ్రిటీష్ వ్యతిరేకత పెద్ద ఎత్తున ప్రజర్విల్లింది. పోలీసు అధికారులకు కూడా ప్రాణభయం పట్టుకుంది. ఇండిగో ప్లాంటర్లు, కంపెనీ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళారు. ఈ తిరుగుబాట్లను, దాడులను నిరోధించటం కష్టంగా మారిందని, ప్రతి సంఘటనలో, పెద్ద సంఖ్యలో ఫరాజీలు గ్రామీణులు పాల్గొంటున్నందున, వారిని నిలువరించటం సాధ్యం కావటం లేదని పోలీసు అధికారులు కంపెనీ ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నారు.

గ్రామాల మీద సైనిక బలగాలు దాడులు జరిపి ఫరాజీలను పెద్ద సంఖ్యలో నిర్బంధించాయి. ప్రజల మీద దాష్టీకాలకు పాల్పడ్డాయి. దూదు మియాను అరెస్టు చేసాయి. అధికారులు ఆయనను మిగతా ఫరాజీల నుండి వేరుచేసి ప్రత్యేక గదిలో ఏకాంతంగా ఉంచారు. ఆయన పట్ల అత్యంత అవమానకరంగా, క్రూరంగా వ్యవహరించారు. దూదు మియా మీద పాలకవర్గాలు సాగించిన దుశ్చర్యలు సహజంగా సంచలనం కలిగించాయి. ఉద్రిక్త వాతావరణానికి కారణమయ్యాయి. ఈ సంఘటనల తరువాత అధికారులు వ్యవహరించిన తీరు తెన్నుల మీద విచారణ జరిపిన ఆంగ్ల అధికారులు కూడా పోలీసు అధికారులను తప్పుపట్టారు. అయినప్పటికీ దూదు మియాకు ఫరాజీల మీద వున్నపట్టు, ప్రజలలో గల పలుకుబడిని గమనించిన అధికారులు, ఆయన సమస్యాత్మకం కాగలరని భావించారు. దూదు మియాను బెంగాల్ నుండి మాత్రమే కాదు భారతదేశం నుండి బహిష్కరించటం మంచిదని ఢాకా కమీషనర్ సలహానిచ్చాడు. ప్లాంటర్ డన్‌లప్ తన కుతంత్రాలను మానలేదు. 1838లో ప్రారంభించిన ఆ కుయుక్తులను కొనసాగించాడు. 1841, 1846, 1857లలో కూడ ఫరాజీలు, దూదు మియాల మీద అనేక కేసులను బనాయించాడు. ఆతడు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ప్రజల అండదండలు, పటిష్టమైన వ్యవస్థ గల ఫరాజీలను పరాజితులను చేయటం అతనికి సాధ్యం కాలేదు. అతని ఎత్తులు పలుమార్లు

విఫలమైనప్పటికి, పట్టు వదలని విక్రమార్కునిలా దూదు మియాకు వ్యతిరేకంగా మళ్ళీ మళ్ళీ శత్రువర్గాన్ని సంఘటితం చేయసాగాడు.

చివరకు 1857 ప్రారంభంలో సరికొత్త అరోపణలతో దూదు మియాను డన్‌లప్ అనుచరవర్గం మరోసారి అరెస్టు చేయించింది. ఈ కేసు విచారణ ఢాకాలోని న్యాయస్థానంలో జరిగింది. పోలీసు, న్యాయవ్యవస్థ మిలాఖత్ కావటంతో, కంపెనీ పాలకుల సలహా మేరకు, సరైన సాక్ష్యాధారాలు లేకున్నా దూదు మియాకు 14 సంవత్సరాల శిక్షను విధించారు. ఈ తీర్పు మీద ఫరాజీలు అప్పీల్ చేసుకున్నారు. ఉన్నత న్యాయస్థానం దూదు మియాను నిర్దోషిగా నిర్ణయించి, కేసును కొట్టివేసి విడుదలకు ఆదేశించింది. అయితే విడుదల ఆదేశాలు అమలు జరుగలేదు. ఆ సమయంలో ప్రథమ స్వాతంత్ర్య సమరజ్వాలలు దేశమంతటా విస్తరిస్తున్నందున విడుదల చేసినట్లే చేసి, మరో కేసు బనాయించి జైలులో బంధించారు.

## ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో ఫరాజీలు

దూదు మియాను బంధించినప్పటికి ఆంగ్లేయులు ఏమి సాధించ లేకపోయారు. బ్రిటీష్ అధికారుల పట్ల, బ్రిటీష్ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత సంతరించుకున్న ఫరాజీలు 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా తమదైన పాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరాజీల వ్యతిరేకతను గ్రహించిన ఆంగ్లేయాధికారులు వారిని పెద్ద సంఖ్యలో నిర్బంధించారు. భారతదేశమంతటా తిరుగుబాట్లు జరుగుతున్న సమయంలో దూదు మియాను విడుదల చేయటం అత్యంత ప్రమాదకరమని భావించిన కంపెనీ పాలకులు, ఆయనను ఒకటిన్నర సంవత్సరం పాటు నిర్బంధించి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ముగిసిన తరువాత మాత్రమే విడుదల చేయడానికి సాహసించగలిగారు.

దూదు మియా నిర్బంధంలో వున్నప్పటికీ, ఆయన ప్రబోధించిన బ్రిటీష్ వ్యతిరేకతను అణువణువునా నింపుకున్న ఫరాజీలు ప్రథమ స్వాతంత్ర్య సమర వీరులతో చేతులు కలిపి పలు చోట్ల కంపెనీ బలగాల మీద తిరగబడ్డారు. ఈ విషయాన్ని ఆ నాటి బ్రిటీష్ అధికారులు రాసిన నివేదికలలో, ప్రభుత్వ మద్దతుదారులు ఆధికారులకు రాసిన లేఖలలో, ఫిర్యాదులలో పేర్కొన్నారు. ఢాకాకు చెందిన గైబుల్లా అనునతడు అధికారులకు రాసిన లేఖలో తిరుగుబాటు సిపాయిలు, ఫరాజీ మౌల్వీలు కలసి కుట్రలు పన్నుతున్నారని ("..that that he had knowledge of a secret meeting between two Hindusthanis and some of the Farazi Khalifas ..., they might be in league with the sepoys..") పేర్కొన్నాడు. బ్రిటీష్ సైన్యంలోని స్వదేశీ సైనికులను తమతో కలిసి రమ్మంటూ, కంపెనీ పాలకులు అధికారుల మీద తిరగబడమంటూ ఫరాజీలు లేఖలు రాసారని ఫరీద్‌పూర్ మేజిస్ట్రేట్ ఉన్నతాధికారులకు పంపిన నివేదికలో వివరించాడు. ఒక పాఠశాల నుండి ఫరాజీలు తమ పిల్లలందరిని ముకుమ్మడిగా తీసుకొని వెళ్ళిపోయారని, ఈ పరిస్థితి చూస్తే, ఫరాజీలు పెద్ద ఎత్తున తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని అనిపిస్తుందని, మధురాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడొకడు అధికారులకు రాసిన లేఖలో అనుమానం వ్యక్తం చేసాడు. 1857 జూలైలో జెస్సోర్ జిల్లా మెజిస్ట్రేట్, నాడియా డివిజన్ కమీషనర్‌కు లేఖ వ్రాస్తూ, ఫరాజీ నాయకుల వేషధారణ గల మౌల్వీలు, ప్రజలను తిరుగుబాటుకు ప్రేరేపిస్తున్నారని ("..very

much in the style of the ordinary preaching of the Farazi Moulvies..") వివరించాడు.

ఈ విషయం ఇలా వుండగా, ఫరాజీలు ప్రజలలో రగిల్చిన బ్రిటీష్ వ్యతిరేక జ్వాలల ప్రభావం వలన ఢాకా, ఫరీద్‌పూర్, దినాపూర్, బక్రాగంజ్, తదితర ప్రాంతాలను తిరుగుబాటుకు సారవంతమైన భూములుగా కంపెనీ పాలకులు భావించారు. అందుకు తగ్గట్టుగానే ఆ ప్రాంతాలలో ఫరాజీలు, తిరుగుబాటు వీరులతో చేతులు కలిపారు. ఈ విషయాన్ని ఆనాడు ఆధికారులకు వచ్చిన పలు ఆకాశరామన్న ఉత్తరాలు, నివేదికులు నిర్ధారణ చేస్తున్నాయి. ఈ తిరుగుబాటులలో దూదు మియా అల్లుడు కూడ పాల్గొనబోతున్నాడని, అందువలన దూదు మియా అనుచరులను, ఆయన అల్లుడిని ముందుగానే అరెస్టు చేయాల్సిందిగా కోరటం జరిగింది. ఫరీద్‌పూర్ జిల్లాకు దూదు మియా బంధువు, జమీందారు గురీబ్ హస్ చౌదరీ తన భవనంలో తుపాకులను తయారు చేసున్నాడనీ, బ్రిటీషర్ల మీద దాడులు చేయాలన్న ఉద్దేశ్యంతో ఆయుధాలు తయారీ ముమ్మరంగా సాగుతోందనీ, తిరుగుబాటు వీరులకు ఆయుధాలు అందజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మోలికొండ నివాసులైన ఆంగ్లేయులు ప్రభుత్వానికి రాసిన లేఖలో వివరించారు. ఈ సందర్భంగా ఆంగ్లేయుల జీవితాలకు ప్రమాదం ముంచుకు రావచ్చును, కనుక తగిన రక్షణ ఏర్పాట్లు చేయాల్సిందిగా లేఖలో కంపెనీ పాలకులను కోరారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి ఒకరు ఆనాటి పరిస్థితుల మీద ప్రభుత్వానికి ఒక నివేదిక పంపుతూ, ఫరాజీలు చీమల పుట్టలాగ పుట్టుకొస్తున్నారని (..a number not less than the swarms of ants..) తెలిపాడు. ఈ లేఖలు, నివేదికలను బట్టి ఆనాడు ఫరాజీల, ఫరాజీ నాయకుల మీద కంపెనీ పాలకులు, జమీందారులు, ఆంగ్లేయులు ఎంతటి నిఘా వుంచారో అర్థం అవుతుంది. ఫరాజీలు, ఫరాజీ సానుభూతిపరులు, మద్దతుదారుల మీద ఎంతటి నిఘా, నిర్బంధాలున్నా, దూదు మియాను చెరసాలలో కట్టడి చేసినా, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులకు వ్యతిరేకంగా, ప్రథమ స్వాతంత్ర్య సమరంలో ఫరాజీలు తమదైన పాత్రను నిర్వహించారు.

## దూదు మియా కన్నుమూత

**'...నిరుపేద చేనేత పనివారల కుటుంబంలో జన్మించి, పీడితుల కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అతిసాదా సీదా జీవితం గడుపుతూ, స్పష్టమైన సామాజిక, రాజకీయ తాత్త్విక ఆలోచనా సంపదతో, అపూర్వ ధైర్య సాహసాలతో ఆయన జరిపిన పోరాటాలు ఆయనను పేదవర్గాల ప్రియతమ పితామహునిగా, నేతగా ఆయా వర్గాల ప్రజల హృదయాలలో నిలిచిపోయేట్టుగా చేసాయి...'**, అంటూ ఆంగ్ల రచయిత డాక్టర్ జేమ్స్ దూదు మియాను శ్లాఘించాడు. జైలు నుండి విడుదల తరువాత ఫరీద్‌పూర్ వదిలేసి ఢాకాను స్థిరనివాసం చేసుకున్నారు. అప్పటి నుండి దూదు మియా అత్యధిక సమయాన్ని ధార్మిక విషయాలకు కేటాయించారు. ప్రజలకు **'...ప్రమాదకర సిద్ధాంతాలు...'** బోధిస్తున్నాడని, **'...చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తి...'** గా బ్రిటీష్ పాలకులచే దూషించబడిన దూదు మియా, ఫరాజీల ధార్మిక, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసారు. ఫరాజీల

ధార్మిక–తాత్త్విక సిద్ధాంతాలను సుదృఢం చేయడంలో విజయం సాధించారు. ఆయన సాధించిన జయ చిహ్నాలుగా ఈనాటికీ తూర్పు బెంగాల్ ప్రాంతాలలో ఫరాజీ సంప్రదాయాలను పాటించే జన సముదాయాలు మనకు దర్శనమిస్తారు. ఈనాటికీ హాజీ షరియతుల్లా, దూదు మియా ఆ జనుల హృదయాలలో నిలిచి పోయి ఉన్నారంటే, ఆ మహనీయుల ప్రభావం ప్రజల మీద ఎంతగా గాఢ ముద్ర వేసిందో అర్థం కాగలదు. నిరుపేద రైతాంగం ప్రతినిధిగా, అణిచివేతకు గురిఅవుతున్న ప్రజల ఆపద్బాంధవుడిగా, ఫరాజీల మహనాయకుడిగా ఖ్యాతిగాంచిన దూదు మియా 1859లో కంపెనీ పాలకులకు సమర్పించిన పత్రంలో తననొక సంస్కరణవాదిగా, ధార్మికవేత్తగా వర్ణించుకున్నా, సమకాలీన పరిస్థితులను విస్మరించకుండా, రాజకీయ ఆలోచనలను తన ప్రవచనాలలో రంగరించి, ఫరాజీ ఉద్యమం దశను దిశను మార్చి, సమరశీల పోరాట వీరులుగా ఫరాజీలను తీర్చిదిద్ది, కంపెనీ పాలకులకు కొరకరాని కొయ్యగా తయారై, జమీందారులకు, ప్లాంటర్లకు, పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేసి చరిత్రకారుల ప్రశంసలను అందుకున్నారు. ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ తారాచంద్‌చే **'...ఫిరంగీల పాలనను తుడిచి పెట్టి ఆ స్థానంలో ముస్లింల పాలనను పునఃస్థాపించాలని జీవితాంతం శ్రమించిన సమరశీల పోరాట యోధుడిగా...'** శ్లాఘించబడిన ఫరాజీ సూర్యుడు దూదు మియా 1860లో అస్తమించారు.

## నొయా మియా నాయకత్వం

ఫరాజీలను బలమైన శక్తిగా రూపొందించడంలో ఘన విజయం సాధించిన దూదు మియా అస్తమించిన తరువాత ఫరాజీల ప్రాబల్యం క్రమక్రమంగా క్షీణించసాగింది. ఈ పరిణామాలను ముందుగా ఊహించిన దూదు మియా దూర దృష్టితో ఫరాజీ ఉద్యమాన్ని పటిష్టంగా నిర్మించటం కోసం జీవితాంతం కృషి చేసారు. ఆయన త్యాగం వృధా పోలేదు. బ్రిటీషర్లు ఆశించినట్టు ఫరాజీల ప్రభావం తగ్గలేదు. 1860లో జరిగిన ఇండిగో రైతుల తిరుగుబాటుకు ఫరాజీలు నాయకత్వాన్ని అందించటంతోపాటుగా దానికి జవజీవాలయ్యారు. నాడియా, ముషీరాబాద్, షబ్నా తదితర ప్రాంతాలలో సాగిన పోరాటాలలో ఫరాజీల ప్రభావం అత్యధికమని, బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన **'ఇండిగో రైతుల తిరుగుబాటు విచారణ సమితి'** స్పష్టంగా పేర్కొంది. ఆ తరువాత జరిగిన తిరుగుబాట్లన్ని ఒకనాడు ఫరాజీల ప్రధాన కేంద్రాలుగా విలసిల్లిన ప్రాంతాలలోనే జరగటం గమనార్హం.

దూదు మియా కన్ను మూసిన కొంత కాలం తరువాత, ఆయన కుమారులు రంగంలోకి వచ్చారు. ఫరాజీల నాయకత్వం స్వీకరించారు. ప్రధానంగా ఆయన కుమారుడు నోయా మియా ( Noa Miya ) తన తండ్రి పాత్రను, బాధ్యతలను నిర్వహించారు. ఆయన నాయకత్వ పగ్గాలు చేపట్టిన తరువాత క్రమంగా ఫరాజీల ప్రభావం మళ్ళీ పుంజుకోసాగింది. తండ్రి మార్గదర్శక సూత్రాల ఆధారంగా నోయా మియా ఫరాజీల కార్యకలాపాలను పర్యవేక్షించసాగారు. ప్రజలలో పలుకుబడి గౌరవం పెరిగింది. దూదు మియా తరువాత తమను ఆదుకోవడానికి వచ్చిన నూతన ప్రవక్తగా ఫరాజీలు భావించి గౌరవించసాగారని, ఆయన మాటలను జవదాటని వేలాది అనుచరులను స్వల్పకాలంలోనే ఆయన సమకూర్చుకున్నారని, ఆంగ్ల అధికారులు తమ నివేదికలలో పేర్కొన్నారు. ఆనాటి పరిస్థితులను శ్రీ నవీన్ చంద్రసేన్ రాసిన Amar Jiban అను గ్రంథంలో నోయా మియా గురించి రాస్తూ,

**'...ఆయనను ఫరాజీలు తమ ధార్మిక – ప్రాపంచిక నాయకుడిగా పరిగణించారు. ఫరాజీల స్థావరాలలో ఆయన మాట వేద వాక్కు. చివరకు ఆయన రాజ్యంలో తనదైన రాజ్యాన్ని నడిపారు,** (" ..The Farazis considered him to be their temporal as well as spiritual leader. With in the Farazi strongholds his word was law. He had virtually established a state with in the state.." Amar Jiban (*in Begali*) By Nabin Chandra Sen) అని పేర్కొన్నారు.

ఈ విధంగా ఫరాజీల ఉద్యమాన్ని పటిష్టం చేస్తూ నొయా ముందుకు సాగారు. జమీందారుల, కంపెనీ అధికారుల అక్రమాలు, అన్యాయం ఎక్కడ జరిగిన అక్కడ ఫరాజీలు ఆయన మార్గదర్శకత్వంలో ప్రత్యక్షం కాసాగారు. 1869లో ధునియా మొన్నేహా పోలీసు ఠాణా పరిధిలోని టుర్నిహాట్ ప్రాంతంలో ఫరాజీలు ఆదాయపన్ను శాఖ అధికారి మీద దాడి చేసారు. అధికారి వద్ద వున్న గుమస్తా , ప్రజల పట్ల దుర్మార్గంగా వ్యవహరించినందున ఆగ్రహించిన చేనేత పనివారు, చేపలు పట్టేవారు అధికారి మీద, పోలీసుల మీద దాడి జరిపారు. ఈ విషయమై జరిగిన విచారణలో **' గుమస్తా అతిగా వ్యవహరించడం వలన దాడి జరిగిందని, అకారణంగా ఫరాజీలు ఈ దాడులకు పాల్పడలేదని '** విచారణ సంఘం పేర్కొనటం గమనార్హం .

అన్యాయం, అధర్మం, అక్రమం అణచివేతలకు వ్యతిరేకంగా మాత్రమే ఫరాజీలు దాడులను చేసారు. తిరుగుబాట్లు నిర్వహించారు. పోరాటాలు జరిపారు. న్యాయాన్ని, ధర్మాన్ని, నైతిక విలువలను గౌరవించారు. ఈ కారణంగానే ఫరాజీలు సాగించిన పలు పోరాటాలలో హిందువులు, క్రైస్తవులు కూడా వారితో భాగస్వాములయ్యారని ఫరాజీల పోరాటాల మీద న్యాయ విచారణలు జరిపిన ఆంగ్లేయాధికారుల సంఘాలు, న్యాయ స్థానాలు తమ నివేదికలో పేర్కొన్నాయి. ఈ విషయాలను ధృవీకరిస్తూ న్యాయస్థానాలలో ఫరాజీలు కానివారు, కంపెనీ పాలకులకు మద్దతుదార్లు కూడా సాక్ష్యం పలికారు. ఈ సంఘటనలు జరిగిన తరువాత ఫరాజీల ప్రాబల్యంగల ప్రాంతాలన్నింటిలో ఆయుధాల చట్టాలను అమలుచేసి, ఫరాజీల వద్దనున్న ఆయుధాలను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం కంపెనీ పాలకులకు కలిగింది. ప్రజాబలం పుష్కలంగా గల ఫరాజీలను నిలువరించడం కంపెనీ పాలకులకు సాధ్యం కాలేదు. నిబద్ధత, నియమబద్ధ జీవితం, పటిష్టమైన పాలనా వ్యవస్థ, అంతకంటే పటిష్టమైన యంత్రాంగం కారణంగా ఫరాజీలను పరాజితులను గావించటం కంపెనీ అధికారులకు దుస్సాధ్యమైంది.

## చిత్తయిన పాలకుల ఎత్తులు

ప్రజలలో క్రమంగా పెరుగుతున్న నోయా మియా ప్రాబల్యాన్ని తగ్గించేందుకు, పుంజుకుంటున్న ఫరాజీలను నిర్వీర్యం చేసేందుకు కంపెనీ పాలకులు, పాలకుల తొత్తులైన జమీందారులు, తమకు అలవాటైన **విభజించు-పాలించు** సూత్రాన్ని ప్రయోగించటం ప్రారంభించారు. కుట్రలు, కుయుక్తులకు శ్రీకారం చుట్టారు. ఆనాడు దూదు మియా మేనల్లుడు బనీ అమీర్ మియా (Bani Amir Miyan) ఫరాజీలలో బాగా పలుకుబడి సంపాదించుకొని బలమైన నాయకుడిగా ఎదిగారు. ఆయన నాయకత్వంలో పలు ప్రాంతాలలో ఫరాజీలు

తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఆయనకూ దూదు మియా కుమారులకు పలు విషయాలలో పొసగటం లేదు. ఈ బలహీనతను ఆసరాగా పరిస్థితులను తమకు అనుకూలంగా తిప్పుకోవాలని పాలక వర్గాలు ఎత్తులు వేసాయి.

1879లో బఖ్రా గంజ్ జిల్లాకు చెందిన జమీందారు గురుచరణ చక్రవర్తి, పన్నుల వసూలు విషయంలో తనకు ఫరాజీలు అడ్డుతగులుతూ, ఇబ్బందులు పెడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసాడు. ఆయన నిర్ణయించిన పన్నుకంటే అత్యధికంగా వసూలు చేస్తున్నందున పన్నును చెల్లించడానికి రైతులు నిరాకరించారు. ఆ ఫిర్యాదును పురస్కరించుకుని విచారణ జరపడానికి విచ్చేసిన అధికారి, సిబ్బందిలో కొందరు ప్రజలతో దురుసుగా వ్యవహరించటం వలన ఆగ్రహించిన ఫరాజీలు భారి ప్రదర్శన నిర్వహించడమే కాక, నిర్బంధించి వుంచిన రైతులను కూడా పోలీసుల ఠాణా నుండి విడుదల చేసుకొని తీసుకువెళ్ళారు. ఈ వ్యవహారం మీద విచారణ జరిపిన ఉన్నతాధికారులు, సిబ్బంది వ్యవహార సరళిని తప్పు పట్టారు. ఆశించిన విధంగా తమ పప్పులు ఉడకకపోవటంతో, స్థానిక పోలీసు ఆధికారులతో జమీందారు సమాలోచనలు జరిపి దూదు మియా తనయులకు, ఆయన మేనల్లుడు అమీర్ మియాల మధ్యనున్న మనస్పర్ధలను దృష్టిలో వుంచుకొని విభేదాలను మరింత తీవ్రతరం చేసి లబ్ది పొందాలని కుటిల యత్నం చేసాడు. స్వయంగా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని, ఎలాగైన అమీర్ ప్రాబల్యాన్ని తగ్గించాల్సిందిగా దూదు మియా తనయులను అతడు కోరాడు. ఈ కుయుక్తుల వెనుక గల వ్యక్తిగత స్వార్ధాన్ని, జమీందారు ఆంతర్యాన్ని గ్రహించిన దూదు మియా బిడ్డలు ఆ ప్రతిపాదనలను తుంగలో తొక్కి బాధితులైన రైతుల పక్షాన నిలిచారు. ఫరాజీలను విభజించి పబ్బం గడుపుకోవాలని కలలుగన్న జమీందారు ఎత్తులు పారలేదు. ఈ విధంగా పాలకులు కుట్రలకు, కుతంత్రాలకు పాల్బడినా ఫరాజీలను చీల్చలేకపోయారు.

## బలం పుంజుకున్న ఫరాజీలు

దూదు మియా హయాంలో బ్రిటీష్ అధికారులను తరిమి కొట్టినట్టుగానే రెండు దశాబ్దాల తరువాత ఆంగ్లేయ అధికారిని ఫరాజీలు తరిమికొట్టి, తమ శక్తి సామర్ధ్యాలు ఏమాత్రం క్షీణించ లేదని రుజువు చేసారు. 1872 జనవరి మాసంలో జనాభా లెక్కల సేకరణకు వచ్చిన అధికారి మన్రోను ఫరాజీలు నిరోధించి, తరిమికొట్టారు. ఆ సందర్భంగా **' మారో ఫిరంగీ '** నినాదంతో బ్రిటీషర్లను హడలగొట్టారు. ఈ నినాదం ఆనాడు ప్రతి ఫరాజీ నోటివెంట వెలువడటంతో, ఆ ప్రాంతాలలోని ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టాయి. ఫరాజీల ప్రాబల్యం గల ప్రాంతాలలో పర్యటించడానికి కూడా అధికారులు వెనుకాడారంటే, దూదు మియా వారసత్వం ఫరాజీ ఉద్యమాన్ని ఎంత బలోపేతం చేసిందో మనం అర్థం చేసుకోవచ్చు.

యువ నాయకుడు నోయా మియా పలుకుబడి బాగా పెరగటం, ఆయనకంటూ బలమైన అనుచరవర్గం ఏర్పడటంతో, ఆ నాడు దూదు మియా తీసుకున్న జమీందారు వ్యతిరేక చర్యలన్నీ మళ్ళీ ఊపందుకున్నాయి. ఫరీద్‌పూర్ జిల్లా నాజరాపారా జమీందారు అధిక మొత్తాల కోసం రైతులను వేధించటం ప్రారంభించాడు. ఆ వేధింపులను భరించలేక,

1879లో జమీందారు బాబు పూర్ణచంద్ర రాయ్ మీద ఫరాజీలు తిరుగుబాటు చేసారు. ఆ తిరుగుబాటును అణచివేయడానికి జమీందారు క్రూరంగా వ్యవహరించాడు. ఆ పరిస్థితులలో ఒక పథకం ప్రకారంగా ఫరాజీలు దాడి చేసి జమీందారును అంతంచేసి సంచలనం సృష్టించారు. ఈ చర్యతో ఆత్మస్థైర్యం పెరిగిన ఫరాజీలు మరింతగా విజృంభించారు. చరిత్ర పునరావృతమైంది. ఫరాజీలు మరింత బలపడి ప్రజావ్యతిరేక చర్యలన్నిటినీ ఎదుర్కొనసాగారు.

తూర్పు బెంగాల్‌లోని అనేక ప్రాంతాలలో ఫరాజీలు కార్మిక సంఘాల పద్ధతిలో బలపడసాగారు. సంఘంలోని ఏ ఒక వ్యక్తికి నష్టం జరిగినా, కష్టం వచ్చినా, అది అందరిదిగా భావించేవారు. సంప్రదాయక ధార్మిక సంఘాల స్థాయి నుండి కార్మికోద్యమానికి సారథ్యం వహించే కార్మిక సంఘాల స్వరూపాన్ని ఫరాజీలు సంతరించుకోవడం వలన ఫరాజీల ప్రభావం అధికమవుతుందని, ఆంగ్లేయ అధికారులు సమర్పించిన నివేదికలు పేర్కొన్నాయి. మాల్దా న్యాయమూర్తి 1870లో నిర్వహించిన విచారణ తరువాత తయారుచేసిన నివేదికలో, "... There is strong combination, like a trade union in England, among all villagers to resist the oppressions by all means legal and illegal ..." అని పేర్కొన్నాడు. పటిష్టమైన కార్మిక సంఘాలు అంతర్గతంగా తమలో తాము ఎంతటి గట్టి సంబంధాలను కలిగి ఉంటాయో అంతకంటే పటిష్టమైన సంబంధాలు కలిగి, ప్రతి ఒక్కరి సమస్యను తమ సమస్యగా ఫరాజీలు భావించారు. ఈ సోదర భావనే ప్రతికూల పరిస్థితులలో కూడా ఫరాజీలు బలం పుంజుకోవడానికి తోడ్పడింది. బలపడ్డ ఫరాజీలు ఫిరంగీల పాలనను అంతంచేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగినందున, ఆంగ్లేయ అధికారులు తమ నివేదికలో ఆ విషయాలను వివరంగా చర్చిస్తూ, ఫరాజీలకు స్పష్టమైన రాజకీయ లక్ష్యం ఉందన్నారు. రాజకీయ పార్టీ స్వరూపాన్ని ధార్మిక సంస్థ ముసుగులో ఫరాజీలు నిర్మించారని ప్రకటించారు.

ఫరాజీలు గణనీయమైన సంఖ్యలో గల ప్రాంతాలలో ఫరాజీ కాలనీలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కాలనీలను **'ఫరాజీ పరాస్'** (Farazi Paras) లని పిలిచేవారు. ఈ కేంద్రాల నుండే ఫరాజీలు తమ ప్రత్యేక అస్థిత్వాన్ని కాపాడుకున్నారు. ఫరాజీలు ధార్మిక, ఆర్థిక, రాజకీయరంగాలలో ప్రత్యేకతను చాటుకున్నా, రైతుల ఉమ్మడి సమస్యలు వచ్చినప్పుడు, ఇతర సాంఘిక జనసముదాయాలతో కలిసి పోరాటాలలో పాల్గొనటంతో, ఆయా వర్గాల ప్రేమాభిమానాలను చూరగొన్నారు.

స్వరూప-స్వభావాలలో ప్రత్యేకతలు నిలుపుకునేందుకు ధార్మిక, ఆచార సంప్రదాయాల విషయంలో కఠినంగా వ్యవహరించటం వలన, సాధారణ ముస్లిం జన సముదాయాల నుండి ఫరాటీలు వేరుపడిపోయారు. ఫరాజీల వ్యక్తిగత ఆచరణే ఇస్లామిక్ ఆచరణగా ప్రకటించి, అందుకు భిన్నంగా వ్యవహరించేవారు అసలు ముస్లింలు కారని దుమ్మెత్తిపోయటంతో సాధారణ ముస్లింలు కూడా మతపరంగా ఫరాజీలను అనుసరించ లేకపోయారు. ఫరాజీల ఉద్యమం ప్రధానంగా ధార్మిక ఆచారాలు, సంప్రదాయాలలో మార్పులు కోరుకుంటూ, **'శుద్ధ ఇస్లాం'** అనుసరణ ఆధారంగా ఉనికిలోకి వచ్చింది. ఈ రకమైన అభిప్రాయాలే ఫరాజీల సంఖ్య తామరతంపరగా పెరగడానికి తోడ్పడ్డాయి. ఈ ధార్మిక సూత్రాలు, కఠిన ఆచరణ ప్రధానశక్తిగా మారి ఫరాజీలకు ఆనాడు సహకరించాయి.

పలు ప్రత్యేకతలను సంతరించుకుని దృఢమైన సోదరభావం పెంపొందించుకున్న కారణంగా ఫరాజీలలో అద్భుతమైన ఐకమత్యం ఉనికిలోకి వచ్చింది. ఈ ఐకమత్యమే అంగబలం, అర్థబలం, ఆయుధబలం గల బ్రిటిషర్లను, బ్రిటీషర్ల తొత్తులను పలు పోరాటాలలో మట్టికరిపించింది.

ఈ విధంగా ఫరాజీలకు ప్రధానబలంగా మారిన ధార్మిక సిద్ధాంతాలు, ఆచరణలే ఫరాజీల ప్రధాన బలహీనతగా కూడా మారాయి. సామాన్య ప్రజలను ఆకట్టుకొవటంలో ఫరాజీలకు అవరోధాలెదురయ్యాయి. ఫరాజీలను సామాన్య ముస్లిం జనసముదాయాల నుండి వేరుచేసాయి. ధార్మికంగా సనాతన ముస్లింల నుండి ఫరాజీలు పూర్తి వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. తాము మాత్రమే అసలు సిసలైన ముస్లింలని ఫరాజీలు ప్రకటించుకుని, తమకు బలంగల ప్రాంతాలలోని ఇతర ముస్లింల పట్ల చిన్నచూపు చూడటం, తమ సంప్రదాయానికి చెందని ముస్లిం ప్రజానీకం పట్ల అనుచితంగా, అవమానకరంగా ప్రవర్తించటం ఫరాజీలకు నష్టదాయకమైంది.

## భారతీయ విప్లవకారులకు స్ఫూర్తి ప్రదాతలు

దార్మిక రంగంలో ఫరాజీల ప్రగతి ఎలా ఉన్నా, 19వ శతాబ్దాంతం వరకు అటు బ్రిటీషర్లను, ఇటు జమీందారులను ఎదుర్కొంటూ సింహాల్లా పోరాడి, రైతాంగ తిరుగుబాట్లను విజయవంతం చేయుటమేకాక, ప్రజలలో స్వేచ్ఛాకాంక్షను, స్వాతంత్ర్య భావాలను ఉద్దీపింపచేయడంలో ఫరాజీలు కృతకృత్యులయ్యారు. సుమారు అర్ధ శతాబ్దికి పైగా ఉధృతంగా సాగి, మరో అర్థశతాబ్ది పాటు సమాజాన్ని ప్రభావితం చేసిన ఫరాజీ ఉద్యమం చరిత్రలో ప్రముఖ స్థానం సంపాదించుకుంది. భూమి కోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం, ఫిరంగీల మీద సాయుధులై తిరగబడి, అనితరసాధ్యమైన ధైర్య సాహసాలతో భారత స్వాతంత్ర్య సంగ్రామంలోని విప్లవకారులందరికీ ఫరాజీలు స్ఫూర్తిదాయకమయ్యారు. బ్రిటీష్ దాస్య శృంఖలాల నుండి స్వేచ్ఛ కోసం సాగిన మహత్తర పోరాట చరిత్రలోనూ తమదైన ముద్రతో బలమైన స్థానాన్ని సొంతం చేసుకుని, ప్రజల హృదయాంతరాళాలలో ఫరాజీ యోధులు సజీవులుగా మిగిలిపోయారు. ◆

**4**

స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కలకలం రేపిన

# మోప్లా మొనగాళ్ళు

**1800 - 1922**

**భా**రత స్వాతంత్ర్యసమరంలో భాగంగా పలు ప్రాంతాలలో సాగిన రైతాంగ పోరాటాలు ప్రజానీకంలోని బలమైన స్వేచ్ఛా–స్వాతంత్ర భావనలకు ప్రతీకలుగా నిలిచాయి. ప్రాథమిక దశలో స్వదేశీ దొరబాబుల దోపిడీకి వ్యతిరేకంగా రైతులు, గ్రామీణ ప్రజలు తిరగబడ్డారు. ఈ దోపిడీ, పీడనకు ఆంగ్లేయుల పెత్తనమే మూలకారణమని గ్రహించిన బాధితులు తమ ఆగ్రహాస్త్రాలను ఫిరంగీల మీదకు మళ్ళించారు. ఈ తిరుగుబాట్లకు నేతృత్వం వహించిన వ్యక్తులు–శక్తులను బట్టి తిరుగుబాట్లు పలు రకాల రంగులు ధరించినప్పటికీ, దాదాపు అన్ని పోరాటాలకు ' **దోపిడీ – అణచివేత, బలమైన స్వేచ్ఛాకాంక్ష** ' లు ప్రధాన కారణమయ్యాయి.

భారతదేశ సామాజిక పరిస్థితుల కారణంగా, ఈ దేశంలోని ప్రతి పోరాటం వెనుక మతం, కులం, జాతి ఛాయలు ఉండటం గమనించవచ్చు. ప్రారంభంలో ఈ సామాజిక శక్తులు ప్రజలు సంఘటితం కావడానికి, పోరాట దిశగా నడవడానికి ప్రధాన చోదకశక్తులుగా పనిచేసాయి. ఈ శక్తుల ప్రాబల్యం వలన తిరుగుబాట్లు పలుమార్లు దశలను, దిశలను మార్చుకున్నాయి. తిరుగుబాట్లు పరిపక్వత పొందే సమయానికి ప్రజానీకాన్ని సంఘటిత పరచడానికి, విజయోన్ముఖంగా ముందుకు సాగడానికి ప్రేరణగా నిలబడటానికి కారణాలు ఆర్థిక, సాంఘిక, రాజకీయపరమైనవి మాత్రమేనని ఈ పోరాటాల చరిత్ర పలుమార్లు స్పష్టం చేసింది.

18వ శతాబ్దంలో బెంగాల్‌లో బ్రిటీషర్ల మీద ఫకీర్లు–సన్యాసుల తిరుగుబాటు ప్రారంభమైనప్పటి నుండి 20వ శతాబ్దం నాటి తెలంగాణా రైతాంగ పోరాటం వరకు పలు పోరాటాలు జరిగాయి. ప్రముఖ చరిత్రకారుడు **కాతవిగాన్** భారతదేశంలో ప్రధానంగా 75 తిరుగుబాట్లు జరిగాయని పేర్కొన్నాడు. అందులో ఏడు తిరుగుబాట్లు అతి ప్రధానమైనవన్నాడు. ఆ ఏడు తిరుగుబాట్లలో మలబారు మోప్లాల పోరాటం చరిత్రలో ప్రముఖ స్థానం పొందింది.

భారత స్వాతంత్ర్యోద్యమంలో మలబారు మోప్లాలు అపూర్వ త్యాగాలతో, అసమాన ధైర్యసాహసాలతో బ్రిటీషర్లను ఎదుర్కొని ప్రత్యేకతను నిలుపుకున్నారు. శతాబ్దానికి పైగా సాగిన మోప్లాల పోరాటం, అంతిమంగా 1818-21లో ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా ప్రదర్శించిన ఉద్యమస్ఫూర్తి, సాహసం, పాలకవర్గాల వ్యతిరేకత అజరామర ఖ్యాతిని గడించిపెట్టింది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత, బ్రిటీషర్ల పాలనకు వ్యతిరేకంగా మోప్లాల పోరాటం తీవ్రస్థాయిలో సాగిందని, మోప్లాల తిరుగుబాటు మీద ప్రత్యేక పరిశోధన జరిపిన బ్రిటీష్ చరిత్రకారుడు Prof.Conrad Wood ("...there was staged the most serious rebellion against British rule in India since the Great Mutiny of 1867-58..." -THE MOPLAH REBELLION AND ITS GENESIS, PPH, 1987) ప్రశంసించాడు.

## మోప్లాలు ఎవరు ?

ఇస్లాం ప్రథమంగా కేరళ రాష్ట్రంలోని మలబారు తీర ప్రాంతం నుండి దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించింది. అరేబియా దేశాల నుండి వచ్చిన ముస్లిం వర్తకులు, మలబార్ ప్రాంతానికి చెందిన మహిళలను వివాహం చేసుకున్నారు. ఆ విధంగా ఏర్పడిన వివాహ సంబంధంతో స్థానిక స్త్రీలను, అరేబియాకు చెందిన పురుషులకు కలిగిన సంతానాన్ని **మోప్లాలు** (MOPLAH) **మోపిల్లాలు** (MOPILLA) అన్నారు. ' **మోప్లా** ' లేక ' **మోపిల్లా** ' అను పదంలో ' **మహా . పిల్లా** ' కలసి ఉన్నాయి. మహా అంటే గొప్ప, పిల్ల అంటే బిడ్డ అని మలయాళ భాషలో అర్థం. పరదేశమైన అరేబియా నుండి వచ్చిన వర్తకులు నీతిగా, నిజాయితీగా వ్యవహరించటం, సంపన్నులుగా కన్పించటం వలన, స్థానికులు వారిని అతిథులుగా ఆహ్వానించి గౌరవించారు. అటువంటి గొప్పవారి సంతానం కనుక మహా (గొప్ప) + పిల్లా (పిల్లలు) = మహాపిల్లా అన్నారని, క్రమానుగతంగా ఆ పదం కాస్తా మోప్లా, మోపిల్లాగా మారిందని చరిత్రకారులు వివరించారు. ( DEVELOPMENT OF THEOLOGY AMONG MOPILLA MUSLIMS, Eassy by Mr. George Koovackal ). ' **మోప్లా** ' అంటే మరొక అర్థం ఉంది. మాపిల్లా అంటే మహాగణకుడని, రాయసగాడని అర్థం. అరేబియా నుండి వచ్చిన వర్తకులు, గణితంలో ప్రవీణులు కనుక ఆ ప్రవీణుల బిడ్డలు కూడా గణితంలో ప్రావీణ్యత సంపాదించారని అందువలన వారిని మోప్లాలని పిలిచారని అంటున్నారు. అన్ని భాషలలో ' **మా** ' అంటే ' **అమ్మ** ' అను అర్థం కనుక, స్థానిక తల్లి ద్వారా గుర్తింపు పొందిన పిల్లలైనందున, మోప్లాలు అంటే తల్లికి చెందిన బిడ్డలని అర్థం చెబుతున్నారు.

మోప్లాలు వర్తక-వ్యాపారుల సంతతికి చెందిన వారైనప్పటికి, స్థానిక వాతావరణం, భౌతిక, నైసర్గిక స్వరూప స్వభావాల దృష్ట్యా ప్రధానంగా వ్యవసాయ దారులు, భూమిని నమ్ముకుని జీవనోపాధి చూసుకుంటున్న కష్టజీవులు, భూమి ఆధారిత ఉత్పత్తులను, సంబంధిత ఇతర వస్తువులను తయారుచేసి, క్రయవిక్రయాల ద్వారా పొట్టపోసుకునే శ్రమజీవులు. మలబారు ప్రాంతంలో అత్యధిక శాతం మోప్లాలు భూకామందులు కారు. భూమిని సంపాదించుకునే అవకాశం లేని నిర్భాగ్యులు. ఆరుకాలాలు శ్రమించి పని చేసినా, తమ

ఘర్మజలం చిందిన నేల మీద ఎటువంటి హక్కులు పొందలేని అభాగ్యులు. బ్రతుకంతా భూకామందుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి, పంట పండినా పండకపోయినా, తాము తిన్నా తినకపోయినా, భూస్వాముల గాదెలు నింపుతూ, అర్ధాకలితో జీవితాలు గడిపే అన్నార్తులు. పంట పండక కౌలు చెల్లించలేని పరిస్థితులు ఎదురైతే, తమ కుటుంబ సభ్యులను భూకామందు వద్ద వెట్టి కుదిర్చి, కౌలు తీర్చే నిజాయతీపరులు. ఏ రోజుకా రోజు పనిని వెతుక్కుని లభించిన డబ్బుతో కుటుంబాలను పోషించుకునే కూలీలు. పని ఉంటే పండగ, లేకుంటే పస్తులతో కాలం గడిపే సామాన్యులు. భూకామందు కౌలు చెల్లింపు కోసం, కుటుంబ బాధ్యతల నిర్వహణ కోసం అప్పులు-సొప్పులు చేయడం, అధిక వడ్డీల చెల్లింపు కోసం మళ్ళీ అప్పులు చేయాల్సిన ఆగత్యం వలన వడ్డీల ఊబిలో చిక్కుకుపోయి,వడ్డీ వ్యాపారుల విష కౌగిలికి బలవుతున్న రుణగ్రస్తులు. భూకామందుల, మధ్య దళారీల చేతుల్లో దోపిడీకి గురవుతున్న బాధాసర్పదృష్టులు. సమస్యల సుడిగుండంలో పడి ఊపిరాడక సతమతమవుతూ ఉన్నప్పటికీ ఆదుకునే నాధుడు లేక, సహాయపడే శక్తులు లేక, వ్యక్తులు రాక నిరాశ నిస్పృహలతో ఎవడో వస్తాడని, ఏదో చేస్తాడని ఎదురు చూపులతో కాలం గడిపే అనాధలు. భూకామందుల, మధ్య దళారీల అవసరాలు తీర్చుతూ, అన్నిరకాల దోపిడీలకు బలవుతూ, భారంగా జీవితాలు గడిపే ప్రజానీకం మలబారు మోప్లాలు. భూస్వాముల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి, చాకిరీ చేసుకుంటూ, భూస్వాములు అడిగినంత పంట భాగం సమర్పించుకుంటూ, భూస్వాముల ఇళ్ళల్లో పండగలు-పబ్బాలు, ఉత్సవాలు, సంబరాలు జరిగినప్పుడు, ఖర్చులకుగాను తమకున్నా లేకున్నా కామందు అడిగినంత సమర్పించుకుంటూ, అణిగిమణిగి ఉండటం ఆ రైతాంగం నిత్యకృత్యమైంది.

ఈ పరిస్థితులు సామాన్య ప్రజానీకంలో భాగమైన మోప్లాల భూసంబంధాలు, ఆర్థిక స్థితిగతులకు అద్దం పడతాయి. భూమి మీద హక్కులు గల ఆసామిని, భూస్వామిని **'జెన్మ్ లేక జెన్మి'** (JENM or JENMI) అని పిలుస్తారు. చిన్న రైతులను, కౌలుదారులను, ఉప కౌలుదారులను **'పట్టక్కారన్'** (PATTAKKARANS) అంటారు. భూముల మీద పర్యవేక్షణ జరిపేందుకు భూస్వామి నియమించిన ప్రతినిధిని **'కనక్కురన్'** (KANAKKARAN) అని పిలుస్తారు. ఈ కనక్కురన్‌ను **'అధిగారి'** (ADHI-GARI) అని కూడా పిలవడం కద్దు. మలబారు ప్రాంతంలో భూసంబంధాలు ప్రధానంగా ఈ ముగ్గురి చుట్టూ తిరుగుతుంటాయి. జెన్మి ఎన్నడూ తమ భూములలో కాలు పెట్టనప్పటికీ, భూములు ఎక్కడ ఎంత ఉన్నాయో తెలియనప్పటికీ, పండిన పంట మాత్రం జెన్మి గాదెలకు చేరుతుంటాయి. ఈ బాధ్యతలను నెరవేర్చేవాడు కనక్కురన్. జెన్మికి అనుకూలంగా వ్యవహరిస్తూ జెన్మిల నుండి రాయితీలు సంపాదించేవాడు. ఒక రకంగా జెన్మిల ప్రతినిధిగా వ్యవహరించేవాడు. కనుక్కరన్ జెన్మిల నుండి భూమిని కౌలుకు తీసుకునేవాడు.

## ఫిరంగీల రాకకు పూర్వ స్థితి

మైసూరు పులి టిపూ సుల్తాన్ 1782లో మలబారు ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో అంతర్భాగం చేసుకున్నాడు. మైసూరు పాలకులు కేంద్రీకృత అధికార వ్యవస్థను పటిష్టం

చేయాలనుకున్నారు. మలబారు ప్రాంతంలోని నాయర్‌ల ఆధిపత్యానికి గండికొట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రాంతపు రాజుల పెత్తనానికి స్వస్తి పలకాలని, రాజుల సైన్యంలో ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చిన నాయర్‌ల, నంబియార్‌ల ఆధిపత్యానికి గండికొట్టి ఆ ప్రాంతాన్ని పూర్తిగా మైసూరు రాజ్యం కనుసన్నలలో ఉంచాలనుకున్నారు. సైన్యం పూర్తిగా రాజు ఆధీనంలో ఉండాలని భావించారు. అందుకు అనుగుణంగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక, రెవిన్యూ సంస్కరణలను అమలులోకి తెచ్చారు.

టిపూ మలబారును హస్తగతం చేసుకోగానే అప్పటివరకు అమలులో ఉన్న జెన్మి, పట్టక్కారన్, కనక్కురన్ భూసంబంధాలను ధ్వంసం చేసాడు. దున్నేవాడిదే భూమి ప్రాతిపదికగా పట్టకారన్‌లకు ( రైతులు) అనుకూలంగా సంస్కరణలను చేపట్టాడు. మలబారు ప్రాంతం అప్పటివరకు ఎరుగని విప్లవాత్మక భూసంస్కరణలను అమలుచేసాడు. భూస్వాముల ఆధిపత్యానికి గండికొడుతూ, దుక్కి దున్ని పంట పండించేవాడిదే భూమన్నాడు. అందుకుగాను పండిన పంటలో నిర్ణీత భాగాన్ని రాజుకు చెల్లించాలని నిబంధన విధించాడు. పంటలో భాగం చెల్లిస్తే చాలు, ఆ భూమిని ఎవరు దుక్కి దున్ని, నారు వేసి, కోత కోస్తారో అతను ఆ భూమికి అసామి అన్నాడు. రైతు పంటభాగాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తున్నంత కాలం, ఆ భూమి నుండి రైతును తొలగించడానికి రాజుకు కూడా హక్కు ఉండదని ప్రకటించాడు. వ్యయసాయాభివృద్ధికి ప్రభుత్వ ఖజానా నుండి రైతుకు రుణాలను అందచేశాడు. విత్తనాలు అందచేశాడు. అధిక పంటలు పండించమని ప్రోత్సహించాడు.

ఈ విప్లవాత్మక మార్పులవలన భూమి మీద భూకామందుల పట్టు సడలింది. టిపూ అనుసరించిన రైతు అనుకూల విధానాలు భూస్వాముల పెత్తనాన్ని దారుణంగా దెబ్బతీసాయి. ఎటువంటి శ్రమా చేయకుండా విలాసవంతమైన రాజప్రాసాదాలలో కూర్చొని తింటూ, వేలాది ఎకరాల భూమిని గుప్పెట్లో ఉంచుకున్న భూస్వాములకు ఈ పరిస్థితులు మింగుడు పడలేదు. దుక్కి దున్ని, నారు పోసి, నీరు పెట్టి, పైరును కాపాడుకుంటూ, కోతకోసి కష్టపడే రైతు కుటుంబాల జీవితాలను తమ ఇష్టానుసారంగా మలుపులు తిప్పగలిగిన సత్తాతో విర్రవీగిన జెన్మిలు, టిపూ సంస్కరణలను సహించలేక కుతకుతలాడిపోయారు. అనువుకాని చోట అధికులమనరాదంటూ మిన్నకుండిపోయారు. ఈ సంస్కరణల పర్యవసానంగా ఏర్పడిన నూతన భూసంబంధాల పరిణామాలకు కలవరపడిన భూస్వాములు, ధనిక సంపన్న వర్గాలు, పొరుగున ఉన్న ట్రావన్‌కోర్ ప్రభువు శరణు జొచ్చారు.

ఈ వాతావరణంలో మోప్లా రైతు జీవన పరిస్థితులలో పెనుమార్పులు సంభవించాయి. మోప్లాల ఆర్థిక స్థితిగతులలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. పంట పొలాలలో కాయకష్టం చేసుకుంటూ భారంగా బ్రతుకులీడ్చుతున్న రైతాంగం జీవితాలలో సంతోషదాయకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గతకాలపు కష్టాల నుండి గట్టెక్కి ముక్కో-చెక్కో, ఎంతో కొంత భూమి తమకు లభించినందుకు రైతాంగం ఆనందించసాగింది. ఈ రకంగా ఆర్థిక పరిస్థితులలో వచ్చిన మార్పులు సామాన్య ప్రజలలో చైతన్యానికి కారణమయ్యాయి.

## కల్లలైన కలలు

బడుగు వర్గాలకు చెందిన రైతన్నకు ఊహించని విధంగా లభించిన అవకాశంతో కలిగిన ఆనందం, ఎంతో కాలం నిలవలేదు. టిపూ తీసుకున్న నిర్ణయాల ఫలితంగా, రైతు అనుకూల మార్పులు స్థిరీకరణపొంది రైతు జనజీవితాలలో శాశ్వత మార్పులు చోటు చేసుకునేలోగా, టిపూ పాలన అస్తమించింది. టిపూ సంస్కరణల మూలంగా భూములతో పాటుగా కోల్పోయిన పలుకుబడి, పెత్తనాన్ని, తిరిగి హస్తగతం చేసుకునేందుకు గోతికాడి నక్కల్లా భూస్వామ్య శక్తులు ఎదురు చూడసాగాయి. అన్ని రకాల ఆధిపత్యాలకు కారణమైన భూములను స్వంతం చేసుకునేందుకు ఆతృత పడసాగాయి. పూర్వవైభవాన్ని కోల్పోయి అవమాన భారంతో రగిలిపోతున్న శక్తులకు, టిపూ పరాజయం ఉపశమనం కలిగించి పూర్వ వైభవాన్ని సంతరించి పెట్టగలదన్న ఆలోచన పెరిగింది. ఆ ఆలోచనల పర్యవసానంగా పరాయి పాలకుల పంచన చేరి, టిపూను పరాజితుడ్ని చేసేందుకు విభీషణ పాత్రను నిర్వహించ పూనుకున్నాయి. పరాయి పాలకుల పాదాక్రాంతులై, స్వదేశీ పాలకుడైన టిపూను పూర్తిగా దెబ్బతీయడానికి ఎదురు చూడసాగాయి.

1792లో ఈస్ట్ ఇండియా కంపెనీతో సాగిన యుద్ధంలో టిపూ పరాజితుడయ్యాడు. ఆ సమయంలో భూస్వాములు, ఉన్నత వర్గాల, వర్ణాలకు చెందిన శక్తులు, వ్యక్తులు ఏకమై కంపెనీ పాలకులకు తోడ్పాటు అందించారు. యుద్ధంలో ఓడిపోయిన టిపూ, మలబారును ఈస్ట్ ఇండియా కంపెనీకి ధారాదత్తం చేయాల్సి వచ్చింది. మలబారు ప్రాంతంలోని ఒక్క వేనాడు తప్ప మిగతా ప్రాంతాలను టిపూ బ్రిటీషర్లకు కోల్పోయాడు. ఆ తరువాత జరిగిన యుద్ధాలు టిపూకు నష్టదాయకంగా పరిణమించాయి. చివరకు 1799లో శ్రీరంగపట్నం వద్ద జరిగిన నాల్గవ మైసూరు యుద్ధంలో టిపూ అమరత్వం పొందాడు.

టిపూ మరణంతో వేనాడు ప్రాంతంతో సహా మలబారు ఉత్తర దక్షిణ ప్రాంతాలు కూడా ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన క్రిందకు వచ్చేశాయి. అధికారం చేపట్టగానే టిపూ సుల్తాన్ రెవిన్యూ సంస్కరణలను కంపెనీ పాలకులు తిరగతోడటం ప్రారంభించారు. మలబారును తమ ఆధీనంలో ఉంచుకునేందుకు, ఆయా ప్రాంతాల సంస్థానాధీశుల నుండి ఎటువంటి ప్రతిఘటనలు లేకుండా చూసుకునేందుకు, మలబారులోని భూస్వాములను మంచి చేసుకునేందుకు ప్రయత్నించారు. రెవిన్యూ మీదనే సదా కన్నువేసే బ్రిటీషర్లు, భూముల మీద పెత్తనం జెన్మిలకు అప్పగించి రెవిన్యూను మాత్రం తమ ఖజానాలకు చేర్పించే పద్ధతులకు శ్రీకారం చుట్టారు. కంపెనీ అధికారులను మంచి చేసుకుని తమ భూములతో పాటుగా వైభవ ప్రాభవాలను కూడా తిరిగి సాధించుకోవాలనుకున్న జెన్మిలు, భూస్వాములు ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. టిపూ సంస్కరణల వలన నష్టపోయిన జెన్మిలను కంపెనీ పాలకులు చేరదీసారు.

## ప్రతిఘటనను రగిలించిన కంపెనీ చర్యలు

టిపూ మీద సాధించిన విజయానికి సహాయం చేసిన భూస్వాములకు, రాజాలకు, సామాజిక పెత్తందారులకు తాయిలాలుగా మలబారు ప్రాంతపు భూములన్నిటినీ ఈస్ట్

ఇండియా కంపెనీ ధారాదత్తం చేసింది. ఆ భూములన్నిటికీ జెన్మిలను ఆసాములుగా ప్రకటించింది. కంపెనీ నిర్ణయించిన మేరకు రెవిన్యూ మొత్తాలను ఖజానాకు జమచేస్తే చాలు, భూముల వ్యవహారాలలో ఎటువంటి జోక్యం చేసుకునేది లేదని ప్రకటించింది. టిపూ పాలనాకాలంలో ట్రావన్‌కోర్‌కు వలస వెళ్ళిన భూకామందులను తిరిగి తమ స్వస్థలాలకు ఆహ్వానించింది. బ్రిటిషర్ల అండదండలతో జెన్మిలు తమ ప్రాంతాలకు తిరిగి వచ్చారు. మోప్లా రైతుల అధీనంలోనున్న భూములను చేజిక్కించుకున్నారు. సామాన్య మోప్లా రైతుల మీద కక్షగట్టి, కసి తీర్చుకోవడం ప్రారంభించారు. తమకు జోహుకూం అన్నవారికి, అనుకూలంగా ఉన్నవారికి సేద్యం చేసేందుకు భూములను కౌలుకు ఇచ్చారు. గతంలో తమ పెత్తనాన్ని, కంపెనీ అధికారులను ప్రతిఘటించిన వాళ్ళను, టిపూకు సహకరించిన కుటుంబీకులను భూముల నుండి వెళ్ళగొట్టారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాలు రైతు కూలీలుగా మారాయి. మలబారు మోప్లాలు ప్రధానంగా వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నవారు కనుక, కంపెనీ పాలకుల వత్తాసుతో జెన్మిలు తీసుకున్న చర్యల వలన భూములను కోల్పోయి, గతకాలపు దుర్భర పరిస్థితులలోకి మోప్లాలు జారిపోవాల్సి వచ్చింది.

ఈ వాతావరణానికి తోడుగా, తమను ఆదుకున్న బ్రిటీష్ అధికారుల పట్ల కృతజ్ఞతాభావంతో భూకామందులు వ్యవహరించసాగారు. కంపెనీ అధికారులను అన్ని విధాల సంతృప్తిపర్చడానికి, విలాసవంతమైన జీవితాల కోసం అవసరమైన ధనధాన్యాలను రైతుల నుండి రాబట్టుకోవటం ప్రారంభించారు. రైతుల కష్టాన్ని దోచుకోవడం ఆరంభమైంది. జెన్మిల అంతులేని ఈ పెత్తందారీతనం, పీడన, దోపిడీ విధానాలు రైతుకు, భూకామందుకు, మధ్యదళారీలకు మధ్య గల సంబంధాలు విషమయం చేశాయి. ప్రధానంగా యజమానికి, రైతుకు మధ్యన తీవ్ర సంక్షోభ పరిస్థితులను సృష్టించాయి. ఈ పరిణామాల మూలంగా భూమి మీద ఆధారపడుతున్న ఇరుపక్షాలు క్రమంగా శత్రువులుగా మారిపోయాయి. ఈ వైరి వర్గాలలో భూకామందుకు ధనబలంతో పాటుగా, ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా అనుకూలంగా ఉండటంతో వారిదే పైచేయి అయ్యింది. ఈ విషయాన్ని KERALA MUSLIMS ( A HIstorical Perspective ) , Ajanta Publications, 1995 గ్రంథంలోని Reflections on Muppila Heritage వ్యాసకర్త Mr. N.P. Ahamed , "...After the defeat of Tipu, the policy of East India Company of giving back the jenmi rightsto Hindu landlords added fuel to the fire. The result was conflict between land owner and the landless...", అని పేర్కొన్నాడు.

## జెన్మిల జులుం

బ్రిటీషర్ల దయతో భూములను స్వాధీనం చేసుకున్న భూకామందులు విజృంభించారు. కంపెనీ పాలకులు కూడా రెవిన్యూ విధానాలను జెన్మిలకు అనుకూలంగా మార్చడంతో జెన్మిల ఇష్టారాజ్యానికి అంతులేకుండా పోయింది. సర్వహక్కులను సంప్రాప్తించుకున్న జెన్మిలు, కౌలును ఇష్టానుసారంగా పెంచివేసారు. పంట రూపంలో కాకుండా నగదు రూపంలో కౌలును చెల్లించాలని పట్టుపట్టారు. పంటను తామే కొనుగోలు చేస్తూ, తక్కువ ధరలకు పంటను బలవంతంగా స్వాధీనం చేసుకోసాగారు. ఈస్ట్ ఇండియా

కంపెనీ నిర్ణయించిన పన్నులను కాకుండా పలు రకాల నూతన పన్నులను విధించారు. ఊపిరి పీల్చుకోలేని విధంగా 52 రకాల పన్నులను అటు కంపెనీకి గాని, ఇటు జెన్మికి గాని రైతులు చెల్లించాల్సి వచ్చింది. ఈ రకమైన ఆర్థిక దోపిడీకి తోడుగా రైతులను భూమి నుండి తొలగించేందుకు జెన్మిలు అక్రమాలకు పాల్పడసాగారు. అర్థాంతరంగా, అకారణంగా పెంచిన కౌలును ఇవ్వలేకపోయిన రైతు నుండి భూమిని బలవంతంగా లాక్కోవడం పరిపాటయ్యింది. జెన్మి కోరినంత పంట భాగం సమర్పించకుంటే నిర్దాక్షిణ్యంగా రైతులను భూమి నుండి గెంటివేయటం నిత్యకృత్యమైంది. కౌలు భూమి ఎంతకాలం తన అధీనంలో ఉంటుందో తెలియని వాతావరణంలో, **'బాంచన్ దొరా'** అంటూ రైతులు భారంగా బ్రతుకు సాగించాల్సిన పరిస్థితులు దాపురించాయి. కంపెనీ అధికారులను, పోలీసులను, రకరకాలుగా సంతృప్తిపర్చడం వలన, న్యాయాన్యాయాలతో పనిలేకుండా అధికారులు, న్యాయాధికారులు జెన్మిలకు అనుకూలంగా వ్యవహరించసాగారు. కోర్టు కేసులు, పోలీసు వేధింపుల మూలంగా, కుటుంబానికి తిండి పెట్టడమే పెనుభారంగా మారటంతో, రైతు పరిస్థితి దారుణమైపోయింది. ప్రభుత్వం, చట్టాలు, పోలీసులు, న్యాయస్థానాలు, అధికారులు కలసికట్టుగా జెన్మిల పక్షం వహించటం వలన రైతులకు న్యాయం దుస్సాధ్యమైంది. అన్యాయం, అధర్మం, అంతులేని పీడన మోప్లా రైతుల ముంగిట్లో వికృత నృత్యం చేయనారంభించాయి.

ఈ పరిస్థితులు మోప్లాలను నిరసన స్థాయి నుండి తిరుగుబాటుకు, ప్రతిఘటనకు ప్రేరేపించాయి. ఆ కారణంగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాల్సి వచ్చింది. తిరుగుబాటు బాటను ఎన్నుకోవాల్సి వచ్చింది. ఆ పరిస్థితులను మలబారు మేజిస్ట్రేట్ H.V. CONOLLY కంపెనీకి పంపిన తన నివేదికలో ఈ విధంగా వివరించాడు. "... The most ready supposition on hearing of such atrocities committed by the lower on the higher ranks of society is that the people have driven to desperation and force to take the law into their own hands by some intolerable tyranny...".

## తిరుగుబాటు ప్రారంభం

భూస్వాముల కక్ష సాధింపు చర్యలు అత్యధికమయ్యాయి. జెన్మిలే కాకుండా, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, అధికారులు రైతుల మీద పెత్తందారులయ్యారు. జెన్మిలకు పంట భాగం వసూలు చేసిపెట్టే మధ్యదళారుల జులుం మితిమీరింది. పంట భాగం అందించినా, రసీదు ఇవ్వకపోవటం, చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ మొత్తంలో పన్నులు వసూలు చేయడం జరిగేది. రసీదులు ఇవ్వకుండా సరిపెట్టి, పన్ను ఎగవేసాడని ఆరోపించి, రైతు మీద కేసు వేసి కౌలు భూములను బలవంతంగా లాక్కోవటం లాంటి కుయుక్తులకు మధ్య దళారులు పాల్పడసాగారు. కౌలు వసూలుకు వెడితే హింసకు దిగారని అసత్య ఆరోపణలు చేసి, తమకు వత్తాసుదారులైన పోలీసుల చేత రైతుల మీద కేసులు నమోదు చేయించి, కటకటాలలో బంధించి కుళ్ళబొడవటం నిత్యకృత్యమయ్యాయి. పంట భాగాన్ని బలవంతంగా వసూలు చేసుకోవటం తప్ప, మిగతా విషయాలు పట్టని జెన్మిలు రైతుల కడగండ్లను పట్టించుకోకుండా కిరాతకంగా వ్యవహరిస్తూ, తమ బలగాలను రైతు కుటుంబాల మీదకు పంపి నానా బీభత్సం సృష్టించి, భయభ్రాంతులు చేయసాగారు.

ఈ రాక్షస చర్యలను మోప్లాలు సహించలేకపోయారు. స్వదేశీ పాలకుల నిరంకుశత్వాన్ని, పరాయి పాలకుల పెత్తనాన్ని భరించలేక మోప్లా రైతు తొలిసారిగా 1802లో తిరుగుబాటుకు శ్రీకారం చుట్టినట్టుగా Prof. Conrad Wood, Prof. Roland E. Miller లు పేర్కొన్నారు. టిపూ పాలన అంతరించిన మూడు సంవత్సరాలలో మోప్లా రైతులు తిరుగుబాటు తత్త్వాన్ని ప్రదర్శించారు. భూస్వాముల మీద ప్రారంభమైన తిరుగుబాటు, భూస్వాములకు అండదండగా ముందుకు వచ్చిన భూస్వాముల మద్దతుదారులు, బ్రిటీష్ పోలీసులు, న్యాయస్థానాలు, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, చివరకు బ్రిటీష్ సైనికులు, అధికారులు మోప్లా రైతుల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వచ్చింది.

ఒకవైపు ఈస్ట్ ఇండియా కంపెనీ, మరోవైపు జెన్మిలు, జెన్మిల ఏజెంట్లు, ఇంకో వైపున వడ్డీ వ్యాపారుల దోపిడి భరించలేకపోయిన మోప్లా రైతు, ప్రారంభ దశలో వ్యక్తిగతంగా నిరసన వ్యక్తం చేసాడు. ఆ పరిణామాన్ని కూడా సహించలేని భూస్వాముల పెత్తందారి మనస్తత్వం, ఆ నిరసనను కఠినాతికఠినంగా అణచివేసింది. ఆ అణిచివేత చర్యల నుండే తిరుగుబాటు వేళ్ళూనుకుంది. మోప్లా రైతులందరి సమస్యలు ఒకేరకం కావటం, సమస్యలు తెచ్చిపెట్టిన వ్యక్తులు-శక్తులు ఒక్కరే కావటంతో సమస్యల పరిష్కారం కోసం కలిసి కట్టుగా ఐక్యపోరుకు మోప్లా రైతులు సమాయత్తమయ్యారు. వ్యక్తిగత పోరాటం క్రమక్రమంగా ఉమ్మడి పోరుగా ఎప్పటి నుండి పరిణామం చెందిందో, అప్పటి నుండి మోప్లా రైతుల తిరుగుబాటు స్వరూపస్వభావాలు మారిపోయాయి.

భూ సమస్య మీద జమోరిన్ రాజులతో పోరాటాలు చేసి, విజయాలు సాధించిన దక్షిణ మలబారు మోప్లాలు 1800 జనవరిలో తొలిసారిగా కంపెనీ ఆజ్ఞలను ఉల్లంఘించారు. ఆ తిరుగుబాటులో రైతులు ప్రభుత్వ కార్యాలయాన్ని విధ్వంసం చేసారు. బ్రిటీష్ అధికారి GEORGE WADELL ను హత్యచేసారు. ఈ సంఘటన తరువాత ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు తిరుగుబాటు వ్యవహారాన్ని ఆదిలోనే తుడిచి వేయాలని క్రూరంగా ప్రవర్తించారు. ఆనాటి తిరుగుబాటు రైతులకు నాయకత్వం వహించిన మోప్లా నాయకులు ఉన్నిముత్తు, అతన్ గురిక్కల్, చెంబాన్ పోకర్‌లను కంపెనీ బలగాలు కాల్చి వేశాయి.

ఈ చర్యతో తొలినాటి తిరుగుబాటు అంతమైంది. అధికారులకు అది అంతం కాదు ఆరంభం అని తెలియదు. ఆ విధంగా రగులుకున్న తిరుగుబాటు జ్వాలలు ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులకు, బ్రిటీష్ పాలకులు మరో 120 సంవత్సరాలు కంటినిండా నిద్ర లేకుండా చేసాయన్న విషయాన్ని తమ రికార్డులలో రాసుకున్నారు. రైతుల ఆగ్రహజ్వాల క్రమక్రమంగా తిరుగుబాటుగా రూపాంతరం చెందింది. ఈ పరిస్థితులు ఇస్ట్ ఇండియా కంపెనీ అధికారులను కలవరపర్చాయి. ప్రముఖ పరిశోధకుడు Prof. Conrad Wood ప్రకారం 1800లో ప్రారంభమైన తిరుగుబాటు మంటలు 1836 నాటి వరకు చెదురు మదురుగా సాగాయి. చరిత్ర పరిశోధకుడు, MAPILLA MUSLIMS OF KERALA గ్రంథ రచయిత PROF. RONALD E. MILLER ఆ తిరుగుబాట్లను ప్రస్తావిస్తూ, 1821 నుండి 1921 వరకు ప్రధానంగా 51 తిరుగుబాట్లు జరిగాయన్నాడు. 1836 నుండి 1921 వరకు జరిగిన తిరుగుబాట్లు అటూ స్వదేశీ ఇటూ విదేశీ చరిత్రకారులను ఆకట్టుకున్నాయి.

1836 నుండి 1921 వరకు జరిగిన 29 తిరుగుబాట్లు మలబారు రైతాంగ చరిత్రలో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

ఈ పోరాటాలలో అటు జెన్మిల దళాలను, ఇటు పోలీసు, సైనిక బలగాలను, ఎదుర్కొని వీరోచితంగా పోరాడిన 318 మంది మోప్లాలు కదన రంగంలో శత్రువుతో ద్వంద్వ యుద్ధంచేస్తూ నేలకొరిగి చరిత్ర పుటలకెక్కారు. శత్రువు చేతచిక్కి చిత్రహింసలకు గురికావడం అవమానంగా భావించినందున అలవికానిచోట అధికులమనరాదనే, లౌక్యానికి భిన్నంగా ప్రాణాలు పణంగా పెట్టారు. చివరివరకు ప్రభుత్వ బలగాలతో పోరాడి మరణాన్ని పొందటం అంతిమ లక్ష్యంగా మోప్లా వీరులు భావించారు. శత్రువుతో పోరాడుతూ కదన రంగంలో ప్రాణాలు వదలిన వారి సంఖ్య వందల్లో ఉన్నా, మహత్తరమైన ఈ రైతాంగ పోరాటంలో అనేక కష్టనష్టాలకు గురైన కుటుంబాలు అసంఖ్యాకం. మోప్లా రైతులు అటు భూస్వాముల కచ్చేరిలలో, దేవిడిలలో, ఇటు ప్రభుత్వ జైళ్ళలో దుర్భర జీవితాలను గడిపారు. పోలీసు తుపాకి గుళ్ళకు, భూస్వాముల కిరాయి మూకల కరకు కత్తులకు బలయ్యారు. భూస్వాములు, బ్రిటీష్ పాలకులు ఎంత దుర్మార్గంగా, క్రూరంగా వ్యవహరించినా, దక్షిణ మలబారు ప్రాంతంలోని సామాన్య పేదా సాదా జనమంతా మోప్లా వీరులకు, తిరగబడ్డ రైతులకు చివరికంటా అండగా నిలిచారు.

## తిరుగుబాట్ల తీరు తెన్నులు

మోప్లా రైతాంగ వీరుల పోరాటం తీరుతెన్నులు విలక్షణమైనవి. భూస్వాములైన జెన్మిలు, జెన్మిల మద్దతుదారులు, అధికారుల పీడనకు వ్యతిరేకంగా పోరాడటం సాంఘిక బాధ్యతగా భావించటమే కాకుండా ధార్మిక విధిగా మోప్లాలు నిర్దేశించుకున్నారు. అధర్మానికి, అన్యాయానికి, అక్రమానికి వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా తమ పవిత్ర గ్రంథం ఆదేశిస్తుందని, ఆ ఆదేశాల మేరకు పోరాడుతూ మరణం పొందితే స్వర్గం ప్రాప్తిస్తుందని మోప్లాలు నమ్మారు. పేద రైతు భూమిని ఆక్రమించుకున్న భూస్వామిని మట్టుబెట్టడం ధర్మ సమ్మతమని భావించారు. ఈ మేరకు మత గురువులైన తంగల్స్ ( మౌల్వీలు-ముల్లాలు ) ప్రచారం చేసారు. ఒకవైపు భూస్వాముల ఆగడాలు, అధికారుల దాష్టీకాలను సహించలేకపోయిన మోప్లాలు, ఓర్పు నశించి పోరుబాటను ఎన్నుకున్నారు. ధర్మయుద్ధం చేయటం ధార్మిక విధిగా కొందరు భావించగా, మరికొందరు స్వర్గప్రాప్తిని ఆశించారు. అణగారిన ప్రజలను, అణచివేతకు గురవుతున్న ప్రజలను ఆదుకోవటం సాంఘిక, ధార్మిక బాధ్యతగా మోప్లాలు విశ్వసించారు. ఆనాడు జెన్మిలతో తలపడి అమరత్వానికి అవకాశం చిక్కక శత్రువుచేత చిక్కిన పలువురు వ్యక్తం చేసిన అభిప్రాయాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

**'...జెన్మిలు నా మీద కేసులు పెట్టి, జైలుకు పంపడాన్ని నేనెటూ నిలువరించలేను. అరాచకాలను సహించలేను. కొందరు ఆ అకృత్యాలను ఎదుర్కొంటూ అమరులవుతున్నారు. వాళ్ళతో కలసి నేను కూడా అమరుడిగా అంతం కావాలనుకున్నాను...'**

**'...అధర్మంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను (జెన్మిలను) హతమార్చుతూ, జీవితాలను అంతం చేసుకుంటున్న వారు షహీదులవుతున్నారని, వారికి పరలోకంలో ప్రతిఫలం లభిస్తుందని, ఆ ప్రతిఫలమే స్వర్గమని విన్నాను. ఆ స్వర్గ ప్రాప్తి కోసం నేను కూడా షహీద్**

**కాడానికి పోరాట వీరులతో కలిసాను..'**

**'...తోటి సోదరుడు ప్రమాదంలో ఉంటే అతనిని కాపాడటం నా ధర్మమని నా మతం ఆదేశిస్తుంది...అందులో సయ్యద్ వంశస్థుడనైన నేను, బాధితుల పక్షాన తప్పక పోరాడాలి. అవసరమైతే బాధితుల కోసం ప్రాణాలు విడవాలి. ఆ ధర్మాన్ని నిర్వర్తించేందుకు పోరాటం చేస్తున్న వారి వెంట నేను నడిచాను...'**

ఈ అభిప్రాయాలతో, అణిచివేతను సహించలేక, ఆర్థిక పరిస్థితులు కల్పిస్తున్న క్లేశం ఫలితంగా కదనరంగానికి కదులుతున్న మోప్లాలు విలక్షణమైన రీతులలో పోరాడటమే కాక ఆ పోరాటానికి సిద్ధం కావటం పేర్కొనదగ్గ అంశం. జెన్మిల పీడన నుండి విముక్తం కావాలనుకున్న మోప్లాలు, విముక్తి కోసం పోరుబాటను ఎన్నుకున్న మోప్లాలు, అందుకు మూడు దశలలో తయారవుతారు. వివాహితుడైన మోప్లా యోధులు ముందుగా తమకున్న కొద్దిపాటి ఆస్థులను పంచి ఇచ్చేస్తారు. అనంతరం భార్య అనుమతి తీసుకుంటారు. ఈ పోరుబాటన నడిచిన వారు అమరులవడం తప్ప తిరిగిరావటమన్నది లేదు. కనుక భార్యలకు ముందుగా విడాకులు ఇస్తారు. విడాకులు ప్రకటించే ముందే తమకున్న కొద్దిపాటి ఆస్థిపాస్థులను భార్య బిడ్డలకు పంచి వేస్తారు. కుటుంబ సంబంధాలను పూర్తిగా తెంచుకొని సామాజిక, ఆర్థిక, ధార్మిక బాధ్యతలును పూర్తి చేసుకొని, పోరుబాటన నడిచేందుకు ప్రతిన పూని పోరాటవీరులతో కలిసి పోతారు. పోరుబాటలో ప్రధాన లక్ష్యాన్ని సాధించుకునేందుకు, ఆ బాటలోనే అమరత్వం పొందేందుకు, మోప్లా వీరులు **తంగల్స్** (ధార్మిక గురువులు) ఆశీస్సులను ప్రత్యేకంగా పొందుతారు.

## నేర్చా-మౌలూద్ సంప్రదాయం

ఈ విధంగా మృత్యువును ఆహ్వానిస్తూ , భూస్వాముల మీద కదనానికి కదిలే మోప్లాలు ప్రత్యేక తరహా ఆచార సంప్రదాయాలను పాటిస్తారు. ఈ ఆచార సాంప్రదాయాలను **' నేర్చా -మౌలుద్ '** అను ప్రత్యేక కార్యక్రమాలుగా జరుపుకుంటారు.

**నేర్చా** అంటే ప్రతిన పూనటం. అక్రమంగా, అన్యాయంగా పేదవాడి భూమిని లాక్కొన్న జెన్మిని హతం చేయటం పుణ్యకార్యంగా భావించిన మోప్లా రైతు బిడ్డ, ఆ కార్యక్రమ నిర్వహణలో ప్రాణాలు వదులుతాను గాని కదన రంగం వీడి వెళ్ళనని ప్రతిన పూనుతాడు. శత్రువుతో పోరాడుతూ అమరత్వం పొందేందుకు మోప్లాలు తంగల్ అనుమతితో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నాక ఎటువంటి పరిస్థితులలో వెనకడుగు వేయనని, అలాంటి పరిస్థితితే వస్తే ప్రాణత్యాగానికి సిద్ధమని ప్రకటిస్తాడు. ఈ పుణ్యకార్యంలో తనకంటే ముందు అమరత్వం పొందిన అమరవీరుల పేర, తమ పూర్వీకుల పేర, అల్లాహ్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ రకమైన ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని **నేర్చా** కార్యక్రమం అంటారు. నేర్చా తరువాత మౌలూద్ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

**మౌలూద్** అంటే నేర్చా దీక్ష స్వీకరించాక శత్రువుతో సాగే పోరాటంలో అమరత్వం పొందేందుకు తరలి వెళుతున్న వ్యక్తి, తన సహచరులతో పాటుగా నిర్వహించే బాధ్యతలకు సంబంధించిన మరో రకమైన ప్రతిజ్ఞ అది. శత్రువును సవాల్ చేసి, లక్ష్యాలను సాధించేందుకు బయలుదేరిన మోప్లాకు సంపూర్ణ విజయం అసాధ్యమన్న విషయం పక్కాగా తెలుసు.

అయినప్పటికీ చివరిదాకా పోరాటంలో పాల్గొంటానని, అధర్మం మీద సాగే పోరులో ప్రాణాలను తృణప్రాయంగా భావించి అర్పించగలనని సహచరులకు వాగ్దానం చేస్తాడు. చివరి రక్తపు బొట్టు నేలమీద పడేంతవరకు శత్రువును నిలువరిస్తూ పోరాడతానని, ఎటువంటి స్థితిలో కూడా శత్రువు చేత చిక్కనని ప్రతిజ్ఞ చేస్తాడు. శత్రువు చేత చిక్కే పరిస్థితి వస్తే ఆత్మాహుతికి సిద్ధమని ప్రకటిస్తాడు. బలమైన శత్రువును తొడగొట్టి సవాల్ చేసి, కవ్వించి కదన రంగానికి రప్పించి, ద్వంద్వ యుద్ధం చేయటం, రణభూమిలో శత్రువుకు వెన్ను చూపకుండా, ఆత్మార్పణకు సిద్ధం కాడానికి అంగీకారం తెలుపుతూ ధార్మిక ప్రతిజ్ఞ చేయడాన్ని **మౌలూద్** అన్నారు. ఒక రకంగా చూస్తే **మౌలూద్** కూడా **నేర్చా** లాంటి మరో రకమైన ప్రతినగా పరగణించవచ్చు.

## అమరత్వం అంతిమ లక్ష్యం

అక్రమంగా భూమి లాక్కున్న భూస్వాములను, అన్యాయంగా, అధర్మంగా వసూళ్ళు చేస్తున్న భూస్వామి ప్రతినిధులను శిక్షించేంతవరకు మాత్రమే మోప్లాలు సఫలీకృతులయ్యేవారు. అంతవరకే తమ లక్ష్యాలను నిర్దేశించుకునేవారు. ఆ తరువాత పోరాటంలో అమరత్వం పొందటం చివరి గమ్యంగా నిర్ణయించుకునేవారు. ప్రజా కంటకుడైన జెన్మిని, అతనికి వత్తాసు పలుకుతూ ప్రజలను పీడిస్తున్న మద్దతుదారులను అంతం చేసాక, ఈ శక్తులకు అన్నివిధాల అండదండలందిస్తున్న ప్రభుత్వం తమను ఊరికే వదలి పెట్టదని, తమ చర్యల పట్ల తీవ్రంగా వ్యవహరిస్తుందన్న విషయం మోప్లాలకు తెలుసు. అందువలన తొలుత జెన్మిల భరతం పట్టేవారు. ఆ తరువాత అతనికి అండగా నిలచిన వత్తాసుదారుల, సంపన్న ధనికవర్గాల వారి మీద దృష్టి సారించేవారు. చివరకు ప్రభుత్వం పంపించే పోలీసు-సైనిక బలగాలను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యేవారు.

ప్రధాన లక్ష్యాన్ని సాధించుకున్నాక, అంతిమ మజిలీ కోసం ఎదురు చూడటం మోప్లాల తదుపరి కార్యక్రమం. ఈ దశ ఎంతో త్యాగపూరిత దశ. ఉద్వేగభరితంగా సాగే ఈ దశ మోప్లాల పోరాట క్రమంలో ప్రత్యేకం. భరతగడ్డ మీద బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సాగిన పలు పోరాటాలకు భిన్నంగా ఉండటం ఈ కార్యక్రమం విశేషం. శత్రువు బలవంతుడని, తమకు అంతిమంగా మరణం తప్పదని తెలిసినా, అన్నిటికీ సిద్ధమైన మోప్లా వీరులు అంతిమ ఘడియ కోసం ఎదురుచూస్తూ గడుపుతారు. శత్రువును తునుమాడటం లేదా తమను తాము అంతం చేసుకోవడానికి సమాయత్తమౌతారు.

జెన్మిల మీద ప్రతీకారచర్యలో పాల్గొన్న మోప్లా యోధులు, జెన్మిల విలాసవంతమైన భవనాన్నో, శత్రువును ప్రతిఘటించేందుకు అనువుగా ఉన్న మరో స్థావరాన్నో, లేక విశాలంగా ఉన్న ప్రార్థనాలయాన్నో ముందుగా ఎంపిక చేసుకుంటారు. ఈ ఎంపిక విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటారు. పోరాటంలో మరణించడానికి ఇష్టపడే మోప్లాలు, ఎలాంటి పరిస్థితులలో శత్రువు చేత చిక్కకుండా ఉండాలన్న దృఢ సంకల్పబద్ధులై ఉంటారు కనుక, తమ స్థావరాన్ని కూడా అందుకు అనుకూలంగా ఉన్నదాన్నే ఎంచుకుంటారు. ఆ విధంగా ఎంపిక చేసిన స్థావరంలోకి తరలి వెడతారు. అన్నపానీయాలు, ఆయుధాలు స్థావరంలోకి చేర్చుకుంటారు. ఆ స్థావరంలో విడిదిచేసి శత్రువు రాకకోసం ఎదురుచూస్తూ గడుపుతారు.

శత్రువు రాక కోసం ఎదురుచూస్తూ గడిపే సమయంలో నిరంతరం ప్రార్థనలు చేసుకుంటూ, ఆల్లాహ్ అనుగ్రహం కోసం అర్థిస్తుంటారు. ధార్మిక పెద్దల ప్రవచనాలను వింటూ, ఖురాన్‌ను భక్తి శ్రద్ధలతో పారాయణం చేస్తూ గడుపుతారు. అధర్మానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ధర్మ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల గాథలను పాటలుగా రాసుకుంటూ, ఆ పాటలను పాడుకుంటూ ప్రాణ త్యాగాలకు తగినంతగా ప్రేరణ, ఉత్తేజం పొందుతూ మానసికంగా, శారీరకంగా అంతిమ మజిలీకి సిద్ధమవుతారు. ఇహలోకంలో తమ జీవితాలు సమాప్తమవుతున్నా, మరణం సమీపిస్తున్నా, పరలోకంలో తమకు శాశ్వత స్థానం లభించబోతున్నదన్న బలమైన విశ్వాసంతో గడుపుతారు.

ఈ విషయాన్ని 1896లో సాగిన మంజేరి పోరాటంలో పాల్గొని శత్రువుకు పట్టుబడిపోయిన ఒక మోప్లా యోధుడు, **మేము బలగాలతో పోరాడుతూ మరణించడానికి ఆ ప్రార్థనాలయానికి వచ్చాము. తిరుగుబాటుకు ముందే ఈ నిర్ణయం జరిగింది,** అన్నాడు. 1898 నాటి పయ్యనాడు తిరుగుబాటులో పాల్గొన్న మరొక మోప్లా , **ప్రార్థనాలయాన్ని మేము ఎంపిక చేసుకోవడం వలన, పోలీసు బలగాలు మా కాళ్ళమీద కాల్పులు జరపటం తప్ప, మమ్మల్ని సజీవంగా ఏ మాత్రం పట్టుకోలేవు,** అని ప్రకటించాడు. ఈ విధంగా శత్రువుకు చిక్కకుండా, స్వచ్ఛందంగా వీరోచిత మరణానికి సిద్ధమయ్యే విలక్షణ నిర్ణయాలను ధృవపర్చుతూ Prof. Conrad Wood తన గ్రంథంలో, "... the main criterion being apparently to avoid being captured alive..." అని పేర్కొన్నాడు.

జెన్మి మీద దాడి తరువాత మోప్లాల మీద చర్యలు తీసుకునేందుకు బ్రిటీష్ అధికారులు, పోలీసులు సైన్యం తరలి వచ్చేది. అ సమయంలో తప్పించుకుని పారిపోవటం, అజ్ఞాతానికి వెళ్ళిపోవటం లాంటి చర్యలను మోప్లాలు ఉద్దేశ్యపూర్వకంగానే అనుసరించలేదు. శత్రువు రాక కోసం ఎదురుచూస్తూ గడపటం, శత్రువు దరిచేరగానే ఆయుధాలతో విరుచుకు పడటం, అంతిమంగా స్థావరాల నుండి బయటకు వచ్చి వీరోచితంగా పోరాడుతూ మృత్యువును సాదరంగా అహ్వానించటం విశేషం.

శత్రువుతో సాగే పోరులో కూడా సైనికులను, పోలీసు బలగాలను ఎదిరించడానికి గానీ, వీలైనంతగా నిలువరించడానికి గాని తగినన్ని ఆయుధాలు ఉన్నా, లేకున్నా వెనుకడుగు వేయడానికి మోప్లా వీరులు ఇష్టపడేవారు కారు. స్పష్టమైన లక్ష్యం, అంతకంటే స్పష్టమైన గమ్యాన్ని నిర్దేశించుకున్న మోప్లాలు కేవలం గజం పొడుగు కూడా లేని కత్తులతో కంపెనీ బలగాలను వీరోచితంగా ఎదుర్కొన్న ఘట్టాలు ఎన్నో ఉన్నాయి. బ్రిటీష్ సైనిక బలగాలతో జరిగిన పలు పోరాటాలలో వందల సంఖ్యలో మోప్లాలు పాల్గొన్నప్పటికీ, బలగాలకు చిక్కినవారి సంఖ్య పదులను దాటకపోవటం ప్రత్యేకత. రణం చేస్తూ అమరత్వం పొందడానికి అమితంగా ఇష్టపడే మోప్లాలు ఈ పోరాటాలలో తొంభై శాతం వరకు అమరులయ్యారు.

## చరిత్ర ప్రసిద్ధి పొందిన పోరాటాలు

మోప్లాల తిరుగుబాటులన్నీ పలు ప్రత్యేకతను సంతరించుకున్నప్పటికీ, చరిత్రకారులు ప్రధానంగా మూడింటిని పరిగణనలోకి తీసుకున్నారు. ఈ పోరాటాలలో తొలి పోరాటం 1836లో పండలం గ్రామంలో కల్లిన్‌గల్ కున్‌యొలాన్ (KALLINGAL KUNYOLAN)

అను మోప్లా నాయకుని నేతృత్వంలో భూస్వామి కచ్చేరి మీద రైతులు దాడిచేయటంతో అరంభమైందనవచ్చు. ఆ దాడిలో కల్లిన్‌గల్ గాయపడ్డాడు. ఒకవైపు భూసమస్య, మరొకవైపు పీడన, జులుం, ఇంకొక వైపు పాలకవర్గాల అణచివేత చర్యలను ఎదుర్కొంటున్న మోప్లాలలో అధర్మం మీద పోరాటం చేయటం ధర్మబద్ధమని తంగల్స్ చేసిన ప్రచారం, వారిని మృత్యు కిరీటం ధరించి పోరుబాట నడిచేందుకు ప్రేరేపించింది. ఈ విధంగా 1837, 1839, 1840, 1841, 1843, 1849 సంత్సరాలలో మొత్తం మీద పది ప్రధాన తిరుగుబాట్లు జరిగాయి.

## 1849 ఆగస్టులో...

భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా గతంలో పలు పోరాటాలు నిర్వహించిన కుటుంబానికి చెందిన అతన్ గురుక్కల్ (ATHAN GURUKKAL) నాయకత్వంలో 1849 ఆగస్టు 25న తిరుగుబాటు ప్రారంభమైంది. రైతాంగం పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్న పండిక్కడ్ నంబూద్రి జెన్మి కచ్చేరి మీదకు 15 మందితో కలసి వెళ్ళిన అతన్ గురుక్కల్, జెన్మి అక్రమ వసూళ్ళను ప్రశ్నించాడు. ఆ సందర్భంగా భూస్వామి తిన్నగా కచ్చేరి నుండి జారుకున్నాడు. అది గ్రహించిన మోప్లాలు మంజేరి రాజాను లక్ష్యంగా పెట్టుకుని, పండిక్కడ్ నుండి మంజేరికి పయనం కట్టారు. మోప్లాల దాడి గురించి తెలుసుకున్న బ్రిటీష్ సైనికులు, పోలీసులు కన్ననూర్, పాల్ఘాట్ నుండి మంజేరికి బయలుదేరాయి.

ఆ విధంగా మంజేరి చేరుకున్న మోప్లాలు ఒక ఆలయాన్ని స్థావరంగా మార్చుకుని, ప్రభుత్వ బలగాలను తరిమికొట్టారు. అనంతరం మంజేరికి 18 కిలోమీటర్ల దూరంలోనున్న అంగడిపురం గ్రామానికి **'లాంగ్‌మార్చ్'** ప్రారంభించారు. ఈ మధ్య మరికొంత మంది మోప్లాలు వచ్చి వారితో చేరారు. ఈ సంఖ్యతో మోప్లాలు 65 మంది అయ్యారు. మార్గం మధ్యలో మోప్లాలకు ముస్లిమేతర రైతు కుటుంబాలు, ప్రజలు సహాయ సహకారాలు అందించారు. ఆహార పదార్థాలు సమకూర్చి పెట్టారు. ఆయుధాలు సరఫరా చేశారు.

ఈ మార్చ్ సాగుతుండగానే బ్రిటీష్ బలగాలు భారీ సంఖ్యలో సమీకృతమై మోప్లాల మీద దాడిచేసాయి. అసమాన ధైర్యసాహసాలతో మోప్లాలు పోరాడారు. బలగాలకు ఎదురెదురుగా నిలబడి తొడగొట్టి సవాల్ చేసి పోరు సాగించారు. వ్యవసాయ పనిముట్లు తప్ప ఎప్పుడూ ఆయుధాలు చేపట్టని రైతు బిడ్డలు అందుబాటులోనున్న సాంప్రదాయక ఆయుధాలు, కొద్దిపాటి తుపాకులతో తలపడ్డారు. ఆత్మవిశ్వాసం మాత్రమే ఆయుధాలుగా గల మోప్లాలు భీకరపోరు జరిపారు. శత్రవుతో పోరాడి నేలకొరగటమే లక్ష్యంగా గల మోప్లాలలో 64 మంది రణభూమిలోనే ఒరిగిపోయారు. ఒకరు గాయపడి శతృవుకు చిక్కారు. ఈ పోరాటంలో శత్రువర్గానికి చెంది 5గురు మరణించారు.

1849 నాటి తిరుగుబాటు తరువాత 1851, 1852, 1853, 1855, 1864, 1873, 1880, 1884, 1885 లలో జెన్మిల మీద వివిధ ప్రాంతాలలో 12 ప్రదాన తిరుగుబాట్లు జరిగాయి. ప్రతి తిరుగుబాటులో దాదాపు ఒకే రకంగా మోప్లాలు వ్యవహరించటం విశేషం. ఈ తిరుగుబాట్లు అన్నిటిలో మోప్లాలు చివరి వరకు పోరాడి అమరత్వాన్ని ఆహ్వానించారు.

### 1894 మార్చిలో...

1894 తిరుగుబాటు తరువాత 1894లో జరిగిన తిరుగుబాటును చరిత్రకారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఈ పోరాటం పండిక్కర్ సమీపాన గల వెల్లింగాడ్ అను ప్రాంతంలో జరిగింది. పండిక్కర్ రైతులు జెన్మి పెడుతున్న బాధలను సహించలేక అంతా ఏకమై జెన్మిని అంతంచేయడానికి నిర్ణయించుకున్నారు. గత తిరుగుబాట్లలో లాగానే ఈసారి కూడా మోప్లా వీరులు ఆకస్మికంగా జెన్మి, అతని మద్దతుదారుల మీద విరుచుకపడ్డారు. విజయమో-వీరస్వర్గమో తప్ప వెన్నుచూపటం ఎరుగని 34 మంది మోప్లాలు పోరాటంలో పాల్గొన్నారు. జెన్మిల రక్షణకు, మోప్లాలను శిక్షించేందుకు తరలి వచ్చిన బ్రిటీష్ బలగాలతో తలపడ్డారు. ఈ తిరుగుబాటులో పాల్గొన్న 34 మందిలో 32 మంది రణభూమిలో కన్నుమూయగా, తీవ్రంగా గాయపడిన మరో ఇరువురు శత్రువు చేత చిక్కారు. శత్రువర్గంలో 7గురు హతులయ్యారు.

### 1896 ఫిబ్రవరిలో...

1836 నుండి 1919 వరకు సాగించిన పోరాటాలలో అత్యధిక ప్రాధాన్యత సంతరించుకున్న తిరుగుబాటు చెంబ్రాస్సరి ( CHEMBRASSERI ) పోరాటం. 1896 ఫిబ్రవరి 26వ తేదీన ప్రారంభమైన ఈ తిరుగుబాటులో 16 గ్రామాలకు చెందిన 99 మంది మోప్లాలు పాల్గొన్నారు. ఈ పోరాట దళంలో తిరుగుబాటు వీరుల పోతుగడ్డగా ఖ్యాతిగాంచిన మంజేరి నుండి 30 మంది ఉన్నారు. మోప్లాలు చెంబ్రాస్సరి నుండి బయలుదేరి పండిక్కడ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా కొందరు మోప్లాలు ముస్లిమేతరుల మీద అవాంఛనీయ చర్యలకు పాల్పడ్డారు. క్రమశిక్షణ కోల్పోయి, సహనం నశించి మోప్లాలు చేసిన తప్పిదాల వలన మోప్లా తిరుగుబాట్లు పలు విమర్శలకు గురయ్యాయి. మోప్లాల రైతాంగ పోరాటానికి మతం రంగు పులమడానికి ఆ వాతావరణం మంచి అవకాశం కల్పించింది. ఈ చర్యల వెనుక గల కారణాలను విమర్శకులు పరిగణన లోకి తీసుకోలేదు. స్థానికంగా గల ముస్లిమేతర నాయకత్వం బ్రిటీషర్లతో కుమ్మక్కయి, మోప్లాలకు కీడు చేయదలపెట్టినందుకు, ఆగ్రహించిన మోప్లాలు ముస్లిమేతరుల పట్ల మొరటుగా ప్రవర్తించారన్న వాస్తవాన్ని విస్మరించారు. పండిక్కర్ మోప్లా యోధులు పండలూరు వెళ్ళారు. వండలూరు నుండి మంజేరి చేరుకున్నారు. ఎప్పటిలాగే మంజేరిలో స్థావరం ఏర్పాటు చేసుకుని, పోలీసు బలగాల కోసం ఎదురు చూసారు. చివరకు పోలీసులు,సైనికులు రానేవచ్చారు. అన్ని వైపుల నుండి కమ్ముకున్న బలగాలతో పోరాడుతూ 94 మంది కన్నుమూయగా 5గురు శత్రువు చేత చిక్కారు.

### ప్రభుత్వ చర్యలు

Prof. Stephen F. Dale తన వ్యాసం THE MAPILLA OUTBREAKS : IDEOLOGY AND SOCIAL CONFLICT IN NINETEENTH CENTURY KERALA లో మోప్లాలు ప్రారంభించిన తిరుగుబాట్లను, **బ్రిటీషర్లు సృష్టించిన నూతన ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు ప్రతిస్పందన**గా పేర్కొన్నాడు. మోప్లాల తిరుగుబాట్ల మీద ఈస్ట్ ఇండియా కంపెనీ చాలా ఆలశ్యంగా స్పందించింది. ప్రారంభ దశలో పోలీసు, సైనిక బలగాలలోనున్న

మలబారు ప్రాంతపు ముస్లింల మీద కన్నేసి, అనుమానితులను తొలగించింది. భవిష్యత్తులో మోప్లాలను ఆ ఉద్యోగాలోకి తీసుకోరాదని నిర్ణయించింది. నిరక్షరాస్యులు, శిక్షణ లేని ఆవేశపరులైన మోప్లాల ప్రతిఘటనలను ప్రారంభంలోనే అణచివేయాలన్న లక్ష్యంతో ఆసాధారణ అధికారాలు కల్పించి పోలీసు, సైనికాధికారులను దక్షిణ మలబారుకు పంపింది. జెన్మిలతో కలసి మోప్లాల పని పట్టాల్సిందిగా ఆదేశాలు జారీచేసింది. సమస్యను వాస్తవిక దృక్కోణం నుండి పరిష్కారం కనుగొనటానికి బదులుగా అధికారులు జెన్మిలతో కలసి మోప్లా ప్రజానీకం మీద పలు క్రూరచర్యలకు పాల్పడ్డారు. మోప్లా తిరుగుబాటుదారులను **మొరటోళ్ళ గుంపుగా**, చట్టాలంటే గౌరవం లేని **మొరటోళ్ళ సమూహం, మూర్ఖులు**, **రౌడీల జట్టు**, **మత ఛాందసులు, మతోన్మాదులు** గా ముద్రలు వేస్తూ, సమస్యను సరైన కోణం నుండి చూడకుండా దారి తప్పటంతో పరిష్కార మార్గాల విషయంలో కూడా అధికారులు, పాలకులు దారితప్పారు.

మోప్లాల తిరుగుబాటు సమస్యను శాంతిభద్రతల సమస్యగా పరిగణించిన కంపెనీ పాలకులు **' మోప్లా దురంతాల చట్టం '** అంటూ ఒక కిరాతక చట్టాన్ని తీసుకొచ్చి ప్రజానీకం మీద విరుచుకు పడ్డారు. ఈ చట్టం అధారంగా కంపెనీ బలగాలు, పోలీసులు, న్యాయస్థానాలు, జెన్మిలు ఏకమై మలబారు ప్రజల జీవితాలను అతలాకుతలం చేసారు. ఈ చర్యల వలన సమస్య మరింత జటిలం కావటం, మోప్లా తిరుగుబాట్లు ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోవటంతో ప్రభుత్వం తన బాణీని మార్చుకోవాల్సి వచ్చింది.

చివరకు మోప్లాలు సాధిస్తున్న విజయాల వెనుక గల సమస్యను అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని తెల్ల పాలకులు గుర్తించారు. అప్పటికి మోప్లాల తిరుగుబాట్లు ప్రారంభమై అర్ధశతాబ్ది దాటింది. మోప్లా ప్రజల సమస్యలకు, నిరసనలకు, తిరుగుబాట్లకు కారణం ఏమిటో విచారణ జరిపి నివేదికలు సమర్పించమని ప్రభుత్వం అధికారులను కోరింది. ఈ విచారణ కోసం మలబార్ ప్రాంతంలో కమీషనర్, మేజిస్ట్రేట్ స్థాయిలలో పనిచేస్తున్న T.L. STRANGE, W. LOGAN లను నియమించింది. ఈ అధికారులు మోప్లా తిరుగుబాట్లకు కారణాలను విశ్లేషిస్తూ నివేదిక తయారుచేసి, **మోప్లాల నిర్దాక్షిణ్యపు అణచివేత, అప్పీళ్ళు-తాసీళ్ళు- వసూళ్ళ పేర్లతో అక్రమ వసూళ్ళు, మోప్లాలను దిక్కులేని అనాథ సమాజంగా తలచి బాగోగులు పట్టించుకోకపోవటం, ఇవన్నీ అభద్రతా భావం కలుగచేసి, రైతాంగ తిరుగుబాటుకు కారణమయ్యాయి,** అని పేర్కొన్నారు.

**బ్రిటీష్ వ్యతిరేకతత్వం, మత ప్రభావం, నిరక్షరాస్యత, అసమగ్రమైన భూసంస్కరణలు కూడా కారణమని** T.S. STRANGE అదనంగా పేర్కొన్నాడు. తిరుగుబాట్లను అణచివేసేందుకు పలు సూచనలు చేసాడు. మోప్లా జనసమూహాల మీద ఉమ్మడి జరిమానాలను విధించాలని, ఆస్తులను జప్తు చేయాలని, ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని సూచించాడు. భూమిని నమ్ముకుని బ్రతికే మోప్లాల వద్ద నుండే వెట్టికత్తి అనబడే పనిముట్టును కూడా ఉండనివ్వరాదన్నాడు. ఈ సూచనల మేరకు తెచ్చిన **' ఆయుధాల నిషేధ చట్టం '**, మోప్లా దురంతాల చట్టానికి మరింత బలమైన కోరలను తెచ్చిపెట్టింది. ఈ నివేదిక తరువాత ప్రభుత్వపరంగా రెవిన్యూ విధానంలో కొన్ని మార్పులు సంభవించాయి. ఆ మార్పుల పర్యసానంగా భూమి మీద, వ్యవసాయదారుల మీద, ప్రజల మీద సాధించుకున్న

పట్టును సడలించడానికి జెన్మిలు ఇష్టపడక పోవటంతో అధికారులు మోప్లాల పట్ల తమ వైఖరిని ఏ మాత్రం మార్చుకోలేక పోయారు. ఈ అనుకూల అంశాలను ఉపయోగించుకుని జెన్మిలు రెచ్చిపోయారు. మోప్లాల నివాసాల మీద దాడులు జరిగాయి. భారీ సంఖ్యలో అరెస్టులు సాగాయి. రైతుల గృహాలలోని వ్యవసాయ పనిముట్లను కూడా ఆయుధాలుగా ప్రకటించి స్వాధీనం చేసుకుని మోప్లాలతో జైళ్ళను నింపారు.

ఈ నేపథ్యంలో మోప్లా తిరుగుబాట్లు కొంత మేరకు మందగించాయి. భూసమస్య ఏ మాత్రం పరిష్కారం కాకపోవటంతో తిరుగుబాట్లు సమసిపోలేదు. 1880లో Mc.WATTERS అను అధికారి ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పిస్తూ, ఈ తిరుగుబాట్లకు, జెన్మిల హత్యలకు వ్యవసాయదారులలో ఏర్పడిన అసంతృప్తి కారణమని పేర్కొంటూ, ఆ అసంతృప్తిని తొలగించనిదే సమస్య పరిష్కారం కాదన్నాడు. భూస్వాముల అక్రమాల వలన మోప్లాలు తిరగబడ్డారంటూ, ఆంగ్లేయ అధికారులు పలుమార్లు ప్రస్తావించటంతో WILLIAM LOGAN ను విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం కమిటీని వేసింది. విచారణ తరువాత దున్నేవాడికి భూమి మీద అధికారాలు కల్పించాలని, భూస్వాముల అధికారాలకు కోత విధించాలని, రైతును భూమి నుండి వైదొలగిస్తున్నపుడు, భూమి అభివృద్ధికి రైతు చేసిన ఖర్చును భూస్వామి నుండి ఇప్పించాలని LOGAN తన నివేదికలో సూచించాడు.

## జెన్మిల కొత్త ఎత్తులు

ఈ నివేదికల ఆధారంగా చట్టాలలో పలుమార్పులు తెచ్చినా, అధికారులను లోబర్చుకుని, న్యాయస్థానాలను వశం చేసుకుని భూస్వాములు తమ అధిపత్యాన్ని నిలుపుకోసాగారు. మోప్లా రైతు ప్రతిసారీ మోసపోయాడు. రైతు ఆగ్రహానికి అంతులేకుండా పోయింది. అందువలన ప్రభుత్వం కొంతమేరకు దిగిరాక తప్పలేదు. రైతును హఠాత్తుగా భూమి నుండి తొలగించినట్టయితే, ఆ భూమి అభివృద్ధికి రైతు చేసిన ఖర్చును చెల్లించిగాని తొలగించరాదని ప్రభుత్వం చేసిన చట్టం వలన రైతుకు కొంతలో కొతం మేలు జరిగింది. గతంలో లాగా జెన్మి తన ఇష్టానుసారంగా భూమి నుండి మోప్లాలను తొలగించడానికి కుదరని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల నుండి బయటపడడానికి జెన్మిలు సరికొత్త ఎత్తులు వేసారు. ఏ భూమి నుండయితే మోప్లా రైతును తొలగించాలనుకున్నాడో, ఆ రైతు సాగుచేస్తున్న భూమిని జెన్మి ఇతరులకు ఇచ్చివేసేవాడు. అందుకుగాను తగిన ప్రతిఫలం స్వీకరించేవాడు. ఆ భూమిని స్వీకరించిన వ్యక్తిని **“ మేల్చేరతదార్ ”** (MELCHARTHDAR) అంటారు. ఈ వ్యక్తి జెన్మి నుండి భూమిని తీసుకుని, మోప్లా రైతు మీద వాజ్యం వేసి అతనిని కోర్టుకు లాగి, భూమిని స్వాధీనం చేసుకుంటాడు. అనంతరం తనకిష్టమైన వారికి, తాము కోరినంత కౌలుఇచ్చే వ్యక్తికి ఆ భూమిని కౌలుకిచ్చి జెన్మికి చెల్లించిన ప్రతిఫలం, కోర్టు ఖర్చులు రాబట్టుకుంటాడు. జెన్మి తన భూమిని మేల్చేరతదార్‌లకు అప్పగించి చేతులు కడుక్కొనేవాడు. మేల్చేరతదార్లులో న్యాయవాదులు అత్యధికులు కావటం వలన మోప్లా రైతుల మీద కేసులు పెద్ద సంఖ్యలో దాఖలయ్యాయి. ఈ రకమైన కొత్త ఎత్తుల వలన జెన్మిలు, జెన్మిల వత్తాసుదారులే కాకుండా, మేల్చేరతదారులు కూడా మోప్లాలకు నూతన శత్రువులయ్యారు.

## ప్రథమ స్వాతంత్ర్య సమరంలో మోప్లాలు

బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలకు పెట్టింది పేరైన మోప్లాలు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పెద్దగా పాల్గొనలేదు. భారతీయ సిపాయిల, ప్రజల విజృంభణతో దేశం అట్టుడికిపోతున్నప్పుడు మోప్లాలు ఆ బాటను అందిపుచ్చుకోకపోవడం నిజంగా ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల అదృష్టమని చరిత్రకారులు పేర్కొన్నారు. ప్రధానంగా జెన్మిల దౌష్ట్యానికి వ్యతిరేకంగా, ఆ దుష్టులకు వత్తాసు పలికినందున ఆయుధాలు చేతపట్టిన మోప్లాలకు బ్రిటీషర్ల కబంధ హస్తాల నుండి ఈ దేశాన్ని పూర్తిగా విముక్తం చేయగలమన్న ఆలోచన ఆనాడు కలుగలేదు. బ్రిటీషర్ల మీద తీవ్ర వ్యతిరేకతను సంతరించుకున్న మోప్లాలకు సరైన నాయకత్వం లభించి, మార్గదర్శకం చేసిఉంటే ఆ వీరోచిత తిరుగుబాట్లు మరో విధంగా సాగి ఉండేవనడానికి తార్కాణంగా 1857 నాటి పోరాటంలో పాల్గొన్న కొంత మంది మోప్లాలు రుజువు చేసారు. ప్రత్యేకంగా ఒక నాయకుడు లేనప్పటికీ, పటిష్టమైన పోరాట వ్యవస్థ కరువైనప్పటికీ బ్రిటీషర్ల నీడను కూడా ఏమాత్రం సహించలేని మోప్లాలు, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సమాచారంతో ఉత్తేజితులై చిన్న స్థాయిలోనైనా బ్రిటీషర్ల మీద తిరుగుబాటు చేసి ఆనాటి తిరుగుబాటుకు తాము దూరంగా లేమన్నారు.

1857 ఆగస్టులో ప్రథమ స్వాతంత్ర్య సమరం ప్రారంభమైందన్న శుభవార్త తెలుసుకుని, ఎర్నాడు ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది మోప్లా వీరులు ఆ దిశగా ముందడుగు వేసారు. కంపెనీ పాలకులకు వ్యతిరేకంగా తిరగబడమని ప్రజలకు పిలుపునిచ్చారు. **"..ఉత్తర హిందూస్థానంలో ప్రారంభమైన తిరుగుబాటు, కంపెనీ పాలనను అస్తవ్యస్తం చేసింది. పాలకులు ప్రస్తుతం అయోమయ పరిస్థితులలో ఉన్నారు. ఇటువంటి సమయంలో దాడులు చేసినట్టయితే, కంపెనీ పాలకులు తమ బలగాలను తెప్పించుకునే అవకాశం ఉండదు. కనుక తిరగబడటానికి ఇదే సరైన అదను. మనం మన స్నేహితులతో సంబంధాలను ఏర్పాటు చేసుకుని తిరగబడాలి...",** అని మోప్లాలు ప్రజానీకాన్ని తిరుగుబాటుకు పురికొల్పారు.

ఆ ప్రయత్నాలు, ప్రచారం మరింత ముందుకు సాగకముందే తిరుగుబాటు మోప్లాల రహస్య కార్యకలాపాలను పాలకవర్గాలు పసికట్టాయి. అంతటితో ప్రథమ స్వాతంత్ర్య సమరంలో భాగంగా మోప్లాలు ప్రారంభించిన తిరుగుబాటు సమసిపోయింది. ఈ విషయాలను 1857 అక్టోబర్ 16న జరిగిన కోర్టు విచారణలోని సాక్షులు, కంపెనీ అధికారులు సమర్పించిన రికార్డుల ద్వారా బహిర్గతమయ్యాయని ప్రముఖ రచయిత DR. CONRAD WOOD పేర్కొన్నాడు.

ఈ విషయాలు మోప్లాలు కేవలం తమ వ్యక్తిగత భూసమస్య పరిష్కారం కోసం మాత్రమే కాకుండా, అప్పటి వరకు సాగుతున్న రైతాంగ తిరుగుబాటుకు భిన్నంగా బ్రిటీషర్లను ఈ గడ్డ మీద నుండి వెళ్ళగొట్టడానికి తమ పరిమితులు, పరిధుల మేరకు తిరుగుబాటులో భాగస్వాములయ్యారని తెలుపుతున్నాయి. భూమి కోసం బ్రిటీషర్లను, జెన్మిలను ఎదుర్కొనటంతో సరిపెట్టుకోకుండా ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు కావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేయటం ద్వారా, మాతృభూమిని వలసపాలకుల కబంధ హస్తాల నుండి విముక్తం

చేయాలన్నంత వరకు సాగి మోప్లాలు చరిత్ర సృష్టించారు. ఈ భావ పరంపరలే ఆ తరువాత జాతీయోద్యమంలో తమదైన వీరోచిత పాత్రను నిర్వహించేందుకు మోప్లాలను పురికొల్పాయి.

## జాతీయోద్యమంలో మోప్లాలు

1916 మే మాసంలో డాక్టర్ అనీబిసెంట్ అధ్యక్షతన హోమ్‌రూల్ ఉద్యమంలో భాగంగా జరిగిన మలబారు జిల్లా ప్రథమ సమావేశంతో, దక్షిణ మలబారులో జాతీయోద్యమ పవనాలు వీచటం ప్రారంభించాయి. భారత జాతీయ కాంగ్రెస్ రంగ ప్రవేశం చేసిన మొదటి నాలుగు సంవత్సరాలలో జెన్మిలు, ఆ జెన్మిలకు వత్తాసుగా వ్యవహరించే న్యాయవాదుల, సంపన్నుల పాత్ర అధికంగా ఉండేది. ఆ కారణంగా మోప్లాలు కాంగ్రెస్‌కు దూరంగా ఉండిపోయారు. 1920 ఏప్రిల్ 28వ తేదీన జరిగిన మంజేరి సమావేశంలో ఖిలాఫత్ ఉద్యమం గురించి మొదటిసారిగా మోప్లాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సంఖ్యాపరంగా జెన్మిల మీద మోప్లా రైతులది పైచేయి అయ్యింది. అటు తరువాత నుంచి మోప్లాలు కాంగ్రెస్‌లో అధిక సంఖ్యలో పాల్గొనటం ఆరంభమైంది.

ఒకవైపు కాంగ్రెస్ సమావేశం, మరోవైపు మారిన మోప్లాల పోరాట దృక్పథం వలన ఖిలాఫత్ ఉద్యమం, దానికి తోడుగా భారత జాతీయ కాంగ్రెస్ ప్రకటించిన సహాయ నిరాకరణ ఉద్యమం మోప్లాలను బాగా ఆకర్షించింది. ఖిలాఫత్‌ను రద్దు చేస్తూ బ్రిటీష్ పాలకవర్గాలు తీసుకున్న నిర్ణయాన్ని ముల్లాలు, మౌల్వీలు (తంగల్స్) తీవ్రంగా నిరసిస్తూ, ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమాలలో పాల్గొనాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఎర్నాడుకు చెందిన హాజీ వరియంకున్నత్ కునాహమద్ హయ్ (VARIANKUNNATH KUNAHMADHAI) లాంటి నాయకుడు ఖిలాఫత్ కమిటీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆ తరువాత సాగిన మోప్లాల తిరుగుబాటుకు ఆయన తిరుగులేని నాయకుడయ్యారు.

1921 జనవరి మాసం నుండి ప్రారంభమై జూన్ వరకు మోప్లాల ప్రాబల్యం గల అన్ని ప్రాంతాలలో ఖిలాఫత్ కమిటీలు ఏర్పడ్డాయి. మోప్లా నాయకులు ఆయా గ్రామాలను పర్యటించి ఉత్సాహవంతులైన స్థానికులను ప్రోత్సహించారు. ఆ కృషి ఫలితంగా మోప్లాల పట్టుగల అన్ని ప్రాంతాలలో జాతీయోద్యమ భావాలు బలంగా నాటుకున్నాయి. ఖిలాఫత్-సహాయ నిరాకరణ ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్, మౌలానా మహ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ, మహాత్మాగాంధీల ప్రసంగాలు మోప్లాలను బాగా ప్రభావితం చేసాయి. జెన్మిల మీద తిరగబడి బ్రిటీష్ బలగాలను ఎదిరించే క్రమంలో ఆత్మార్పణలకు పాల్పడే విశిష్ట వారసత్వం గల మోప్లాలు ఉత్తేజితులయ్యారు. బ్రిటీష్ బలగాలను తమ భూభాగం నుండి నెట్టివేయాలని సంకల్పించారు.

ఆ లక్ష్యసాధన కోసం ప్రాణాలను అర్పించటం కాకుండా గాంధీజీ ప్రబోధించిన అహింసా మార్గంలో ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా హిందూ-ముస్లింల ఐక్యత పరిఢవిల్లింది. అటు ఖిలాఫత్ కమిటీలు ఇటు సహాయ నిరాకరణ కమిటీలు, కాంగ్రెస్ కమిటీలలో నాయకత్వం వహించి, మతంతో సంబంధం లేకుండా కార్యక్రమాలను నిర్వహించారు. ఆనాటి ఖిలాఫత్ కమిటీలలో శ్రీ కె.పి. కేశవ మీనన్, శ్రీ యు. గోపాల మీనన్, శ్రీ కె.వి.జి. మీనన్, శ్రీ యం. గోపాల మీనన్, శ్రీ కె. శేఖర మీనన్, శ్రీ కె. మాధవ

మీనన్, శ్రీ టి.వి. చత్తు కుట్టీ మీనన్, శ్రీ యం.పి. నారాయణ మీనన్, శ్రీ ఎలియా నాయర్, జనాబ్ మహ్మద్ అబ్దుర్రహ్మాన్ సాహెబ్, మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్, మౌల్వీ మోడుకొయా, జనాబ్ పి. మొడుకోయా, జనాబ్ కె ముహమ్మద్ ముస్సలియార్, జనాబ్ మోహిద్దీన్ కోయా తదితరులు సభ్యులు.

ఈ సందర్భంగా హిందూ సోదరులతో సఖ్యతగా మెలగాలని, ఎటువంటి పరిస్థితులలో వారికి కష్టం-నష్టం కలిగించకుండా చూడాలని ముస్లిం ముల్లాలు, తంగల్స్ కోరటంతో హిందూ-ముస్లింల మధ్య పటిష్టమైన స్నేహసంబంధాలు వ్యక్తమయ్యాయి. ఒత్తపాలెం (OTHAPALAM ) గ్రామంలో హిందూ సోదరులు దేవుడ్ని ఊరేగిస్తుండగా, అందులో పాల్గొన్న వారికి ముస్లింలు కొబ్బరి బొండాల నీళ్ళతో దాహం తీర్చిన అరుదైన సలు సంఘటనలు చోటుచేసుకున్నాయి. అనూహ్యమైన ఈ ఐక్యత బ్రిటీష్ అధికారులను షాక్‌కు గురిచేసిందని, ప్రముఖ రచయిత డాక్టర్ రౌనాల్డ్ మిల్లర్ వ్యాఖ్యానించడాన్ని బట్టి ఆనాడు హిందూ-ముస్లిం జన సముదాయాల మధ్య వ్యక్తమైన స్నేహసంబంధాల స్థాయి, పటిష్టత తెలుస్తుంది.

## మౌలానా షౌకత్ అలీ ప్రసంగాలు

1920 ఆగస్టు 18న కాలికట్‌లో జరిగిన ఖిలాఫత్ సమావేశంలో మహాత్మా గాంధీ, మౌలానా షౌకత్ అలీ పాల్గొన్నారు. ఆ సభలో మోప్లాలు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనటం, ఇస్లాం ప్రకారం ధర్మసమ్మతమని, ఖురాన్ ప్రకారంగా సహాయ నిరాకరణ అనుసరణీయమని ప్రకటించారు. ఈ మార్గంలో లక్ష్యాలను సాధించుకోలేకపోయినట్టయితే మరింత తీవ్ర చర్యలకు, త్యాగాలకు తయారుకావాల్సి వస్తుందని షౌకత్ అలీ ఇచ్చిన పిలుపు మోప్లాలను ఉత్తేజపర్చింది. ఆ పిలుపుతో మోప్లాలు మరింత ఉత్సాహంతో కార్యక్రమాలలో పాల్గొన్నారు. మౌలానా ప్రసంగాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఆ ప్రసంగాలు మోప్లాలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయని, మందు దట్టించి ఉన్న ఫిరంగికి మౌలానా ప్రసంగాలు వెలిగించిన అగ్గి భరాటాల్లా పెను ప్రమాదాన్ని తెచ్చిపెట్టగలవని పాలకవర్గాలు భావించాయి. **"... ఆయన ప్రసంగాలు మోప్లాల నుంచి ప్రమాదం కొని తెచ్చేవిధంగా ఉన్నా..."** యని, CHIEF SECRETARY OF MADRAS TO THE GOVERNMENT OF INDIA, ఉన్నతాధికారులకు పంపిన నివేదికలో పేర్కొన్నాడు. అందుకు తగ్గట్టుగానే షౌకత్ అలీ ఎక్కడ ప్రసంగాలు చేసినా బ్రిటీషర్ల మీద పోరాటం చేయటం అధర్మం, అన్యాయం, అక్రమం మీద పోరాడటమేకాక అల్లాహ్ మార్గాన పోరాడటమేనన్నారు. ధర్మాన్ని, న్యాయాన్ని స్థాపించటం కోసం మరణించటం గాని, ఆ కార్యసాధనలో సాగుతున్న వ్యక్తులకు అడ్డుగా నిలిచే అధర్మవర్తనులను చంపటంకాని తప్పుకాదన్నారు. ఈ పోరాటాలలో గాంధీజీ ప్రబోధించిన అహింసా మార్గంలో నడిచేందుకు ముస్లింలు వాగ్దానం చేసియున్నారంటూ, ఆ మార్గంలో నిర్దేశించిన గమ్యాన్ని చేరుకోలేనట్టయితే, ముస్లింలు తమదైన మార్గాన్ని తామే నిర్ణయించుకోవచ్చునని ఆయన ప్రవచించారు. ఈ సందర్భంగా కొందరు ధార్మిక నేతలు, గతంలో మోప్లాలు అనుసరించిన ఆత్మార్పణలను కూడదంటూ ప్రచారం చేసారు. **"... శత్రువు దాడిచేసినప్పుడు, తప్పించుకోలేనప్పుడు, చావు తప్పదన్నప్పుడు, చివరికంటా రక్షణ**

**కోసం ప్రయత్నించాలి తప్ప ఆత్మార్పణలకు పాల్పడటం సరికాదు...''** అంటూ సాగిన ప్రసంగాలు మోప్లాల ఆలోచనా ధోరణులను మార్చాయి.

ఈ పరిణామాలతో బ్రిటీష్ పాలకులు కలవరపడ్డారు. పరిస్థితులు అదుపు తప్పేలోగా చర్యలు తీసుకోకపోతే, సమరశీలురైన మోప్లాలను అదుపుచేయటం కష్టతరమవుతుందని భావించారు. కర్కశంగా ఉద్యమాన్ని అణిచివేయాలని సంకల్పించారు. బ్రిటీష్ పోలీసు గూఢచారులు ఉద్యమకారుల మీద నిఘాను తీవ్రతరం చేసారు. ఉద్యమకారుల మధ్య ఎటువంటి సమాచారం చేరకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొరియర్‌లను నిర్బంధించారు. ప్రజల నుండి ఏవిధమైనా సహకారం లభించకుండా ఉండేందుకు కుయుక్తులు పన్నారు. విభజించి పాలించు సూత్రంతో పాలనను సుస్థిరం చేసుకున్న బ్రిటీష్ పాలకవర్గాలు ప్రజా ఉద్యమాన్ని అణిచి వేసేందుకు ఎత్తులు వేశాయి.

ఖిలాఫత్ కమిటీలలో మోప్లాలు అధికంగా ఉన్నారు కనుక ఖిలాఫత్ వ్యతిరేక కమిటీల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించారు. జెన్మిలకు వ్యతిరేకంగా ఏర్పడిన కౌలుదారుల సంఘాలకు పోటీగా జెన్మిల వత్తాసుదారులతో ప్రత్యేక సంఘాలు ప్రారంభింప చేశారు. ఖిలాఫత్ పతాకాన్ని నిషేధించారు. నాయకుల సంచారం మీద ఆంక్షలు విధించారు. పర్యటనల మీద నిఘా పెంచారు. ఆయుధాలు దాచిపెట్టారన్న నెపంతో ప్రార్థనాలయాలు, గృహాల మీద దాడులు జరిపారు. మోప్లాలకు బలమైన కేంద్రాలన్న ప్రతిచోట దాడులను నిర్విఘ్నంగా సాగించారు. అడ్డు వచ్చిన జనసమూహాల పట్ల దారుణంగా వ్యవహరించారు. ఈ చర్యలతో మోప్లాల గుండె మండిపోయింది. నాయకుల ఆజ్ఞలను జవదాటరాదని ప్రతిన పూనిన మోప్లాలు అటు జెన్మిల చర్యలను, ఇటు పాలకుల చర్యలను ఎంతో ఓర్పుతో సహించారు.

ఆ సమయంలో హిందూ-ముస్లింల మధ్యన చిచ్చు పెట్టేందుకు పాలకవర్గాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. మలబారు ప్రాంతంలో అధిక సంఖ్యలో గల మోప్లా ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చకొట్టారు. లక్ష్యసాధనకు అన్ని రకాల ఎత్తులు వేయసాగారు. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకుడు శ్రీ కె. మాధవన్ నాయర్ ఈ చర్యల గురించి '**మలబారు కలాపం**' లో, '**... మత సామరస్యాన్ని విచ్ఛిన్నంచేసి హిందువులను ముస్లింల నుండి దూరం చేయడానికి ప్రభుత్వం తీవ్రమైన చర్యలకు పాల్పడింది...'** అన్నారు. జాతీయోద్యమాన్ని అణిచేందుకు ప్రభుత్వం తీసుకున్న అతి ప్రమాదకర చర్యలు, ఆ తరువాత మలబార్‌లో ఏర్పడిన భయానక పరిస్థితులకు కారణమని అటు ఆంగ్ల అధికారులు, ఇటు స్వదేశీ చరిత్రకారులు తీర్మానించటం ద్వారా ప్రభుత్వం ఎంతటి దుర్మార్గపు చర్యలకు పాల్పడింది అర్థంచేసుకోవచ్చు.

## నిషేధాలు-నిర్బంధాలు

ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమాల సభలు, సమావేశాలను ఎక్కడా జరగనివ్వరాదని అధికారులు ప్రభుత్వానికి సలహాలిచ్చారు. దక్షిణ మలబారు మేజిస్ట్రేట్, రైతు సభలను నిషేధించాడు. **"...అలాంటి సమావేశాలు జరగటం వలన ప్రభుత్వానికి మాత్రమే కాక, ఈ జిల్లాలోని హిందూ జెన్మిలకు వ్యతిరేకంగా అమాయకులైన మోప్లాల మనోభావాలు చెలరేగుతాయని..."** ఉన్నతాధికారులకు తెలిపాడు. ఈ ఉడత వూపులకు

ప్రజలు గాని, సమరశీల యోధులైన మోప్లాలు గాని భయపడలేదు. బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో ప్రాణాలు పణంగా పెట్టడానికి వెనుకాడని మోప్లాలు నిషేధాలు-నిర్బంధాలకు కలవరపడలేదు. దేశ వ్యాపితంగా సాగుతున్న ఉద్యమంలో భాగస్వామి కావాలని, పుట్టి పెరిగిన మట్టి కోసం మోప్లా బిడ్డడు ఎంతటి త్యాగానికైనా వెనుదీయడన్న విషయాన్ని నిరూపించాలని, అన్నిటినీ సహించారు. ప్రభుత్వం విధించిన నిషేధపు ఉత్తర్వులను, అక్రమ నిర్బంధాలను రైతాంగం, ప్రజలు బాహాటంగా ఉల్లంఘించి, సభలు, సమావేశాలు యధాతథంగా జరుపుకో సాగారు. కల్పకంచెరి అను గ్రామంలో నిషేధపు ఉత్తర్వులను ఉల్లంఘించి జరిగిన సభలో 20 వేల మంది పాల్గొన్నారు. పొన్నాని అను ప్రాంతంలో జరిగిన సభలలో ప్రజలను పోలీసులు తీవ్రంగా చితకబాది అమానుషంగా వ్యవహరించారు.

ప్రజలు గత్యంతరంలేక తిరగబడ్డారు. ఆ పరిస్థితులను వివరిస్తూ, ' **ప్రాణాలను తృణప్రాయంగా భావించే ఉద్రేకపూరితులైన మోప్లాల్లో అసహాయోద్యమనే అగ్ని కణం పడకూడదని మొదటి నుండి ప్రభుత్వము వారెంతో ఆతురతతో నుండిరి.'** అని డాక్టర్ పట్టాభి సీతారామయ్య తన **భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర**లో రాసారంటే ఆనాటి పరిస్థితి ఎంతటి తీవ్రంగా ఉందో, అందులో మోప్లాల పాత్ర ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకుందో తేటతెల్లమవుతుంది. పరిస్థితులు చేజారకుండా కాంగ్రెస్ నాయకులు, ఖిలాఫత్ నేతలు, శ్రీ సి. రాజగోపాలాచారి, జనాబ్ యాకూబ్ హుస్సేన్, శ్రీ మాధవన్‌నాయర్, శ్రీ గోపాల మీనన్, జనాబ్ మహమ్మద్ కోయా తదితరులు కృషి చేసారు. ప్రజలు నిగ్రహం పాటించినా ప్రభుత్వం తీవ్రమైన ప్రతీకార చర్యలకు పాల్పడింది. ఈ చర్యలే మోప్లాల సరికొత్త తిరుగుబాటుకు బాటలు వేసింది.

## బద్దలైన బడబాగ్ని

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య నమోదు చేసినట్టుగానే, ఉద్రేకపూరిత స్వభావులైన మోప్లాల మస్తిష్కాలలో సహాయనిరాకరణ అనే అగ్నికణం పడనే పడింది. అది కాస్త ప్రభుత్వం విధించిన నిషేధాలు, సాగించిన నిర్బంధాలతో మరింతగా రగులుకుంది. నాయకుల మీద, సామాన్య కార్యకర్తల మీద అధికారులు సాగించిన అరెస్టులు, దుర్మార్గాలు మోప్లాలను ప్రజ్వరిల్లచేశాయి. ఈ పరిస్థితులు, భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో వివాదాస్పద ఘట్టంగా మారిన 1920-22 నాటి తిరుగుబాటుకు, మోప్లాల బలిదానానికి, మలబారు అల్లకల్లోలానికి కారణమయ్యాయి.

1921 ఫిబ్రవరి 5వ తేదీన సభలను, సమావేశాలను ప్రభుత్వం నిషేధించింది. మోప్లా నేతలు సహజంగానే ఈ నిషేధాన్ని ఉల్లంఘించారు. సభలు, సమావేశాలను ప్రార్ధనాలయాలలో నిర్వహించ పూనుకున్నారు. నిషేధాజ్ఞలున్నప్పటికీ నాయకులు తమ కార్యకలాపాలను యధాతథంగా సాగించటంతో నేతలను అరెస్టు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నిర్ణయం మేరకు ఫిబ్రవరి 26వ తేదీన ఖిలాఫత్ కమిటీ నాయకులైన పొర్రాయిల్ కున్ అహమద్ ( PORRAYIL KUNAHAMAD ) , పొర్రాయిల్ అబూబకర్, ( PORRAYIL ABUBAKAR ) వి.వి.హసన్ కుట్టీ, కల్లార్కల్ అహమ్మద్ (KALLARAKKAL AHAMAD) లను తిరుంగాడిలో అరెస్టు చేసారు. నాయకుల చర్యలు శాంతి భద్రతలకు

ప్రమాదకరంగా పరిణమించాయని ఆరోపించి కేసులు నమోదయ్యాయి. ఆ తరువాత విచారణ తంతు నడిపించి ఆరు మాసాల జైలు శిక్ష విధించారు.

ఈ చర్యలతో మోప్లాలు మండిపడ్డారు. మలబారు మోప్లాల హృదయాలలోని బడబాగ్ని బద్దలైంది. ఆ సమయంలో ప్రముఖ మోప్లా నాయకుడు, ఖిలాఫత్ కమిటీ అగ్రనేత మౌల్వీ అలీ ముస్సలియార్‌ను (MOULI ALI MUSSALIYAR) అరెస్టు చేయాల్సిందిగా మద్రాసు జిల్లా కలెక్టర్ ఇ.యం. థామస్ ఆదేశాలు జారీచేసాడు. ఆయనను అరెస్టు చేస్తే మోప్లాల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని, ఆ ఉద్రేకాన్ని నియంత్రించలేమన్న భయంతో అప్పటికి అధికారులు మిన్నకుండిపోయారు.

ప్రజల నిరసన ఒకవైపు తీవ్రతరం అవుతుండగా మరోవైపు అధికారులు నిషేధాలను, నిర్బంధాలను మరింత ఎక్కువ చేసారు. ప్రత్యేక చట్టాల నిబంధనలను అమలులోకి తెచ్చి ప్రముఖ జాతీయ నాయకులు యాకూబ్ హసన్ లాంటి వారిని అరెస్టు చేసారు. మౌల్వీ ఇర్నికున్నమ్ అలీ ముస్సలియార్ నాయకత్వాన తిరుంగాడి పట్టణానికి చెందిన ఖిలాఫత్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు రానున్న తుపానును సూచించసాగాయి. ఒకవైపు ఈ నిరసన జ్వాలలు ప్రజ్వరిల్లుతున్న సమయంలోనే పశ్చిమ ఎర్నాడు ప్రాంతంలో పొన్నాని పట్టణంలో ఏర్పడిన ఖిలాఫత్ వ్యతిరేక కమిటీ సభ్యులు, అధికారుల అండదండలతో జూలై మొదటి వారంలో సభను నిర్వహించడానికి సాహసించారు. ఈ కార్యక్రమాన్ని ఖిలాఫత్ కార్యకర్తలు ఎదుర్కొన్నారు. మోప్లాలు విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా విరుచుకు పడిన మోప్లాల ధాటికి పోలీసులు నిలువలేకపోయారు. పోలీసుల పలాయనం మోప్లాలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపచేయటమేకాక, పోలీసు బలగాలంటే చిన్నచూపుకు కారణమైంది.

ఈ సంఘటన తరువాత ఖిలాఫత్ వ్యతిరేకులు, ప్రభుత్వ అనుకూల వర్గాల మీద ఖిలాఫత్ కార్యకర్తలు దాడులు ప్రారంభించారు. ఈ దాడులలో మతం, కులం, వర్గం, వర్ణం అడ్డురాలేదు. 1921 ఆగస్టు ప్రారంభంలో తిరుంగాడి ప్రాంతంలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని మోప్లాలు మరింత వేగవంతం చేసారు. తాగుడుకు వ్యతిరేకంగా ప్రచారాన్ని తీవ్రతరం చేసారు. ఈ ప్రచార కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడంతో శాంతి భద్రతలకు భంగం ఏర్పడింది. పలుచోట్ల హింసాకాండలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలోనే పుక్కుటూర్ మెప్లాలు, బ్రిటీషర్ల వత్తాసుదారుడైన భూస్వామికి సంబంధించిన భవనాన్ని ఆక్రమించుకున్నారు. ఆ భవనాన్ని తమ ప్రార్థనాలయంగా మార్చుకున్నారు. ఆ జెన్మి పక్షాన వచ్చిన బలగాలను ఎదుర్కొన్నారు. బలగాలు పలాయనం చిత్తగించాయి. ఈ సంఘటన తరువాత దాదాపు 3 వారాల పాటు అక్కడ మోప్లాల రాజ్యం సాగింది. జూలై 29న మరో మోప్లా నాయకుడు పుక్కుటూర్ ఖిలాఫత్ కమిటీ కార్యదర్శి వడక్కేవిట్టిల్ మహమ్మద్ ( VADAKKE-VITTIL MUHAMAD ) ఇంటి మీద దాడి జరిగింది. పుక్కుటూర్ జెన్మి అరవ తిరుముల్‌పాద్ ఇంటి నుండి తుపాకిని దొంగతనం చేసాడన్న ఆరోపణల మీద పోలీసులు దాడి చేసారు. ఈ చర్యలో పోలీసులకు తుపాకీ దొరకలేదు. మహ్మద్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నించగా ప్రజలు అడ్డుకుని ఆ ప్రయత్నాలను వమ్ముచేసారు. పోలీసులు ఉత్తచేతులతో తిరుగుముఖం పట్టారు.

ఈవిధంగా పలు ప్రాంతాలలో మోప్లాలు  పోలీసు బలగాల మీద, సైనికుల మీద, ప్రభుత్వ అనుకూల వర్గాల మీద, ఖిలాఫత్-సహాయ నిరాకరణోద్యమ వ్యతిరేకుల మీద పైచేయిగా ముందుకు సాగుతున్న సమయంలో, ప్రజల గౌరవాభిమానాలను సొంతం చేసుకున్న మౌల్వీ అలీ ముస్సలియార్ మీద ప్రభుత్వం కన్ను పడింది. ఆయన అరెస్టు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం తత్ఫలితంగా ఉత్పన్నమయ్యే అవాంఛనీయ పరిస్థితును ఎదుర్కొనడానికి కాలికట్ నుండి ప్రత్యేకంగా సాయుధ పోలీసు బలగాలను భారీ సంఖ్యలో రప్పించింది.

## మౌల్వీ అలీ ముస్సలియార్

మౌల్వీ అలీ ముస్సలియార్ 1853లో తూర్పు మంజేరిలోగల పండిక్కడ్ సమీపాన గల నెల్లిక్కుట్టులో జన్మించారు. తండ్రి ఇరిక్కున్నన్ పల్లట్టు మలయాలి కుంచి  మొహిద్దీన్, తల్లి అమీనా.  నెల్లిక్కుట్టులో ప్రాథమిక స్థాయి ధార్మిక విద్యను పూర్తి చేసిన ముస్సలియార్ ఉన్నత విద్యకోసం మక్కా వెళ్ళారు. మక్కా నుండి తిరిగి వచ్చాక, లక్ష దీవులలోని కనారట్టి ద్వీపంలోని ఒక పాఠశాలలో ప్రధానాచార్యుడిగా చేరారు. అక్కడ పనిచేస్తున్న సమయంలో మలబార్‌లోని తన కుటుంబీకులు 1894 మే 24న బ్రిటీష్ బలగాలతో పోరాడుతూ ప్రాణాలు విడిచిన సమాచారం అందుకుని స్వస్థలానికి వచ్చేశారు. 1897లో జరిగిన మరొక పోరాటంలో మిగిలిన కుటుంబ సభ్యులు కూడా బ్రిటీష్ పోలీసుల ఊచకోతకు గురయ్యారు. ఆ సంఘటనతో మోప్లా రైతు జనావళి పట్ల అత్యంత కిరాతకంగా వ్యవహరిస్తున్న తెల్ల పాలకులను ఎలాగైనా తరిమివేయాలని ఆయన దృఢంగా నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయంతో   కరడుగట్టిన బ్రిటీష్ వ్యతిరేకిగా, జాతీయ భావాలను నరనరాన నింపుకున్న పచ్చి జాతీయవాదిగా ఆయన రూపాంతరం  చెందారు.

ఈ మధ్య కాలంలో ఆయన అనేక విద్యా సంస్థలలో పనిచేసారు. 1907లో తిరుంగాడిలోని ప్రముఖ విద్యాసంస్థకు అధిపతిగా నియమితులయ్యారు. విద్యార్థులకు ధార్మిక మార్గదర్శకత్వంతో పాటుగా బ్రిటీష్ వ్యతిరేకత నూరిపోసారు. 1916 ప్రాంతంలో జాతీయోద్యమ పవనాలు వీచటంతో ఆ బాటను అందిపుచ్చుకున్నారు.  1920లో తిరుంగాడి పట్టణ ఖిలాఫత్ కమిటీ ఏర్పడినప్పుడు పి.యం. పుక్కోయా తన్నల్‌తో పాటుగా అలీ ముస్సలియార్ కూడా కమిటీ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వం, ఆదర్శవంతమైన మార్గదర్శకత్వంలో తిరుంగాడి పట్టణ సమీప గ్రామాలలో ఖిలాఫత్ కమిటీలు ఏర్పడ్డాయి.  ఆయన ప్రత్యేక శిక్షణలో కార్యకర్తలు సుశిక్షితులుగా తయారయ్యారు. కార్యకర్తలకు ప్రత్యేక దుస్తులు నిర్దేశించారు. ప్రతి శుక్రవారం ఆయన అనుచరులు, నిర్దేశించిన దుస్తులతో ఎంతో క్రమశిక్షణతో ప్రార్థనలకు రావటం, తిరిగి వెళ్ళటం జరిగేది. ఆ రోజున జరిగే ప్రసంగాలలో తుపాకీ తూటాల్లాంటి మాటలతో బ్రిటీష్ పాలకుల మీద ఆయన విరుచుకుపడేవారు. బ్రిటీష్ ప్రభుత్వం కూలిపోతుందనీ, గాంధీజీ, అలీ సోదరులు తమకు సహాయపడతారని, ప్రజలంతా గాంధీజీకి, అలీ సోదరులకు తోడ్పాటు అందించాలని, బ్రిటీష్ న్యాయస్థానాలను బహిష్కరించాలని, బ్రిటీష్ అధికారులను అంతం చేయాలని, మౌల్వీ ముస్సలియార్ ఆ ప్రసంగాలలో నొక్కి చెప్పేవారని బ్రిటీష్ అధికారి

యఫ్.బి. ఇవాన్స్ తన నివేదికలో పేర్కొన్నాడు.

చివరకు మౌల్వీ అలీ ముస్సలియార్‌ను అరెస్టు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆయన కోసం కాలికట్ నుండి ప్రత్యేకంగా వచ్చిన పోలీసు బలగాలు వేట ప్రారంభించాయి. ఆగస్టు 19వ తేదీ రాత్రి జిల్లా కలెక్టర్, డి.యస్.సి. హిచ్‌కాక్, పోలీసు ఉన్నతాధికారులు తమ బలగాలతో తిరుంగాడి చేరుకున్నారు. గ్రామాన్ని చుట్టుముట్టి మౌల్వీ అలీ, ఇతర నాయకుల కోసం ప్రార్థనాలయాలు, గృహాలను సోదా చేశారు. ప్రముఖ ఖిలాఫత్ నేతలు లవకుట్టీ, కున్హల్వీ, ఖాదర్ మొహిద్దీన్‌లాంటి వారెవ్వరూ పోలీసులకు చిక్కలేదు. ఆయుధాలు ఉన్నాయన్న నెపంతో వారి గృహాల మీద దాడులు జరిపినా ఎక్కడా ఏమీ దొరకలేదు. చివరకు నిద్రపోతున్న ఓ ముగ్గురు సామాన్య కార్యకర్తలను మాత్రం అదుపులోకి తీసుకుని తిరుంగాడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తిరుంగాడి ప్రజలు పోలీసు స్టేషన్ వద్ద గుమికూడగా, ఖిలాఫత్ నాయకుడు కె.యం. మౌల్వీ సర్ది చెప్పి పంపివేశారు. కాని పోలీసు బలగాలు పంరప్పన్‌గుడి సమీపాన గల టానూర్ అనుచోట గుమికూడిన జనం మీద ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండానే కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో నలుగురు మృతి చెందారు. ఏడుగురు గాయపడ్డారు. ఈ సంఘటనతో ప్రజలు బాగా రెచ్చిపోయారు.

ఈ విషయం ఇలా వుండగా ఆగస్టు 20న మౌల్వీ ముస్సలియార్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు వచ్చారని తెలిసి ఆగ్రహించిన ప్రజలు తమ ప్రియతమ నాయకుని అరెస్టును ప్రతిఘటించేందుకు అందిన ఆయుధమల్లా తీసుకుని తిరుంగాడి చేరుకున్నారు. తిరుంగాడి మసీదు, అక్కడ వున్న మరో పవిత్ర స్థలాన్ని బ్రిటీష్ బలగాలు కూలగొట్టారని సాగిన ప్రచారం ప్రజలలో మరింత ఆగ్రహానికి కారణమైంది.

ప్రముఖ ఖిలాఫత్ నాయకుడు మౌల్వీ కున్‌యి ఖాదర్ (Kunyi Kadar) నాయకత్వంలో తిరుంగాడి పట్టణానికి వస్తున్న మూడువేల మంది ప్రజలను బ్రిటీష్ పోలీసులు అడ్డుకుని కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన జరుగుతుండగానే మరోవైపు నుండి ప్రజలు పోలీసు బలగాల మీద పడ్డారు. ఆ ప్రజలను పోలీసులు నిలువరించకలేక అచేతనులయ్యారు. ఆయుధాలు కలిగియున్నా కూడా, తండోపతండాలుగా తరలి వస్తున్న ప్రజలను ఎదుర్కొవడం పోలీసు తుపాకులకు అసాధ్యమైంది. పరిస్థితులు విషమించటం గమనించిన అధికారులు గత్యంతరంలేక సమీపంలోని న్యాయస్థాన భవనంలో దాక్కున్నారు. ఆ భవనాన్ని ఉద్యమకారులు చుట్టుముట్టారు. ఆగ్రహంతో రగిలిపోతున్న మౌల్వీ అనుచరులు ఆ భవనంలోకి ప్రవేశించి అధికారుల మీద దాడి చేశారు. ఈ సంఘటనలో జిల్లా కలెక్టర్, మరో పోలీసు ఉన్నతాధికారి మరణించారు. ప్రజలు తరుముతుండగా బ్రతుకు జీవుడా అంటూ పారిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. పోలీసు బలగాలు తిరుంగాడి నుండి కాలికట్‌కు దౌడు తీసాయి. ఈ సంఘటనకు కారకుడని మోప్లా నాయకుడు మౌల్వీ కున్‌యి ఖాదర్ (Kunyi Kadar) ను పోలీసులు అరెస్టు చేసి, విచారణ తంతును జరిపించి, బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను ఉరితీసింది.

పోలీసు బలగాలు ఎప్పుడైతే పత్తా లేకుండా పారిపోయాయో మౌల్వీ అలీ

ముస్సలియార్‌ని ఆ ప్రాంతానికి తిరుగులేని నాయకునిగా ప్రజలు పరిగణించారు. ఆయన తక్షణమే పాలనాకార్యక్రమాల నిర్వహణను చేపట్టారు. హిందూ-ముస్లిం వివక్షతకు అతీతంగా పాలన సాగించారు. ఖిలాఫత్ రాజ్యం సాధించాలన్న లక్ష్యంతో సమర్ధవంతంగా వ్యవహరించారు. బ్రిటీష్ బలగాలు తిరిగి రాక తప్పదని, ఆ బలగాలను తట్టుకుని నిలబడగల శక్తి తమకు లేదని ఆయనకు తెలుసు. ఆత్మహత్యా సదృశ్యమైన పోరాటం కంటే ప్రజల ప్రాణాలను కాపాడుకునే రాజీ మార్గం పట్ల ఆయన అనుకూలత చూపారు. ఈ విషయాలను అలీ ముస్సలియార్‌తో కలిసి పనిచేసిన శ్రీ కేశవ మీనన్ వివరించారు.

ఈ సంఘటనల గురించి సాగిన ప్రచారం వలన పరిసర గ్రామాలకు గ్రామాలు కదలి తిరుంగాడి వచ్చాయి. ఆ విధంగా 30 వేల మంది జనం తిరుంగాడికి చేరుకున్నారు. పోలీసులు పలాయనం చిత్తగించటంతో ప్రజల ఆత్మవిశ్వాసం పెరిగి, ఎటువంటి భయంకర పరిస్థితులనైనా ఎదుర్కోటానికి సిద్ధం అయ్యారు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న మౌల్వీ అలీ ముస్సలియార్ రానున్న ప్రమాదాన్ని పసికట్టారు. కాలికట్‌కు వెళ్ళి పోలీసులు పెద్ద సంఖ్యలో తిరిగి తిరుంగాడి రాగలరని, మరింత కిరాతకంగా వ్యవహరించగలరని ఊహించారు. నాయకుల వలన, ప్రధానంగా తన వలన ప్రజలు ప్రాణాలు కోల్పోవటం సరికాదని భావించిన అలీ ఆలోచనలో పడ్డారు. సహచరులతో సంప్రదించారు. చర్చలకు సిద్ధమన్నారు. అప్పటికే ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు శ్రీ కేశవ మీనన్, మహమ్మద్ అబ్దుర్రెహమాన్, శ్రీ యు. గోపాలరావు, మౌల్వీ ఇ. మైదూ తదితరులు మరింత హింసాకాండ, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆ సమయంలో అలీ ముస్సలియార్ అనుచరులతో కలిసి చర్చలకు వచ్చారు. ప్రజల ప్రాణాలను కాపాడాలన్న లక్ష్యంతో రాజీకి సిద్ధమయ్యారు. ఆయన అనుచరులు అందుకు అంగీకరించకుండా, శత్రువుతో పోరాడుతూ వీరమరణం పొందడానికి సిద్ధమయ్యారు. చర్చలు సాగలేదు.

ఆగస్టు 28వ తేదీన భారీ సంఖ్యలో తిరుంగాడి చేరుకున్న పోలీసు బలగాలు, మౌల్వీ అలీ ముస్సలియార్, అనుచరులు బసచేసియున్న తిరుంగాడి జుమా మసీదును చుట్టుముట్టాయి. కందకాలు సిద్ధంచేసుకుని, ఆగస్టు 30వ తేదీన కాల్పులు ప్రారంభించాయి. మసీదు లోపల 114 మంది అనుచరులతో మౌల్వీ చిక్కుబడిపోయారు. పోలీసు కాల్పుల ఫలితంగా 22 మంది మరణించగా చాలామంది తప్పించుకున్నారు. ఈ పోరాటంలో బ్రిటీష్ పోలీసు బలగాలలో 20 మంది చనిపోయారు. చివరకు మౌల్వీ అలీ ముస్సలియార్‌తో పాటుగా 32 మంది లొంగిపోయారు. ప్రభుత్వం ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేసింది. మౌల్వీ ఆయన అనుచరులకు న్యాయవాదిని నియమించుకోడానికి, తమ వాదన విన్పించుకోడానికి అవకాశం ఇవ్వలేదు. ఈ విచారణ తంతు తరువాత మౌల్వీతో పాటుగా 12 మందికి ఉరిశిక్ష విధించారు. ముగ్గురిని అండమాన్ దీవులకు పంపారు. మిగిలిన 33 మందికి, జీవిత ఖైదును ఖాయం చేసారు. ఈ విషయాలన్నిటినీ శ్రీ కేశవ మీనన్ తన ' కలిన్నా కాలం ' అను గ్రంథంలో పేర్కొన్నారని ENCYCLOPAEDIA OF MUSLIM BIOGRAPHY, [APH PUBLISHING CORPORATION (2001) సంకలన కర్త NAGENDRA KUMAR SINGH వివరించారు. ఈ ఉరిశిక్ష అమలుకాకముందే మౌల్వీ

అలీ ముస్సలియార్ 1922 ఫిబ్రవరి 17వ తేదీన మరణించారు.

ఈ సంఘటనకు సంబంధించిన వివిధ కథనాలున్నాయి. MOPPILA MUSLIMS OF KERALA అను గ్రంథంలో ROLANAD E. MILLER (ORIENT LONGMAN - 1976) భిన్నమైన వివరాలు తెలిపారు. ఆ వివరాల ప్రకారం, తిరుంగాడిలో ప్రజలు బ్రిటీష్ పోలీసు బలగాల మీద తిరగబడినప్పుడు జరిగిన ప్రాణ నష్టాన్ని గమనించిన అలీ ముస్సలియార్ తాను దాక్కొన్న రహస్య స్థావరం నుండి స్వయంగా బయటకు వచ్చారు. బలగాలతో రాజీ కోసం వచ్చిన ఆయనను, ఆయన అనుచరులను నేల మీద కూర్చోమన్నారు. ఆ విధంగా కూర్చోగానే పోలీసులు ఆకస్మికంగా చుట్టుముట్టి కాల్పులు జరిపారని, ప్రజలు తిరగబడగా మొత్తం మీద 17 మంది మృతి చెందారు. ఆ సమయంలో అలీ తప్పించుకుని చెర్నాడ్ వెళ్ళి అక్కడి నుండి తిరుగుబాటును సాగించారు. ఆ తరువాత ఆయనను పట్టుకున్నారు. ట్రిబునల్ ద్వారా విచారణ జరిపి ఆయనకు మరణ శిక్ష విధించారని ROLANAD E. MILLER పేర్కొన్నారు.

## బ్రిటీషర్ల ఛాయలు కూడా మాయం

ఆగస్టు 20వ తేదీన పోలీసులు తిరుంగాడి నుండి పలాయనం చిత్తగించటం, పుక్కుటూర్, పొన్నాని తదితర ప్రాంతాలలో బ్రిటీష్ బలగాల మీద లభించిన విజయం, తిరుంగాడిలో చావు దెబ్బలు తిని పారిపోయిన బ్రిటీష్ అధికారుల, సైనిక బలగాల పిరికి చర్యలు మోప్లా నాయకులలో, ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని ఇనుమడింపచేసింది. ఆ తరువాత 21వ తేదీన ఖిలాఫత్ ఉద్యమకారులకు లభించిన అనూహ్య విజయంతో మరింత రెచ్చిపోయారు. బ్రిటీష్ పాలకుల చిహ్నాలనే కాదు, ఛాయలను కూడా తమ ప్రాంతాల నుండి పూర్తిగా తుడిచి వేయాలని సంకల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల మీద దాడులు జరిపారు. తగులబెట్టారు. రైలు పట్టాలను పీకివేసారు. స్టేషన్లను నాశనం చేసారు. టెలిగ్రాఫ్ తీగలను తెంపివేసారు. వంతెనలను కూల్చివేసారు. న్యాయస్థానాల ప్రాంగణాలను కూడా విడిచిపెట్టకుండా ధ్వంసం చేశారు. ఈ విధంగా మోప్లా తిరుగుబాటు కాలంలో మొత్తం పది రిజిస్ట్రార్ కార్యాలయాలు, 23 పోస్టాఫీసులు, 52 స్థానిక ప్రభుత్వ కార్యాలయాలను ఉద్యమకారులు ధ్వంసం చేసారని ప్రభుత్వ నివేదికలు తెలిపాయి.

ఈ సందర్భంగా బ్రిటీష్ అధికారులకు వత్తాసు పలికిన వల్లువనాడు, ఎర్నాడు జిల్లాలోని అతి పెద్ద భూస్వామి నీలాంబర్ రాజు ప్రాసాదాన్ని మోప్లాలు దోచుకున్నారు. భూస్వాముల దోపిడీ ఫలితంగా తీవ్ర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, ఆకలి మంటలతో అలమటిస్తున్న పేద రైతాంగం ఈ సంఘటనలో పాల్గొంది. కోట లాంటి నీలాంబర్ రాజా ప్రాసాదంలోని ధాన్యపు కళ్ళాలు రైతులను నిలువనివ్వకుండా చేసాయి. గంజినీళ్ళకు కూడా మొహం వాచి ఉన్న రైతులు పది రోజులపాటు కడుపునిండా భోజనాలు చేస్తూ ప్రాసాదంలో గడిపారు. ఆనాటి ఈ సంఘటనను మాజీ బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగి శ్రీ గోపాల్ నాయర్ రాసిన పుస్తకంలో చాలా సవిరంగా వివరించారు.

ఈ తిరుగుబాటులలో ఖిలాఫత్ కార్యకర్తలు, మోప్లా రైతులు తమకు శత్రువుగా వ్యవహరించిన ప్రతి ఒక్కరి మీద విరుచుకుపడ్డారు. ఖిలాఫత్ కార్యకలాపాలను వ్యతిరేకించిన

వారందరిని శత్రువులుగా భావించారు. ప్రధాన శత్రువైన తెల్ల పాలకులకు అనుకూలంగా వ్యవహరించిన వారంతా తమకు శత్రువులని ప్రకటించారు. శత్రువు హిందువైనా, ముస్లిమైనా క్షమించలేదు. శత్రువుతో సహకరించినా, ఆశ్రయం కల్పించినా, సమాచారం అందించినా అంతం చేసారు. బ్రిటీష్ పోలీసులకు సమాచారం అందజేస్తున్న రిటైర్డ్ పోలీసు అధికారి KHAN BAHADUR KURIMANNIL VALIYAMANNIL CHEKKUTTI SAHIB ని తిరుగుబాటు నాయకుడు హాజీ కున్ హమ్మద్ నాయకత్వంలో హత్య చేసారు. బ్రిటీష్ ప్రభుత్వంతో, జెన్మిలతో చేతులు కలపొద్దంటూ కున్ హమ్మద్ హెచ్చరికలు చేసాడు. బ్రిటీష్ బలగాలను, అధికారులను సమర్ధించిన మోప్లాలను అవిశ్వాసులుగా ప్రకటించారు. ఈ పరంపరలో 1921 అక్టోబర్ 21 ప్రాంతంలో పట్టికాడు గ్రామం వద్ద 15 ముస్లిమేతరుల గృహాలను తగులబెట్టారు. నవంబర్ 24 తేదీన కాలికాపు అను గ్రామంలో ఖిలాఫత్ వ్యతిరేకులైన మోప్లాలకు సంబంధించిన 40 గృహాలను దహనం చేసారు. పరాయి పాలకులకు వత్తాసు పలికిన ప్రతి ఒక్కరూ ఇటువంటి శిక్షను అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ మేరకు పలు శిక్షలు విధించారు.

ఆగస్టు సంఘటన తరువాత ఖిలాఫత్ ఉద్యమ నాయకులలో ఒకరైన మలప్పురం ధార్మిక నాయకుడు కె. సయ్యద్ మహమ్మద్ కోయా, శ్రీ పి. సన్‌కున్ని మీనన్ అను అధికారితో మాట్లాడుతూ **'.. బ్రిటీష్ ప్రభుత్వం సమాప్తమైంది. ఖిలాఫత్ పాలన ప్రారంభమైంది...'** అనడాన్ని బట్టి ఆ రోజుల్లో మోప్లాలకు లభించిన విజయాలు ఎంతటి ఆత్మస్థైర్యాన్ని తెచ్చిపెట్టాయో తెలుస్తుంది. ఆనాటి సంఘటలనో పాల్గొని 1974 వరకు బ్రతికున్న కె.యం. మహ్మద్ అను మోప్లా యోధుడు Prof. CONRAD WOOD తో మాట్లాడుతూ **'...పుక్కొట్టూరు వద్ద పోరాటంలో పోలీసులు పూర్తిగా ఓడిపోయారన్న భావనను నేతలు మాలో కల్పించారు. పోలీసులకు ఎటువంటి అధికారాలు లేవు. కొద్దిగా శ్రమిస్తే మనం గెలుస్తాం ...'** అని మా నాయకులు చెప్పారన్నారు.

## మోప్లా యోధుల పాలన

మోప్లా కార్యకర్తలలో ప్రగాఢ విశ్వాసాన్ని ఇనుమడింపచేసిన నాయకులు ఖిలాఫత్ పాలనకు అంకురార్పణ చేసారు. ఆధిపత్యం చాటుకున్న ఖిలాఫత్ నాయకులు తమ ప్రాబల్యంగల ప్రాంతాలను, పాలనా సౌలభ్యం కోసం విభజించుకున్నారు. ఈ విధంగా పాలన చేసిన వారిలో మౌల్వీ అలీ ముస్సలియార్, హాజీ కున్నాథ్ కున్హా అహమ్మద్, నీతికొయా తంగల్, చెంబ్రాశరీ ఇంబిచ్చి కోయా తంగల్ లాంటి వారిని పేర్కొనవచ్చు, ఈ నేతలంతా తమకు పట్టుగల ప్రాంతాలను ప్రత్యేక రాజ్యాలుగా ప్రకటించుకున్నారు.

బ్రిటీష్ ప్రభుత్వంలో పనిచేసిన శ్రీ గోపాల్ నాయర్ రాసిన పుస్తకంలో హాజీ కున్నాథ్ కున్హా అహమ్మద్ గురించి వివరించారు. ఈ పుస్తకాన్ని బ్రిటీష్ అధికారులు బాగా మెచ్చుకున్నారు. ఈ మెచ్చుకోలును బట్టే ఆనాడు ఆయన రాసిన అంశాలు తప్పకుండా ఉద్యమకారులకు వ్యతిరేకంగా ఉంటాయన్నది నిర్వివాదాంశం. అయినప్పటికీ అందులో కూడా కొన్ని వాస్తవాలు చెప్పక తప్పలేదు. ఆ వివరాల ప్రకారం **'..వారియర్ కున్నాథ్ కున్హా అహమ్మద్ హాజీ**

**గ్రామం వచ్చి, బండి తోలుకుని జీవించడం మొదలు పెట్టాడు. ఖిలాఫత్ ఉద్యమంలో చేరి ఎర్నాడులో ఉద్యమ నాయకుడయ్యాడు. తిరుగుబాటు రాగానే, తాను రాజన్నాడు...ఇతను హిందువులకు రాజుగా, మహమ్మదీయులకు మత గురువుగా, ఖిలాఫత్ ఉద్యమానికి సేనా నాయకుడిగా నటించాడు. ఖిలాఫత్ ఉద్యమ యూనిఫారం, బ్యాడ్జి, టర్కీ టోపి, చేతిలో ఖడ్గం ధరించి వల్లువనాడు, ఎర్నాడు తాలూకాల్లో సంపూర్ణ స్వరాజ్యం అనుభవించాడు. దోపిడీలు దొమ్మీల వల్ల ప్రజలు చాలా బాధలను అనుభవిస్తున్నారని, అందుచేత యుద్ధ చందాలు తప్ప మిగతా పన్నులు వసూలు చేయబోనని ప్రకటించాడు. తన రాజ్య పరిధి దాటి ఎవరైనా బయటకు వెళ్ళదలిస్తే, ఆ వ్యక్తి శక్త్యానుసారం డబ్బిస్తే బయటకు వెళ్ళేందుకు అనుమతి పత్రాలిచ్చాడు..'.** ఈ యోధుడు హిందూ-ముస్లింల ఐక్యతను కోరుకున్నాడు. ఐక్యత కరువైతే శత్రువును ఎదుర్కోవటం కష్టమని గ్రహించి, ముస్లిమేతరులకు కష్టం-నష్టం కలుగకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నాడు. **'...హిందువులను చంపొద్దు. వారి ఇష్టానికి వ్యతిరేకంగా ఇస్లాంలోకి మార్చొద్దు. మనం వారిని బాధలకు గురిచేస్తే వారు శత్రుపక్షం చేరిపోతారు. మన పరాజయానికి కారకులు కాగలరు. మనకు హిందూ వ్యతిరేకత లేదు. పాలకులకు (బ్రిటీష్) ఎవరైతే మద్దతు ఇస్తారో వారిని మాత్రమే మనం శిక్షిస్తాం. మనకు ముస్లిం రాజ్యం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యం లేదు...'** అని స్పష్టంగా ప్రకటించాడు. సరిహద్దు రక్షణ దళాన్ని ఏర్పాటు చేసాడు. హాజీ కున్నాథ్ కున్హా అహమ్మద్ రాజ్యం ఎంతో కాలం సాగలేదు. 1922 జనవరి 6 తేదీన బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి కాల్చి చంపింది.

ఆ సమయంలో హాజీ కున్నాథ్ కున్హా అహమ్మద్ అంతటి స్థాయిలో కాకున్నా పాలనాధ్యక్షుడిగా ఖ్యాతి గడించిన మరొక నాయకుడు నీతికోయా తంగల్, కోయా తంగల్ కుమారం పత్తూరు గ్రామానికి చెందినవాడు. ఈయన కూడా తనను తాను పాలకునిగా ప్రకటించుకున్నాడు. విధ్వంసక చర్యలకు పాల్పడరాదని అనుచరులను ఆదేశించాడు. లూటీలు చేయరాదని, ఆజ్ఞలు జారీచేసాడు. ఆదేశాలు ఉల్లంఘించిన కార్యకర్తలను కఠినంగా శిక్షించాడు. ప్రజలను మత భేద భావనతో చూడలేదు. ఎవ్వరు తప్పు చేసినా మతాలతో ప్రసక్తి లేకుండా కఠినంగా వ్యవహరించాడు. తిరుగుబాటు చల్లారిన తరువాత ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి కాల్చివేసింది.

ఆ బాటలో నడిచిన మరో నేత చెంబ్రాశ్శరీ ఇంబచ్చి కోయాతంగల్. ఆయన కూడా తనను తాను రాజుగా ప్రకటించుకున్నాడు. తన పరిధిలోని అనేక గ్రామాలకు ప్రతినిధులను నియమించాడు. ఆదేశాలను జారీ చేస్తూ కార్యకలాపాలు సజావుగా జరిగేటట్టు జాగ్రత్త పడ్డాడు. తిరూర్-కరువారంకుండు గ్రామాల మధ్యన నున్న పర్వత ప్రాంతాలలో న్యాయస్థానం ఏర్పాటు చేసాడు. అక్కడ నాలుగు వేల మంది అనుచరులను సమీకరించాడు. బ్రిటీష్ అధికారులకు వత్తాసు పలికిన, ఖిలాఫత్ పోరుకు వ్యతిరేకంగా వ్యవహరించిన 40 మందిని తన న్యాయస్థానానికి రప్పించాడు. ఈ నిందితులంతా సైనికులకు, బ్రటీష్ పోలీసులకు పాలు పండ్లు సరఫరా చేసి సహకరించారన్న ఆరోపణలను విచారించాడు. ఆరోపణలు రుజువు కావటంతో 33 మందికి మరణశిక్ష విధించి, దగ్గర ఉండి అమలు జరిపించాడు.

1922 జనవరి 20వ తేదీన చెంబ్రాశ్శరీ ఇంబిచ్చి కోయా తంగల్‌ను ప్రభుత్వం అరెస్టు చేసి కాల్చి చంపింది.

ఆ కోవలోనే పాలన చేసిన మరొకరు, కట్టిగల్ తంగల్. ఆయన వెల్లంచెర్రి రాజుగా ప్రకటించుకున్నాడు. ఈ టైటిల్‌ను ఆయన చెంబ్రాశరీ తంగల్ నుండి పొందాడు. తన ప్రాంతం నుండి ఇతర తంగల్స్‌కు, వారి సహచరులకు ఆర్థిక, ఆహార, ఆయుధ సరఫరా గావించాడు. తిరుంగాడి మౌల్వీ అలీ ముస్సలియార్ స్వల్ప కాలం మాత్రమే పాలన చేసినప్పటికీ ఇతర తంగల్స్, పాలకులు ఆయనను ఆదర్శంగా తీసుకున్నారు. స్వపర భేదాన్ని చూడలేదు. తప్పు ఎవరు చేసినా, ఆజ్ఞలను ఎవరు ఉల్లంఘించినా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. బ్రిటీష్ అనుకూలతను చూపిన ముస్లిమేతరుల కంటే, ఆజ్ఞలను జవదాటిన మోప్లాలను కఠినంగా శిక్షించారు. ఈ వరవడినే ఆ తరువాత ఇతరులు స్వీకరించారు.

మోప్లాలలో అత్యధికులు విద్యా జ్ఞానం లేనివారైనప్పటికీ తిరుగుబాటును పకడ్బందీగా సాగించారు. శత్రువుకు సమాచారం అందకుండా, ఆహార పదార్థాలు సరఫరా కాకుండా, బలగాలు గమ్యానికి త్వరగా చేరకుండా చేయడానికి అవసరమైన అన్ని చర్యలను పటిష్టంగా నిర్వహించారు. తిరుగుబాటు వ్యవహారమంతా పథకం ప్రకారంగా సాగిందని, బ్రిటీష్ అధికారి, మద్రాసు గవర్నర్ లార్డ్ విల్లింగ్‌టన్ 1921 సెప్టెంబర్ మాసంలో వైశ్రాయికి పంపిన నివేదికలో స్పష్టం చేసాడు. తిరుగుబాటు నాయకులు సాగించిన స్వతంత్ర పాలన అద్భుతంగా సాగింది. ఈ విషయాన్ని కూడా బ్రిటీష్ ఉన్నతాధికారులు తమ లేఖలలో అంగీకరించారు. మలబారు వ్యవహారాల మీద నివేదిక సమర్పించిన సైనికాధికారి మేజర్ వాల్కర్ తన నివేదికలో, **'... మన గైర్హాజరిలో వారు (మోప్లాలు) ఈ ప్రాంతంలో తమదైన సామ్రాజ్యాన్ని స్థాపించుకోగల వ్యక్తిత్వం, శక్తియుక్తులు కలిగియున్నార...'** ని పేర్కొనడం చూస్తే మోప్లా నేతల సామర్థ్యం అవగతం అవుతుంది.

## మోప్లాల పట్టులో పలు గ్రామాలు

ఈ సందర్భంగా మలబారు ప్రాంతంలో రెండు ప్రధాన పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాలు ఆగస్టు 26న ఒకటి పుక్కుట్టూర్‌లో, నవంబర్ 14న పండిక్కాడ్‌లో సాగాయి. పుక్కుట్టూర్ పోరులో మోప్లా వీరులు అసమాన ధైర్య సాహసాలు చూపారు. బ్రిటీష్ సైనికుల వద్దనున్న ఆధునిక ఆయుధాలు మోప్లా రైతుల వద్ద లేవు. రైతుల సాంప్రదాయక పనిముట్లే ఆయుధాలయ్యాయి. ఉద్యమకారులలోనున్న పట్టుదల, శత్రువు మీద ఉన్న కసి, పరాయి పాలకులంటే ఏర్పడిన తీవ్ర వ్యతిరేకత, భరించరాని దుస్థితి ప్రేరణగా ముందుకు నడిపించాయి.

ఈ లోగా బ్రిటీష్ బలగాలు మరింత సంఖ్యను, ఆయుధాలను సమకూర్చుకున్నాయి. పర్వత ప్రాంతాలు, అటవీ ప్రదేశాలలో పోరాటాలకు పేరెన్నికగన్న పలు సైనిక పటాలాలు మలబారులో దిగాయి. భీకర పోరు జరిగింది. ఈ పోరాటాలలో మోప్లాలకు అధిక ప్రాణ నష్టం జరిగింది. పుక్కుట్టూరులో 300-400 మంది, పండిక్కాడ్‌లో 234 మంది ఉద్యమకారులు ప్రాణాలు విడిచారు. నవంబరు 13వ తేదీన జరిగిన మరొక పోరాటంలో

56 మంది రైతులను సిపాయిలు బలితీసుకున్నారు. ఆ మర్నాడు మరో 104 మంది హతులయ్యారు. నవంబరు 28వ తేదిన ఘూర్ఖా రెజిమెంటు మీద మోప్లాల దాడి జరిగింది. ఈ దాడిలో 58 మంది మోప్లా రైతులు సైనిక శిబిరాల్లోకి చొరబడ్డారు. ఆ సాహసులను సైనిక శిబిరాల్లోనే సైనికులు అంతం చేసారు. ఈ పోరాటాలలో జరిగిన నష్టం దృష్ట్యా అప్పటి నుండి ఎదురెదురుపడి పోరాడే పద్ధతులకు స్వస్తి పలికి మోప్లాలు గెరిల్లా పోరుబాటను ఎన్నుకున్నారు. పట్టణ ప్రాంతాలలో బ్రిటీష్ బలగాలది పైచేయి కాగా, గ్రామీణ ప్రాంతాలు మాత్రం ఉద్యమకారుల పట్టులోనే ఉండిపోయాయి. ఈ పరిస్థితులలో **' మార్షల్ లా '** ప్రకటించారు. మోప్లాల ప్రాబల్యం గల ప్రాంతాల మీద ప్రభుత్వ బలగాలు విరుచుకుపడ్డాయి. పట్టణాలు, గ్రామాలలో సోదా ప్రారంభించాయి. పోరాడుతూ అమరత్వం పొందటం ప్రాథమిక లక్ష్యంగా వ్యవహరించే ప్రవృత్తి గల మోప్లాలు ఒంటరిగా బలగాలను ఎదుర్కొంటూ షహీద్ కావటం కోసం ఉత్సాహపడటం పోలీసు బలగాలకు మింగుడు పడలేదు.

ఈ పరిస్థితులలో ప్రజల మీద పాశవిక దాడులకు ప్రభుత్వ బలగాలు పాల్పడ్డాయి. ఉద్యమకారులను, ఉద్యమాలకు సంబంధంలేని వారి పట్ల ఒకే రకంగా వ్యవహరించాయి. విదేశీ సైనికులు మోప్లాలు అంటేనే శత్రువులుగా పరిగణించారు. అక్టోబర్ 25న మేల్‌మూర్ గ్రామం మీద దాడిచేసి ఉద్యమకారులను, సానుభూతిపరులను, సామాన్య ప్రజలను గృహాల నుంచి బయటకు ఈడ్చుకుని వచ్చి కాల్చి చంపారు. నవంబరు 16వ తీదీన కుజిహిమన్నా అను గ్రామంలో 15 మంది మోప్లాలను దారుణంగా హతమార్చారు. ఈ సంఘటన తరువాత 15 మంది ఆ మోప్లాలు అమాయకులని వెల్లడైంది. ప్రభుత్వ బలగాలకు స్త్రీ పురుష భేదం లేకుండా పోయింది. ఈ అకృత్యాలకు ప్రధానంగా మోప్లా మహిళలు, పిల్లలు గురయ్యారు. మహిళలను కాన్సెంట్రేషన్ క్యాంపులలో నిర్బంధించి చిత్రహింసలు పెట్టారు. ప్రజలలో ప్రధానంగా మహిళలలో భయోత్పాతం కలిగించేందుకు తిరుగుబాటు వీరులను అరెస్టు చేసి బహిరంగంగా ఉరితీసి, గ్రామాలలోని చెట్లకు వేలాడదీసారు. మృతదేహాలను తీసుకువెళ్ళడానికి కూడా అనుమతించలేదు. మలబారు ప్రాంతమంతా కాల్పులతో, ఉరితీతలతో, చిత్రహింసలతో రక్తసిక్తమైంది. శ్మశానవాటికగా మారింది. అన్ని అరాచకాలను అనుభవిస్తూ కూడా మహిళలు తమ పురుషులకు పూర్తి మద్దతు పలికారు. **'.... మోప్లాల చేతుల్లో హిందువులు అనుభవించిన కష్టాల కంటే మోప్లా మహిళలు బ్రిటీష్ సైనికుల చేతుల్లో భయంకర కష్టాలను అనుభవించార...'** ని శ్రీ మాధవన్ నాయర్ తన కలాపురం (KALAPURAM) లో రాసారు.

## పదివేల ప్రాణాలు బలి

శతాబ్దం క్రితం ప్రారంభమైన బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో బలైన మోప్లాల ప్రాణాల సంఖ్య కంటే జాతీయోద్యమంలో భాగంగా సాగిన తిరుగుబాట్లలో మోప్లా జనసముదాయం అత్యధికంగా నష్టపోయింది. బ్రిటీషర్ల కిరాతకానికి సుమారు 10వేల మంది బలైనారని అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. Dr.ROLAND E MILLER సమాచారం ప్రకారంగా పదివేల మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం మాత్రం కేవలం వెయ్యి మంది చనిపోయారని ప్రకటించింది. 1922 జనవరి నాటికి 2,266 మంది మోప్లాలను బ్రిటీష్

బలగాలు పొట్టన పెట్టుకున్నాయని మరొక అధికారిక నివేదిక తెలిపింది. బ్రిటీష్ అత్యున్నత అధికారి లార్డ్ రావిల్సన్ నివేదిక ప్రకారంగా సైనికులతో పోరాడుతూ 4 వేల మంది తిరుగుబాటుదారులు మరణించగా, 169 మంది సైనికులు హతమయ్యారు. తిరుగుబాటు ఫలితంగా 462 హత్యలు, 5941 దోపిడీలు, 352 గృహదహనాల సంఘటనలు జరిగాయని Prof. CONARD WOOD పేర్కొన్నాడు.

బ్రిటీష్ రాజ్యం స్థానంలో మోప్లాలు ఖిలాఫత్ రాజ్య స్థాపనను చేయాలని అనుకుంటున్నారని భావించిన పాలకులు మోప్లాల పట్ల చాలా క్రూరంగా వ్యవహరించారు. మార్షల్ లా ప్రకటించిన తరువాత 252 మంది మోప్లాలను కోర్టు మార్షల్ చేసి కాల్చివేసారు. 502 మందికి జీవిత కారాగార శిక్ష విధించారు. వేలాది మందిని సంవత్సరాలపాటు జైళ్ళపాల్జేసారు. పదిమంది పట్టే జైలులో వంద మందిని ఉంచి, కనీస వసతులు కూడా లేకుండా చేసి, కడుహీనమైన పరిస్థితులను మోప్లాలు అనుభవించేట్టుగా చేసారు.

## బళ్ళారి రైలు విషాదాంతం

ఈ సందర్భంగానే మలబారు పోరాట చరిత్రలో అత్యంత కిరాతక చర్యగా చరిత్ర పుటలకెక్కిన **బళ్ళారి రైలు సంఘటన** జరిగింది. ఈ సంఘటన ఆంగ్లంలో **'ట్రైన్ ట్రాజెడీ'** గా పిలువబడింది. కలకత్తా చీకటి కొట్టులో బ్రిటీష్ అధికారులను, సైనికులను కుక్కి దారుణంగా చంపాడని సిరాజుద్దౌల ఆనాడు విమర్శలకు గురయ్యాడు. ఆ సంఘటనను **'కలకత్తా ట్రాజెడి'** గా బ్రిటీషర్లు ప్రచారం చేసారు. ఈ విషయాలను పాఠ్య పుస్తకాలలో చేర్చి పసి హృదయాలను బాగా ప్రభావితం చేసారు. ఈ సంఘటన మీద విదేశీ చరిత్రకారుల్లో కూడా ఏకాభిప్రాయం లేదు. అటువంటి వివాదాస్పద అంశానికి రంగులు పూసి జనంలో ప్రచారం చేసిన బ్రిటీష్ చరిత్రకారులు **'బళ్ళారి రైలు విషాదాంతాన్ని'** మాత్రం ఉద్దేశ్యపూర్వకంగానే మరచిపోయారు. కలకత్తా సంఘటనకు సిరాజుద్దౌలా కారణమయ్యాడో లేదో కాని **'ట్రైన్ ట్రాజెడీ'** కి మాత్రం బ్రిటీష్ అధికారులు కారణమయ్యారు.

1921 ఆగస్టులో ప్రారంభమైన తిరుగుబాటు పలు అంతర్గత, బహిర్గత కారణాల మూలంగా నవంబరు మాసాంతానికి బలహీనపడసాగింది. మోప్లా నాయకులు ఒక్కొక్కరుగా అంతం కావటం, ఉద్యమకారులు సైనికుల తుపాకిగుండ్లకు బలికావటం, అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు జైళ్ళ పాలవటం, బ్రిటీష్ సైనిక బలగాలు మోప్లాల ఆధిపత్యం గల ప్రాంతాలలోని ప్రతి అంగుళాన్ని ఆక్రమించుకోవడం, మార్షల్‌లా ప్రకటించిన ప్రభుత్వం పోలీసులు, సైనిక బలగాలతో పల్లె, పట్టణ ప్రాంతాలన్నిటినీ అడుగడుగున సోదాలు నిర్వహించి, భారీగా అరెస్టులు సాగించటం లాంటి చర్యలు ఉద్యమం నీరసపడడానికి కారణమయ్యాయి. ఈ చర్యలకు తోడుగా పాలక వర్గాలు సామదాన భేదోపాయాన్ని ఆచరణలోకి తెచ్చాయి. ఉద్యమకారుల పట్టుగలిగిన గ్రామాలకు సామూహిక జరిమానాలు విధించారు. ఉద్యమకారులు లొంగిపోయినట్లయితే క్షమిస్తామని, శిక్షల తీవ్రత ఉండదని ప్రకటించారు. ఉద్యమనేతలకు సహకారం ఇవ్వనట్టయితే ఆ గ్రామాలకు విధించిన సామూహిక జరిమానాలను రద్దు చేస్తామన్నారు. ఈ మేరకు పలు గ్రామాల మీద మొత్తం 30 వేల

రూపాయల జరిమానాను విధించారని, విధించింది 30 వేలైనా వసూలు చేసింది లక్ష రూపాయలని Dr. SANTIMOY RAY తన గ్రంథం FREEDOM MOVEMENT AND INDIAN MUSLIMS లో బ్రిటీష్ అధికారుల నివేదికాంశాలను ఉటంకించారు. అడిగినంత జరిమానా చెల్లించలేక పోయిన గ్రామాలకు చెందిన వందలాది మోప్లాలను చిత్రహింసల కేంద్రాలలో బందీలను చేసారు. ఈ వాతావరణం మోప్లాల ఆలోచనలలో మార్పు తెచ్చింది. గతంలో లాగా శత్రువుతో పోట్లాడుతూ అమరత్వం పొందటం కాకుండా పోరాటం ద్వారా ఫలితాన్ని ఇహ లోకంలోనే సాధించాలన్న భావన కారణంగా వృధాగా ఆత్మార్పణలు చేయడం ఎందుకన్న ప్రశ్న ఉద్భవించింది. ఈ విషయమై పలువురు తంగల్స్, అధికారుల ప్రకటనల ప్రభావానికి మోప్లాలు లోనయ్యారు.

ఈ పరిస్థితులలో పలువురు మోప్లాలు బ్రిటిష్ సైనికుల ఉచ్చులో చిక్కుకున్నారు. అలా చిక్కిన మోప్లాల బృందాన్ని తిరూర్ జైలు నుంచి బళ్ళారి జైలుకు పంపాలని నిర్ణయించారు. మోప్లాలను తరలించడానికి ఒక గూడ్స్ వ్యాగన్‌ను తెప్పించారు. ఆ వ్యాగన్ 18 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పు ఉంది. మోప్లాలు 127 మంది ఉన్నారు. అంతమంది ఆ వ్యాగన్‌లో పట్టరు. ఆ విషయం అధికారులకు పట్టలేదు. మోప్లాలందరిని ఆ వ్యాగన్‌లో పచ్చి చేపలను కుక్కినట్లు కుక్కారు. ఆ వ్యాగన్ పట్టనప్పటికీ మరో వ్యాగన్ తెప్పించలేదు. అందర్ని కుక్కి వ్యాగన్ తలుపులు తెరుచుకోడానికి వీలు లేకుండా బిగించారు.

1921 నవంబర్ 19న రైలు బళ్ళారికి బయలుదేరింది. రైలు బయలుదేరగానే ప్రజల హహాకారాలు మిన్నుముట్టాయి. తమ ఆత్మీయులను క్రూరమైన రీతిలో జైలుకు తరలిస్తున్న సంఘటన చూస్తున్న ఆప్తులకు దుఖ:ం ఆగలేదు. ఏమి చేయలేని పరిస్థితి. నోరు తెరిస్తే జైళ్ళు నోళ్ళు తెరుస్తాయి. లాఠీలు వీపుల మీద నర్తిస్తాయి. ఆత్మీయుల ఆక్రందనలు వింటూ సంబంధితులు మిన్నకుండి పోయారు. వ్యాగన్‌లో మోప్లాలు కిక్కిరిసి పోవటంతో గాలి పీల్చడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. వ్యాగన్‌కు కొత్తగా పెయింటింగ్ కూడా చేయటం వలన, దానికున్న చిన్నపాటి రంధ్రాలు మూసుకుపోయాయి. శ్వాస పీల్చడం కూడా కష్టమైపోయింది. రైలు సాగుతోంది. రైలు గార్డులకు మోప్లాల ఆర్తనాదాలు, హాహాకారాలు విన్పిస్తున్నా ఏమీ పట్టనట్టుగా ఉండి పోయారు.

రైలు ప్రయాణం ప్రారంభంలో విన్పించిన ఆక్రందనల స్థాయి క్రమక్రమంగా సన్నగిల్లసాగింది. మంచినీళ్ళు కోరుతూ సాగిన కేకలు క్రమంగా తగ్గిపోయాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా విన్పించటంలేదు. భయంకర విషాదం మోప్లాలను అలుముకుంటున్నప్పటికీ సైనికాధికారులలో స్పందన రాలేదు. రైలు తిరూర్ నుండి 90 మైళ్ళ దూరంలో గల కోయంబత్తూరు చేరుకుంది. ఆ సమయంలో అసలు వ్యాగన్‌లో ఎవ్వరూ లేనట్టుగా, ఎటువంటి అలికిడి విన్పించలేదు. అధికారులకు అనుమానం వచ్చింది. వ్యాగన్ తలుపులు తెరిచారు. వ్యాగన్‌లో ఉన్న మోప్లాలలో ఎటువంటి కదలికలేదు. అంతా స్పృహ కోల్పోయారు. స్పృహ కోల్పోవటం కాదు 70 మంది మోప్లాల యోధులు మృతి చెందారు. మరొక అంచనా ప్రకారంగా 80 మంది మృతిచెందారు.

బ్రిటీష్ అధికారుల కిరాతకాన్ని వెల్లడించే ఈ సంఘటనను కప్పిపెట్టాలని అధికారులు

శత విధాల ప్రయత్నించారు. అది వీలుకాలేదు. ఈ విషాదాంతం బయటకు పొక్కగానే దేశవ్యాపితంగా నిరసన వెల్లువెత్తింది. ప్రజలు నిరసన ప్రదర్శనలు జరిపారు. నాయకులు ఈ సంఘటన మీద విచారణ కోరారు. ప్రభుత్వం విచారణ కమిటీని వేసింది. ఆ కమిటీ విచారణ జరిపి పోలీసు అధికారులది ఎటువంటి తప్పులేదంది. ఆ పాపాన్ని రైల్వే అధికారుల మీద నెట్టివేసింది. ఈ సంఘటనలో ప్రాణాలను కోల్పోయిన ప్రతి మోప్లా కుటుంబానికి 300 రూపాయల పరిహారం చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

**హింసామార్గం ఎందుకు ఎన్నుకున్నారు?**

భారతదేశంలో అగ్రనాయకులుగా పరిగణించబడుతున్న మహాత్మాగాంధీ, అలీ సోదరులు, మౌలానా అబుల్ కలాం అజాద్ లాంటి ప్రముఖుల పర్యటనలతో ప్రభావితులైన మోప్లాలు అహింసా మార్గం నుండి మార్గం మళ్ళి ఎందుకు హింసా మార్గం ఎంచుకున్నారు? ఈ విషయమై అనుకూల ప్రతికూల వాదనలు సాగాయి. అహింసా మార్గంలో ఉద్యమిస్తామని వాగ్దానం చేసిన మోప్లాల విజృంభణకు ఆంగ్లేయాధికారులు అనుసరించిన అణచివేత చర్యలే ప్రధానమని కొంతమంది, జాతీయ నాయకత్వం మోప్లాలను నిస్సహాయులుగా వదిలి పెట్టడమేనని మరికొంత మంది, అసలు మోప్లా ప్రజానీకంలో అంతర్గతంగా నున్న బ్రిటీష్ వ్యతిరేక స్వభావమని, మతం ప్రభావమని మరికొంతమంది చెప్పుకొచ్చారు. ఆ కారణాలన్నీ దేనికదేగా చెప్పుకుంటే ఏదీ సంపూర్ణం కాదు.

Prof. **ROLANDE MILLER,** ప్రధానంగా అధికారుల తప్పుడు నిర్ణయాలు, బలహీనమైన పథకాలు కారణమన్నాడు. కాలికట్ నుండి తిరుగాండికి సైనికదళాలను తరలించటం, మౌల్వీ అలీ ముస్లియార్ అరెస్టుకు ప్రయత్నించటం, ఖిలాఫత్ కార్యకర్తలను నిర్బంధించటం లాంటి అనుచిత చర్యలు మోప్లాలను రెచ్చగొట్టాయని, ఆ సంఘటనతో రెచ్చిపోయిన మోప్లాలు తిరుగుబాటు బాటను ఎన్నుకున్నారని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇదే తరహా అభిప్రాయాన్ని ప్రఖ్యాత జాతీయోద్యమ నాయకుడు శ్రీ కె.పి. కేశవ మీనన్ తన KARINYAKALUM లో ప్రస్తావిస్తూ, మోప్లాలు హింసా మార్గం ఎన్నుకోవడానికి అధికారులు అనుసరించిన కిరాతక చర్యలు మాత్రమే కారణమన్నారు. జెన్మి-రైతుల సంబంధాలు మాత్రమే కాదని, అది మసీదుకు సంబంధించిన వివాదం కాదనీ అన్నారు. ఓర్పు నశించిన మోప్లాలు అహింసా సిద్ధాంతాలను వదలి హింసా మార్గం ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

మలబారులో తిరుగుబాటు చర్యలు ప్రారంభమై అత్యంత వేగంగా అన్ని ప్రాంతాలకు వ్యాపించటం, హింసాకాండ చెలరేగటంతో అప్పటివరకు ఖిలాఫత్- సహాయ నిరాకరణ కమిటీలలో భాగస్వామ్యం వహించిన ముస్లిమేతర నాయకులు, మోప్లాల తీరుతెన్నులను సమీక్షించి సంస్కరించాల్సింది పోయి, ఖిలాఫత్ కమిటీలకు దూరమయ్యారు. ఫలితంగా విశాల దృక్పథం, గాంధీమార్గం పట్ల నిబద్ధత గల నాయకుల స్థానంలో ఉద్యమాన్ని స్థానిక నాయకత్వం తన చేతుల్లోకి తీసుకుంది. సహజంగా ఆవేశపరులు, బ్రిటీషర్లంటే వ్యతిరేక స్వభావం గల మోప్లాలు ప్రజల మీద దాడులకు పాల్పడిన ఆంగ్లేయాధికారుల మీద ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. బ్రిటీష్ సైనిక బలగాలు పెద్ద సంఖ్యలో మోప్లాల మీద విరుచుకుపడి, కిరాతక చర్యలకు పాల్పడుతున్నప్పుడు, సామాన్య మోప్లాలకు రక్షణగా

జాతీయ నాయకులు ఎవ్వరూ రాలేదని మలబార్ మోప్లాలు **' కాపరిలేని గొర్రెలయ్యారని '** పలువురు భావించారు. పరిస్థితులు విషమిస్తుండగా శ్రీ రాజగోపాలచారి, అలీ సోదరులు, మౌలానా అబుల్ కలాం ఆజాద్, యాకూబ్ హసన్ లాంటి నాయకులు మలబారు సందర్శించి మోప్లాలకు నచ్చచెప్పి అహింసా మార్గానికి మళ్ళించగలమని చేసిన సూచనలను ప్రభుత్వం అంగీకరించకపోవటంతో మోప్లాలకు సరైన మార్గం చూపగలవారెవరూ లేకపోయారు.

ఈ పరిస్థితులను ఆసరాగా తీసుకుని జెన్మిలు, బ్రిటీష్ అధికారులు ప్రజలలో మత విబేధాలను సృష్టించారు. జెన్మిలు తమ మీద రైతాంగం సాగించిన ప్రతి చర్యను హిందువుల మీద జరిగిన దాడిగా చిత్రించారు. మలబారు జనావళిలో మోప్లాలు అత్యధికులు కావడం, భూస్వాములంతా హిందువులు కావడంతో జెన్మి- మోప్లాల సంఘర్షణలన్నీ హిందూ-ముస్లిం సంఘర్షణలుగానే కన్పించేవి. ఈ అవకాశాన్ని అధికారులు, పాలకవర్గాలు చాకచక్యంగా ఉపయోగించుకున్నాయి. బ్రిటీషర్లు, జెన్మిలు తమదైన రీతిలో ఉధృతంగా ప్రచారం సాగించి మతం ప్రాతిపదికన ఏర్పడిన విభజనను బలిష్టం చేశారు. ఈ పరిస్థితులకు మోప్లాల పోరాటానికి నాయకత్వం వహించిన వారిలో ఎక్కువమంది తంగల్స్ (మౌల్వీలు) కావటం మరో కారణమయ్యింది. 1921 జూలై మాసంలో 18మంది మోప్లాల నాయకులకు అరెస్టు చేయాలని పోలీసులు నిర్ణయించగా అందులో తిరుంగాడి మౌల్వీ అలీ ముస్సలియార్‌తో పాటుగా మరో ఎనిమిది మంది **' తంగల్స్ '** ఉండటం విశేషం. ఈ నాయకుల నేపథ్యం ప్రధానంగా ధార్మిక మార్గం కావటం వలన మోప్లాలను బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరుబాటన నడిపించేందుకు మత మనోభావాలను సహజంగానే ఉపయోగించుకున్నారు. ఈ చర్యలు ప్రారంభంలో ముస్లిమేతరులకు వ్యతిరేకంగా సాగలేదు. ఆ తరువాత కూడా ముస్లిమేతరులకు కష్టం కలిగించినట్టయితే వారంతా శత్రువు పక్షం వహించవచ్చునని, అలాంటి చర్యలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న బ్రిటన్ తగినంత బలగాలను కల్లోల ప్రాంతాలకు తరలించలేకపోవటం మరో కారణంగా చెప్పుకోవచ్చు. ఒకవైపు భారత దేశమంతటా ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా సాగటం, ప్రజలు అసంఖ్యాకంగా పాల్గొనటంతో మోప్లాలకు అంతులేనంతగా మనోధైర్యం పెరిగింది. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభించిన తిరుగుబాటుకు యావత్తు భారతదేశం స్పందిస్తుందని మలబారు మోప్లాలు విశ్వసించారు. **బ్రిటీష్ రాజ్యం అంతమైపోతుందని, కీలక సమయంలో భారతదేశంలోని జనసముదాయాలన్ని ఉద్యమిస్తాయని భావించినట్టు,** ఆనాటి తిరుగుబాటులో పాల్గొన్న అవక్కోర్ ముస్సలియార్ తెలిపారు. అందుకు వ్యతిరేకంగా జరగటంతో మోప్లాలు నిరాశ నిస్పృహలకు గురయ్యారు. ఆ నిరాశా నిస్పృహల నుండే అహింసా మార్గం తప్పింది. అది కాస్త హింసాకాండకు పురికొల్పింది.

## భూ సమస్యకు మతం రంగు

పాలకవర్గాల సంస్కరణలు, రెవిన్యూ చర్యల వలన మలబారు ప్రాంతంలో రైతులు, భూకామందుల మధ్యన ఏర్పడిన భూ వివాదానికి ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు

మతం రంగు పులిమారు. మలబారులో 90 శాతం భూమి హిందూ జెన్మిల ఆధీనంలో ఉండగా, ప్రజానీకంలో 70 శాతం మంది భూమిలేని నిరుపేద మోప్లాలు. రైతులు, రైతు కూలీలలో అత్యధికులు ముస్లిం మోప్లాలు కావడం, భూస్వాములు హిందూ జెన్మిలవటం వలన ఈ రెండు వర్గాల మధ్యన తలెత్తిన వివాదాన్ని తమ స్వార్థ ప్రయోజనాల నిమిత్తం హిందూ-ముస్లింల సమస్యగా ప్రచారం కల్పించారు. ఆరుకాలాలు శ్రమపడినా అటు జెన్మిల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బ్రతకాల్సిన దుర్భర పరిస్థితులలో, అటు జెన్మిల, ఇటు మధ్య దళారీల దోపిడీని సహించలేక, ఓర్పు నశించిన మోప్లాలు తిరగబడి హింసకు పాల్పడేసరికి, ముస్లింలు హిందువుల మీద దాడులు చేస్తున్నారని కంపెనీ పాలకులు ప్రచారం చేశారు.

భూ సమస్య ఆధారంగా సాధారణ హిందూ ప్రజానీకం, మోప్లాలతో కలిసి భూస్వాముల మీద తిరగబడకుండా చేసేందుకు ఈ వివాదాన్ని హిందూ- ముస్లింల వివాదంగా జెన్మిలు చిత్రించి, సామాన్య హిందూ ప్రజానీకాన్ని తమ వెంటన పెట్టుకుని, మోప్లాలకు వ్యతిరేకంగా ఉపయోగించుకున్నారు. హిందూ జెన్మిల మీద జరిగిన హింసను హిందూ సమాజం మీద ముస్లింలు సాగిస్తున్న హత్యాకాండగా చిత్రీకరించారు. ప్రతి సంఘటనను ఏదో రకంగా మతం రంగు పులిమి తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నించారు. భారతీయులు మతానికి, ఆచార వ్యవహారాలకు, సంప్రదాయాలకు ఇచ్చే ప్రాధాన్యతను గమనించిన బ్రిటీష్ సామ్రాజ్యవాద శక్తులు, ఈ రెండు వర్గాల మధ్యన జరిగిన ఘర్షణలకు మతం రంగుపూసి, తమ దోపిడీని, అణచివేతను నిరాటంకంగా కొనసాగించేందుకు కుయుక్తులు పన్నాయి. చివరకు 1920-21లో ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమాలతో ప్రేరణ పొందిన మోప్లాలు అటు జెన్మిల మీద ఇటు బ్రిటీష్ ప్రభుత్వం మీద సాగించిన పోరాటాలను కూడా మత కలహాలుగా చిత్రించాయి. ప్రముఖ చరిత్రకారుడు Dr. Santimoy Ray తన Freedom Movement and Indian Muslims గ్రంథంలో బ్రిటీషర్ల కుయుక్తిని ఎండగడ్తూ, "... To cover their diabolic design and rebellion was branded as communal flare up..." అన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు పథకం ప్రకారంగా సాగించిన ఈ ప్రచారానికి లోనైన స్వదేశీయులు కూడా మోప్లాల తిరుగుబాటును, హిందువుల మీద మోప్లాలు సాగించిన దమనకాండగా భావించారు.

## భిన్నాభిప్రాయాలు

ఈ దుష్పరిణామాల వలన ఆత్మత్యాగాలతో ఒక శతాబ్దం పైగా అప్రతిహతంగా సాగిన మలబారు మోప్లాల రైతాంగ పోరాటం, ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమాలలో మోప్లాల పాత్ర, అనుకూల ప్రతికూల విమర్శలతో, భిన్నాభిప్రాయాలతో, భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో వివాదాస్పదంగా మిగిలిపోయింది.

ఈ పోరాటంలోని ప్రధాన వైరి పక్షాలు మతం రీత్యా హిందువులు- ముస్లింలు అయినప్పటికీ, వైరానికి మతం మాత్రమే కారణం కాలేదు. భూ సంబంధాలు రైతుల రగడ రచ్చకెక్కడానికి మూలమైనాయి. ఈ వివాదాన్ని **'...నిశితంగా పరిశీలిస్తే, ఈ నేరాలలో 80శాతం మోప్లాలు హిందూ జెన్మీలపైగాని, ఏజెంట్లపైగానీ, రెవిన్యూ అధికారులపైగానీ,**

**పోలీసులపైగానీ చేసినవే. ఈ ప్రాంతంలో ఎక్కువమంది జెన్మీలు హిందువులు, నంబూద్రీలు, రాజాలు కాగా కౌలుదారులలో అత్యధికులు మోప్లాలు...”** అంటూ ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు శ్రీ ఇ .యం.యస్. నంబూద్రిపాద్ ఆనాటి పరిస్థితులను వివరించారు. ( కేరళలో రైతాంగ ఉద్యమ సంక్షిప్త చరిత్ర, 1942). అంతేకాదు మోప్లాలు హిందువుల మీద క్రోధం పెంచుకోవడానికి కారణాలను వివరిస్తూ, **‘...హిందువులకు చెందిన నాయకులు, ఉద్యమంలోని వివిధ స్థాయి కార్యకర్తలను తనను వదిలి వెళ్ళారని గ్రహించాడు. మిలటరీ తనను వెంటాడడం గమనించాడు. ఇరుగు పొరుగున ఉన్న హిందువులు తనకు వ్యతిరేకంగా మిలటరీకి సహాయపడ్డారు. దానితో వారిపై క్రోధం పెంచుకున్నాడు మోప్లా ...’.** ఈ క్రోధం కారణంగా మాత్రమే మోప్లాలు హిందువుల మీద చెదురుమదురుగా హింసకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని కూడా శ్రీ ఇ.యం.యస్ విశ్లేషిస్తూ, **‘..ఇది(హిందువుల వైఖరి) మోప్లాలో గల దుస్సాహసికులపై బాగా పనిచేసింది. అందువలన కొన్ని హిందూ వ్యతిరేక చర్యలు జరిగాయి. అలా రెచ్చిపోయినవారు కూడా అతి కొద్దిమంది మాత్రమే. మోప్లాలకు గల జెన్మి వ్యతిరేక భావాలను హిందూ వ్యతిరేక భావాలుగా మార్చడానికి (మత గురువులు) యత్నించేవారు. కానీ మోప్లాల జెన్మి వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక చర్యలతో పోల్చి చూస్తే అనాలోచితంగా, మూర్ఖంగా చేసిన నేరాలు బహు తక్కువ. మోప్లా రైతుకు మతపరమైన విశ్వాసాల కంటే వర్గ దృక్పథమే ఎక్కువగానున్నదని చెప్పక తప్పదు...’** అన్నారు.

జాతీయోద్యమ నాయకుడు, ప్రముఖ గాంధేయవాది శ్రీ నారాయణ మీనన్ మోప్లాల పోరాటం గురించి ప్రస్తావిస్తూ, **‘ ..తిరుగుబాటు దారులు మతపరమైన ఉద్దేశ్యంతో హిందువుల మీద దాడి చేయటం జరగలేదని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల అలాంటి సంఘటనలు చెదురుమదురుగా జరిగినపుడు, దోపిడీలు జరిగినపుడు వారిని (మోప్లాలను) మోప్లా నేతలు తీవ్ర శిక్షలకు గురిచేసారు. ఒక్కొక్కప్పుడు అలాంటివారి చేతులు నరికి తీవ్రంగా శిక్షించిన ఘటనలు ఉన్నాయి. లూటీ చేసిన వస్తువులను తిరిగి యజమానులకు అప్పజెప్పించారు. ప్రభుత్వ వ్యతిరేకులైన హిందువులను అనుమానించలేదు. అనేక చోట్ల పేద హైందవ రైతులు కూడా మోప్లా తిరుగుబాటు దారులలో చేరారు”.** (భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, ప్రచురణ: కృష్ణా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, 1984) . మలబారు మోప్లాలు సాగించిన పోరాటాలు, మతకలహాలు కావని, అవి వర్గదృక్పథంతో ధనిక, భూస్వామ్య వర్గాల మీద సాగిన రైతాంగ తిరుగుబాట్లుగా పేర్కొంటూ, **“...మలబారు బ్రాహ్మణుల పత్రిక “యోగ క్షేమ” 1922 జనవరి 6వ తేదీనాటి తన సంచికలో ఇలా రాసింది. ‘...ఆత్మ రక్షణార్థం, స్వప్రయోజనాలను కాపాడుకోవటం కోసం హిందూ, ముస్లిం, క్రిష్టియన్ ఆ పరిస్థితులలో ఏదైతే చేస్తాడో మోప్లా రైతు కూడా అదే చేసాడు...”** శ్రీ నారాయణ మీనన్ అన్నారు.

ప్రముఖ చరిత్రకారుడు బిపిన్‌చంద్ర తన ప్రఖ్యాత గ్రంథం India's Struggle for Independence 1857-1947 లో మోప్లాల తిరుగుబాటు ప్రారంభ దశను వివరిస్తూ, **“...ప్రథమ దశలో అత్యధికంగా గల హిందూ జెన్మిలు (భూస్వాములు), ప్రభుత్వ అధికారానికి ప్రతీకలైన**

**కచ్చేరీలు (కోర్టులు), పోలీసు స్టేషన్లు, ట్రజరీలు, కార్యాలయాలు, బ్రిటీష్ ప్లాంటర్లు తిరుగుబాటు లక్ష్యాలుగా మారాయి. అధికారులు, భూస్వాములు, పేద హిందువులను చాలా అరుదుగా పట్టించుకున్నారు. హిందూ ప్రజానీకంతో కిక్కిరిసి ఉన్న ప్రాంతాల గుండా తిరుగుబాటుదారులు మైళ్ళ కొద్దీ ప్రయాణం చేసినా, భూస్వాముల మీద మాత్రమే వారు దాడులు చేసారు. రికార్డులను తగులబెట్టారు. జనాబ్ కున్ అహమ్మద్ హాజీ లాంటి నాయకులు హిందూ ప్రజానీకం ఎటువంటి దోపిడీకి, బాధలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదేశాలను ఉల్లంఘించి, హిందువులను బాధలకు గురిచేసి, దోపిడికి పాల్పడిన మోప్లాలను కఠినాతి కఠినంగా శిక్షించారు. ముస్లింలపట్ల ఎటువంటి పక్షపాతాన్ని ఆయన ప్రదర్శించలేదు. బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన మోప్లాలనూ ఆయన విడిచి పెట్టలేదని ...'** వివరించారు.

మోప్లా రైతుల తిరుగుబాటు స్పష్టంగా వర్గ దృక్పథంతో పేద రైతుల కష్టార్జితాన్ని దోచుకున్న, పేదలను పీడించిన, ధనిక భూస్వాములకు వ్యతిరేకంగా మాత్రమే జరిగినట్టుగా ప్రబలమైన సాక్ష్యాధారాలు ఉన్నా, అక్కడక్కడ జరిగిన చిన్న చిన్న సంఘటనలు, భిన్న మతాలకు చెందిన వ్యక్తుల మధ్య తలెత్తిన వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో జరిగిన కలహాలను పరిగణనలోకి తీసుకుని, మోప్లా పోరాటాలను హిందువుల మీద ముస్లింల దాడులుగా పరిగణించారు. సంపన్న భూస్వాములు హిందువులు, రైతులు, కౌలుదారులు, పేదలు మోప్లాలన్న వాస్తవం, విమర్శకుల దృష్టిపథం నుండి తప్పుకోవటం వలన ఈ పోరాటాలు మతకలహాలన్న అపోహకు గురయ్యాయి. అతి ఉత్సాహపరులైన దుస్సాహసికులు కొందరు అక్కడక్కడ ముస్లిమేతరుల మీద సాగించిన దమనకాండ, ప్రార్థనాలయాలకు కలిగించిన నష్టం కూడా ఈ అపోహలకు కారణమయ్యింది.

ఈ అపోహలకు రూపం కల్పించి వాస్తవాలను మరుగుపర్చి, అటు మత దురహంకార శక్తులు, ఇటు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, ఆంగ్లేయ చరిత్రకారులు, అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించిన సాహిత్యం, సాగించిన ప్రచార వరవడిలో భారతీయ రచయితలు, చరిత్రకారులు, చివరకు కొందరు జాతీయోద్యమ నాయకులు కూడా కొట్టుకుపోయారు. తిరుగుబాటుకు దోహదం చేసిన పరిస్థితుల పూర్వాపరాలను, తిరగబడిన ప్రజల సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని, పోరుకు ప్రేరేపించిన ప్రత్యేక కారణాలు మలబారు ప్రాంతంలో నెలకొన్న భూ సంబంధాలను, వాస్తవిక దృష్టితో గమనించక పోవటం వలన మోప్లాల పోరాటం తీవ్ర విమర్శలకు గురైంది.

తిరుగుబాటుకు నాయకత్వం వహించిన మోప్లాలు, శత్రువు మీద పోరుకు సిద్ధమవుతూ ధార్మిక ప్రతిజ్ఞలు తీసుకోవడం, మత సంబంధమైన ఆచార వ్యవహారాలను పాటించడం, **నేర్చా-మౌలుద్** లాంటి సంప్రదాయాలను అనుసరించటం, ధర్మ యుద్ధానికి ధార్మిక పెద్దల ఆశీస్సులు పొందటం తదితర పద్దతులు కూడా మోప్లాల తిరుగుబాట్ల మీద బురద చల్లదలచిన శక్తులకు ఆధారాలయ్యాయి. ప్రధానంగా తమ స్థావరాల నుండి శత్రువు కోసం ఎదురు చూస్తూ గడిపిన కాలంలో మోప్లాలు ప్రార్థనలు చేయటం, ప్రేరణ పొందటానికి

చేసిన మత సంబంధమైన కార్యక్రమాలు విమర్శకులను తప్పుదోవ పట్టించాయి. జాతీయోద్యమంలో మత గ్రంథాల ప్రవచనాలు, మత పెద్దల ఆశీస్సులు, పౌరాణిక పాత్రల సాహసాల ప్రేరణతో దేశం కోసం ఆత్మార్పణలకు పాల్పడిన ముస్లిమేతరుల చరిత్ర ఒక పక్కన బ్రహ్మాండంగా కన్పిస్తుండగా, అక్కడ కన్పించని మతతత్త్వం మలబారు మోప్లా పోరాట యోధుల చర్యలలో కన్పించటం విశేషం.

హిందూ–ముస్లింల ఐక్యతను ప్రగాఢంగా అభిలషిస్తున్న మహమ్మద్ అన్సారి లాంటి ప్రముఖులు కూడా మోప్లాల చర్యలను ఖండించారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం నుండి మోప్లాలు మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జాతీయోద్యమంలో ఫైర్‌బ్రాండ్‌గా ఖ్యాతిగాంచిన కవి, మౌలానా హస్రత్ మోహాని మాత్రం అన్సారి అభిప్రాయాలతో ఏకీభవించలేదు. మోప్లాలు పేద వర్గాలకు చెందిన ముస్లిమేతరుల మీద ఎటువంటి దాడులకు పాల్పడలేదని, సంపన్నులు, భూస్వాములు, ప్రభుత్వాధికారులు, బ్రిటీషర్లలతో చేతులు కలిపిన శక్తుల మీద మాత్రమే దాడులు చేస్తారన్న విషయం గమనించాలని ఆయన కోరారు. అక్కడక్కడా వ్యక్తిగత కక్షల కారణంగా, వ్యక్తిగత స్వార్థం కారణంగా జరిగిన సంఘటనల ఆధారంగా దేశభక్తి ప్రపూరితులైన మోప్లాల తిరుగుబాట్లను మతోన్మాద చర్యలుగా పేర్కొనటం తగదన్నారు.

## గాంధీ విమర్శ

మహాత్మాగాంధీ తన **యంగ్ ఇండియాలో** మోప్లాల చర్యలను విమర్శిస్తూ, .. **మలబారులో మోప్లాలు హిందువులపై గావించిన పనులకు హిందువులు దుఃఖిస్తారని, ఏ పరిస్థితులలోనైనా ఎంత రెచ్చగొట్టినా, బలవంతంగా మతం మార్పిడి చేయడం న్యాయమని చెప్పలేను. మోప్లా తిరుగుబాటు హిందూ మహమ్మదీయులకు పరీక్ష...బలవంతంగా మతాంతీకరణలను చేయటం, దోపిడీ చేయటంలాంటి మోప్లా చర్యలకు మహమ్మదీయులు సహజంగా సిగ్గుపడి తలవంచుకోవాలి....**అన్నారు.

గాంధీజీ విమర్శలను తిప్పికొడుతూ, సర్ శంకర్ నాయర్ తాను రాసిన **" గాంధీ–అరాచకం "** పుస్తకంలో '..మోప్లాలు సాహసోపేతులని, భగవంతుడంటే భయపడేవారు..' అని పేర్కొన్నాడు. ఈ అభిప్రాయాలకు తగ్గట్టుగానే, **'...ఆర్య సమాజికుల ప్రచారం సాగింది. మోప్లాలు చంపిన వ్యక్తుల ఫోటోలు సంపాదించి, హిందువులపై జరిగిన ఘోర కృత్యాలంటూ ప్రచారం చేసారు. ఉరితీయబడిన మోప్లా రైతుల ఫోటోలుగాని, అత్యాచారాలకు బలైన, అవమానాలకు గురైన మోప్లా స్త్రీల ఫోటోలను వీరెక్కడా ప్రదర్శించలేదు. ఈ ప్రవర్తన ప్రభుత్వ దమనకాండకు సహాయపడింది.. '.**

భారతీయ జాతీయ కాంగ్రెస్ మోప్లా చర్యలను సంపూర్ణంగా అంగీకరించకున్నా ఆనాటి పరిస్థితులను, అధికారుల వైఖరిని విమర్శిస్తూ పలు తీర్మానాలు చేసింది. ఒక తీర్మానాన్ని డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య రాసిన **' కాంగ్రెస్ చరిత్ర '** మొదటి భాగం పేజీ 303లో ఇచ్చారు. ఆ తీర్మానం **"...కార్యవర్గము వారి వద్ద నున్న సాక్ష్య సాధనాలను బట్టి, మోప్లాలకు సహించరానంత కోప కారణము కల్పించబడినదనీ, ప్రభుత్వము వారి పక్షమున తయారు చేయబడి, వారిచే ప్రకటించబడిన నివేదికలు పక్షపాత**

**భూయిష్టములుగానూ, మోప్లాల తప్పిదములను అతిశయోక్తులతో నిండినదిగానూ ఉన్నవనీ, ప్రభుత్వము వారు శాంతిభద్రతలనే నెపముతో అనవసరముగా ప్రజలను సంహరించిన విషయము వాటిలో తగ్గించి వ్రాయబడినదనీ, ఈ సభవారభిప్రాయ పడుతూ మోప్లాల పక్షమున జరిగిన దౌర్జన్యములను నిరసిస్తున్నారు...".** అని పేర్కొనడం విశేషం.

## చిరస్మరణీయ ఖ్యాతి

భూస్వాములకు వ్యతిరేకంగా ప్రారంభమై, బ్రిటీషర్ల మీద గురిపెట్టబడిన మోప్లా రైతులు, ప్రజల పోరాటాలు జాతీయోద్యమంలో భాగంగా సాగినప్పటికీ, మోప్లాలు విమర్శలకు గురికాక తప్పలేదు. బ్రిటీష్ సైనిక, పోలీసు దళాల తుపాకి గుండ్లకు ఎదురుగా నిలిచి, చివరి రక్తపు బొట్టు నేల రాలేవరకు తొడగొట్టి పోరాడి ఆత్మార్పణలకు పాల్పడిన మోప్లా మొనగాళ్ళు విమర్శలకు గురికావడం జాతీయ ఉద్యమంలోని కొందరు నాయకుల, చరిత్రకారుల హ్రస్వదృష్టికి నిదర్శనమని పలువురు ప్రముఖులు విమర్శించారు. ఏది ఎలాగున్నా జాతీయోద్యమంలో తమదైన ముద్రవేసుకున్న మోప్లాల తిరుగుబాటు ఎదుర్కొన్నంత ప్రశంసగాని, విమర్శగాని స్వాతంత్రోద్యమ చరిత్రలోని మరే ఉద్యమపోరాట రూపం ఎదుర్కొనలేదనవచ్చు.

1800లో ప్రారంభమై 120 సంవత్సరాపాటు సాగి, 1920-22 లలో జాతీయ స్ధాయిలో కలకలం రేపిన మలబారు మోప్లాల పోరాటం 1922 జనవరి నాటికి ముగిసింది. అనాటి పోరాటయోధులను 1971లో స్వాతంత్ర్య సమరయోధులుగా భారత ప్రభుత్వం గుర్తించింది. ఈ పోరాటం ఎంతటి విమర్శకు గురైనా బ్రిటీష్ వ్యతిరేకతలో, దేశభక్తి విషయంలో మోప్లాలు అగ్రగణులన్న చారిత్రక వాస్తవాన్ని ఎవ్వరూ కాదనలేని రీతిలో, చిరస్మరణీయ ఖ్యాతితో స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో శాశ్వత స్ధానాన్ని సుస్థాపితం చేసుకున్నారు. ◆

## అహింసా మార్గాన ఆత్మార్పణలకు సిద్ధపడిన

# ఖుదా-యే-ఖిద్మత్‌గార్ వీరులు

### 1929 - 1948



బ్రిటీష్ సామ్రాజ్యవాద శక్తుల పాలనకు చరమ గీతం పాడేంత వరకు సాగిన స్వాతంత్ర్య సంగ్రామ మహాప్రవాహంలో పలు పోరాట స్రవంతులు అంతర్లీనంగా సాగాయి. ఈ పోరాటాలు పలు ప్రాంతాలలో ఆయా సాంఘిక జనసముదాయాల నాయకత్వంలో జరిగాయి. సువిశాల భారతావని మీద ఈ పోరాటాలు-తిరుగుబాట్లు ఎక్కడ జరిగినా, ఏ సాంఘిక జనసముదాయం నేతృత్వంలో సాగినా లక్ష్యం మాత్రం ఒక్కటే. అది పరదేశీయుల పీడన నుండి, దోపిడీ నుండి, పెత్తనం నుండి స్వదేశీయులను విముక్తి గావించటం, చివరకు ఈ గడ్డ మీద నుండి బ్రిటీషర్లను తరిమికొట్టడం.

ఈ అంతిమ లక్ష్యం దిశగా శక్తి యుక్తులను మోహరించే ముందు ఆయా ప్రాంతాల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, ప్రాంతీయ సమస్యలు, ఉద్యమాలు

తొలి దశలో ప్రధాన పాత్ర వహించాయి. సమస్యల పరిష్కారం దిశగా ప్రారంభమై, విదేశీ శక్తులు, ఆ శక్తులకు వత్తాసు పలుకుతున్న స్వదేశీ విద్రోహులకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో సంతరించుకున్న అనుభవం, చైతన్యం కాలక్రమేణా ఆ పోరాటాల దిశను-దశను మార్చాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో ప్రారంభమైన పోరాటాలు క్రమక్రమంగా భారత స్వాతంత్ర్య సంగ్రామ ప్రవాహంలో అంతర్భాగమయ్యాయి.

భారత స్వాతంత్ర్యోదమంలో భాగంగా సాగిన ప్రముఖ పోరాటాలు ఐదింటిలో ముస్లిం జనసముదాయాలు ప్రధాన పాత్రను పోషించటమేకాదు, నాయకత్వం వహించి నడిపించాయి. ఈ ఐదు కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాల ముస్లిం జనసముదాయాలన్నీ, ముస్లిమేతర జనసముదాయాలతో చేతులు కలిపి 1919 నుండి దశాబ్ధం పాటు మహోధృతంగా సాగించిన చారిత్రక ఉద్యమం, **ఖిలాఫత్ ఉద్యమం**. బహుళ ప్రాచుర్యం పొందిన ఈ ఉద్యమాన్ని పక్కన పెడితే, బ్రిటీష్ సామ్రాజ్యవాద శక్తులు ఈ నేల మీద నిలదొక్కుకునే ప్రయత్నం ప్రారంభించగానే బెంగాల్‌కు చెందిన ముస్లిం ఫకీర్లు తొలి తిరుగుబాటు శంఖారావం పూరించారు. బెంగాల్ కేంద్రంగా వహాబీలు, వహాబీల సమకాలీన పోరాటయోధులైన ఫరాజీలు తిరగబడ్డారు. మలబారు తీర ప్రాంతానికి చెందిన మోప్లాలు 1800 నుండే ఆయుధం పట్టారు. ఈ తిరుగుబాట్లలో ఫకీర్లు, ఫరాజీలు, వహాబీలు, మోప్లాలు బ్రిటీషర్ల మీద కత్తికట్టి రణం సాగించారు. ఆ పోరాటాల గురించి గత అధ్యాయాలలో తెలుసుకున్నాం. ఆ పోరాట రీతులకు భిన్నంగా, భారతదేశ వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని సమరశీల పోరాట వీరులుగా ప్రసిద్ధి చెందిన పఠాన్ యోధులు **' ఖుదా-యే-ఖిద్మత్‌గార్ '** లుగా అవతరించి జాతీయోద్యమంలో అపూర్వమనదగిన రీతిలో గాంధీజీ మార్గాన అహింసాయుధంతో పోరుసాగించి ధన్యులయ్యారు.

ప్రవృత్తి, వృత్తిపరంగా పోరాట వీరులుగా ఖ్యాతి గడించిన పఠాన్‌లు, ఆయుధాలను వృత్తి పనిముట్లుగా ధరించి, కదనరంగమే కార్యక్షేత్రంగా భావిస్తారు. ఆత్మగౌరవం, కుటుంబ గౌరవం, జాతి గౌరవం కోసం ప్రాణం ఇవ్వటం, ప్రాణాలు తీయడం వీరికి పరిపాటి. పగతీర్చుకోవడానికి ప్రయత్నించని కుటుంబాలను, జాతికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోడానికి యత్నించని పఠాన్ యువకుడ్ని నపుంసకుడిగా లెక్కగడతారు. అటువంటి పఠాన్ల జాతి, తమ కరకు కత్తులను పర్వత పంక్తుల్లోకి గిరవాటువేసి, అహింసా మార్గాన స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ సైనికమూకలను, ముష్కర పోలీసులను ఎదుర్కొన్నారు. ఆత్మార్పణలతో అహింసా సిద్ధాంతానికి, సత్యాగ్రహోద్యమానికి ప్రాణం పోసి, స్వాతంత్ర్య సమర చరిత్రలో సరికొత్త పేజీలను సృష్టించారు.

## వాయవ్య సరిహద్దు ప్రాంతాలు

భారతదేశ సంస్కృతి, చరిత్రలో వాయవ్య సరిహద్దు ప్రాంతాలు ప్రముఖ పాత్ర వహించాయి. అవిభక్త భారతదేశానికి వాయవ్య ప్రాంతంలో గల పంజాబ్, సింధ్ రాష్ట్రాలతో కలిపి ప్రస్తుత అఫ్ఘనిస్థాన్ సరిహద్దుల వరకు గల ప్రాంతాలన్నిటినీ బ్రిటీషర్లు వాయవ్య

సరిహద్దు ప్రాంతాలుగా నామకరణం చేసారు. 1846లో పంజాబును జయించాక బ్రిటీషర్లు ఈ ప్రాంతం మీద దృష్టి కేంద్రీకరించారు. రష్యా, పర్షియా రాజ్యాధినేతలు ఈమార్గం గుండా భారతదేశంలోకి ప్రవేశించి తమ ఆధిపత్యానికి గండి కొట్టగలరని బ్రిటీషర్లకు భయం పట్టుకుంది. ఈ ప్రదేశాలను వాయవ్య సరిహద్దు ప్రాంతంగా ప్రకటించి, భారతదేశంలోకి మార్గాన్ని ప్రసాదించే ఈ ప్రాంతాల గిరిజన జాతులను, మైదాన ప్రాంతాల ప్రజానీకాన్ని తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 1849లో పంజాబ్‌ను, సరిహద్దు జిల్లాలను బ్రిటీష్ రాజ్యంలో కలిపి వేసారు. అప్పటి నుండి వాయవ్య సరిహద్దు ప్రాంతాలు తెల్లవాడి ప్రత్యక్ష ఏలుబడిలోకి వచ్చాయి. ఆఫ్ఘన్ యుద్ధం తరువాత 1879లో బ్రిటీషర్లకు, ఆఫ్ఘాన్ అమీర్‌కు మధ్య కుదిరిన గాండమక్ ఒప్పందం, ఆ తరువాత 1893-95లో ఏర్పడిన డ్యూరాండ్ సరిహద్దు రేఖ, పఠాన్‌ల భూమి ' **ఆఫ్ఘనిస్థాన్** ' ను రెండుగా విభజించి, **ఫక్తూన్** (పుష్టన్) జాతీయులను చీల్చివేసింది. ఈ చీలిక వలన కొంత భాగం ఆఫ్ఘనిస్థాన్‌లో కలవగా మరికొంత భాగం బ్రిటీష్ ఇండియాలో కలసిపోయింది. బ్రిటీష్ ఇండియాలో కలసిపోయిన ప్రాంతాన్ని **వాయవ్య సరిహద్దు ప్రాంతం**గా పిలవటం పరిపాటైంది. భారత విభజన తరువాత ఈ ప్రాంతం పాకిస్థాన్ భూభాగంలో కలసిపోయింది.

ఈ సరిహద్దు ప్రాంతం 33 వేల కిలోమీటర్ల విశాలమైన విస్తీర్ణంతో, ఉత్తరాన హిందూకుష్ పర్వతశ్రేణి, దక్షిణాన బెలూచిస్థాన్, పంజాబుకు చెందిన దేరా గాజీఖాన్ జిల్లా, తూర్పున కాశ్మీర్, పంజాబ్, పశ్చిమాన ఆఫ్ఘనిస్థాన్ ఎల్లలతో విరాజిల్లింది. ఈ ఎల్లల మధ్యన గల హజారా, పెషావర్, కోహట్, బన్నూ, మర్దన్, దేరా గాజీఖాన్ జిల్లాలను, పంజాబ్‌లో కలిసి ఉన్న ఏజన్సీ ప్రాంతాలైన మలకాండ్, కుర్రం, ఖైబర్, ఉత్తర వజీరిస్థాన్, దక్షిణ వజీరిస్తాన్‌లను పూర్తిగా కలిపివేసి 1901లో బ్రిటీష్ ప్రభుత్వం **వాయవ్య సరిహద్దు రాష్ట్రం** ఏర్పాటు చేసింది.

## చారిత్రక ప్రాధాన్యత

భారతదేశపు వాయవ్య సరిహద్దు ప్రాంతం చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. మహాభారతంలోని కౌరవుల తల్లిపేరు గాంధారి. ఆ గాంధారి ఈ ప్రాంతానికి చెందిన గాంధారం బిడ్డ. ఈ గాంధారం పెషావర్ జిల్లాలోని ఒక ప్రాంతం. ప్రపంచ ప్రఖ్యాత సంస్కృత వ్యాకరణ పండితుడు పాణిని ఈ ప్రదేశంలో పుట్టి పెరిగాడు. ఈ ప్రాంతాల ప్రసక్తి మొదటిసారిగా హిమచ్ఛాదిత హిందూకుష్ పర్వత శ్రేణుల గుండా ఆర్యులు మన దేశానికి వచ్చిన సందర్భంలో వినవస్తుంది. ఆర్యుల నుండి అలెగ్జాండర్ వరకు, ఆ తరువాత అనేకులు ఈ మార్గం గుండా భారతదేశంలోకి ప్రవేశించారు. భారతదేశానికి పుంఖాను పుంఖాలుగా వచ్చిన వలసలకు, ఆక్రమణదారులకు, అతిథులకు ఈ ప్రాంతంలోని కైబర్ కనుమ సింహద్వారం అయ్యింది. ఈ మార్గం గుండా సాగిన ఆక్రమణలను, వలసలను స్వేచ్ఛాప్రియులైన ప్రజలు నిలువరించారు. పరుల రాకను ప్రతిఘటించారు. పోరాడారు. ఆ పోరాటాలలో ప్రాణాలు అర్పించారు. శతాబ్దాల తరబడి ఆక్రమణదారుల అరాచకాలకు వాయవ్య సరిహద్దు ప్రాంతం ఆలవాలమైంది. ఈ వాతావరణం, భౌతిక పరిస్థితుల మూలంగా

ఈ ప్రాంతపు ప్రజలకు యుద్ధం అతి సాధారణమైన క్రీడగా మారింది. శతాబ్దాల అరాచకాన్ని అనుభవించి, అను నిత్యం యుద్ధాలలో మునిగితేలిన ప్రజలు అందుకు తగ్గట్టుగానే, పోరాట వీరులయ్యారు. యుద్ధప్రియులుగా విఖ్యాతిగాంచారు.

## ఆధిపత్యం అంగీకరించని పఠాన్

ఈ ప్రాంతపు **పఠాన్** ప్రజానీకం శతాబ్దం పైగా బ్రిటీషర్ల ఆధిపత్యాన్ని అంగీకరించలేదు. ప్రాణాలు తృణప్రాయంగా భావించి పలుసార్లు దాడులకు పాల్పడ్డారు. గెరిల్లా పోరాటాలు సాగించారు. ఈ స్వేచ్ఛా జీవులను లొంగదీసుకునేందుకు తెల్లదొరలు ప్రత్యేక సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. సైనిక పటాలాలను దించారు. సుమారు 50 భయంకర దండయాత్రలను జరిపారు. అప్పటికీ పఠాన్ ప్రజానీకం లొంగి రాలేదు. నిరంతరం పరదేశీయులతో పోరాటాలు సాగించిన పఠాన్లు బ్రిటీష్ అధికారులను ముప్పుతిప్పలు పెట్టారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, **' ..ఏ ఒక్క రాత్రి కుదురుగా నిద్ర పోలేని పరిస్థితులను పఠాన్‌లు సృష్టించారని ..',** ఆంగ్లేయాధికారులు తమ డైరీలలో రాసుకుని వాపోయారు. ఈ పరిస్థితుల మూలంగా పఠాన్ ప్రజానీకం అంటే మండిపడే ప్రభుత్వం, ఆంగ్లేయ అధికారులు పఠాన్‌ను **అనాగరికుడు, జంతుప్రాయుడు, పులిలాంటి క్రూరుడు, విశ్వాసఘాతకుడైన హంతకుడు** అంటూ ద్వేష భావనలను తమ రికార్డులలో నమోదు చేసుకున్నారు. అయిష్టంగానైనా కొందరు పఠాన్లను **పులులు, సింహాలు**గా అభివర్ణించారు.

ఈ నేల మీద తెల్లవాళ్ళు సాగించిన దుర్మార్గాలు అన్నీ, ఇన్నీ కావు. బానిసత్వం కంటే మరణం మేలని ప్రతిఘటించిన ప్రజలను లొంగదీసుకునేందుకు గ్రామాలకు గ్రామాలు తగలపెట్టారు. పంటలు నాశనం చేశారు. పఠాన్ వీరులను తుపాకీ గుళ్ళకు గురిచేసి చెట్లకు వేలాడదీశారు. మహిళల మీద అత్యాచారాలు జరిపారు. పిల్లలు వృద్ధులనే తేడా లేకుండా ప్రజలను వేటాడి వేటాడి హతం చేశారు. ఈ ప్రాంతాన్ని **' ఎవ్వరికీ చెందని భూమి '** గా ప్రకటించి, అధికారుల ఆయుధ శిక్షణకు, మనుషుల వేటలో ప్రత్యేక శిక్షణకు అనువైన ప్రదేశంగా ఎంచుకున్నారు. ఈ ప్రాంతంలో ఎంతటి ఘోరం జరిగినా, ఎంత దుర్మార్గం చేసినా ఆ విషయాలు ఏవీ బయటకు పొక్కకుండా పటిష్టమైన ఇనుప తెరలను ఏర్పాటుచేసి అధికారులకు పూర్తి స్వేచ్ఛ కల్పించారు. పఠాన్ల మీద విరుచుకుపడేందుకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చారు. విభజించి పాలించు సూత్రం ద్వారా, స్థానిక పఠాన్ నాయకులను మంచి చేసుకుని, అల్ప సంతోషులైన నేతలకు బహుమతులు అందజేసి అందలాలెక్కిస్తామని ఆశలు కల్పించి ఆయా ప్రాంతాలకు సర్దారులుగా ప్రకటించి, అన్ని అధికారాలను తమ గుప్పెట్లో పెట్టుకుని తెలివిగా పాలన సాగించారు.

## ప్రజలు - స్వభావం

వాయవ్య సరిహద్దు ప్రాంతం పరస్పర విరుద్ధ ప్రకృతికి నిలయం. ఈ ప్రాంతంలో హిమచ్ఛాదిత పర్వతాలు, రమ్యమైన అరణ్యాలు, పచ్చని పంట భూములు, పండ్లను, పూలను దండిగా ప్రసాదించే తోటలు, మనోహర పచ్చిక బయళ్ళు ఒకవైపు ఉండగా మరొక వైపున గడ్డిపరక కూడా మొలవని ఎడారి ప్రాంతం, ఇసుక బయళ్ళతో పాటుగా, చిన్న మొలక

కూడా కానరాని కఠిన శిలలు దర్శనమిస్తాయి. ప్రకృతిపరమైన వైరుధ్యం ఏ విధంగా ఇక్కడ చోటుచేసుకుందో అదే తీరున ప్రజల భోగభాగ్యాలలో, జీవన విధానంలో కూడా తేడా కన్పిస్తుంది. వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని పఠాన్లు ముస్లింలు. పఠాన్‌లతో పాటుగా శిక్కులు, హిందువులు కూడా ఇక్కడ సహజీవనం సాగించారు. ఈ ముస్లిమేతర ప్రజలలో అధికులు వ్యాపారస్థులు, బ్యాంకర్లు, వర్తకులు. ఈ ప్రాంతపు ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వీరి అధిపత్యంలో ఉండేది. ముస్లిం పఠాన్లు ప్రధానంగా రైతులు, పండ్లతోటల, జంతువుల పెంపకందారులు. యుద్ధ విద్యలలో నేర్పరులు. పోరాటవీరులు. ఆయుధం వీరి ఆభరణం. అత్యంత ధైర్యస్తులు. భయం, పిరికితనం వీరికి బహుదూరం.

**' పఠాన్ '** అనేది ఏ ఒక జాతిని సూచించే పదం కాదు. ఈ ప్రాంతంలోని అత్యధిక ప్రజల **' పుస్తో'** లేక **పుస్తు '** భాషను మాట్లాడుతారు. ఈ భాషను మాట్లాడే ప్రజలను మతాలతో ప్రమేయం లేకుండా పఠాన్‌లుగా పరిగణిస్తారు. పఠాన్లలో ప్రధానంగా అఫ్రిది, వజిరి, యూసుఫ్ జాయ్, మహసూద్, మోహమ్మద్ జాయ్, ఒరాక జాయ్ అనునవి ప్రధాన తెగలు. ఈ తెగలన్నీ స్వతంత్ర, స్వయం నిర్ణయాలతో, స్వేచ్ఛా జీవనం సాగిస్తుంటాయి. స్వేచ్ఛా- స్వాతంత్ర్యాలు, స్వతంత్ర జీవనం వీరికి ప్రాణం. పఠాన్లకు ప్రాణం కంటే ఆత్మగౌరవం ముఖ్యం. ఆత్మాభిమానం ఎక్కువ. ప్రాణం అతి చౌక. జాతి కోసం, జాతి గౌరవం కోసం, మిత్రుని కోసం ప్రాణాలను ఇవ్వడానికి గాని, ప్రాణాలు తీయడానికి గాని సర్వదా సిద్ధం. శత్రువుగా భావించిన వాడి ప్రాణాలు తీయడం అక్కడ అనవాయితి. నమ్మక ద్రోహాన్ని ఏ మాత్రం సహించరు. శరణు గోరి వస్తే శత్రువునైనా క్షమించి అతిథిగా గౌరవించే దయా స్వభావులు. హుందా, దర్పం గల జాతి పఠాన్ జాతి. మాట పడరు. అవమానం భరించలేరు. అవమానాన్ని భరించేకంటే మరణానికి సిద్ధమౌతారు. మాట నిలుపుకోటానికి ప్రాణం ఇస్తారు. మాటతప్పితే ప్రాణం తీస్తారు. మాట నిలుపుకోడానికి అవసరమైతే ప్రాణాలు పణంగా పెడతారు. అవమానం, అవహేళన భరించటం కంటే ప్రాణాలు వదలడం లేదా శత్రువు ప్రాణాలు తీయడం ఉత్తమమని భావిస్తారు. ఆయుధం విసర్జించి శత్రువుకు లొంగటం కలలో కూడా ఊహించని అంశం. జామీను మీద విడుదల కావడం కూడా చాలా అవమానంగా భావించి, ఆత్మహత్యకు పాల్పడిన కథనాలు ఈ జాతి జనుల తత్వానికి ప్రత్యేక ప్రతీకలుగా నిలుస్తాయి. పగ-ప్రతీకారానికి పఠాన్లు ప్రసిద్ధి. శతృవు మీద పగపడితే లక్ష్యం సిద్ధించేవరకూ ఊరుకోరు. పగ అనేది పఠాను జాతి ప్రత్యేక స్వభావం. ప్రతీకారం తీర్చుకోడానికి ఇష్టపడని వ్యక్తికి పఠాన్ జాతిలో గౌరవ మర్యాదలు దక్కవు. పగ-ప్రతీకారం అనేవి వీరికి వినసొంపైన మాటలు. ఆ జనంలో రగిలిన ప్రతీకార జ్వాల శత్రువును బలి తీసుకోవడంతో సమాప్తమైతే అంతకంటే ఆనందం ఉండదని, వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో అనేక సంవత్సరాలు వైద్యుడిగా పనిచేసిన డాక్టర్ టి.యల్. పెన్నేల్ (Dr. T.L.Pennell) వివరించారు. పఠాన్ జాతి జనుల ప్రతీకారం గురించి డాక్టర్ పెన్నేల్ పలు సంఘటనలను పేర్కొన్నారు.

పగ-ప్రతీకారం ప్రధాన ప్రాకృతిక లక్షణాలుగా, ఆయుధమే ఆభరణంగా, ప్రాణం తీయటం, ప్రాణమివ్వటం అనేది ఒక సరదా క్రీడగా భావించే జనులు, స్వాతంత్ర్యోద్యమంలో మహాత్ముడు ప్రవేశపెట్టిన సత్యాగ్రహోద్యమానికి ప్రతీకలుగా నిలిచిన శాంతిదూతలుగా

పరిణామం చెందటం, జాతీయ ఉద్యమంలో శాంతి సైన్యంగా ప్రముఖ పాత్ర నిర్వహించటం ఆశ్చర్యం కలిగించే విషయం.

ఆ శాతి దళం సభ్యులే ' **ఖుదా-యే-ఖిద్మత్‌గార్** ' లు. **ఖుదా-యే- ఖిద్మత్‌గార్** అంటే **' దేవుని సేవకుడు '** అని అర్ధం. జాతీయోద్యమ చరిత్రలో **' సరిహద్దు గాంధీ '** గా ఖ్యాతి గాంచిన, పఠాన్‌ల ప్రియతమ నేత ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, ఖుదా-యే-ఖిద్మాత్‌గార్ సంస్థను సృష్టించారు. ఆయన ఆలోచనల ప్రకారం, **భగవంతునికి ఎవరి సేవలు అక్కరలేదు, ఆయన సృష్టించిన మానవులకు మాత్రం సేవలు అవసరం. మానవాళికి సేవలందిస్తే భగవంతునికి సేవలు అందజేసినట్లే** నన్న భావనలో మానవ సేవే మాధవ సేవ అంటూ శాంతి సైన్యంతో భారత జాతీయోద్యమంలో ప్రత్యేక చరిత్రకు కారణమయ్యారు. పఠాన్ జనసముదాయం నుండి పుట్టుకొచ్చిన శాంతి సైన్యం ఆవిర్భావానికి ముందు ఆ ప్రాంతాలలో విద్యా- వికాస కార్యక్రమాలను చేపట్టి, అనువగు పరిస్థితులను గఫార్‌ఖాన్ సృష్టించారు. స్వజనుల చరిత్రను అధ్యయనం చేసి జాతి జనుల అభ్యున్నతి కోసం చిన్న వయస్సులోనే కంకణధారుడైన ఆయన ప్రారంభించిన కార్యక్రమాలు, ఆ తరువాత పఠాన్‌ల సహజ స్వభావానికి వ్యతిరేక రంగం సిద్ధం కావడానికి ప్రధాన భూమికగా మారాయి. ఈ **' శాంతి సైనికుల దళం '** చరిత్ర గఫార్‌ఖాన్ జీవితంతో పెనవేసుకుపోయింది. ఖుదా- యే-ఖిద్మత్‌గార్ సంస్థ పుట్టుక, అభివృద్ధి, భారత స్వాతంత్ర్యోద్యమంలో నిర్వహించిన పాత్రను తెలుసుకోవాలంటే, ముందుగా గఫార్‌ఖాన్ జీవిత చరిత్ర తెలుసుకోవాల్సిందే !

## ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్

జీవితాంతం గాంధేయవాదిగా గడిపిన స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 1890లో జన్మించారు. వాయవ్య సరిహద్దు ప్రాంతంలోని పెషావర్ జిల్లా, చార్‌సద్దా తహసిల్‌లోని ఉత్తమంజాయ్ గ్రామంలోని ప్రఖ్యాతి చెందిన మహమ్మద్ జాయ్ తెగలోని సంపన్న కుటుంబం ఆయనది. మహమ్మద్ జాయ్ (Mohammed Zai) అంటే ' **మహమ్మద్ సంతతి** ' అని అర్థం. ఆయన తండ్రి బెహ్రాం ఖాన్ ఉత్తమంజాయ్ గ్రామ సర్దార్. పలు పండ్ల తోటలకు, భూములకు యజమాని. మహమ్మద్ జాయ్ తెగ ప్రజలు తాము ప్రవక్త వారసులుగా గర్విస్తూ, ప్రవక్త బాటలో తు.చ. తప్పక నడవాలని వాంఛిస్తారు.

చిన్నతనం నుంచే సర్దార్ల కుటుంబాలలో కన్పించే సంపన్న జీవన విధానానికి భిన్నంగా ప్రవర్తించిన గఫార్ ఖాన్ గ్రామంలోని మౌల్వీలు వద్ద ధార్మిక విద్యను పూర్తిచేసి, 1898లో పెషావర్‌లోని మున్సిపల్ బోర్డు స్కూల్‌లో, 1901లో ఎడ్వర్డ్ మిషన్ స్కూల్‌లో విద్యాభ్యాసం గావించారు. ఎడ్వర్డ్ మిషన్ స్కూల్‌లోని ప్రధాన ఉపాధ్యాయుడు రెవరెండ్ ఇ.యఫ్.యఫ్.విగ్రాం (Reverend Mr. E.F.F. Wigram) సేవానిరతి ఖాన్ భవిష్యత్తును మలుపు తిప్పింది. రెవరెండ్ విగ్రాంను ఆదర్శంగా తీసుకుని జాతి జనుల సేవలో గడపాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రాంతంలోనే రెవరెండ్ విగ్రాం సోదరుడు డాక్టర్ విగ్రాం ఒక వైద్యశాలను నిర్వహిచేవాడు. పఠాన్ ప్రజల సేవలో గడుపుతున్న విగ్రాం సోదరుల సేవాతత్పరత గఫార్‌ఖాన్‌లో నిబద్ధతను పటిష్టపరిచింది.

ఆరడుగుల ఎత్తు, దృఢకాయుడైన ఖాన్‌కు సైన్యంలో చేరాలని ఆకాంక్ష. సమరశీల యోధులైన పఠాన్ బిడ్డలు సైన్యంలో చేరాలని అభిలషించేవారు. సర్దార్ కుటుంబానికి చెందిన పఠాన్ బిడ్డడికి సైన్యంలో బ్రిటీష్ అధికారులతో సమానంగా హోదా లభించేది. ఆ స్థాయి హోదాను పొందడానికి పఠాన్ యువకులు ఉవ్విళ్ళూరేవారు. గఫార్ ఖాన్ కూడా సైన్యంలో (Guides Mission) చేరారు. ఒక బ్రిటీష్ సైనికాధికారి మరొక పఠాన్ సైనికుని పట్ల అగౌరవంగా ప్రవర్తించడం చూసి సహించలేని ఆయన, సైన్యం నుండి బయటికి వచ్చేశారు. ఆ తర్వాత 1908లో ఆలీఘర్ వెళ్ళి విద్యాభ్యాసం చేస్తుండగా, రెవరెండ్ విగ్రాం ఆయనను ఇంగ్లాండ్ వెళ్ళి చదవమని సలహా ఇచ్చారు. అందుకు ఏర్పాట్లు కూడా జరిగాయి. చివరకు తల్లి అయిష్టత వ్యక్తం చేయటంతో ఆ ప్రయత్నం మానుకుని స్వగ్రామానికి వెళ్ళి వ్యవసాయంలో గ్రామ వ్యవహారాల నిర్వహణలో తండ్రికి తోడ్పడసాగారు.

స్వగ్రామానికి తిరిగి వచ్చిన గఫార్ ఖాన్, ప్రజల పేదరికం, అవిద్యల మీద దృష్టి సారించారు. విద్యా సౌకర్యాలు లేనందున పఠాన్లు ఎలా వెనుకబడుతున్నది, ఎంతటి అజ్ఞానంలో మగ్గిపోతున్నది అధ్యయనం చేశారు. ఈ పరిస్థితులను మెరుగుపర్చడానికి నడుం బిగించారు. విద్యలో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న స్వజనులకు విద్యా-వికాస సదుపాయాలను కల్పించాలని సంకల్పించారు. మిత్రుడు అబ్దుల్ అజీజ్ సహకారంతో 1910లో ఉత్తమ జాయ్‌లో **' ఆజాద్ జాతీయ పాఠశాల '** ను ప్రారంభించారు. ఈ రంగంలో అప్పటికే కృషిచేస్తున్న ప్రముఖ సంఘసంస్కర్త అబ్దుల్ వాహిద్ హాజీ అసాబ్ ప్రోత్సాహం ఆయనకు లభించింది.

బిడ్డలకు విద్యాబుద్ధులు చెప్పటం వరకే గఫార్ ఖాన్ తన కార్యక్రమాలను పరిమితం చేసుకోలేదు. పఠాన్ సమాజంలో చిట్లం కట్టుకుపోయి ఉన్న పగ-ప్రతీకారం, మూర్ఖత్వం -మౌఢ్యం, అపరిశుభ్రత, అనారోగ్యం, పేదరికం లాంటి పలు రుగ్మతల వలన జాతి జనులు ఏ విధంగా నష్టపోతున్నది పేర్కొంటూ, సంస్కరణల అవసరాలను వివరిస్తూ ఆ దిశగా ప్రచారం ప్రారంభించారు. ప్రజలలో విద్యా-వికాసంతోపాటుగా సామాజిక సంస్కరణల కోసం తగిన కార్యక్రమాన్ని, ప్రణాళికను తయారు చేసుకున్నారు. సంస్కరణల అవసరాన్ని నొక్కి చెప్పారు.

పరంపరగా వచ్చే అచార సంప్రదాయాలకు అత్యధిక గౌరవమిచ్చే, పఠాన్ సమాజం సంస్కరణలను సహజంగానే అంగీకరించలేదు. సంస్కరణలు పఠాన్ జాతి జనుల స్వభావానికి వ్యతిరేకం. గఫార్ ఖాన్ నిరుత్సాహపడలేదు. దృఢచిత్తంతో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించ సాగాయి. బానిసత్వంలో, అజ్ఞానంలో, అరాచకంలో మగ్గుతున్న ప్రజానీకం తమ దుర్భర పరిస్థితులను, ఆ పరిస్థితులకు కారణాలను క్రమంగా అర్థం చేసుకుంటూ, గఫార్ ఖాన్ మార్గాన నడిచేందుకు సన్నద్ధం కాసాగారు. ప్రజలలో చైతన్యపు ఛాయలు ప్రస్ఫుటం కాసాగాయి.

ఈ వాతావరణం అటు పాలకవర్గాలలో, ఇటు పాలకవర్గాల చెప్పుచేతల్లో ఉన్న మౌల్వీలలో అసహనానికి కారణమైంది. ప్రజలు విద్యావంతులైతే తమ దాష్టీకాలు సాగవని బ్రిటీషర్లు, తమ ఆధ్యాత్మిక-సాంఘిక పెత్తనం సాగదని భావించిన ధార్మిక గురువులు

ఆటంకాలు సృష్టించారు. ఆటంకాలు సృష్టించిన పాలకులు, ధార్మిక నాయకులు, ప్రజల జీవితాలలో గుణాత్మక మార్పుకు తగిన ప్రత్యామ్నాయం చూడలేకపోవటంతో గఫార్ ఖాన్‌కు ఆ ఆటంకాలు అడ్డు కాలేకపోయాయి. ఈ వాతావరణంతో ఉత్సాహాన్ని నింపుకున్న గఫార్ ఖాన్, పఠాన్ యువతకు సమకాలీన రాజకీయాలను పరిచయం చేయడానికి, జాతీయ భావాలను ప్రోదిచేయటానికి చర్యలు తీసుకున్నారు. అలీఘర్‌లో పరిచయమైన మౌలానా జాఫర్ అలీ ఖాన్ సంపాదకత్వం వహిస్తున్న **' జమీందార్ '** దినపత్రిక, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సారధ్యంలోని **' అల్–హిలాల్ '** పత్రికలను పాఠశాలలకు తెప్పించి అధ్యయనం చేయించారు. ఈ పత్రికలు విద్యార్థులు,యువజనులలో రాజకీయ చైతన్యానికి తోడ్పడ్డాయి.

యువకుడు గఫార్ విద్యా–వికాస కార్యక్రమాలంటూ, సంస్కరణలంటూ గ్రామాలు పట్టి తిరగడాన్ని, తల్లితండ్రుల ప్రేమ అర్థం చేసుకోలేకపోయింది. వివాహం చేస్తే ఇంటి పట్టున ఉంటాడని భావించి 1912లో గఫార్ ఖాన్‌కు పెండ్లి చేసారు. అదే సమయంలోనే గఫార్‌కు మార్గదర్శకంగా ఉన్న హాజీ అబ్దుల్ వాహిద్ సాహెబ్ బ్రిటీష్ పాలకుల మీద తిరుగుబాటు ప్రకటించారు. గత అనుభవాల దృష్ట్యా, వలసపాలనాధికారుల ఎత్తులకు ప్రభావితులైన పఠాన్ తెగల పెద్దలు, ధార్మిక నేతలు తిరుగుబాటుకు చేయూతనివ్వలేదు. గత్యంతరం లేక హాజీ సాబ్ పర్వత ప్రాంతాలలో అదృశ్యమైపోయారు. జాతి జనుల అభ్యున్నతిని కోరుతూ సాగుతున్న సంస్కరణల పర్వానికి మార్గదర్శకత్వం వహిస్తున్న హాజీ సాబ్ అదృశ్యం కావటంతో యువకుడు గఫార్‌ఖాన్‌కు మార్గదర్శకులు కరువయ్యారు.

నిర్మాణాత్మక మార్గదర్శకత్వం కోసం గఫార్‌ఖాన్ ముస్లిం సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న నేతల వైపు దృష్టిసారించారు. 1913లో ఆగ్రాలో జరిగిన ఆల్ ఇండియా ముస్లింలీగ్ సమావేశాలకు, ఆ తరువాత దేవ్‌బంద్‌లలో జరిగిన ముస్లిం ప్రముఖుల సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యా–వికాస కార్యక్రమాలను, సంస్కరణలను కొనసాగించాలని, రాజకీయ చైతన్యానికి కృషి చేయాల్సిందిగా పలువురు నేతలు ఆయనకు సలహా ఇచ్చారు. ప్రముఖుల సలహాల మేరకు మరికొన్ని ప్రాంతాలలో ఆజాద్ పాఠశాలల స్థాపనకు గఫార్ ఖాన్ నడుం కట్టారు.

అది 1914 సంవత్సరం. ప్రథమ ప్రపంచ యుద్ధకాలం నాటి కిరాతక చట్టాలను ప్రభుత్వం అమలుచేస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక భావాల ఉనికిని కూడా పాలకులు సహించలేకున్నారు. ఆ పరిస్థితులలో అధికారుల చూపు ఆజాద్ పాఠశాలల మీద పడింది. రాజకీయ, సాంఘిక చైతన్యానికి కారణమవుతున్న పాఠశాలలను మూసివేయడానికి అధికారులు హుకూం నామాలు జారీచేసారు. స్థానిక సర్దార్‌లను మాలిమి చేసుకుని, బెదిరించి కొన్ని పాఠశాలలను మూసి వేయించారు. ఆ వాతావరణంలో కూడా నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తూ, గఫార్ ఖాన్ విస్తృతంగా పర్యటనలు ప్రారంభించారు. జాతి జనుల అభ్యున్నతిని వాంఛిస్తున్న గఫార్ ఖాన్ నిబద్ధతను, ధైర్యసాహసాలను గమనించిన ప్రజలు ఆయనను **' బాద్షా ఖాన్ '** అంటూ గౌరవాభిమానాలను ప్రకటించారు. **బాద్షా ఖాన్** అంటే **ఖాన్‌లకు రాజు. ఖాన్** అంటే **నేతయని అర్థం.** ఈ విధంగా యువకుడైన అబ్దుల్ గఫార్ ఖాన్, ఖాన్‌లకే ఖాన్ **బాద్షాఖాన్** అయ్యాడు. ఆ సమయంలోనే ఆయన కార్యక్రమాలను మౌనంగా సమర్ధించిన

భార్య అకాల మరణం చెందటంతో, తన ఇద్దరు బిడ్డలను తల్లితండ్రులకు అప్పగించి ఆయన ప్రజా సేవకు పూర్తిగా అంకితమయ్యారు.

## గఫార్ ఖాన్ రాజకీయ రంగ ప్రవేశం

బ్రిటీష్ ప్రభుత్వం రౌలత్ చట్టం తెచ్చింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ప్రజాపోరు ప్రారంభమైంది. ఈ పోరాటం సందర్భంగా గఫార్‌ఖాన్ మొదటిసారిగా మహాత్మాగాంధీ గురించి విన్నారు. గాంధీజీ పిలుపు మేరకు ప్రారంభమైన రౌలత్ వ్యతిరేక ఆందోళనలో ఆయన భాగస్వామి అయ్యారు. 1919 ఏప్రిల్ 6న, ఉత్తమం జాయ్‌లో జరిగిన సమావేశంలో రౌలత్ చట్టాన్ని విమర్శిస్తూ ఆయన తొలి రాజకీయ ప్రసంగం చేశారు. ఈ ఉద్యమ ప్రవేశంతో ఖాన్-గఫార్-ఖాన్ పఠాన్‌ల రాజకీయ నేతగా ఉద్భవించారు. ఆ రోజు హాజరైన జనసందోహాన్ని గమనించిన బ్రిటీష్ అధికారులు ఉత్తమంజాయ్ గ్రామం మీద దాడిచేశారు. ప్రజల వద్దనున్న ఆయుధాలను లాక్కొన్నారు. అరవై వేల రూపాయల ఉమ్మడి జరిమానా విధించారు. గఫార్‌ఖాన్‌ను కాల్చేస్తామని ఆయన తండ్రిని హెచ్చరించారు. చివరకు తండ్రి, తనయులను అరెస్టు చేశారు. వృద్ధుడైన బెహ్రాం ఖాన్ మూడు మాసాలు జైలులో గడపగా, గఫార్‌ఖాన్ ఆరు మాసాల జైలు జీవితాన్ని తొలిసారిగా చవిచూశారు. జైలు నుండి విడుదల తరువాత తల్లితండ్రులు పట్టుపట్టి ఆయనకు ద్వితీయ వివాహం చేశారు.

## జాతీయోద్యమ ప్రవేశం

గఫార్ ఖాన్ 1920లో ఢిల్లీలో జరిగిన ఖిలాఫత్ సమావేశాలకు హాజరయ్యారు. ఆ సమావేశాలలో మహాత్మా గాంధీ, అబుల్‌కలాం ఆజాద్‌లను ఆయన తొలిసారిగా చూశారు. ఈ సమావేశాలలో సత్యాగ్రహ ఉద్యమం, అహింసా సిద్ధాంతాల గురించి విన్నారు. మహాత్మా గాంధీజీ, అలీ సోదరుల ప్రేరణతో ఖిలాఫత్ – సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా వలసపాలకుల చర్యలకు నిరసన తెలుపుతూ, ముజాహరిన్ దళాలతో ఆయన కాబూల్ వలస వెళ్ళి తిరిగి వచ్చారు. నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాలకు వెళ్ళి వచ్చాక, విద్యా-వికాస కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి వ్యక్తుల కంటే సంస్థలు బాగా పనిచేయగలవని భావించి పలు సంస్థలను స్థాపించారు. 1921లో ANJUMAN-E-ISLASHUL-AFAGHENA (ఆఫ్ఘాన్‌ల సంస్కరణల సంఘం) ను ఏర్పాటు చేసారు. రైతుల సంక్షేమం కోరుకుంటూ 1927లో ANJUMAN-E-ZAMINDARAN సహకార వ్యవస్థను ప్రజలకు మరింత చేరువచేసేందుకు సహకార చైతన్య కేంద్రాలను (Cooperative Enlightenment Centres) ప్రారంభింప చేసారు. యువజనుల శక్తి, యుక్తులను నిర్మాణాత్మకంగా ఉపయోగించుకునేందుకు Pushtun Jirgah పుస్టున్ యువజన సంఘాన్ని (Pushtun Youth League) ప్రారంభించారు.

ప్రజా చైతన్యానికి కారణమవుతున్న పాఠశాలను నిర్వహించటమే ఘోరమైన నేరంగా భావించిన బ్రిటీష్ అధికారులు 1921లో గఫార్ ఖాన్‌ను అరెస్టు చేసారు. పాఠశాలలను మూసివేసినట్టయితే వదలివేస్తామని ఆయనకు నచ్చచెప్పమని, ఖాన్ తండ్రికి నాగపూర్ చీఫ్ కమీషనర్ చెప్పాడు. ఆ ప్రస్తావన తెచ్చిన తండ్రితో, **'...అందరూ నమాజ్ మానివేసారనుకో**

**నన్ను కూడా మానివేయమని చెబుతావా? ప్రజలను విద్యావంతులని చేయటం పవిత్ర నమాజ్‌లాంటిదని'** ఆయన తండ్రికి చెప్పారు. లాహోర్ చీఫ్ కమీషనర్ సర్‌జాన్ మాఫే ఆజ్ఞలకు, హుంకరింపులకు ఖాన్ గఫార్‌ఖాన్ ఏ మాత్రం బెదరకపోవటంతో ఆయనను తన ఆఫీసుకు రప్పించి పాఠశాలలను మూసివేయమని, లేదంటే బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయనని, వ్యతిరేక భావాలను ప్రచారం చేయనని హామీ ఇవ్వాల్సిందిగా ఆదేశించాడు. అందుకు సమాధానంగా, **'...ముందు మీరు మా దేశాన్ని ఆక్రమించారు. ప్రస్తుతం మా దేశంలో కూడా మమ్మల్ని బ్రతకనివ్వరా?'** , అని ఖాన్ ప్రశ్నించేసరికి, మండిపడిన అధికారి ఆయనను **' భయంకర నేరస్థుడు '** గా పేర్కొంటూ, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించాడు. ఆ సమయంలో ఆయనతోపాటు అబ్దుల్ ఖయ్యాం అను మిత్రుడు కూడా బ్రిటీష్ అధికారిని ఎదిరించి నిలిచాడు.

గఫార్ ఖాన్ జైలులో ఉండగా మత గ్రంథాల అధ్యయనం ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధులతో ధార్మిక చర్చలు జరిపారు. **' ... ఒక మతం యొక్క బలాన్ని ఆ మతం వారమని చెప్పుకునే వారి సంఖ్యను బట్టి నేను నిర్ణయించను... జీవన సరళిలో ప్రస్ఫుటం కానటువంటి మత విశ్వాసం నిరర్థకం. ఇస్లాం అంటే ఆచరణ (అమల్), విశ్వాసం (యకీన్), ప్రేమ (మొహబ్బత్)...ఇవి లేని ముస్లిం వట్టి శబ్దం మాత్రమే. నిస్సారమైన వ్యక్తి మాత్రమే. దేవుడు ఒక్కడేనని, మరొక దేవుడు లేడని, సత్క్రియల ద్వారానే మోక్షం సాధ్యమని ఖురాన్ షరీఫ్ నిర్దుష్టంగా ఆదేశిస్తున్నదని...',** ఆయన భావించారు.

1924లో జైలు నుండి విడుదలైన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌కు ఘన స్వాగతం లభించింది. ఆయనను ఆఫ్ఘాన్లు గర్వించదగిన వ్యక్తిగా (FAKAR-E-AFGHAN) ప్రజలు ప్రకటించారు. ఆయన జైలులో ఉండగానే తల్లి మరణించింది. 1927లో తండ్రి బెహ్రాం ఖాన్ కన్నుమూసారు. ఆయన కుటుంబం మక్కా యాత్రలో నుండగా రెండవ భార్య కూడా మరణించింది. ఈ విషాద సంఘటనల తరువాత సంస్కరణలు, విద్యా వ్యాప్తి, రాజకీయ చైతన్యం కోసం పూర్తి సమయాన్ని కేటాయించాలని నిర్ణయించుకుని కుటుంబ బాధ్యతలను బిడ్డలకు అప్పగించి, ఆయన సమాజ సేవకు అంకితమైపోయారు.

1928 చివరిలో కలకత్తాలో జరిగిన ముస్లిం నాయకుల సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఆ సభలో నేతలు ప్రదర్శిస్తున్న ఆగ్రహావేశాలు, వారి తీరుతెన్నులు హేతుబద్ధంగా లేకపోవటం ఆయనకు నచ్చలేదు. ఆ సమయంలోనే అక్కడే జరుగుతున్న భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యారు. ఆ సమావేశంలో గాంధీజీ చేసిన ప్రసంగం విని, ఆయన వ్యవహార సరళిని గమనించిన గఫార్ ఖాన్ బాగా ప్రభావితుడయ్యారు. ఆనాటికే గాంధీజీ మార్గంలో ముందుకు సాగుతున్న ఆయన, యావత్తు జీవితం అదే బాటలో నడవాలని నిర్ణయించుకున్నారు.

## ఖుదా-యే-ఖిద్మత్‌గార్ ఆవిర్భావం

నూతన ఉత్తేజంతో, వినూత్న సిద్ధాంతాల ఆకళింపుతో ఖాన్ గఫార్ ఖాన్ స్వస్థలం చేరుకున్నారు. బహిరంగ సమావేశాల మీద నిషేధం ఉన్నందున మసీదులలో సమావేశాలు, సభలు నిర్వహిస్తూ, ప్రసంగాలు చేస్తూ, సహనం, సంయమనం, సహిష్ణుత, అహింస, శాంతి,

సత్యాగ్రహం తదితర అంశాలను తన ప్రజలకు పరిచయం చేస్తూ ప్రచారం ప్రారంభించారు. అటువంటి సమావేశాలు జరుగుతున్న సందర్భంగా 1929 సెప్టెంబర్‌లో ఒక యువకుడు ఆయన వద్దకు వచ్చి, జాతీయోద్యమ కార్యక్రమాలలో భాగంగా గాంధీజీ మార్గంలో పఠాన్ ప్రజలను నడిపించాలంటే వినూత్న సంస్థ అవసరం ఉందన్నాడు. పఠాన్ యువజన సంఘాలు కేవలం సేవా కార్యక్రమాలకు పరిమితం అవుతున్నందున బ్రిటీష్ ప్రభుత్వ చర్యలను ఎదుర్కొనేందుకు సైనిక శిక్షణ గల యువకులతో కూడిన **' భగవత్సేవకుల దళం '** అవసరమని వివరించాడు. భగవంతుని ఎదుట ప్రమాణం చేసి జాతి జనుల కోసం, దేశం కోసం పోరాటానికి దీక్షపూనిన స్వచ్ఛంద సేవకుల దళం కావాలన్నాడు. ఈ సేవకులు ఆయుధాలు చేపట్ట కూడదన్నాడు. శతృవుతో అస్త్రశస్త్రాలతో కాకుండా ఆత్మార్పణలతో పోరాడగల చేవ, దమ్ము, ధైర్యం గల సమరశీల యోధుల పటాలాన్ని రూపొందించాలని సూచించాడు. ఆ యువకుడి అభిప్రాయాలను ఆసక్తితో విన్న బాద్షాఖాన్, ఆ వినూత్న, విప్లవకర భావాలను అంగీకరించి, సహచరులతో సంప్రదించి 1929లో **' ఖుదా-యే-ఖిద్మత్‌గార్ '** సంస్థను ప్రకటించారు. ఈ విధంగా చరిత్రలోని ప్రప్రథమ అహింసా యోధుల సైన్యం ఏర్పడింది. ( "... An army of trained proffessional nonviolent soldiers was something new... Kudai Khidmadgars, under the leadership of Abdul Gaffar Khan, became history's first proffessional nonviolent army..." - Mr. Eknath Easwaran in his book Badshah Khan)

ఈ సంస్థ సభ్యులు, **' మనసావాచా కర్మణా అహింసకు దత్తమై, ప్రతిఫలాపేక్ష లేకుండా, విద్వేషానికి దూరంగా, మానవ సేవయే మాధవసేవగా భావించి ప్రజాసేవ చేయటమే ప్రధాన ధ్యేయంగా పరిశుద్ధ జీవనసరళిని అనుసరించాలని '** గఫార్‌ఖాన్ భావించారు. లక్ష్యం విషయంలోనే కాకుండా లక్ష్యసాధనా మార్గంలో కూడా ఖచ్చితంగా ఉండాలని నిర్ణయమైంది. **' ప్రజల హృదయాలను సన్మార్గోన్ముఖులను చేసేటటువంటి, అపమార్గంలో పోకుండా కట్టడి చేసేటటువంటి ఒక బృందం మీ మధ్య నుంచే ఉద్భవిస్తుంది. లక్ష్యసిద్ధిని పొందగలవారు వీరే.'** అను ఖురాన్ అయత్‌ను ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థకు మార్గదర్శకంగా స్వీకరించారు. అంతేకాదు **' తమ సమున్నతికై తాము కృషి చేసుకొనని వారి సమున్నతికై భగవానుడు ఏమి చేయడు.'** అను ఖుర్ ఆన్ అయత్‌ను అనుసరించి తమను తాము ఉద్ధరించుకోవడమే ప్రధానమని బోధించారు. అందుకు తగ్గట్టుగా సంస్థ నియమాలను రూపొందించారు.

## విశిష్ట ధ్యేయం

సమరశీల యోధులలో అనూహ్యామైన రీతిన సహనశీలతను ప్రవేశింపచేసి, ప్రతీకార జ్వాలలతో శత్రువును దగ్ధం చేయాలని పరితపించే పఠాన్ బిడ్డలను అహింసా వీరులుగా తీర్చిదిద్దిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ ధ్యేయం, ప్రారంభంలో సాంఘిక సంస్కరణలకు పరిమితమైంది. అనంతరకాలంలో స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల కోసం అహింసా పోరాటం సాగించాలన్న రాజకీయ ధ్యేయాన్ని నిర్దేశించుకుని రాజకీయ సంస్థగా పరిణామం చెందింది.

తొలిదశలో **'... పఠానులకు స్వయంకృషి, పొదుపు, ఆత్మవిశ్వాసం అనే**

**సుగుణాలను, ఆత్మగౌరవం, భీతిని పారద్రోలే భగవద్భక్తి గరపడానికి, వారిలో సాంఘిక సంస్కరణకు, ఆర్థికాభివృద్ధికి దోహదం చేయడం...'**, ఖుదా-యే -ఖిద్మత్‌గార్ సంస్థ ధ్యేయం. ఈ విషయాన్ని ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ మాటల్లో చెప్పాలంటే **'...నా ఉద్యమం రాజకీయమైనదే కాక సాంఘికమైనది కూడాను. పొరుగు వారిని ప్రేమించాలని, నిజం మాట్లాడాలని ఖుదా-యే-ఖిద్మత్‌గార్లందరికీ నేను బోధిస్తుంటాను. పఠానులు స్వతహాగా యుద్ధవీరులు, తేలికగా అహింసకు కట్టుబడరు. వారికి అహింసా ధర్మాన్ని నేర్పడానికి శాయశక్తుల కృషి చేస్తున్నాను... '**

ఈ ధ్యేయంతో ప్రారంభమైన ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ సభ్యుల ప్రవర్తన ప్రధానంగా శాంతి, అహింస, శత్రువుతో స్నేహపూర్వక వ్యవహారం అనేది వినూత్నమైన సృష్టి ఏ మాత్రం కాదని ఖాన్ గఫార్ ఖాన్ ప్రకటించారు. ఈ విషయాన్ని వివరిస్తూ, **'... అహింసాతత్వానికి నా వంటి ముస్లింగాని, పఠాన్‌గాని అంకితం కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇది ఒక కొత్త తత్వమేమీకాదు. 1400 ఏళ్ళ క్రితం ప్రవక్త మక్కాలో ఈ పద్ధతినే ఆశ్రయించినారు. అప్పటి నుంచి దుష్టుల బాధల నుండి విముక్తంగాదలచిన వారందరూ ఈ తత్వాన్నే అనుసరించారు. అయితే ఇదంతా మరచిపోయి, మహాత్మాజీ మనకు ఒక కొత్త తత్వాన్ని బోధిస్తున్నారని మనం అనుకుంటున్నాం. మనం మరచిపోయిన ఒక ఉత్తమ పద్ధతిని పునరుద్ధరించిన గొప్పతనం మహాత్మాజీకే చెల్లుతుంది. ఒక జాతి తనకు జరిగే అన్యాయాన్ని తొలగించుకోడానికి ఇది అనుసరణీయ మార్గమని మహాత్ముడు ఈ తత్వాన్ని మన ముందు ఉంచారు...'**, అన్నారు. ఈ విధంగా అహింసా సిద్ధాంతమే ప్రధాన మార్గంగా ప్రజల అభ్యున్నతి, మాతృదేశ సేవ, తద్వారా స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలను లక్ష్యంగా నిర్ణయించుకున్న ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థకు ఖాన్ గఫార్ ఖాన్, ఆయన సహచరులు ప్రత్యేక నియమ నిబంధనలు రూపొందించారు. ఈ నిబంధనలు సంస్థ స్వభావ స్వరూపాలను వెల్లడిస్తాయి.

## నియమనిబంధనలు

ఈ నియమనిబంధనలను మహాత్మా గాంధీకి ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసిన శ్రీ ప్యారేలాల్ రాసిన **' తోడేళ్ళపాలు చేసారు '** గ్రంథంలో ( గాంధీ సాహిత్య ప్రచురణాలయం, హైదరాబాద్, 1969, తెలుగు అనువాదం : శ్రీ జి. కృష్ణ ) ఈ విధంగా ఉటంకించారు.

**"1. మనసా వాచా మానవులకు ఏ విధమైన క్లేశాన్ని కలిగించరాదు. తనను ఇతరులు ఎలా ఆదరించాలని ఆశిస్తాడో ఇతరులను తాను అలా ఆదరించాలి.**

**2. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ ఎవ్వరి మీద దుష్ప్రచారం చేయరాదు. చాటున మాటున నిందలను వేయరాదు. అసత్యాలను పలుకరాదు.**

**3. సాత్విక మార్గంలో అధికార దర్పాన్ని, అధికార దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలి. ప్రేమతో, వాత్సల్యంతో ప్రత్యర్థిని అపమార్గం నుంచి మళ్ళించాలి.**

**4. ఎవ్వరినీ అణచడానికి పూనుకోరాదు. అటువంటి చర్యలలో పాల్గొనరాదు. అణగారిన, అణగారుతున్న వారి పక్షాన్నే ఖుదా-యే-ఖిద్మత్‌గార్ వహించాలి.**

**5. ముఠాలలో, కుట్రలలో చేరరాదు. ఎవ్వరిపైనా కసి తీర్చుకోవాలనే సంకల్పం చేయరాదు. ఎవ్వరి పట్లా విరోధం పూనరాదు.**

**6. సంఘానికి అపకారం కలిగించే దురాచారాలను, పద్ధతులను విడనాడాలి. అటువంటి ఆచార పద్ధతుల రద్దుకై నిర్విరామంగా కృషిచేస్తూ ఉండాలి.**

**7. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ నిరాడంబరంగా జీవితం గడపాలి.**

**8. నిజాయితీతో పరిశ్రమించి జీవన యాత్ర సాగించాలి. సోమరితనం కూడదు. తనకు అవసరమైన దానికి మించి వాంఛించరాదు.**

**9. దేశానికి, సంఘానికి ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సేవానురక్తితో అంకితుడు కావాలి. నిజాయితీతో సేవచేయాలి. తన దేశ శ్రేయస్సును, సంఘ శ్రేయస్సును సాధించడానికి వెనుదీయరాదు.**

**10. అధిక సంఖ్యాకుల ఆమోదంతో ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ చేసిన ప్రతి నిర్ణయాన్ని, జారీ చేసిన ప్రతి ఆదేశాన్ని ప్రతి సభ్యుడు తు.చ. తప్పక మన్నించాలి. నిజాయితీతో, నిబద్ధతతో దానిని అమలు చేయాలి..."**

ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సభ్యులు శాంతి సైనికులుగా, అహింసా యోధులుగా అజరామరమైన కీర్తి పొందే విలక్షణ రీతిలో నడిచేందుకు ఈ నియమ నిబంధనలు బహుముఖంగా తోడ్పడ్డాయి. ఈ విశిష్టమైన ప్రవర్తనా నియమావళి, కార్యక్రమాల సరళి వెనుక మహత్తరమైన మానవీయ విలువలను ప్రతిష్ఠించి, సేవాభావాన్ని ఆవిష్కరించిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, పఠాన్ జాతి జనులలో ఏ విధమైన మౌలిక సామాజిక మార్పులను కోరుకున్నారో మనకు తెలియచేస్తుంది.

## అహింసాయోధుల మహత్తర ప్రమాణం

పఠాన్ బిడ్డడు ప్రాణం ధారపోయడానికైనా సిద్ధపడతాడు గాని, ఆడిన మాట తప్పడు. బద్ధవిరోధి కూడా అన్నార్తుడై తన ఇంటికి వస్తే, ఆదరించటం ధర్మంగా భావిస్తాడు. ఈ సుగుణాలను బాగా ఎరిగిన వ్యక్తి కనుక ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, పఠాన్ ప్రజలను హింసా మార్గం నుండి మళ్ళించేందుకు ప్రత్యేకంగా ' **ప్రమాణం** ' రూపొందించారు. ఈ మేరకు ప్రతి ఖుదా-యే- ఖిద్మత్‌గార్‌చే ఈ ప్రమాణం / ప్రతిజ్ఞ చేయించటం తప్పనిసరి. ఆ ప్రమాణం ఈ విధంగా ఉంది.

**"... భగవంతునికి మానవుడు సేవలు చేయాల్సిన అవసరంలేదు కనుక, మానవ సేవయే మాధవసేవగా భావించి భగవంతుడు సృష్టించిన మానవులకు, ఖుదా-యే-ఖిద్మత్‌గార్ అను నేను సేవలందిస్తానని ప్రమాణం చేస్తున్నాను. ప్రతి హింసాత్మక, ప్రతీకార చర్య నుండి నేను దూరంగా ఉంటానని, నా పట్ల క్రూరంగా వ్యవహరించే వారిని, నన్ను అణగద్రొక్కే వారిని నేను క్షమిస్తానని ప్రమాణం చేస్తున్నాను. ప్రతి పఠాన్‌ను నా సోదరునిగా, మిత్రునిగా పరిగణిస్తానని, సంఘవ్యతిరేక సంప్రదాయాలకు, పద్ధతులకు దూరంగా మెలగుతానని ప్రమాణం చేస్తున్నాను. నేను మంచికి సమీపంగా, చెడుకు దూరంగా వ్యవహరిస్తూ సామాన్య జీవితం గడుపుతానని, సోమరిగా కాకుండా మంచి ప్రవర్తనతో, పద్ధతులతో నా జీవితాన్ని సాగిస్తానని, ప్రతిరోజు రెండు గంటలు సాంఘిక సేవా కార్యక్రమాలకు కేటాయిస్తానని ప్రమాణం చేస్తున్నాను...'**

ఈ ప్రమాణం ప్రతి ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌కు హింసకు, ప్రతీకారానికి దూరంగా, అహింసను ' **ఆత్మ** ' గా భావించి ప్రవర్తించేందుకు నిర్దుష్టమైన కట్టుబాటును ఏర్పరచింది. ఈ మేరకు ఒకసారి భగవంతుని పేర ప్రమాణం చేసిన ఖుదా-యే -ఖిద్మత్‌గార్, అవసరమైతే ప్రాణాలు వదలడానికైనా సిద్ధపడ్డాడు గాని, ప్రమాణాన్ని ఉల్లంఘించకపోవటం విశేషం. ఒకవేళ ప్రమాణాన్ని ఉల్లంఘించాల్సిన ఉపద్రవం ఎదురైతే ఆత్మాహుతికి సిద్ధపడ్డాడు తప్ప, అహింసా మార్గం వీడక పోవటం ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల విశిష్టత.

## నిర్మాణం - సైనిక శిక్షణ

ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ సైనిక వ్యవస్థలా ఉండాలని ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నిర్ణయించారు. అందుకు అనుగుణంగా సంస్థకు సైనిక పటాలాల రూపు రేఖలు కల్పించారు. సభ్యులకు ప్రాథమిక స్థాయి శిక్షణ కల్పించారు. ప్రతిరోజు డ్రిల్లు చేయటం, సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయగలిగేలా శిక్షణ ఇవ్వటం పట్ల శ్రద్ధ చూపారు. ప్రత్యేక బ్యాడ్జీ, మూడు రంగుల జెండా ఏర్పాటు చేసారు. సైన్యంలో లాగే వివిధ స్థాయి పదవులు, అధికార క్రమాన్ని నిర్దేశించారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లకు **సాలార్-యే-ఆజం** (కమాండర్ ఇన్ చీఫ్) ను నియమించారు. ఈ అధికారులు, అధినేతలు స్వచ్ఛందంగా తమ జీవితాలను, సమయాన్ని సంస్థ లక్ష్యాల సాధన కోసం పణంగా పెట్టడానికి వచ్చినవారే కనుక, జీతాలు, అలవెన్సుల వ్యవహారానికి తావులేదిక్కడ. సాలార్-యే-ఆజం ఆజ్ఞలను పాటించే అధికారులను నియమించారు. శాంతి సైనికులు ఒక నిర్ణీత కార్యక్రమం ప్రకారం వ్యాయామం వగైరాలు చేయాలి. శాంతి సైనికులు ప్రారంభంలో తెల్లటి ఖద్దరు దుస్తులు ధరించేవారు. అవి త్వరగా మాసిపోతున్నందున తెల్లటి దుస్తుల స్థానంలో ఎర్రటి రంగు చొక్కాలను అనుమతించారు. ఈ చొక్కాల మూలంగానే ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లను ' రెడ్ షర్ట్స్ ' (Red Shirts) గా చరిత్ర నామకరణం చేసింది. సైనిక వ్యవస్థను, సైనిక శిక్షణను, సైనిక జీవన సరళిని అనుసరిస్తున్నప్పటికీ ఖుదా-యే-ఖిద్మత్‌గార్లు ఏ రకమైన ఆయుధాలను ధరించకపోవటం, కనీసం లాఠీ కూడా చేతపట్టకపోవటం విశేషం. ఈ విశేషమే ఖుదా-యే-ఖిద్మత్‌గార్లకు జాతీయోద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించింది.

**'...నేను మన ప్రవక్త గారి ఆయుధాన్ని మీకు ఇవ్వమన్నాను. ఆ ఆయుధం గురించి మీరు ఎరుగరు. ఆ ఆయుధమేమిటో తెలుసా? సహనం, సత్‌ప్రవర్తన. ఈ ఆయుధం ముందు పోలీసులుగాని, సైన్యంగాని క్షణకాలం కూడా నిలబడలేరు. ప్రపంచంలోని ఏ శక్తి కూడా దీనికి వ్యతిరేకంగా నిలువజాలదు. మీరు మీ గ్రామాలకు వెళ్లినప్పుడు మీ గ్రామస్తులతో చెప్పండి. భగవత్సేవకుల దళాలు సహనమే ఆయుధంగా పరిగణిస్తాయని, ఎటువంటి కష్టనష్టాలనైనా భరిస్తాయని, సహనం-సహిష్ణుత ద్వారా శత్రువు మీద విజయం సాధిస్తాయని చెప్పండి. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థలోకి ఆహ్వానించండి ',** అని పేర్కొంటూ ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు ఎటువంటి ఆయుధాలు ధరించరాదని అబ్దుల్ గఫార్ ఖాన్ నిర్దేశించారు. ఈ నిబంధన వలన, ఆయుధాలను ఆభరణాలుగా ధరించే అలవాటు గల పఠాన్ యువకులు, పర్వత పంక్తులలో నడిచేందుకు సహాయపడే చేతి కర్ర తప్ప మిగతా వాటన్నింటిని విసర్జించారు.

## మార్చింగ్ సాంగ్

క్రమశిక్షణ, త్యాగం, సహిష్ణుత, ఓర్పు, అహింసలు భగవత్సేవకులందరికి అలంకారాలయ్యాయి, ఆయుధాలయ్యాయి. చక్కని సైనిక శిక్షణ పొందటమేకాక, పటిష్టమైన సైనిక వ్యవస్థను అనుసరిస్తున్న ప్రతి ఖుదా–యే–ఖిద్మత్‌గార్ సంస్థ తన శాంతి సేనలను ఉత్తేజపర్చడానికి **' మార్చింగ్ సాంగ్ '** రూపొందించుకుంది. ఖుదా–యే–ఖిద్మత్‌గార్ తామెవ్వరమో, తమ లక్ష్యం ఏమిటో, లక్ష్యసాధనా మార్గం ఏమిటో ప్రజలకు తెలిపే విధంగా ఓ పాట రూపొందించబడింది.

**'...మేము భగవంతుని సేవకులం, మరణం గాని, ధన ప్రభావం గాని మమ్మల్ని కదిలించలేదు. మరణానికి సిద్ధమై మేము, మా నాయకుడు పయనిస్తాం. మా ఆశయాన్ని గౌరవిస్తాం. మా ప్రజలకు సేవలందచేస్తాం. స్వాతంత్ర్య మా లక్ష్యం. దానికై మేం చెల్లించే మూల్యం మా ప్రాణాలే ! ...'.** ఈ మార్చింగ్ సాంగ్ ఆంగ్లంలో ఈ విధంగా సాగుతుంది. "... We are the army of God, by death or wealth unmoved. We march, our leader and we, ready to die. We serve and we love our people and our cause, Freedom is our goal. Our lives the price we pay..." ( BADSHAH KHAN - A Man to Match His Mountains - By Eknath Easwaran, Penguin Books, 1999 )

ఈ పాటను పాడుకుంటూ పునరుత్తేజం పొందుతూ, ఖుదా–యే– ఖిద్మత్‌గార్‌లు సమాజంలోని సామాజిక, రాజకీయ చీడ–పీడల మీద, అహింసా యుద్ధం ప్రకటించారు. ఆ ' **శతాబ్దాల అరాచకగడ్డ** ' కు ఎన్నడూ అనుభవంలోకి రాని చరిత్రను సృష్టించారు. పఠాన్ ప్రజల సహజ స్వభావానికి విరుద్ధమైన నియమాలతో రూపొందిన ఖుదా–యే–ఖిద్మత్‌గార్ సంస్థలో అబ్దుల్ గఫార్ ఖాన్ ప్రారంభించిన జాతీయ ఆజాద్ పాఠశాలల విద్యార్థులు, యువకులు తొలుతగా చేరారు. అనంతర కాలంలో జాతి, మత, ప్రాంతాల పట్టింపులేమీ లేకుండా వాయవ్య సరిహద్దు ప్రాంతంలోని ప్రజలంతా స్త్రీ, పురుష వివక్షకు అతీతంగా సంస్థ సభ్యులయ్యారు. సంస్కరణల కోసం, స్వేచ్ఛా–స్వాతంత్ర్యాల సాధన కోసం అహింసా యోధులుగా ముందుకు సాగారు.

## ఫక్తూన్ లేక పుస్టున్ పత్రిక ప్రారంభం

విప్లవాత్మక అభిప్రాయాలను, లక్ష్యాలను, లక్ష్యసాధనా మార్గాలను, ప్రగతిశీల సంస్కరణలను ప్రజానీకంలో ప్రచారం చేయడానికి అబ్దుల్ గఫార్ ఖాన్ ఓ పత్రిక ప్రారంభించ సంకల్పించారు. గతంలో ఆజాద్ జాతీయ పాఠశాలలకు తెప్పించిన **' అల్–హిలాల్ '**, **' జమీందార్ '** పత్రికలు విద్యార్థుల మీద ఎటువంటి ప్రభావం చూపెట్టాయో గమనించిన బాద్షాఖాన్, తమ మాతృభాష **' పుస్తో '** లో **' పుఫ్‌స్టున్ '** ( ది పఠాన్ ) పత్రిక 1929లో ప్రారంభించారు. ఆ పత్రిక అచిరకాలంలో బహుళ ప్రజాదరణ పొందింది. పుస్టో భాషను మాట్లాడే ప్రజలంతా జాతి, మత, ప్రాంతాల వివక్షను మరచి పత్రికను చదువసాగారు. ఈ పత్రిక ద్వారా గఫార్‌ఖాన్ తన ఆలోచనలను, కార్యక్రమాలను, అభిప్రాయాలను ప్రజలలోకి బలంగా ప్రవహింప చేసారు.

గఫార్ ఖాన్ 15 సంవత్సరాల కుమారుడు ఖాన్ గనీఖాన్ రాసిన చిన్న కవిత

పత్రిక టైటిల్ మీద కన్పించేది. ఆ కవిత భావం ఇలా సాగుతుంది, ' **తళా తళా మెరిసే రాతి ఫలకం అమర్చిన గోరి క్రింద బానిసగా నన్ను సమాధి చేస్తే, దానిని గౌరవించకు. దాని మీద ఉమ్మివేయ్. బ్రిటీష్ తుపాకులచే నేను ముక్కలు ముక్కలు గాకపోతే నా ముఖాన్ని నీకు ఏమని చూపేది ? నా బీడు భూమిని ఈడెన్ తోటగా మార్చుతాను. లేదా ఫక్తూన్ల గృహాలను, నందులు గొందులను తుడిచి పెడతాను.**' ఈ కవితను Eknath Easwaran ఈ విధంగా ఆంగ్లంలోకి తర్జుమా చేసారు. "... If I a slave lie buried in a grave under a dazzling tombstone, respect it not; spit on it ! O mother, with what face will you wail for me if I am not torn to pieces by British guns ? Either I turn this wretched land of mine into a Garden of Eden or I wipe out the lanes and homes of Pathans !" ( BADSHAH KHAN - A Man to Match His Mountains - Eknath Easwaran, Penguin Books, 1999 )

ఖాన్ గనీఖాన్ రాసిన ఈ కవిత కంటే ముందు పత్రిక కవర్ పేజీ మీద ప్రముఖ ఫక్తూన్ రచయిత ఖాదిమ్ రాసిన కవిత కన్పించేది. సంవత్సరాల దాస్యం కంటే ఘడియ సేపు స్వేచ్ఛాజీవిగా మనుగడ సాగిస్తే చాలన్న భావనతో ఆ కవిత సాగింది. '**..మృత్యువు కోరల్లో చిక్కుకుని బాధపడుతూ ఉన్నప్పటికీ, ఒక గంటసేపు స్వాతంత్ర్యం అనుభవించడం. దాస్యంలో ఏండ్ల కొద్దీ మ్రగ్గడం కంటే మేలు..**'. బలమైన స్వేచ్ఛా కాంక్షను వ్యక్తం చేసే ఇటువంటి కవితలను మకుటంగా స్వీకరించిన ' **ఫక్తూన్** లేక **పుస్టున్** ' ఎటువంటి మహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగిందో అర్థం చేసుకోవచ్చు.

ఈ పత్రిక ద్వారా ప్రజలు చైతన్యవంతులై, ఉత్తేజం పొందితే, ప్రభుత్వ మనుగడకు ప్రమాదం ఉందని పసిగట్టిన బ్రిటీష్ ప్రభుత్వం పత్రిక మీద, పత్రికాధిపతి అబ్దుల్ గఫార్ ఖాన్ మీద కత్తిగట్టింది. బ్రిటీష్ అధికారుల హుంకరింపులను ఖాతరు చేయని ఖాన్ అబ్దుల్ గఫార్ కాన్ పత్రిక ద్వారా పఠాన్ సమాజంలో అవసరమైన సంస్కరణల ప్రచారం బహుముఖంగా సాగించారు. విద్యా-వికాస కార్యక్రమాల అవసరాన్ని నొక్కి చెప్పారు. స్త్రీ విద్య, స్త్రీ స్వేచ్ఛ పట్ల అమితాసక్తి చూపించిన ఆయన ఆ ప్రాంతంలో అనుసరిస్తున్న **పర్దా** పద్ధతిని నిరసించారు. పురుషాధిక్యతకు వ్యతిరేకంగా స్త్రీ స్వేచ్ఛా-సమానత్వాలకు ప్రాధాన్యతనిచ్చారు. భగవంతుని దృష్టిలో స్త్రీ, పురుషులు సమానమన్నారు. ధార్మికాచరణ, సత్ప్రవర్తన, సచ్ఛీలత, సదాచార జీవితాన్ని గడపటం ద్వారా మాత్రమే ఒకరినొకరు మించిపోగల రీతిలో భగవంతుని అనుగ్రహాన్ని పొందగలరని వివరించారు. భగవంతుని ఆదేశాలను, ప్రవక్త చూపిన బాటను పూర్తిగా విస్మరించి, పురుషులు స్త్రీల మీద ఆధిపత్యం, పెత్తనం చలాయిస్తున్నారని అన్నారు.

వ్యక్తి తన బాగు మాత్రమే చూసుకోరాదన్నారు. జాతి జనులందరి అభ్యున్నతిలోనే అందరి సౌభాగ్యం మిళితమై ఉందన్న వాస్తవాన్ని గ్రహించి ఉమ్మడి శ్రేయస్సు కోసం కృషి సాగించాలన్నారు. మతం, దేశభక్తి మాత్రమే మనిషిని జాతి కోసం అంకిత భావంతో పనిచేసేందుకు ప్రేరణ కల్పిస్తాయని ప్రబోధించారు. విప్లవం అనేది వరదలాంటిదని, ఒక జాతి సౌభాగ్యంతో తులతూగ గలగటం గాని, తుడిచిపెట్టుకు పోవటం గాని విప్లవం వలన సాధ్యపడుతుందని హెచ్చరించారు. జాతీయ స్ఫూర్తి, సోదరభావం, స్వార్థరహిత

ప్రవర్తనను అలవర్చుకున్న జాతి జనులు విప్లవం ద్వారా సత్ఫలితాలకు అర్హులవుతారని తెలిపారు. బానిసత్వం భయంకర రోగమన్నారు. ఈ రుగ్మత నుండి జాతి యావత్తు విముక్తం కావాలన్నారు. స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల కోసం ఎటువంటి త్యాగాలకైనా, చివరకు ఆత్మార్పణలకు కూడా సిద్ధపడాలన్నారు. బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం అహింసా సిద్ధాంత పునాదుల మీద, సత్యాగ్రహమే సాధనంగా సాగాలని అభిలషించారు.

ఈ మేరకు పరాయి పాలకుల దాష్టీకాలను, కిరాతక పాలనను మాతృభాషలో ప్రజలకు విడమర్చి చెప్పటం వలన ఆయన ఆశించిన ఫలితాలు కన్పించసాగాయి. ఆశయాల ప్రచారం ఉధృతంగా సాగటం, అనుకూలంగా ప్రజలు స్పందించే కొద్ది, బ్రిటీష్ పాలకులు ఖాన్ అబ్దుల్ ఖాన్ పర్యటనల మీద, ప్రసంగాల మీద, ప్రవచనాల మీద నిప్పులు కక్కసాగారు. ఈ ఆగ్రహం ఉగ్రరూపం ధరించి పత్రికను నిషేధించే స్థాయికి వెళ్లింది. ఖుదా-యే -ఖిద్మత్‌గార్‌ల ఉద్యమాన్ని అణిచివేసే క్రమంలో ప్రభుత్వం 1930లో **ఫక్తూన్**ను నిషేధించింది. ఆ తరువాత 1931లో ఫక్తూన్ మళ్ళీ రంగం మీదకు వచ్చింది. ఆ పున:ప్రవేశం ఎంతో కాలం నిలవలేదు. వలసపాలకుల ఉక్కుపాదాల క్రింద విలవిలలాడిన ' **ఫక్తూన్** లేక **పుస్టున్** ' మళ్ళీ మూతపడింది. అక్షరాలను ఆయుధంగా మలచుకోదలచిన గఫాం ‍ఖాన్ పత్రికను మళ్ళీ ప్రచురించ సాగారు.

ఈసారి ' **దస్ రోజా** '(Das Roza) పేరుతో 1938 ఏప్రిల్ మాసంలో మరో పత్రిక తీసుకొచ్చారు. పత్రిక పేరు మారినా లక్ష్యం, మార్గం, స్వభావాలలో ఏ మాత్రం మార్పు లేకపోవటంతో పాలకుల ఆంక్షలు, నిషేధాలు తప్పలేదు. అయినప్పటికీ పోరు మార్గంలో రాజీపడకుండా సాగిన **దస్ రోజా**కు కూడా ఫక్తూన్‌కు లాగే నిషేధాల బెడద తప్పలేదు. చివరకు **దస్ రోజా** కూడా 1941లో నిషేధించబడింది. ఆ తరువాత 1945లో పునఃదర్శనమిచ్చిన **దస్ రోజా** వారపత్రికగా కొంతకాలం సాగి, రెండు సంవత్సరాల తరువాత అంతర్ధానమైంది. మాతృభాష మీద మమకారంతో, ఫక్తూన్‌ల సంస్కృతి, సభ్యతలను పదిలపరచడానికి, ముఖ్యంగా పుస్టో భాషను సజీవంగా ఉంచడానికి, సంస్కరణలను ప్రజల్లో ప్రచారం చేయడానికి, పరాయి పాలకులకు వ్యతిరేకంగా ప్రజలలో స్వేచ్ఛా-స్వాతంత్ర్య భావనలను పరిపుష్టం చేయడానికి ఉద్దేశించబడిన ' **ఫక్తూన్** ', ' **దస్ రోజా** ' పత్రికలు లక్ష్యాన్ని సాధించటంలో విజయ పతాకం ఎగురవేసి, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌కు చేదోడువాదోడుగా నిలిచాయి.

## సంస్కరణల నుండి శాసనోల్లంఘన

భారత జాతీయోద్యమంలో 1924 నుండి 1929 వరకు స్తబ్దత ఏర్పడింది. కాంగ్రెస్ ప్రజలకు ఎటువంటి కార్యక్రమాన్ని ఇవ్వలేదు. ఆ సమయంలో ఆయాప్రాంతాల ప్రజల సమ్యసలు, ప్రజాచైతన్యాన్ని బట్టి, జాతీయోద్యమంలో భాగంగా ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు, ఆందోళనలు సాగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఖాన్ గఫార్ ఖాన్ పఠాన్ జాతి జనులలో అభ్యున్నతి కోరుతూ సాంఘిక సంస్కరణల కోసం అవిరళ కృషి

సాగించారు. విద్యా-వికాస కార్యక్రమాల ముమ్మరం చేశారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థను, ఆయన ప్రారంభించిన యితర సంస్థలను పటిష్టంచేసి, ఆయా రంగాలలో ప్రగతి కోసం శ్రమించారు. ఆ సమయంలో దేశంలో మతకలహాలు తలెత్తాయి. వలసపాలకులు ఆ కలహాలను మరింతగా రెచ్చగొట్టారు. మత దురహంకార శక్తులకు వత్తాసు పలికారు. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ లాంటి శాంతిదూతల వలన మతోన్మాద రాక్షసి వాయవ్య సరిహద్దు ప్రాంతాల వరకు తన విద్వేషపు నీడను చాచలేకపోయింది. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని నమ్మిన గఫార్ ఖాన్ మతం పేరుతో ఘర్షణ పడాల్సిన అవసరం లేదని బోధించారు. జాతీయ భావాలను ప్రచారం చేసి, జాతీయ ఆలోచనలకు ప్రాణప్రతిష్ట చేసారు.

ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ క్రమక్రమంగా వాయవ్య సరిహద్దు ప్రాంతమంతా విస్తరించసాగింది. మహాత్మాగాంధీ ఆలోచనలతో ప్రభావితమైన ఖాన్ గఫార్ ఖాన్ అహింసా మార్గాన పోరాడేందుకు జనులను సిద్ధం చేసారు. భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఖుదా-యే- ఖిద్మత్‌గార్‌లకు అందించిన రాజకీయ చైతన్యంతో ఈ భగవత్సేవకులంతా భారత జాతీయ కాంగ్రెస్ ఆజ్ఞలను శిరసావహించే సుశిక్షితులైన కార్యకర్తలుగా తయారయ్యారు. గఫార్ ఖాన్ ఆపాటికే భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, వాయవ్య సరిహద్దు ప్రాంతాలకు జాతీయ కాంగ్రెస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. ఈ వాతావరణంలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లే భారత జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలుగా పరిణామం చెందారు.

## ఆత్మార్పణల పరంపర ప్రారంభం

1929 డిసెంబర్ 31వ తేదీన లాహోర్‌లో జరిగిన సమావేశంలో ' **పూర్ణ స్వరాజ్యం** ' డిమాండ్ చేస్తూ, స్వరాజ్య సాధనకు తగిన ఉద్యమాన్ని ప్రారంభించాల్సిందిగా భారత జాతీయ కాంగ్రెస్ గాంధీజీని కోరింది. గాంధీజీ కొంతకాలం వరకు మౌనంగా ఉన్నా, మౌలానా హసరత్ మొహాని లాంటి నాయకులు ఎప్పట్నించో కోరుతున్న' **పూర్ణ స్వరాజ్యం** ' తీర్మానానికి ఆయన నుండి గ్రీన్ సిగ్నల్ లభించడంతో ప్రజలలో జాతీయ కాంగ్రెస్ నాయకులలో, కార్యకర్తలలో, ఉద్యమకారులలో ఉత్సాహం ఉరకలెత్తింది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 1930 జనవరి ఒకటవ తేదీన, లాహోర్ నగరం ' పూర్ణ స్వరాజ్యం ' సంబరాలు చేసుకుంది. పఠాన్‌లు త్రివర్ణ పతాకాలు ఎగురవేసారు. అన్ని మతాల, వర్గాల ప్రజలు అమితోత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలలో కన్పించిన ఈ ఉత్సాహ ఉధృతి అధికారులలో ఆందోళనకు, ఆగ్రహానికి కారణమైంది. సంపూర్ణ స్వరాజ్యం తీర్మానం చేసిన కాంగ్రెస్, స్వరాజ్యాన్ని సాధించేందుకు చేపట్టాల్సిన ఆందోళనా మార్గాన్ని నిర్ణయించాల్సిందిగా గాంధీజీని కోరగా, బ్రిటీష్ శాసనాలను ఉల్లంఘించమని గాంధీజీ పిలుపునిచ్చారు.

ఈ నిర్ణయం మేరకు వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో విభిన్న రూపాలలో చట్టాలను ఉల్లంఘించటం ప్రారంభమైంది. ప్రజలను నియంత్రించటం అధికారులకు సాధ్యంకాలేదు. ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రజలు ఉద్యమించటం అధికారులకు మింగుడు పడలేదు. సమరశీలురైన పఠాన్‌లు సహనంతో వ్యవహరిస్తున్న

తీరును చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. ఈ అనూహ్య పరిస్థితులను అర్థం చేసుకోలేకపోయారు.

ఈ పరిస్థితులలో దమనకాండ సాగించి, ఉద్యమాన్ని అణచివేయడానికి నిర్ణయించుకొన్న అధికారులు ప్రజల మీద విరుచుకు పడ్డారు. అణచివేతచర్యలు బయటకు పొక్కనివ్వకుండా, వాయవ్య సరిహద్దు ప్రాంతాన్ని, ఇతర ప్రదేశాల నుండి వేరుచేస్తూ, ఇనుపతెరలను నిర్మించారు. ప్రజానాయకుల ప్రవేశాన్ని నిషేధించారు. ఈ తీవ్ర చర్యల మాటున శాసనోల్లంఘనకారుల మీద భయంకర దమనకాండ సాగింది. ఉద్యమకారులు హద్దులు మీరి ప్రవర్తించిన జాడలు ఎక్కడా కన్పించలేదు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు శాసనోల్లంఘన కార్యక్రమాలలో పూర్తిగా లీనమయ్యారు. భారత జాతీయకాంగ్రెస్ పిలుపును గ్రామ గ్రామానికి తీసుకు వెళ్ళసాగారు. ఈ వాతావరణాన్ని బ్రిటీష్ అధికారులు తట్టుకోలేకపోయారు. అబ్దుల్ గఫార్ ఖాన్‌ను పిలిపించి ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ కార్యకలాపాలను నిలిపి వేయమనగా, అది ససేమిరా వీలుకాదని అయన అన్నారు.

బ్రిటీష్ శాసనాలను ఉలల్లంఘించాలని పిలుపునిచ్చిన గాంధీజీ, **దండి** అను గ్రామం వద్ద 1930 ఏప్రిల్ 6వ తేదీన ఉప్పును తయారుచేశారు. గాంధీజీ పిలుపును ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ అందిపుచ్చుకుంది. ప్రభుత్వం ఎంతటి దారుణాలకు దిగినా, దమనకాండకు పాల్పడినా సంస్థ ఆశయాల మేరకు ప్రశాంతంగా మెలగాలని, హింసను అహింసతో ఎదుర్కోవాలని గఫార్ ఖాన్ కోరారు. ఆయన మాటను కేవలం ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సభ్యులే కాకుండా, జాతి-మతాలకు అతీతంగా ఇతర వర్గాల ప్రజానీకం కూడా శిరోధార్యంగా స్వీకరించి, అన్ని రకాల త్యాగాలకు సిద్ధమయ్యారు.

## ఆచరణే నిబద్ధతకు గీటురాయి

స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ప్రతి సంస్థ ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉత్తమోత్తమ నియమావళిని తయారు చేసుకుంటుంది. ఆ నియమావళిని సంస్థ సభ్యులు ఖచ్చితంగా అనుసరించాలని ఆదేశిస్తుంది. ఆచరణలో ఎదురైన పరిస్థితుల సంక్లిష్టతను బట్టి సభ్యుల నిబద్దత, ఆదేశాల పాటింపు పట్ల ఉన్న అనురక్తి, చిత్తశుద్ధి ఆ సంస్థకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెడతాయి. ప్రాణాలకంటే నియమ పాలన ప్రధానమని భావించి ముందుకు సాగే ఉద్యమకారులకు, క్లిష్టపరిస్థితులలోని ఆచరణే గీటురాయి అవుతుంది. అసాధారణ పరిస్థితులలో కూడా విధించుకున్న విధి నిషేధాలను తు.చ. తప్పకుండా అనుసరించినప్పుడే ఆ సంస్థ గమ్యస్థానం చేరుకుంటుంది. ఆ సంస్థ సభ్యుల చరిత్ర సువర్ణాక్షరాలలో లిఖించబడి, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తూ, అపూర్వ వారసత్వంగా కలకాలం అలరారుతుంది. ఈ నేపథ్యాన్ని గమనించిన ప్రముఖులు, A tree will be judged by the fruits it gives అన్నారు. ఈ మేరకు ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఆ లక్ష్యాలను సాధించేందుకు, మానవీయ విలువలతో కూడిన నియమ నిబంధనలను నిర్దేశించుకొంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన భగవత్సేవకులు, అత్యంత క్లిష్ట పరిస్థితులలోనూ, ఆ విధి నిషేధాలను ఖచ్చితంగా ఆచరించి, అనుసరించి అందరికి

ఆదర్శంగా నిలిచారు.

గాంధీజీ పిలుపు మేరకు వాయవ్య సరిహద్దు ప్రాంతాలలో ఆరంభమైన శాసనోల్లంఘన ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసులు, సైన్యం అమానవీయ చర్యలకు పాల్పడ్డాయి. ఉద్యమకారుల పట్ల కిరాతకంగా వ్యవహరించాయి. ఈ హింసాత్మక వాతావరణంలో ప్రతి క్షణం పరమ భయంకర దాష్టీకాన్ని అనుభవిస్తూ సంస్థ గీచిన గీతను ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు దాటలేదు. ఓర్పు, సహనమే ఆయుధాలుగా అహింసా సిద్ధాంతపు వెలుగులో చరిత్ర సృష్టించారు. ఆ అద్భుత చరిత్రలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు ప్రవర్తించిన తీరు, అందించిన అపూర్వ త్యాగాలు, ఆత్మార్పణలు చరిత్రలో ఆ సంస్థకు ప్రత్యేక స్థానం కల్పించాయి. బ్రిటీష్ ప్రభుత్వం తన కిరాతక చర్యలను బహిర్గతంగా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకొంది. వలస పాలకులు తమ చర్యలు బహిరంగం కాకుండా చూడాలని ఎంతగా ప్రయత్నించినా సాగుతున్న హింసాకాండ వివరాలు అస్పష్టంగా వెల్లడి కాసాగాయి. ఆ వార్తలు యావత్తు దేశాన్ని ఉత్కంఠకు గురిచేసాయి. భారత జాతీయ కాంగ్రెస్ ఈ వార్తల వేడిమికి తట్టుకోలేకపోయింది. నిజానిజాలను తెలుసుకునేందుకు శ్రీ విఠల్‌భాయ్ పటేల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రవేశాన్ని అడ్డుకున్న ప్రభుత్వం శ్రీ సులేమాన్ విచారణ కమిటీని స్వయంగా నియమించింది.

ప్రభుత్వ సహాయ నిరాకరణ నేపథ్యంలో శ్రీ విఠల్‌భాయ్ కమిటీ అష్టకష్టాలు పడి ప్రత్యక్షసాక్షులను విచారించి, 350 పేజీల నివేదికను పార్టీకి సమర్పించింది. ఈ కమిటీతో పాటు ఆనాడు వివిధ వార్తాపత్రికలు, ప్రభుత్వ విచారణ కమిటీ, లండన్ నుండి వెలువడే ఆంగ్లపత్రికలు, ప్రత్యక్షసాక్షుల కథనాలు, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ రచనలు, ఆయన కుమారుడు వలీ ఖాన్ రచనలు, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల మీద ఆనాడు బ్రిటీష్ ముష్కర మూకలు సాగించిన దుష్కృత్యాలను, పారించిన రక్తపుటేరులను, ప్రజల గుండెల మీద కురిపించిన తుపాకిగుళ్ళను, వందలాది ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల ప్రాణాలను బలితీసుకున్న బ్రిటీష్ హంతక ముఠా కిరాతక కృత్యాలను, వికృత చేష్టలను, భయంకర విధ్వంసాన్ని సవివరంగా ప్రపంచానికి వెల్లడించాయి. ఈ వివరాలను తెలుసుకున్న భారతదేశం నిశ్చేష్ట కాగా, భారతీయులు ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల అపూర్వ బలిదానాలను, ఆత్మార్పణలను కథలు కథలుగా విని ఉద్యమస్ఫూర్తిని, ఉత్తేజాన్ని పొందారు.

## చరిత్ర సృష్టించిన సంఘటనలు

శాసనోల్లంఘనకు ముందడుగు వేసిన అబ్దుల్ గఫార్ ఖాన్ ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సమావేశాలను 1930 ఏప్రిల్ 18, 19 తేదీలలో సంస్థ ప్రధాన కార్యస్థానమైన ఉత్తమంజాయ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు వందల మంది ఖుదా-యే-ఖిద్మత్‌గార్ యోధులు హాజరయ్యారు. గఫార్‌ఖాన్ సూచనలు, సంస్థ ఆదేశాలందుకున్న కార్యకర్తలంతా శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనేందుకు తమ ప్రాంతాలకు తరలివెళ్ళారు.

ఈ సమావేశం తరువాత ఏప్రిల్ 23వ తేదీన ఉత్తమంజాయ్‌లో మరో సభను ఏర్పాటు చేసి, ఆ సభలో బ్రిటీష్ చట్టాలను ఉల్లంఘించమని గఫార్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈ సభానంతరం పెషావర్‌కు బయలుదేరిన ఆయన, నాకీ (NAAKI) పట్టణం చేరుకోగానే

బ్రిటీష్ పోలీసులు ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ వార్త తెలుసుకున్న ప్రజలు మూకుమ్మడిగా తమ్ము తాము ఖుదా-యే -ఖిద్మత్‌గార్‌లుగా ప్రకటించుకుని గఫార్ ఖాన్‌ను నిర్బంధింలో ఉంచిన పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టారు. పోలీసు వాహనాలను కదలనివ్వకుండా రోడ్డుకు అడ్డంగా పడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గఫార్ ఖాన్ సోదరులు **డాక్టర్ ఖాన్ ఇస్మాయిల్ ఖాన్** ఆ ప్రాంతానికి చేరుకుని ఆగ్రహావేశాలకు లోను కావద్దని ప్రజలకు సర్దిచెప్పారు. డాక్టర్ ఖాన్ ఆదేశం మేరకు ప్రజలు ప్రశాంతంగా నిరసన వెల్లడించి, ఆటంకాలు తొలగించి అరెస్టులకు సిద్ధమయ్యారు.

ఈ సందర్భంగా ఎంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని తన ప్రసంగంలో రంగరించి ప్రజల ముందుంచి, శాంతపర్చిన ఖాన్ ఇస్మాయిల్ ఖాన్ **' డాక్టర్ ఖాన్ సాబ్ '** గా ప్రసిద్ధి పొందారు. ఆయన తన తమ్ముడు **సరిహద్దు గాంధీ** వెంట ఉంటూ వచ్చారు. ఈ సోదరులిద్దరు కలిసి వాయవ్య సరిహద్దు రాష్ట్ర రాజకీయాలను దశాబ్దాల పాలు శాసించారు. డాక్టర్ ఖాన్ సాబ్ ఆ తరువాత వాయవ్య సరిహద్దు రాష్ట్రం ముఖ్యమంత్రిగా గౌరవాభిమానాలు అందుకున్నారు.

ఉత్తమంజాయ్‌లో సభను నిర్వహించినందుకు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌తో పాటుగా ఆఫ్ఘాన్ యూత్ లీగ్ ప్రధాన కార్యదర్శి మియాన్ అహ్మద్ షా, అధ్యక్షుడు అబ్దుల్ అక్బర్ ఖాన్, సభా నిర్వహణలో పాల్గొన్నందుకు సాలార్ అఫ్రాజ్ ఖాన్, షా నవాజ్ ఖాన్‌లను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టుచేసి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ ఘటనతో ప్రారంభమైన శాసనోల్లంఘన, వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో పలు చారిత్రక సంఘటనలకు కారణమైంది. ఈ సంఘటనలలో పెషావర్ విషాదం. ఉత్తమం జాయ్‌పై సాగిన దాష్టీకాలను ప్రధానంగా పేర్కొనవచ్చు. ఈ సంఘటనలు అన్నింటిలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలు చూపిన సంయమనం, సహనం, ఓర్పుతోపాటుగా బ్రిటీష్ పోలీసులు, సైనికుల క్రౌర్యాన్ని నిరాయుధంగా ప్రాణ త్యాగాలతో నిలువరించిన వాయవ్య సరిహద్దు ప్రాంతాల పఠాన్ బిడ్డల అపూర్వ చరిత్రను రక్తాక్షరాలతో జాతీయోద్యమం పదిలపర్చగా, ప్రపంచ అహింసోద్యమం అగ్రస్థానం కల్పించింది.

## పెషావర్ చారిత్రక విషాదం

ఉత్తమంజాయ్ గ్రామంలో బాద్షా ఖాన్ ప్రసంగించిన రోజుననే, ఆయన అనుచరులు, ప్రజలు పెషావర్‌లో విజృంభించారు. అంతకు ముందురోజునే మద్య పానీయాల దుకాణాల వద్ద, విదేశీ వస్త్ర విక్రయశాలల వద్ద పికిటింగ్ జరపాలని కాంగ్రెస్ కమిటీ ప్రజలను కోరింది. ఏప్రిల్ 22వ తేదీన వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో బ్రిటీష్ సైన్యాలు సాగిస్తున్న హత్యాకాండల మీద విచారణ జరిపేందుకు వచ్చిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి వర్గాన్ని బ్రిటీష్ అధికారులు రాష్ట్రంలోనికి అనుమతించలేదన్న వార్త ప్రజలకు తెలిసింది. ఆ చర్యకు నిరసన వ్యక్తం చేస్తూ, ఆ రోజు సాయంత్రం పెషావర్ పట్టణంలోని షాహిబాగ్‌లో ప్రభుత్వ ఆజ్ఞలను ఉల్లంఘిస్తూ, బహిరంగ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న నాయకులు ఏప్రిల్ 23 నుండి పికిటింగ్ నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ పిలుపు పట్ల ఆగ్రహించిన పోలీసులు ఖుదా-యే-ఖిద్మత్‌గార్ నాయకులను, కాంగ్రెస్ నేతలను

నిర్బంధించారు. ఈ చర్యతో మండిపడిన ప్రజలు నగరంలోని కూడలి ప్రాంతంలో సమావేశమై పరిస్థితులను చర్చించి, కమిటీ నిర్ణయాలను అమలుచేయాలని, పికిటింగ్ జరపాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలో, పెషావర్ పట్టణంలోని, ఖిస్సాఖ్వాని బజార్‌లో జరిగిన వీరోచిత పోరాటం క్రమాన్ని పలు గ్రంథాలు, నివేదికలు వెల్లడించాయి. ప్రభుత్వ పత్రికలుగా పేరుపడ్డ ఆంగ్ల పత్రికలు కూడా ఖిస్సాఖ్వానీ బజారులో జరిగిన దుర్మార్గాన్ని కళ్ళకు కట్టినట్టు వివరించాయి. ఆ కథనాలు సంక్షిప్తంగా ఇలా ఉన్నాయి.

బ్రిటీష్ ప్రభుత్వ చర్యలు, కాంగ్రెస్ కమిటీ నిర్ణయాలు, నాయకుల అరెస్టులు, నేతల మీద జారీచేసిన అరెస్టు వారెంటుల నేపథ్యంలో ప్రజానీకం ఐచ్ఛికంగా హర్తాల్ పాటించారు. పెషావర్ పట్టణం పూర్తిగా స్తంభించింది. ప్రజలు తమ నిరసన వెల్లడించారు. కమిటీ నిర్ణయం ప్రకారం సాగాల్సిన పికిటింగ్ కార్యక్రమానికి నిర్దేశించిన కార్యకర్తలను ఉత్సాహపర్చుతూ, కార్యాలయం నుండి పికిటింగ్ ప్రదేశాలకు పంపేటప్పుడు తండోప తండాలుగా ప్రజలు గుమికూడి ఉద్యమకారులకు వీడ్కోలు పలకసాగారు. అ సమయంలో ఒక పోలీసు అధికారి సాయుధ పోలీసుల దళంతో కాంగ్రెస్ పార్టీ ఆఫీసు వద్దకు వచ్చి, నేతలను అరెస్టు చేయడానికి వారెంట్లు ఉన్నాయన్నాడు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు ఎటువంటి ప్రతిఘటన లేకుండా, ప్రశాంతంగా కార్యాలయం నుండి బయటకు వచ్చి పోలీసుల వాహనంలో కూర్చున్నారు. ప్రజలు నాయకులకు జేజేలు పలుకుతున్నారు. నేతలు కూర్చున్న వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. అలా బయలుదేరిన వాహనాల్లో ఒకదాని టైరు బద్దలు కావటంతో ఆ వాహనం నుండి దిగి మరో వాహనం కోసం అధికారులు ఎదురు చూడసాగారు. ఆ సమయంలో తమకు తాముగా స్టేషన్‌కు నడిచి రాగలమని, తమకు పోలీసు వాహనాలు అక్కరలేదని నాయకులు ముందుకు సాగారు. అ నాయకుల వెంట పెద్ద సంఖ్యలో ప్రజలూ స్టేషన్‌కు నడిచారు. అదంతా పెద్ద ఊరేగింపులా మారింది.

ఈ వాతావరణం పోలీసు అధికారులకు నచ్చలేదు. ప్రజలు కాబూల్ గేటు పోలీసుస్టేషన్ చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్ గేట్లు మూసి ఉన్నాయి. ప్రజలు, నేతలు వేచి చూస్తుండగా, ఒక అశ్వం మీద అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చాడు. అతడ్ని చూసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నినదించారు. అందుకు ఆగ్రహించిన అధికారి రుసురుసలాడుతూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. ప్రజలు **'ఇంక్విలాబ్ జిందాబాద్', 'మహాత్మాగాంధీకి జై'** అని నినాదాలిస్తూ, అక్కడ నుండి వెళ్ళిపోసాగారు.

ఆ సమయంలో తిరిగి వెళ్ళిపోతున్న ప్రజల వెనుకవైపు నుండి మూడు సాయుధ పోలీసు శకటాలు ప్రజల మధ్యలోకి ఆకస్మికంగా దూసుకు వచ్చాయి. ఎటువంటి హెచ్చరికలు లేకుండా ప్రజల మీదకు అతి వేగంగా దూసుకురావటంతో, ప్రజలు చెల్లాచెదురయ్యారు. ఆ తొక్కిసలాటలో సాయుధ శకటాల క్రింద పలువురు నలిగిపోయారు. గాయపడ్డారు. మృతిచెందారు. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. గాయపడిన వారి ఆర్తనాదాలతో, చనిపోయినవారి బంధువుల రోదనలతో, హాహాకారాలతో ఆ ప్రాంతం రణక్షేత్రంగా గోచరించింది. ఈ రణక్షేత్రంలోని విశేషం ఏమిటంటే అక్కడ పోలీసులు మాత్రమే ఆయుధాలు కలిగి ఉండటం, ఉద్యమకారులు నిరాయుధులుగా సాయుధ పోలీసులకు ఎదురు నిలవడం.

కనీసం కర్రముక్కలుగానీ, రాళ్ళు రప్పలు గానీ ఉపయోగించకుండా పోలీసుల దాష్టీకాన్ని భరించటం. ఆ విధంగా ప్రశాంత చిత్తంతో వెనుదిరిగిపోతున్న ప్రజల మీద బ్రిటీష్ పోలీసులు పథకం ప్రకారంగా దుర్మార్గానికి దిగినా ఆగ్రహించని ప్రజలు ఎంతో సహనం-ఓర్పుతో క్షతగాత్రులను, మృతులను ఆ ప్రాంతం నుండి తరలించసాగారు.

## వందలాది ప్రాణాలను బలిగొన్న కాల్పులు

ఈ విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు అసంఖ్యాకంగా ఆ ప్రాంతానికి చేరుకోసాగారు. ఆ ప్రదేశమంతా ఉద్యమకారులతో నిండిపోతున్న సమయంలో మరొక పోలీసు ఉన్నతాధికారి మోటార్ సైకిల్ మీద అక్కడకు వచ్చాడు. అతడి మోటార్ సైకిల్ అక్కడ ఆగి ఉన్న సాయుధ శకటాలను ఢీకొంది. ఆ అధికారి వాహనం మీద నుండి క్రింద పడటంతో, ఆ అధికారి మీదుగా వాహనం వెళ్ళింది. ఆ దృశ్యాన్ని చూసిన ఉద్యమకారులు నవ్వటం గమనించిన సైనికులు తమ అధికారికి అవమానం జరిగిందని ఆగ్రహించి సాయుధ శకటాల నుండి అకస్మాత్తుగా కాల్పులు ప్రారంభించారు. ఆ పోలీసు కాల్పుల ఫలితంగా వాహనాలకు మంటలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటి పోలీసు కమీషనర్ హడావుడిగా వచ్చి స్టేషన్‌లోనికి ప్రవేశిస్తూ, మెట్ల మీద నుండి జారి క్రిందపడి స్పృహ కోల్పోయాడు. తిరిగి ఒక క్షణంలో లేచి నిలబడి, ఆగ్రహంతో రగిలిపోతూ, కాల్పులకు ఆదేశాలిచ్చాడు. ఈ కాల్పులలో పలువురు అమరులయ్యారు. అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలు కోల్పోయినవారిని గాని, తీవ్రంగా గాయపడి బాధతో విలవిలలాడిపోతున్న వారిని గాని అక్కడి నుండి తీసుకుపోవడానికి కూడా వీల్లేదని పోలీసులు ఆదేశాలు జారీచేస్తూ ప్రజలను, ఉద్యమకారులను అడ్డుకున్నారు.

## శవాల దిబ్బగా మారిన కిస్సా ఖ్వాని బజార్

ఆ సందర్భంగా పలువురు నాయకులు ప్రజలకు నచ్చచెప్ప ప్రయత్నించారు. పోలీసుల విచక్షణా రహితంగా జరిగిన కాల్పులకు బలైపోయిన తమ ఆప్తుల మృతదేహాలను, గాయపడి విలవిలలాడుతున్న సహచరులను తీసుకు వెళ్ళనివ్వనిస్తేనే తప్ప అక్కడి నుండి కదిలేది లేదని ప్రజలు స్పష్టంచేసారు. సాయుధ శకటాలను ఆ ప్రదేశం నుండి తరలించాలని కోరారు. పోలీసులు వెళ్ళిపోవాలని డిమాండ్ చేశారు. అ డిమాండ్లను అధికారులు ఏమాత్రం అంగీకరించలేదు. సాయుధ పోలీసులు ఆ ప్రాంతాన్ని వీడలేదు. పోలీసుల మొండి వైఖరి వలన ప్రజలు అక్కడ నుండి కదిలే ప్రసక్తి లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ప్రాణాలు కోల్పోయిన, ప్రాణాలు కోల్పోతున్న, గాయపడిన సహచరులను వదిలి వెళ్ళే ప్రసక్తి లేదని ప్రకటించారు. లాఠీ దెబ్బలనుగాని, తుపాకి తూటాలనుగాని స్వీకరించడానికి, చివరకు ప్రాణ త్యాగానికి కూడా తామంతా సిద్ధమని దృఢంగా ప్రకటించారు. ఉద్యమకారులు అంత దృఢంగా నిలిచేసరికి పోలీసులకు, సైనిక బలగాలకు అరికాలి మంట నెత్తికెక్కింది. నిప్పుతొక్కిన కోతుల్లా అధికారులు చిందులేయసాగారు.

ప్రజలను చెదరగొట్టడానికి సాయుధ బలగాలు రెండవసారి కాల్పులకు పాల్పడ్డాయి. ఈసారి ఖిస్సా ఖ్వాని బజార్ (Kissa Khawni Bazar) లో మాత్రమే కాకుండా

ఆ ప్రక్కనున్న సందుల్లో, గొందుల్లో చేరిన ప్రజల మీదకు నేరుగా పలుమార్లు కాల్పులు జరిపారు. ఉదయం పదకొండు గంటలకు ప్రారంభమైన ఈ కాల్పుల పర్వం సాయంత్రం అయిదు గంటల వరకు సాగింది. ఖిస్సా ఖ్వాని బజార్ శవాల దిబ్బగా మారింది. మృతవీరుల భౌతికకాయాల నుండి స్రవించిన రక్తపు ధారలతో పెషావర్ తడిసి ముద్దయ్యింది. బ్రిటీష్ పోలీసుల కిరాతకత్వానికి పరాకాష్టగా నిలిచిన ఈ సంఘటనలో సుమారు మూడు వందల మంది అమరులయ్యారు. వందలాది ఉద్యమకారులు గాయపడ్డారు. గాయపడిన పలువురు ఆ తరువాత మృతి చెందారు.

ఈ సందర్భంగా ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు, కాంగ్రెస్ కార్యకర్తలు, ఖిలాఫత్ ఉద్యమకారులు ఖిస్సాఖ్వాని బజారు సందుల్లో విసిరివేసినట్టుగా పడి ఉన్న 60 మృతదేహాలను సేకరించి, ఒకచోటకు చేర్చి గౌరవప్రదంగా అంత్యక్రియలు జరిపారు. గాయపడిన ఉద్యమకారులకు, ప్రజలకు డాక్టర్ ఖాన్ సాబ్ చికిత్స చేయించారు. బ్రిటీష్ పోలీసులు కల్పించిన ఆటంకాల వలన గాయపడిన వారికి సక్రమంగా చికిత్స జరగకపోవటంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. అమరవీరుల మృతదేహాలను కదల్చడానికి కూడా అంగీకరించని అధికారులు, సైనిక దళాలు రాత్రికి రాత్రే పలు వాహనాలలో మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా గుర్తు తెలియని ప్రాంతాలకు తరలించి, ఆ దేశభక్తుల భౌతిక కాయాలను అనాధ శవాల్లా అంత్యక్రియలు జరిపి చేతులు దులుపుకున్నారు.

## నరకం చూసిన పెషావర్ ప్రజలు

ఈ విధంగా రంగ ప్రవేశం చేసి, పెషావర్‌ను శ్మశానం చేసిన సైనిక దళాలు పట్టణాన్ని పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నాయి. మూడు రోజుల పాటు అక్కడ సైన్యం రాజ్యమేలింది. ప్రజల ధన మాన ప్రాణాలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయింది. పట్టణాన్ని ఆక్రమించుకుని రాక్షస పాలన సాగించారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్, భారత జాతీయ కాంగ్రెస్ సహా అన్ని సంస్థల నాయకుల, కార్యకర్తల గృహాల మీద దాడులు చేశారు. అస్తిపాస్తులను విధ్వంసం చేసారు. దోచుకున్నారు. ప్రజానీకం నరకాన్ని చవిచూసారు. అత్యంత క్రూరంగా వ్యవహరిస్తూ, నరకాన్ని కూడా మరపింపచేసిన సైనిక దళాలు ఏప్రిల్ 26న పట్టణాన్ని ఖాళీచేసి హఠాత్తుగా వెళ్ళిపోయాయి. సైనిక దళాలు పట్టణాన్ని ఖాళీచేసి వెళ్ళిపోవటం వలన ప్రభుత్వ పాలన కనుమరుగైంది. ఆ సమయంలో ఖుదా- యే-ఖిద్మత్‌గార్లు, ఖిలాఫత్ కార్యకర్తలు పట్టణంలో శాంతిభద్రతలను కాపాడటానికి ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణగా నిలిచారు.

## అమరవీరుల్లో కొందరు

వాయ్యువ సరిహద్దు ప్రాంత చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించిన ఈ సంఘటనలలో అసువులు బాసిన వారిలో కొందరి పేర్లను Dr. Santimoy Roy తన గ్రంథం Freedom Movement and Indian Muslims లో ఉటంకించారు. ఆ ప్రకారం ఆనాటి సంఘటనలో అమరులైన వీరులలో అబ్దుల్ అహమ్మద్, అబ్దుల్ గఫార్ ఖాన్, అబ్దుల్ జలీల్, అబ్దుల్లా, అఘా ఖాన్, అఘా మహమ్మద్ అలియాస్ తలంగే, అహమ్మద్ సరూర్, అక్రంఖాన్, అబ్దుల్లా చౌదరీ, దిలావర్, ఫకీర్ మహమ్మద్, ఫజలుద్దీన్, ఫజల్ మహమ్మద్,

ఫజల్ రహమన్, గప్పార్ ఖాన్, గులాం హుస్సేన్, గులాం మహమ్మద్, గుల్ మొహమ్మద్, గుల్ రహమన్, కరీం షా, హుస్సేని, మహమ్మద్ అఫ్జల్, మొహమ్మద్ అలీ, మహమ్మద్ అష్రాఫ్, మహమ్మద్ దీన్, మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ సయాద్, మొహమ్మద్ షా, ఫహిల్వాన్ గుల్, ఖుమర్ గుల్, రంజాన్, షా అఫ్జల్, షా మీర్ గులాం, షేర్ దిల్, సయ్యద్ మొహమ్మద్, ఉమర్ ఖాన్, ఉమీర్ ఖేల్, వలి అహమ్మద్, వలిగే, జైదుల్లా, జాయారత్ గుల్ తదితరులు ఉన్నారు.

## అంత్యక్రియలకూ ఆటంకాలు

బ్రిటీష్ పోలీసుల, సైనిక దళాల దుష్కృత్యాలు అంతటితో ఆగలేదు. రాక్షస రాజ్యం ప్రారంభమైనాక, అక్కడ జరుగుతున్నదేమిటో తెలుసుకోవడానికి వచ్చిన ప్రభుత్వ ప్రతినిధి శ్రీ సులేమాన్ ఒకవైపున విచారణ జరుపుతుండగానే, మరొక వైపున ప్రజల మీద పోలీసులు కిరాతకత్వానికి పాల్పడ్డారు. ప్రజల మీద కాల్పులు జరిపారు. ఆ సమయంలో అభం శుభం తెలియని ఇద్దరు పసిపిల్లలు మృతి చెందారు. ఆ బాల వీరుల అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. పసిబిడ్డల భౌతికకాయాలను ఖననం చేయడానికి వెడుతున్న సమూహం మీద కూడా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో మరో 12మంది అమరులయ్యారు. పసిబిడ్డల శవాలను మోస్తున్న ప్రజల మీద కాల్పులు జరపడంతో ఆ వ్యక్తులు అక్కడికక్కడే నేలకూలి పోతుండగా, మరొకరు వచ్చి ఆ స్థానాన్ని భర్తీ చేయటం, ఆ వ్యక్తులూ కూలిపోగానే మరొకరు వచ్చి ఆ స్థానాన్ని భర్తీ చేయటం జరిగింది. ఈ విధంగా బ్రిటీష్ ప్రభుత్వం పలు ఘోరాతి ఘోరాలకు పాల్పడి, ఆ విషయాలేవీ ప్రపంచానికి తెలియరానివ్వరాదని ఎంతగా జాగ్రత్తపడినా, నిజం నిప్పులాంటిది కనుక బహిర్గతంకాక తప్పలేదు. బ్రిటీషర్ల రాక్షసక్రీడల రహస్యాలు రట్టుకాక తప్పలేదు.

## ప్రపంచ చరిత్రలో అపూర్వం

ప్రపంచంలో జరిగిన ప్రసిద్ధ అహింసాయుత ఉద్యమాల మీద అధ్యయనం చేసిన Harward University చెందిన Prof. Gene Sharp ఖిస్సా ఖ్వాని బజార్ సంఘటన గురించి రాస్తూ, ' **...ముందు వరుసలోనున్న వ్యక్తులు తుపాకి గుళ్ళకు నేలకొరిగిపోతుండగా వెనుక వరుసలోని వాళ్ళు తుపాకులకు తమ గుండెలను ఎదురుచూపుతూ ముందు వరుసలోకి వచ్చి పోలీసు కాల్పులకు గురయ్యారు. ఉద్యమకారులలో ఏ ఒక్కరూ కూడా భయాన్ని వ్యక్తంచేయకుండా అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించారు. మృతదేహాలు గుట్టలు గుట్టలుగా పడినప్పటికీ ఏ ఒక్కరిలో కూడా మైదానం వీడి వెళ్ళాలన్న ఆలోచన గానీ, కించిత్తు చలనం గానీ కన్పించలేదని** ' పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ' **యువకులే కాకుండా చిన్న పిల్లలు కూడా సైనికుల తుపాకులకు ఎదురు నిలబడటం, ఎంతమందిని కాల్చుతారో కాల్చండిరా ! అంటూ సింహగర్జన చేయటం ఆశ్చర్యకరం...** ' అన్నాడు.

## ఘర్వాల్ రైఫిల్స్ యోధుల సౌభ్రాతృత్వం

ఈ సందర్భంగా నిరాయుధుల మీద జరిగిన కాల్పుల సమయంలో, అధికారుల

ఉత్తర్వులను తిరస్కరించి 1857 నాటి సైనిక తిరుగుబాటును గుర్తుకు తెచ్చి, తెల్ల పాలకుల గుండెల్లో ఘర్వాల్ రైఫిల్స్ (Garhwal Rifles) సైనికులు గుబులు పుట్టించారు. పెషావర్‌లో విజృంభణకు సిద్ధమవుతున్న ప్రజలను అణచివేయడానికి భారతీయ సైనికులు గల ఘర్వాల్ రైఫిల్స్ దళాన్ని ప్రభుత్వం పిలిపించింది. ప్రజల మీద కాల్పులు జరపమని ఆదేశించగా, కాల్పులు జరపడానికి నిరాకరించిన సైనిక దళం నాయకుడు శ్రీ ఠాకూర్ చంద్రసింగ్, ' **నిరాయుధులైన మా సోదరుల మీద కాల్పులు జరపం....భారత సైన్యం బయటి శత్రువుతో పోరాడటానికి మాత్రమే. మీరు మమ్మల్ని ఫిరంగులతో పేల్చి వేసినా అందుకు మేము సిద్ధం** ' అని స్పష్టం చేసాడు. ఈ తిరస్కార వైఖరితో మండిపడిన అధికారులు కఠిన శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించినా, **శిక్షలకు సిద్ధం తప్ప కాల్పులు జరిపే ప్రసక్తి లేదంటూ** హిందూ-ముస్లింల మధ్యనున్న సోదరభావాన్ని, బంధాన్ని స్పష్టంగా చాటాడు.

ఈ సంఘటన తర్వాత ఘర్వాల్ రైఫిల్స్ దళం మీద సైనిక విచారణ జరిపి, శ్రీ సింగ్‌కు 14 సంవత్సరాలు, ఆయన సహచరులకు 10 సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. అనంతరం గాంధీ-ఇర్విన్‌ల మధ్యన కుదిరిన ఒప్పందం వలన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్న వారందరి శిక్షలను రద్దు చేసినప్పటికీ ఘర్వాల్ రైఫిల్స్ దళంలోని దేశభక్తుల శిక్షలను రద్దు చేయలేదు. ఘర్వాల్ రైఫిల్స్ సైనికుల వైఖరిని క్రమశిక్షణారాహిత్యంగా పరిగణిస్తూ మహాత్మాగాంధీ కూడా వ్యతిరేకించారు. రౌండ్ టేబుల్ సమావేశాలకు వెళ్ళిన ఆయనతో ఓ ఫ్రెంచి విలేకరి ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, ఘర్వాల్ రైఫిల్స్ సైనికుల విడుదలను మీరు ఎందుకు కోరలేదని అడిగాడు. అందుకు గాంధీజీ సమాధానం చెబుతూ, ' **నేను ప్రభుత్వ ఉద్యోగులకు, సైనికులకు ప్రభుత్వ ఆజ్ఞల్ని ధిక్కరించమని చెప్పను. ఎందుకంటే ప్రభుత్వం మన చేతుల్లోకి వచ్చిన తర్వాత మేమూ ఉద్యోగుల చేత, సైనికుల చేత పని చేయించవలసి ఉంటుంది. ఇప్పుడు వాళ్ళని ప్రభుత్వ ఆజ్ఞల్ని భంగపర్చమని ప్రోత్సహించానే అనుకోండి రేపు నా ఆజ్ఞల్ని కూడా వారు భంగపరుస్తారు కదా !'** అన్నారు. ఈ సమాధానం పలువురి విమర్శలకు గురైంది.

అటు పెషావర్‌లో ఖుదా-యే-ఖిద్మత్‌గార్, కాంగ్రెస్-ఖిలాఫత్ కార్యకర్తలు, బ్రిటీషర్ల కిరాతక అణచివేతను ఓర్పుతో ఎదుర్కొంటుండగా, ఇటు ఉత్తమంజాయ్ గ్రామంలో పాలకుల చర్యలకు నిరసన తెలిపేందుకు ప్రజలు సమావేశం కాసాగారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ ఖాన్ సాబ్ పెషావర్ చేరుకొనేసరికి, ఒకవైపు ప్రజలు మరోవైపు సైనిక బలగాలు మోహరించి ఉన్నాయి. సమావేశస్థలి నుండి వెళ్ళిపోకపోతే కాల్పులు జరపగలమని సైనికాధికారులు హెచ్చరించినా, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు స్థిర నిశ్చయంతో నిలబడి ఉన్నారు. ఆ సమయంలో అతి చాకచక్యంగా మాట్లాడి అహింసాయుతంగా శాసనోల్లంఘనను విజయవంతం చేయమని ప్రజలకు నచ్చజెప్పి డాక్టర్ ఖాన్ సాబ్ పెను ప్రమాదాన్ని తప్పించారు. అటు పెషావర్‌లోనూ, ఇటు ఉత్తమంజాయ్‌లలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు స్థిరచిత్తంతో సాగించిన శాసనోల్లంఘనోద్యమం తీరును గమనించిన బ్రిటీష్ అధికారులు గందరగోళంలో పడిపోయారు. ' **అరివీర భయంకరుడైన పఠాన్ కంటే అహింసావాది పఠాన్** ' అంటేనే అధికారులు భయంతో వణికిపోసాగారని (The British feared a non-

violent Phathan more than a violent one) ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అబ్దుల్ గఫార్ ఖాన్ పేర్కొన్నారు. సమరశీలురైన పఠాన్ ప్రజానీకం సహజ స్వభావాలకు విరుద్ధంగా, ఖుదా-యే-ఖిద్మత్ గార్‌లు అహింసా యోధులుగా జాతీయోద్యమ వేదిక మీద దర్శనమివ్వటం బ్రిటీషర్లను భయపెట్టగా, భారతీయులంతా ఆశ్చర్యపోయారు.

## ఆత్మాభిమానం మీద వేటు

ఉద్యమకారులు అనుసరిస్తున్న సరికొత్త పోరాటరూపానికి ప్రతిగా, అధికారులు అణచివేత విధానాలను మార్చుకున్నారు. ఆత్మాభిమానం, ఆత్మ గౌరవానికి అత్యధిక స్థానమిచ్చే పఠాన్ల మీద మానసిక దాడికి సిద్ధమయ్యారు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం గాయపడేలా వ్యవహరించి, ప్రతీకారేచ్ఛను రగిల్చి పఠాన్ యోధులను అహింసా మార్గం నుండి మళ్ళించాలని, అప్పుడు యధేచ్ఛగా తమ క్రూరమైన సైనిక చర్యల ద్వారా ఉద్యమకారులను అణచివేయవచ్చని పథకాలను తయారు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ ప్రస్తావిస్తూ, ఆ చర్యలన్నీ ప్రజలను హింసాత్మక చర్యలకు రెచ్చగొట్టేందుకు మాత్రమేనని (All the horrors the British perpetrated on the Pathans had only one purpose to provoke them to violence) అన్నారు. ఈ నూతన ఎత్తులను ఖుదా-యే- ఖిద్మత్‌గార్ ప్రధాన స్థావరమైన ఉత్తమంజాయ్ గ్రామంలో ముందుగా అమలుచేయాలని అధికారులు నిర్ణయించుకున్నారు.

## రక్తసిక్తమైన ఉత్తమంజాయ్

1930 మే మాసం 13వ తేది. ప్రాతఃకాల సమయం. ఉత్తమంజాయ్ గ్రామం గాఢ నిద్రలోనే ఉంది. ఆ సమయంలో అత్యాధునిక ఆయుధాలు ధరించిన ఎనిమిది వందల మంది సైనికులు, సైనికాధికారులు గ్రామాన్ని చుట్టుముట్టారు. పెషావర్ పట్టణంలో శాంతి సైనికులను బలితీసుకున్న బ్రిటీష్ సైనికాధికారే ఈ దాడికి కూడా నాయకత్వం వహించాడు. తెలతెల్లవారుతుండగానే సైనికులు గ్రామంలోకి ప్రవేశించారు. ఒక చిన్న దుకాణం పై అంతస్థు మీద ఉన్న ఖుదా-యే-ఖిద్మత్‌గార్ ప్రధాన కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించ ప్రయత్నం చేసారు. అది విఫలం కాగా భవనం గోడలెక్కి పై అంతస్థుకు ఎగబ్రాకి బాల్కనీని ఆక్రమించుకున్నారు. గ్రామాన్ని చుట్టుముట్టినా, తమ కార్యాలయాన్ని ఆక్రమించుకున్నా, భగవత్సేవకులు మాత్రం ఏమీ జరగనట్టుగానే ప్రవరిస్తూ, ఆందోళనకు ఏ మాత్రం తావు ఇవ్వకుండా, హింసను అహింసతో ఎదుర్కోవాలని సంస్థ కమాండర్ రబ్‌నవాజ్ ఖాన్ (Rabnawaz Khan) జారీచేసిన ఆజ్ఞలను అమలుచేసేందుకు సంసిద్ధులై ఎదురు చూడసాగారు. ఈ సందర్భంగా ఉత్తమంజాయ్‌లోని ఖుదా-యే-ఖిద్మత్‌గార్ల మీద సైనికులు సాగించిన భయంకర బీభత్సకాండను శ్రీ విఠల్ భాయ్ పటేల్ కమిటీ ముందు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్న విషయాలను Eknath Eswaran తన గ్రంథం Badshah Khan- A Man to March his Mountains లో దృశ్యీకరించారు.

ఆ కథనం ప్రకారం, కార్యాలయం బాల్కనీని ఆక్రమించుకున్న సైనికులు విధ్వంసం సాగిస్తూ, తుపాకులను ఎక్కుపెట్టి కార్యాలయంలోని కార్యకర్తలను లొంగిపొమ్మంటూ

హెచ్చరికలు చేశారు. అంతటితో ఆగకుండా కార్యకర్తలను బాల్కనీ నుండి బయటకు లాగి విసిరి వేయసాగారు. బాల్కనీ నుండి బయటకు వచ్చిన కార్యకర్తల దుస్తులను తొలగించి వరుసలో నిలబెట్టమని సైనికాధికారి ఆజ్ఞలు జారీచేసాడు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు దీనిని అవమానంగా భావించి తిరస్కరించారు. ఒక అధికారి పిస్టల్ తీసి ఉద్యమకారుని కణతకు గురిపెట్టి ఆదేశాలను పాటించి బట్టలు విడవకుంటే కాల్చి పారేస్తానన్నాడు. అయినప్పటికీ ఆ పఠాన్ బిడ్డలు తిరస్కరించారు. అధికారి ఆదేశాలను పాటించేందుకు నిరాకరించిన కార్యకర్త మీదకు సైనికులు లంఘించి చావబాదారు. శరీరమంతా రక్తంతో తడిసిపోయినా, చివరికి స్పృహ తప్పి పడిపోయేంత వరకు వంటి మీద బట్టల తొలగింపును నిరోధించి ఆయన నేలకూలిపోయాడు. ఆ కార్యకర్త నేలకూలిపోగానే సైనికుల దృష్టి మరొక కార్యకర్త ఫైజ్ మహమ్మద్ మీదకు మళ్ళింది. దృఢకాయుడైన ఆయన మీద ఎగబడి బట్టలను తీయడానికి సైనికులు విఫలయత్నంచేసి, చివరకు అతనిని కూడా బాయ్‌నెట్‌లతో స్పృహ తప్పే వరకు కుళ్ళ పొడిచారు. ఈ విధంగా ఒకరి తరువాత మరొకర్ని స్పృహ తప్పేంతవరకూ చావబాదటం, ఆ తరువాత దుస్తులను తొలగించి, అవమానపర్చటం సుదీర్ఘంగా జరిగింది.

ఆ తరువాత ఖుదా-యే-ఖిద్మత్‌గార్ నేత మహమ్మద్ నక్వీబ్ ఖాన్ (Mohammed Naquib Khan) ను లాక్కొచ్చారు. ఆయనను కూడా తీవ్రంగా గాయపర్చారు. రక్తంతో ఆయన దుస్తులు తడిసిపోయాయి. బలవంతంగా ఆయన చొక్కాను తీసి గిరాటు వేసారు. చివరకు ప్యాంటు కూడా తీయడానికి ప్రయత్నం చేయటంతో, ఆయన ఆ అవమానాన్ని భరించలేకపోయారు. ఖుదా-యే- ఖిద్మత్‌గార్ ప్రతిజ్ఞను కూడా విస్మరించి, ఈ అవమానాన్ని భరిస్తూ బ్రతకటం కంటే, పోరాడుతూ చావడం మేలని భావించి ఆయుధాన్ని అందుకున్నాడు. ఈ పరిస్థితి తీవ్రతను గమనించిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల కమాండర్, '**మరణం సంభవించేవరకు అహింసా బాటలో నడుస్తానని ప్రతిజ్ఞ చేశావుగా, అంతలోనే నీ ఓర్పు నశించిందా** ? ' (Is your patience exhausted so soon? You swore to remain non-violent until death) అంటూ పొలికేక వేయటంతో, ఆయన శిలలాగ నిలబడిపోయారు. ఆ పరిస్థితిని అదనుగా భావించిన సైనికులు ఆయనను చుట్టుముట్టి, మీదపడి లాఠీలతో కొట్టి, బాయ్‌నెట్‌లతో తీవ్రంగా పొడిచి నక్వీబ్ ఖాన్ శరీరాన్ని మాంసపు ముద్దచేసారు. కమాండర్ ఆదేశాలను వినకుండా ఆ రోజున ఆయన తిరగబడి ఉన్నట్లయితే ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల చరిత్ర తిరగ రాయబడి ఉండేది.

ఆ సమయంలో అబ్దుల్ గఫార్ ఖాన్ 14 సంవత్సరాల కుమారుడు ఖాన్ వలి ఖాన్ కూడా కార్యాలయంలో ఉన్నాడు. అతడూ ఏమాత్రం భయపడకుండా, '**నేను గఫార్ ఖాన్ కుమారుడ్ని**' అంటూ సాయుధ సైనికుల ఎదుట నిలిచాడు. బాలుడని కూడా చూడకుండా ఒక సైనికుడు అతడి మీదకు తుపాకి గురి పెట్టాడు. ప్రమాదాన్ని గ్రహించిన మరో సైనికుడు తుపాకిని పక్కకు తప్పించాడు. ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని హసన్ ఖాన్ అను కార్యకర్త వలీ ఖాన్‌ను ఒడిసిపట్టుకుని పక్కనే ఉన్న మసీదులోకి పరుగులెత్తి, ఆ బిడ్డడి ప్రాణాలను కాపాడాడు.

ఈ రకంగా కార్యాలయంలో దొరికిన ప్రతి కార్యకర్తను నరకయాతనలకు గురిచేసాక, సైనికుల దృష్టి గ్రామం మీద పడింది. గ్రామంలో కన్పించిన ప్రతి ఒక్కరిని చావ

చితకబాదారు. ప్రజలంతా ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు కానప్పటికీ సైనికుల బారిన పడక తప్పలేదు. హింసాకాండను యధేచ్ఛగా సాగించిన తరువాత గ్రామాన్ని తగులబెట్టారు. ప్రతి ఇంటిని నాశనం చేసారు. ప్రజల ఆస్తులను దోచుకున్నారు. గ్రామాన్ని పూర్తిగా విధ్వంసం చేసాక, ప్రతి ఒక్కరిని స్పృహ తప్పేలా కొట్టాక విజయం సాధించామన్న అహంభావంతో ఇంకా **' రెడ్‌ షర్ట్స్‌ ఎవ్వరైనా ఉన్నారా ? '** అని సైనికాధికారి ప్రశ్నించాడు. ఆ స్వరంలోని అహంకారాన్ని అబ్బాస్‌ ఖాన్‌ అను వృద్ధుడు గమనించాడు. ఆయన ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ కానప్పటికీ, ఇంటికి వెళ్ళి తన షర్టును ఎర్రటి రంగులో తడిపి తొడుక్కొని, తన సహచరులను కూడా పిలుచుకుని వచ్చి, ఆ అధికారి ఎదుట నిలిచాడు. అధికారి ముఖంలోకి నేరుగా చూస్తూ **' ఇదిగో ఎర్ర చొక్కాను, ఉన్నాను. ఏంచేస్తావ్‌ ?'** అని గద్దించాడు. ఆ వృద్ధుని సింహగర్జన విన్న అధికారి క్షణంపాటు నిర్ఘాంతపోయాడు. ఆ అవమానాన్ని భరించలేని అధికారి తన సైనికులను ఆ వృద్ధుడి మీద దాడి చేయించాడు. అబ్బాస్‌ ఖాన్‌ శరీరం కూడా క్షణాలలో మాంసం ముద్దగా మారి నేలమీద దొర్లింది. ఈ విశేషాంశాన్ని ఖాన్‌ అబ్దుల్‌ గఫార్‌ ఖాన్‌ ప్రస్తావిస్తూ , **' మహమ్మద్‌ అబ్బాస్‌ ఖాన్‌ ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ కాదు, పైగా మేమంటే ఆయనకు గిట్టేది కాదు.ఆ సమయాన అతనిలోని దేశభక్తి పెల్లుబికి అట్టి సాహసకార్యం చేయించింది '** అన్నారు.

1930 మే25న మర్దాన్‌ జిల్లాలోని టక్కర్‌ గ్రామంలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల మీద కాల్పులు జరిగాయి. పలువురు మృతిచెందారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల కార్యాలయం తగులబెట్టారు. గృహాలను భస్మీపటలం చేసారు. నాయకులను అరెస్టు చేసారు. ఆ అరెస్టులను నిరసిస్తూ జరిగిన సభమీద కాల్పులు జరిపారు. పలువురి ప్రాణాలు పోయాయి. మూడు రోజులపాటు సైనికుల దమనకాండ సాగింది. డేరా యిస్మాయిల్‌ జిల్లాలోని అనేక గ్రామాల మీద దాడులు చేసారు. ఆ ప్రాంతంలో మే 30న మహిళలు, పిల్లలతో సహా సాగిన ఊరేగింపు మీద కాల్పులు జరిపి బ్రిటీష్‌ బలగాలు పలు దారుణాలకు పాల్పడ్డాయి.

## ఇనుపకోరలు చాచిన సైనిక చట్టం

ప్రజల నుండి విచిత్ర రీతిలో ప్రతిఘటనను చవిచూసిన బ్రిటీష్‌ అధికారులు, ఎంతగా రెచ్చగొట్టినా సహనం వహించి ఆత్మార్పణలతో అహింసా సిద్ధాంతానికి ప్రాణం పోసిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లను అణచివేయడానికి వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో **' మార్షల్‌ లా '** ప్రకటించారు. ఈ శాసనాన్ని ఆసరాగా చేసుకుని బ్రిటీష్‌ అధికారులు, సైనిక బలగాలు, పోలీసులు విజృంభించారు. ప్రజల మీద పాశవిక నిర్బంధకాండను సాగించారు. ఆ విజృంభణను, ప్రజల మీద సాగిన దుష్కృత్యాలను, కార్యకర్తలు పడినపాట్లను శ్రీ విఠల్‌భాయ్‌ కమిటీ ప్రపంచానికి వెల్లడిచేస్తూ, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల సాహసాలను, ఓర్పును, సహనాన్ని సవివరంగా నివేదికలో పేర్కొంది.

1930లో ప్రకటించిన మార్షల్‌ లా 1931 వరకు కొనసాగింది. మార్షల్‌ లా అమలులో ఉన్నా, శాంతియుతంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉద్యమకారులను ప్రభుత్వం నివారించలేకపోయింది. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ల మానసిక స్థైర్యాన్ని ఏమాత్రం దెబ్బతీయలేకపోయింది. జాతీయోద్యమం కార్యక్రమాలు మరింత ఉత్సాహంతో సాగాయి.

ఉద్యమకారులను అడ్డుకోలేకపోయిన పోలీసులు, సైనికులు ఆ అక్కసుతో అమానుష చర్యలకు పాల్పడ్డారు. సరిహద్దు రాష్ట్రం మొత్తం సైనికుల అదుపు ఆజ్ఞల క్రిందకు రావటంతో ప్రభుత్వ బలగాల కిరాతక చర్యలకు అంతులేకుండా పోయింది. సరిహద్దు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో పైశాచికత్వం రాజ్యమేలింది. బ్రిటీష్ పోలీసు పిశాచాలకు ప్రధానంగా ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలు బలైపోయారు. ఉద్యమకారుల పాడి-పంటలను ధ్వంసం చేసారు. నాయకుల గృహాలను గుర్తించి నిల్వచేసుకున్న పంటను కిరోసిన్ పోసి తగులబెట్టారు. లాఠీలు ప్రయోగించి అవమానకర రీతిలో చిత్రహింసలు పెట్టారు.

ఖుదా-యే-ఖిద్మత్‌గార్లను అక్రమంగా అరెస్టు చేసి నడిబజార్లలో నిల్చోపెట్టి, బలవంతంగా దిగంబరులను చేసి, వెంటపడి తరుముతూ పరుగులు తీయించారు. పరుగులెత్తుతున్నపుడు తన్నడం, తుపాకి మడమలతో పొడవటం సర్వసాధారణమైంది. ప్రజలను కాల్చి చంపి, శవాలను కన్పించకుండా మురికి కాల్వలలోకి పారేశారు. సామూహిక ఖననం చేశారు. ఉద్యమకారులను పట్టుకెళ్లి, భవనాలపై నుండి కిందనున్న రాళ్ళమీదకు దొర్లించి, ఆ బాధను తట్టుకోలేక బాధితులు వేస్తున్న కేకలను వింటూ కిరాతక ఆనందాన్ని అనుభవించారు. మురికి గుంటల్లోకి గిరవాటువేసి, మురికి నీళ్ళల్లో ముంచి ఊపిరాడక ఉద్యమకారులు హాహాకారాలు చేస్తుంటే కేరింతలు కొట్టారు. రక్తం గడ్డకట్టుకుపోయే దారుణమైన చలిలో లోతైన చల్లటి నీటిగుంటల్లోకి కార్యకర్తలను దొర్లించి రాక్షసానందం పొందారు. ఈ అతి భయంకర చిత్ర హింసలను భరించడానికి ఉద్యమకారులు సిద్ధపడ్డారు తప్ప, ఆయుధం అందుకొనేందుకు గాని, అహింసా మార్గాన్ని వీడేందుకు గాని ఏమాత్రం ఇష్టపడలేదు. ఆత్మాభిమానులైన పఠాన్ బిడ్డలు కొందరు ఈ అవమానాలు భరించలేక, సంస్థ ప్రధాన లక్ష్యమైన అహింసా దీక్షను భగ్నం చేయలేక, అవమానాల నుండి విముక్తి కోరుకుంటూ ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు సంచలనం కల్గించాయి. ఈ మేరకు వాయవ్య సరిహద్దు రాష్ట్రాలలోని ప్రజలకు సేవలు అందించడానికి విచ్చేసిన ఆంగ్లేయ సామాజిక సేవా కార్యకర్తలు, మిషనరీలు తమ తమ గ్రంథాలలో, డైరీలలో, లేఖలలో చాలా హృదయవిదారకంగా ఆయా సంఘటనలను వర్ణించారు. ఏది ఏమైనప్పటికీ సత్యాగ్రహోద్యమ కాలంలో ఏ ఒక్క ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కూడా అహింసా మార్గం వీడినట్టుగాని, దౌర్జన్యానికి పాల్పడినట్టుగాని చివరకు బ్రిటీషర్లు కూడా ఆరోపించకపోవటం విశేషం. బ్రిటీష్ సైనికుల పాశవిక చర్యలను భరించలేక పోయిన కార్యకర్తలు, అటు అహింసా మార్గం నుండి తప్పుకుని ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ ప్రతిజ్ఞను ఉల్లంఘించలేక, ఇటు అవమానాన్ని భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నారని **' భారతదేశంలో 30 రోజులు '** అను గ్రంథ రచయిత ప్రొఫెసర్ ఫీల్డింగ్ కింగ్‌హాల్ వివరించాడు. భగవంతుడు ప్రసాదించిన జీవితాలను మానవుడు తనంతట తాను అంతం చేసుకోవటం మహాపాపమని పలుమార్లు హెచ్చరికలు జారీ చేయాల్సినంత స్థాయిలో ఆత్మార్పణలు సాగాయి.

ఈ పరిస్థితుల ఉధృతిని గమనించిన బ్రిటీష్ అధికారులు ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లను ప్రజలనుండి దూరం చేయడానికి అసత్య ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యకర్తలు ధరించే ఎర్రటి చొక్కాలను ఆధారం చేసుకుని ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు రష్యా తొత్తులని, బొల్షివిక్ సిద్ధాంతాల ప్రేమికులని ప్రచారం చేసారు. **' కాంగ్రెస్ కార్యకర్తలమంటూ**

**ఎర్రటి చొక్కాలు ధరించి మీ ప్రాంతాలకు వచ్చే రెడ్ షర్ట్స్‌ను గ్రామాల నుండి తరిమి కొట్టాల్సింది** ' గా బ్రిటీష్ ఉన్నతాధికారులు గ్రామాధినేతలకు లేఖలు రాసారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలు అశాంతిని సృష్టిస్తారని హింసను ప్రేరేపిస్తారని దుష్ప్రచారం సాగించారు.

ఈ విధంగా వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తరించిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రెండు సంవత్సరాల పాటు క్రూరమైన చర్యలకు పాల్పడింది. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలను వెంటాడి వేటాడి చంపడానికి సైనికులకు, పోలీసులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ విషయాన్ని ప్రముఖ రచయిత Mohammed Yunus ఓ వ్యాసంలో, **' ఎర్ర చొక్కాల దళం ' వారిని తుపాకితో వేటాడటం ఈ రాష్ట్రంలోని బ్రిటీష్ సైనికులకు ఒక క్రీడ. ఒక విలాస కార్యక్రమమని,** పేర్కొన్నాడు**.** ఈ సమాచారాన్ని భారతదేశంలో పర్యటించిన ఒక అమెరికన్ రచయిత కూడా, Gunning the Red Shirts was popular sport and pastime of the British forces in the province ' అని సాక్ష్యమిచ్చాడని వ్యాసంలో యూనుస్ తెలిపాడు.

## శాసనోల్లంఘన విరమణ - పునఃప్రారంభం

గాంధీ-ఇర్విన్‌ల మధ్యన కుదిరిన ఒప్పందం వలన శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించారు. ఈ ఉద్యమ కాలంలో అరెస్టు చేసిన నాయకులందరితోపాటుగా ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌ను బ్రిటీష్ ప్రభుత్వం విడుదల చేసింది. జైలు నుండి విడుదల కాగానే, గ్రామాభివృద్ధి మీద ఆయన దృష్టి సారించారు. గ్రామాల పునర్నిర్మాణంకోసం కృషి సాగించాలని ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లను కార్యోన్ముఖులను చేసారు. రోజుకు కనీసం 25 మైళ్ళ మేరకు నడక సాగిస్తూ ప్రజలతో సంబంధాలను పటిష్టం చేసుకుంటూ, సామాజిక-రాజకీయ పరిస్థితుల పట్ల అవగాహన కల్గిస్తూ, ప్రజలను చైతన్యవంతుల్ని చేయసాగారు. బానిస బంధనాల నుండి మాతృదేశాన్ని విముక్తం చేయటంతోపాటుగా, ప్రజలను ఆకలి, పేదరికం నుండి దూరం చేయటం కూడా ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ లక్ష్యమని ప్రకటించారు. వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోని పఠాన్ ప్రజానీకం అభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించాలని, అందుకు తగ్గట్టుగా సాంప్రదాయక పోరాటాలు, బ్రిటీష్ సైన్యంలో చేరటం మానాలని, వృత్తులను-వ్యవసాయక పద్ధతులను ఆధునీకరించుకోవాలని ఉద్బోధించారు.

సమాజ నిర్మాణంలో మహిళకు సమాన స్థానం కల్పించాలని కోరారు. ఖురాన్ గ్రంథం ఆదేశాలను, మహమ్మద్ ప్రవక్త ఆచరించి చూపిన పద్ధతులను సక్రమంగా అర్థం చేసుకోకపోవటం వలన స్త్రీల మీద పురుషులు అధిక్యత ప్రదర్శిస్తున్నారని ప్రకటించారు. స్వేచ్ఛా భాతర దేశంలో మాత్రమే పఠాన్ ప్రజల అభ్యున్నతి సాధ్యమని, అందువలన స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల కోసం సాగుతున్న జాతీయోద్యమంతో పఠాన్ కుటుంబాలు యావత్తు భాగస్వాములు కావాలని, త్యాగాలకు సిద్ధం కావాలని కోరారు. శాంతి, సహనం,అహింసా మార్గాలో బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలను ఎలా సుసంపన్నం చేయాలో ఉద్బోధిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో ఖుదా-యే- ఖిద్మత్‌గార్ సంస్థ ప్రచారం సాగించింది.

శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేశాక 1931 మార్చి 31న కరాచీలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశం గాంధి-ఇర్విన్‌ల ఒప్పందాన్ని ఆమోదించింది. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సభ్యులతో కలిసి అబ్దుల్ గఫార్ ఖాన్ తొలిసారిగా కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యారు. గాంధీజీ బాటన తు.చ. తప్పక నడుస్తూ, అపూర్వ త్యాగాలతో నూతన చరిత్రను సృష్టించిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సభ్యులకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థను జాతీయ కాంగ్రెస్ అనుబంధ సంస్థగా సరిహద్దు గాంధీ ప్రకటించారు. ఈ సమావేశాలలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్లు చక్కని క్రమశిక్షణతో బాధ్యతలను నిర్వహించి నాయకుల ప్రశంసలను పొందారు.

## దమనకాండ పున:ప్రారంభం

1931 ఏప్రిల్‌లో ఇర్విన్ స్థానంలో వైస్రాయిగా వెల్లింగ్‌టన్ వచ్చాడు. అతడు వచ్చీరాగానే గాంధీ-ఇర్విన్‌ల ఒడంబడిలోని షరతులను ఉల్లంఘించి అరెస్టులు, నిషేధాలు విధిస్తూ, దమనకాండను ప్రారంభించాడు. భారతదేశ వ్యాప్తంగా ప్రారంభమైన దమనకాండ వాయవ్య సరిహద్దులకూ వ్యాపించింది. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ల మీద హింసాకాండ ప్రజ్వరిల్లింది. సరిహద్దు గాంధీని అరెస్టుచేశారు. 1932లో శాసనోల్లంఘనం పునః ప్రారంభమైంది. ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు ప్రభుత్వ శాసనాల ఉల్లంఘున ఉద్యమాన్ని పునరుద్ధరించారు. ఈ మేరకు పరిస్థితులు తీవ్రస్థాయికి చేరుకోగానే, సరిహద్దు గాంధీని, ఆయన సోదరుడు డాక్టర్ ఖాన్ సాబ్‌ను, వందలాది కార్యకర్తలను ప్రభుత్వం జైలు పాల్జేసింది. చివరకు 1934లో గఫార్‌ఖాన్‌ను వాయవ్య సరిహద్దు ప్రాంతాల నుండి బహిష్కరించింది.

ఈ సందర్భంగా బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలకు అబ్దుల్ గఫార్ ఖాన్ హాజరయ్యారు. ఈ సమావేశాలలో ఆయనను కాంగ్రెస్ అధ్యక్ష స్థానం స్వీకరించాల్సిందిగా సమావేశం కోరింది **' ..నేను సైనికుడను జీవితాంతం సైనికుడ్నే. జనరల్ హోదాలో గాకుండా సైనికుడుగానే మరణించడం నాకు ఇష్టం..',** అంటూ జాతీయ కాంగ్రెస్ ప్రతిపాదనను ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ సున్నితంగా తిరస్కరించారు. (..I appreaciate the friends who have started this move, but let me declare, as I have done over and over again, that I am only a humble soldier and it is my ambition to end my days not as a general but as a soldier..) గతంతో పలుమార్లు అన్నట్టుగానే, ప్రజలకు సేవలందించే సామాన్య కార్యకర్తగానే ఆయన ఉండిపోయారు తప్ప ఎప్పుడూ కూడా అధికార పగ్గాలను స్వీకరించలేదు. ఆయన ప్రారంభించిన సంస్థలలో కూడా అగ్రస్థానాలను చేపట్టలేదు. పలు నగరాలు, పట్టణాలు పర్యటిస్తూ జాతి సమైక్యత, స్వేఛ్ఛా-స్వాతంత్ర్యాల సాధన అవసరాలను వివరిస్తూ, ప్రజలను ఉద్యమదిశగా కార్యోన్ముఖులను చేయడానికి నిరంతరం శ్రమించసాగారు. ఆ ప్రయత్నాలను విఫలం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నింది. 1935 జూలై మాసంలో అరెస్టుచేసి వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోకి ఆయన ప్రవేశాన్ని మరోమారు నిషేధించింది. ఆ తరువాత ఆయన 1936లో విడుదల అయినప్పటికీ నిషేధం మాత్రం అమలులో ఉండటంతో వాయవ్యసరిహద్దు రాష్టంలో ప్రవేశించే అవకాశం లేనందున

సేవాగ్రాంలో ఉండిపోయారు.

## ముస్లిం లీగ్‌ను మట్టికరిపించిన ఖాన్ సోదరులు

అంతర్జాతీయ పరిణామాలు, భారతీయులలో వ్యక్తమవుతున్న స్వేచ్ఛా- స్వాతంత్ర్య కాంక్షల ఫలితంగా 1935లో బ్రిటీస్ ప్రభుత్వం భారత ప్రభుత్వ చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం ప్రకారంగా రాష్ట్రాలలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం పూనుకుంది. ఈ మేరకు వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి సన్నాహాలు చేయసాగింది. 1937 జనవరిలో జరిగిన ఎన్నికలలో ఖాన్ సోదరుల మార్గదర్శకత్వంలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు ఎన్నికల ప్రచారాన్ని క్రమశిక్షణలతో నిర్వహించారు. ఖాన్ సోదరుల విశిష్ట వ్యక్తిత్వాల వలన, ఖుదా-యే -ఖిద్మత్‌గార్‌ల కృషివలన కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. ముస్లింలకు తానే ప్రతినిధిగా ప్రకటించుకుంటున్న ముస్లిం లీగ్ మట్టికరిచింది. డాక్టర్ ఖాన్‌సాబ్ వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు.

ఆ తరువాత ఆరు సంవత్సరాల పాటు స్వజనులకు దూరంగా ఉండిపోయిన గఫార్‌ఖాన్ వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి చేరుకుని నిర్మాణాత్మక కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగానే వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో పరిస్థితులను, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల కార్యక్రమాల గురించి తెలియజేయడానికి మహాత్మాగాంధీని వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి ఆహ్వానించారు. ఆ ఆహ్వానంపై గాంధీజీ వాయవ్య సరిహద్దు రాష్ట్రాన్ని సందర్శించారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లను సేవాగ్రాంకు ఆహ్వానించి గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాల గురించి, ప్రాథమిక విద్య, పరిసరాలు-వాతావరణం, ఆరోగ్య విషయాల గురించి తెలుసుకోవాల్సిందిగా కోరారు. ఈ అంశం మీద మరింత శ్రద్ధ వహించిన గఫార్‌ఖాన్ పెషావర్ సమీపానగల సర్దార్ యాబ్ (Sardar Yab) లో సంస్థ ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఆ దిశగా ప్రత్యేక కృషి ప్రారంభించారు.

## క్విట్ ఇండియా ఉద్యమం

1942లో క్విట్ ఇండియా (Quit India) ఉద్యమానికి గాంధీజీ పిలుపునిచ్చారు. ఈ పిలుపును అందిపుచ్చుకున్న ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలు వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో విజృంభించారు. ఈ సందర్భంగానే రాష్ట్రాలలోని కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామాలు సమర్పించాయి. డాక్టర్ ఖాన్‌సాబ్ కూడా రాజీనామా చేసి మంత్రివర్గాన్ని రద్దుచేశారు. ఈ సందర్భంగా గాంధీజీ "Do or Die" నినాదం ఇచ్చారు. ఈ నినాదంతో స్ఫూర్తి పొంది, వాయవ్య సరిహద్దు రాష్ట్రం విజృంభించింది. బ్రిటీష్ రహస్య పోలీసులు గఫార్ ఖాన్‌ను నీడలా వెంటాడసాగారు. ఈ సారి ఆయనను అరెస్టు చేయడానికి భయపడిన ప్రభుత్వం కొత్త తరహాగా వ్యవహరించసాగింది. ఆయన ఎక్కడకు వెళ్ళినా, ఎక్కడ సమావేశం పెట్టి పాలకులను విమర్శించినా అరెస్టు చేసి, అక్కడి నుండి ఆయనను తరలించి, ఆయన స్వస్థలంలో విడిచిపెట్టడం పనిగా పెట్టుకుంది. ఈ పద్ధతులకు విసిగిపోయిన అబ్దుల్ గఫార్ ఖాన్ చార్‌సద్దా గ్రామానికి చెందిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లతో కలసి మర్దాన్‌లోని ప్రభుత్వ

కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఒకరి చేతులను మరొకరు సంకెళ్ళలా బిగించి పట్టుకొని కార్యాలయం వైపు ముందుకు సాగిన కార్యకర్తలను విడగొట్టాలని పోలీసులు అతి దారుణంగా కొట్టారు. శరీరమంతా రక్తసిక్తం అవుతున్నా, ప్రాణాలు కోల్పోయేంత దారుణంగా పోలీసులు హింసిస్తున్నా ముమ్ముందుకు సాగుతూ కార్యకర్తలు నేలకొరిగిపోయారు తప్ప విడివడలేదు, కలబడలేదు, ప్రాణభయంతో పారిపోలేదు. చివరకు అబ్దుల్ గఫార్ ఖాన్‌ను అరెస్టు చేసి భయంకర నేరస్థులకు నిలయమైన హరిపూర్ జైలుకు పంపారు.

బ్రిటన్‌లో పాలకపక్షం మారింది. ఆ పరిస్థితుల ప్రభావం భారతదేశం మీద స్పష్టంగా కన్పించింది. అంతకు ముందు అరెస్టు చేసిన వారందరిని 1945 మార్చిలో విడుదల చేసారు. డాక్టర్ ఖాన్ సాబ్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారు. బ్రిటన్‌లోని నూతన లేబర్ పార్టీ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించడానికి సిద్ధపడింది. ఆ సమయంలో పాకిస్తాన్ ఏర్పాటుకు అఖిల భారత ముస్లిం లీగ్ నడుంకట్టింది. పాకిస్తాన్ ఏర్పాటు, భారత విభజనను అబ్దుల్ గఫార్ ఖాన్ ఖండించారు. మహమ్మద్ ఆలీ జిన్నా ప్రతిపాదించిన **ద్విజాతి సిద్ధాంతాన్ని** తిప్పికొట్టారు. ద్విజాతి సిద్ధాంతానికి సమాధానంగా మాట్లాడుతూ రానున్న పరిస్థితులను గుర్తుచేస్తూ, గఫార్ ఖాన్ పలు హెచ్చరికలు చేసారు. **"...భారతదేశమంతా ఒకే జాతి. హిందువులు, ముస్లింలు, అందరూ కలసి ఒకే జాతి. కొన్ని రాష్ట్రాలలో హిందువులు కేవలం అల్పసంఖ్యాకులు. కొన్ని రాష్ట్రాలలో ముస్లిములూ అంతే. ఇవే దౌర్జన్యాలు ఇతర ప్రాంతాలలోనూ తటస్థిస్తే అధిక సంఖ్యాకులు అల్ప సంఖ్యాకులను మట్టుపెట్టి ఉద్యమిస్తే జాతి అధోగతి పాలవుతుంది. మనం తేరుకోలేనంతగా దాస్యంలో చిక్కుకుపోతాం..."** అని ఆయన అన్నారు. ఆయన ప్రసంగాలలోని సారాంశాన్ని శిరోధార్యంగా స్వీకరించిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలు భారత విభజనను వ్యతిరేకించారు. ముస్లిం లీగ్ రాజకీయాలను ఎండగడ్తూ ప్రచార కార్యక్రమాలను ఉధృతం చేసారు.

ఈ పరిస్థితులలో ముస్లిం లీగ్ 1946 ఆగస్టు 16 వ తేదిన ప్రత్యక్షచర్యకు పిలునిచ్చింది. ఈ పిలుపు ఫలితంగా హిందూ-ముస్లింల మధ్య భారీ ఎత్తున హింసాకాండ చోటు చేసుకుంది. ఈ హింసాకాండను నిరోధించి, హిందూ-ముస్లింల మధ్యన సామరస్య వాతావరణం నెలకొల్పడానికి ఖుదా-యే -ఖిద్మత్‌గార్ లు కృషి ప్రారంభించారు. అటు ముస్లింలలో ఇటు హిందువులలోను మత దురహంకార రాజకీయ శక్తులు విజృంభించాయి. ఆ శక్తులను అదుపు చేయడానికి ఖుదా-యే-ఖిద్మాత్ గార్లు అహింసనే ఆయుధంగా ధరించి రంగంలోకి దిగారు. పరిస్థితులు చేజారకుండా కృషి చేసి, మరోమారు అహింసా సిద్ధాంత పునాదులను పటిష్ట పర్చారు. ఈ సందర్భంగా సరిహద్దు గాంధీ పలు ప్రాంతాలలో మాట్లాడుతూ, **'...హిందూస్థాన్ నేడు ఉన్మాద నిలయమైపోయింది. మన ఇళ్ళకు మనమే నిప్పు అంటించుకోవడం చూడగా, నా హృదయం శోకంతో ద్రవిస్తోందని...'** అంటూ బాధను వ్యక్తం చేసారు. మరొకచోట ముస్లింలను ఉద్దేశిస్తూ **'...ఇస్లాం మత ధర్మాలు ప్రపంచంలో**

**కెల్లా సహనానికి గీటురాళ్ళ వంటివని మీరు గ్రహించ కోరుతున్నాను. మనం నిజమైన ముస్లిములమే అయితే, సోదరుల మధ్య ఈ సహనభావాన్ని మరింతంగా పరివ్యాప్తం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయవలె. నేడు ముస్లింల కంటే ఇతరులే ఎక్కువ సహనం చూపుతున్నట్లు విదితమవుతుంది. మనలోని ఈ తప్పును సరిదిద్దుకొని నిజమైన ముస్లిములు కావల్సిఉంద..'** ని సలహా ఇచ్చారు.

జాతి శ్రేయోభిలాషి సరిహద్దు గాంధీ వాణి అరణ్య రోదన అయ్యింది. సరిహద్దు రాష్ట్రాలలో మత కలహాలు ప్రజ్వరిల్లాయి. అధికార దాహంతో అల్లాడిపోతున్న వ్యక్తులు-శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మత భావాలను రెచ్చగొట్టారు. ప్రజలను ఉన్మాదంలో పడేసారు. భారత విభజన తప్ప మరొక మార్గంలేదని భావించేట్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, **'...మన దేశ చరిత్రలో ఇది అత్యంత క్లిష్ట సమయం. దౌర్జన్యం సర్వసాధారణమయింది. మనలో అనేకులం మానవత్వం కోల్పోయాము. మనం అనాగరికులమైనాము. సరిహద్దులలో గాని, ఇతరత్రాగానీ, నా సోదరులను అనాగరిక మార్గం నుంచి తప్పించడానికి, నా కాలాన్ని, శక్తిని అంతటినీ వినియోగిస్తాను. నాకు ముస్లిం లీగ్‌తో గానీ, బ్రిటీష్ ఉద్యోగులతో గానీ తగాదా ఏమీ లేదు. పఠానులు ఇతరులందరు కూడా పరాయి వారి పాలన నుంచి విముక్తులము కావడమే నా ప్రగాఢ వాంఛ...'** అని ప్రకటించారు. 1946 చివరిలో బీహార్ రాష్ట్రంలోని నౌఖాళిలో జరిగిన మత కలహాల సందర్భంగా మత సామరస్యాన్ని నెలకొల్పేందుకు వెళ్ళి వచ్చిన ఆయన ఖుదా-యే-ఖిద్మత్ గార్ కార్యకర్తల సభలో ప్రసంగిస్తూ, **'...మన ప్రియతమ మాతృభూమికి అగ్గి పెట్టాలని యత్నించే వారిని తీవ్రంగా హెచ్చరిస్తున్నాను. వారు జ్వలింపచేసే ఈ ఆగ్నికి వారే అహుతి అయిపోతారు. మత కేంద్రాలకు నిప్పు పెట్టడం ద్వారాను, అమాయకులను చంపి దోచుకోవడం ద్వారాను ఇస్లాం మతాన్ని వీరు ఎట్లా సేవించుకోగలరో తెలియరాకుండా ఉన్నది...'** అన్నారు.

భారత విభజన ప్రమాదాన్ని స్పష్టంగా గ్రహించిన ఆయన మతం పేరుతో విభజన కోరుకుంటున్న ముస్లింలీగ్ నాయకుల ఎత్తులను ప్రజలకు వివరిస్తూ , **'...చాల విషమ పరిస్థితులలో ఉన్నాము. అధికారం తమ చేతుల్లోంచి పోతుందని బ్రిటీష్ అధికారులు వారి అనుయాయులు వ్యథ చెందుతున్నారు. ఇస్లాం పేరిట మిమ్మల్ని తప్పు దోవలో పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ముమ్ముందు రాబోయే ప్రమాదాల గురించి మిమ్మల్ని హెచ్చరించడం నా విధి. అట్లా చేయకపోతే మానవుడి ముందు, భగవానుని ముందు నా ప్రవర్తనను సమర్థించుకోలేకపోతాను. పైగా మనస్సుకు స్థిమితం కూడా ఉండదు...'** అని సరిహద్దుప్రాంతాల ప్రజలను అప్రమత్తులను చేసారు. ఈ ప్రవచనాలను ఆదర్శంగాను, మార్గదర్శకంగా స్వీకరించిన ఖుదా-యే-ఖిద్మత్ గార్లు త్రికరణ శుద్ధితో శాంతి సామరస్య వాతావరణం కోసం, ఐక్య భారతం కోసం ఎనలేని కృషి చేసారు. అటు బ్రిటీష్ పాలకుల, ఇటూ ముస్లింలీగ్ కార్యకర్తల చేతుల్లోను భరించరాని హింసలకు, అవమానాలకు ఖుదా-యే-ఖిద్మత్ గార్ కార్యకర్తలు బలయ్యారు.

1946లో జరిగిన ఎన్నికలలో డాక్టర్ ఖాన్ సాబ్ నేతృత్వంలోని కాంగ్రెస్ తిరిగి అధికారాన్ని చేపట్టింది. ముస్లింలీగ్‌కు ఈ సారి కూడ పరాజయం తప్పలేదు. 50 స్థానాలకు గాను, 32 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. పరాజయం, పరాభవం నుండి కోలుకునేందుకు ముస్లింలీగ్ భారత విభజన యత్నాలకు ఉపిరి పోస్తూ, అధికార దాహోర్తులైన రాజకీయ నాయకులను, వ్యాపారవేత్తలను, బడాబడా పెట్టుబడిదారులను, భూస్వాములను అధికారం - ఆదాయం ఆసరా చూపించి ఆకట్టు కోసాగింది. ఆంగ్లేయాధికారులు, పాలకులు కూడ ముస్లింలీగ్‌కు మిత్రులుగా వ్యవహరించసాగారు. విభజన అనివార్యం అన్పించే పరిస్థితులను గమనించిన బాద్షా ఖాన్ చింతించసాగారు.

## గుండె కోతకు గురైన గఫార్ ఖాన్

1947 మే 1వ తేదిన భారత జాతీయ కాంగ్రెస్ దేశ విభజనకు సూత్రప్రాయంగా అంగీకరించింది. అనంతరం జూన్ 3వ తేదిన విభజనకు సమ్మతి తెలిపింది. భారత విభజన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానిని వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్. ఈ తీర్మానం ఆయనను గుండెకోతకు గురి చేసింది. ఈ రోజున ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ గాంధీజీతో మాట్లాడుతూ, **'...కాబట్టి మహాత్మాజీ ఇక నుండి మమ్మల్ని పాకిస్థాన్ వారంటారు. విదేశీయులం అంటారు అవునా?** ' అంటూ గుండె లోతుల్లోనుండి పెల్లుబికిన మనోవ్యధను వ్యక్తంచేశారు. భారత విభజన జరిగితే వాయవ్య సరిహద్దు రాష్ట్రం పాకిస్థాన్‌లోకి వెళ్ళవచ్చు. పాకిస్థాన్ ఏర్పాటు కోరుతున్న ముస్లిం లీగ్ పాకిస్థాన్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఆ పరిణామాలు సంభవిస్తే అంతవరకు ముస్లిం లీగ్‌ను, విభజనను వ్యతిరేకించిన పాపానికి ఖాన్ సోదరులు, వారి అనుచరగణం, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు నూతన ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు గురి కావాల్సి వస్తుంది. ఈ పరిస్థితులను అంచనా వేసిన ఆయన గాంధీజీతో మాట్లాడుతూ, ' **మమ్మల్ని తోడేళ్ళ పాల్జేశారు** ' అన్నారు.

ఆయన అన్నట్లుగానే ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు భయంకర హింసాకాండ, అణచివేతకు గురి కావాల్సి వచ్చింది. బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో 15 సంవత్సరాలు జైలు జీవితం చవిచూసిన ఖాన్ గఫార్ ఖాన్‌ను నూతన ప్రభుత్వం అంతకంటే ఏమీ చేయలేకున్నా, ఆయన అనుచరుల పరిస్థితి ఆందోళనకు గురిచేసింది. **స్వాతంత్ర్య సమరయోధులైన ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల మీద పాకిస్థాన్ ప్రభుత్వం ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా తాను సహించనని,** గాంధీజీ గఫార్ ఖాన్‌కు అప్పటికి ఊరట కల్గించారు. కాని ఆ ఊరట చివరకు ఊరటగానే మిగిలిపోయింది. నిజంగా గఫార్ ఖాన్, ఆయన సహచరులు పాకిస్థాన్ పాలకవర్గాల చేతుల్లో పలు ఇక్కట్లు పడ్డారు. ఈ విషయాలను గఫార్ ఖాన్ ప్రస్తావిస్తూ , **'...ముస్లిం లీగ్ వారు బహిరంగ సభలలోనే ఖుదా-యే-ఖిద్మత్‌గార్ల నాయకులను అంతం చేయాలని తమ కార్యకర్తలను ప్రోత్సహించేవరకూ వెళ్తున్నారు. పాకిస్థాన్ ఏర్పడిన తరువాత, హిట్లర్ జనంపై విచారణ జరిపినట్లుగా విచారణ జరిపి, ఇస్లాంకు వ్యతిరేకులైన అందరినీ ఉరితీస్తారని బహిరంగ సభలలో ప్రకటిస్తున్నారు...'** అని అన్నారు. ఆయన

అన్నట్లుగానే పాకిస్థాన్ పాలకవర్గాలు, ఆ పాలకవర్గాల తొత్తులు గఫార్ ఖాన్ అనుచరవర్గం పట్ల అత్యంత క్రూరంగా ప్రవర్తించారు.

1947 జులైలో మౌంట్‌బాటన్ వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించాడు. ఖాన్ సోదరుల ప్రాబల్యం గల ఈ ప్రాంతం ఆనాడు కాంగ్రెస్ ఆధిపత్యంలో ఉంది. ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్‌లో కలపాలని ముందుగా నిర్ణయించుకున్నందున **ప్రజాభిప్రాయం** అను నాటకాన్ని మౌంట్ బాటన్ ప్రకటించాడు. ఈ చర్య వెనుకనున్న దురుద్దేశాన్ని, ప్రజాభిప్రాయాన్ని సేకరణ జరిగితే ఉత్పన్నమయ్యే హింసాత్మక పరిణామాలను గ్రహించిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించమని ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లకు, రాజకీయంగా తన వెంటనున్న ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుని అటు ప్రభుత్వ అధికారులు, ఇటు ముస్లింలీగ్ నేతలు ఏకమై వాయవ్య సరిహద్దు రాష్ట్ర ప్రజలు పాకిస్థాన్‌లో చేరేందుకు సమ్మతించినట్టుగా ప్రకటించారు. ముస్లింలు అత్యధికంగా గల ఉత్తర ప్రాంతంలోని బెంగాల్, కాశ్మీర్, అస్సాం, పంజాబ్, సింద్, బలూచిస్థాన్, వాయవ్య సరిహద్దు రాష్ట్రం కలసి ' **పాకిస్థాన్** ' ఏర్పడగలదని అందువలన తమతో సహకరించమని, హిందువుల రాజకీయాలను చిత్తుచేయడానికి సహాయపడమని, ముస్లిం లీగ్ గఫార్ ఖాన్‌ను కోరింది. ఆ అభ్యర్ధన తిరస్కరిస్తూ, ముస్లింలకు ప్రధాన శత్రువు బ్రిటీష్ పాలకులు మాత్రమేగాని, హిందువులు ఏ మాత్రం కాదని, బ్రిటీషర్లు దేశం వదలి వెళ్ళాక పలు శతాబ్దాలుగా కలసిమెలసి సహజీవనం చేస్తున్న హిందూ- ముస్లింలు స్వతంత్ర్య భారతదేశంలో కూడా సామరస్యంగా జీవించగలరని **సరిహద్దు గాంధీ** ఆశాభావం వ్యక్తం చేశారు.

అబ్దుల్ గఫార్ ఖాన్ ఎంతగా పాకులాడినా భారత విభజన తప్పలేదు. 1947 ఆగస్టు మాసంలో భారతదేశం ఇండియా-పాకిస్థాన్‌లుగా చీలిపోయింది. వాయవ్య సరిహద్దు రాష్ట్రం పాకిస్థాన్‌లో విలీనమైంది. పాకిస్థాన్ ఏర్పడగానే ముస్లింలీగ్ కార్యకర్తలు, నాయకులు, పాలకవర్గాలు ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల మీద విరుచుకుపడ్డారు. డాక్టర్ ఖాన్ నేతృత్వంలో గల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం రద్దు చేసింది. గఫార్ ఖాన్ పత్రిక '**పుష్టున్**' ను నిషేధించింది. ఈ నిషేధంతో **పుష్టున్** శాశ్వతంగా మూతపడింది. పుష్టున్ లేక ఫక్తూన్ జాతి పఠాన్‌ల ప్రాంతాన్ని **పుష్టునిస్థాన్** లేక **ఫక్తూనిస్థాన్** గా నామకరణంచేసి ప్రత్యేక ప్రాంతంగా ప్రకటించాల్సిందిగా డిమాండ్ చేసినందు వలన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ మీద పాకిస్థాన్ పాలకులు మండిపడసాగారు.

ఆ ఆగ్రహం హద్దులు మీరి 1948 జూన్ 15వ తేదీన అబ్దుల్ గఫార్ ఖాన్‌ను దేశద్రోహం నేరం క్రింద అరెస్టు చేసారు. ఈ విధంగా ప్రారంభమైన అరెస్టులు ఆయన మరణించేంత వరకు సాగి, సరిహద్దు గాంధీ జీవితంలో మరో 15 సంవత్సరాలను మింగేసాయి. ఈ 15 సంవత్సరాలే కాకుండా మరో ఆరు సంవత్సరాలు ప్రవాసంలో ఆయన జీవితం గడిచిపోయింది. ఈ మేరకు అటు బ్రిటీషర్ల పాలనలో 15 సంవత్సరాలు, ఇటు పాకిస్థాన్‌లో మరో 15 సంవత్సరాలు ఆయన జైలు జీవితాన్ని రుచి చూడాల్సి వచ్చింది.

ఈ విధంగా దక్షిణాఫ్రికా నేత నెల్సన్ మండేలా అనుభవించిన జైలు జీవితం కంటే ఎక్కువ కాలం, విముక్తి పోరాటంలో భాగంగా అబ్దుల్ గఫార్ ఖాన్ జైళ్ళల్లో గడిపారు.

1948లో ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థను ముస్లింలీగ్‌లో విలీనం చేయాల్సిందిగా మహమ్మదాలి జిన్నా కోరాడు. జిన్నా వినతిని గఫార్ ఖాన్ తిరస్కరించటమే కాకుండా సంస్థను కార్యకలాపాల పరిధిని పాకిస్థాన్ అంతటా వ్యాపింప చేయదలచినట్టు మే 13న బాద్షా ఖాన్ ప్రకటించారు. ఈ సంస్థ రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంద సేవాసంస్థగా పనిచేస్తుందని ఆయన అన్నారు. అయినప్పటికీ పాకిస్థాన్ నాయకులు ఖాన్ గఫార్ ఖాన్ ప్రయత్నాలను వంకర దృష్టితో చూస్తూ మండిపడసాగారు. గఫార్ ఖాన్ అరెస్టు తరువాత ప్రభుత్వం ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థ మీద, కార్యకర్తల మీద విరుచుకుపడింది. భయంకర రాజ్యహింస ప్రారంభమైంది. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ సంస్థను నిషేధించింది. ఆ సంస్థ కార్యాలయాలన్నిటి మీద దాడులు జరిగాయి. పలు ప్రాంతాలలోని సంస్థ శాఖల కార్యాలయాల భవనాలను కూల్చి, నేలమట్టం చేశారు. అసంఖ్యాకంగా కార్యకర్తలను, సానుభూతిపరులను అక్రమంగా నిర్బంధించారు. అరెస్టు చేసారు. ఈ మేరకు పరిస్థితులు చాల విషమించాయి.

1948 ఆగస్టు 12వ తేదీన చార్‌సద్దా తహసీల్‌లోని బాబ్రా గ్రామంలోని సంస్థ కార్యాలయం మీద దాడి జరిగింది. ఆ సమయంలో కార్యకర్తలు, ప్రజలు అక్కడి మైదానంలో సామూహికంగా నమాజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పోలీసులు అకస్మాత్తుగా వచ్చిపడ్డారు. మరతుపాకుల అగ్నివర్షం ప్రారంభమైంది. ప్రజల మీద విచక్షణా రహితంగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో పలువురు గాయపడ్డారు. **తుపాకి గుండ్లు దూరకుండా మిగిలిన దేహం అంటూ లేదని, ప్రార్ధన చేస్తున్నవారు చేస్తున్నట్టుగానే కూలిపోయారని**, ఈ దుస్సంఘటన గురించి చెబుతూ గఫార్ ఖాన్ తెలిపారు. ఈ కాల్పులలో 15 మంది చనిపోయారని, 50 మంది గాయపడ్డారని ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యక్ష సాక్షులు మాత్రం ఖురాన్ మీద ప్రమాణం చేసి, మృతుల సంఖ్య రెండు వేలకుపైగా ఉండవచ్చని స్పష్టంచేసారు. ఈ కారణంగా ఆ గ్రామం పక్కన అతి పెద్ద **మరుభూమి** ఏర్పడిందని ప్రజలు తెలిపారు. ఈ ప్రాణాంతక పరిస్థితులలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లను బలిచేయటం, పోరాటం సాగించటం ఇష్టంలేని గఫార్ ఖాన్ 1947 సెప్టెంబర్ మాసంలో పాకిస్థాన్ ప్రభుత్వాన్ని అంగీకరిస్తూ, ఆ మేరకు అప్రమత్తులై మెలగవలసిందిగా కార్యకర్తలను కోరారు.

## తోడేళ్ళ పాల్జేసారు

భారత విభజనను భారత జాతీయ కాంగ్రెస్ అంగీకరించగానే ఆవేదనకు లోనైన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, ఆ తరువాత ఉత్పన్నమైన ప్రతికూల పరిస్థితులను గమనించి ' **మమ్మల్ని తోడేళ్ళ పాల్జేసారని** ' మహాత్మాగాంధీతో అన్నారు. ఈ మాటను స్వీకరించి '**తోడేళ్ళ పాలుచేసారు** ' అను శీర్షికతో మహాత్మా గాంధీజీ వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన శ్రీ ప్యారేలాల్, సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జీవిత చరిత్రను రాసారు. ఆనాటి గఫార్ ఖాన్ మాటలను నిజం చేస్తూ, పాకిస్థాన్ పాలకులు తోడేళ్ళల్లాగా వ్యవహరించి అబ్దుల్ గఫార్ ఖాన్‌ను వెంటాడి జీవిత చరమాంకం వరకు వేధించారు.

1948 ఫిబ్రవరి 23న పాకిస్థాన్ ప్రభుత్వాన్ని, పాలకులను గుర్తించినప్పటికీ, పాలకులు, పాలక వర్గాల తాబేదార్లు గఫార్ ఖాన్‌ను, ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలను, మద్దతుదారులను వదలిపెట్టలేదు. ఆవిధంగా క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటుండగా, 1949 జనవరిలో మహాత్మా గాంధీ హత్యకు గురవటంతో సరిహద్దు గాంధీ హతాశులయ్యారు. అహింసోద్యమంలో తమ మార్గదర్శి ఆకస్మాత్తుగా అంతర్ధానం కావటం, అది కూడ కిరాతకుల కుట్రకు ఆ అహింసా మూర్తి బలికావటం ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌ను వ్యాకులతకు గురిచేసింది.

ఆ తరువాత ప్రజాస్వామిక వ్యవస్థలో మనుగడ సాగించేందుకు గఫార్ ఖాన్ సోదరులు మార్చి మాసంలో పీపుల్స్ పార్టీని ప్రారంభించారు. ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తలంతా ఆయన వెంటనడిచారు. ఈ వాతావరణాన్ని గమనించిన పాకిస్థాన్ పాలకులు కళ్ళల్లో నిప్పులు పోసుకున్నారు. గఫార్ ఖాన్‌ను, ఆయన సోదరుడు డాక్టర్ ఖాన్ సాబ్‌ను అరెస్టు చేసారు. 1954 లో డాక్టర్ ఖాన్ సాబ్‌ను విడుదల చేశారు. సుదీర్ఘకాలం సరిహద్దు గాంధీని కారాగారంలో బందీచేసి అ తరువాత విడుదల చేసారు. ఈ విధంగా ఏడు సంవత్సరాల నిర్బంధం తరువాత ఖాన్ వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోకి ఆయన తిరిగి వచ్చారు. పఠాన్‌లను భూమిని **' ఫక్తూనిస్థాన్ ' గా** ప్రకటించి పాకిస్థాన్‌లో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయమని ఖాన్ గఫార్ ఖాన్ డిమాండ్ చేసారు. ఆయన డిమాండ్‌ను పాకిస్థాన్ పాలకులు త్రోసి పుచ్చారు. ఆ తరువాత జరిగిన ఎన్నికలలో మళ్ళీ డాక్టర్ ఖాన్ సాబ్ విజయం సాధించి వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి ముఖ్యమంత్రయ్యారు..

1956 మార్చి మాసంలో పాకిస్థాన్‌ని, పాలక ప్రభువులు **ఇస్లామిక్ రిపబ్లిక్** గా ప్రకటించుకున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఖాన్ గఫార్ ఖాన్ మీద పాలకుల క్రూర దృష్టి పడింది. జూన్ మాసంలో ఆయనను అరెస్టు చేసారు. భారీగా జరిమానా విధించి, ఆయన ఆస్తిపాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. డాక్టర్ ఖాన్ సాబ్ మే మాసం 9వ తేదీన హత్యకు గురయ్యారు. 1958 పాకిస్థాన్‌లో రాజ్యాంగం రద్దుచేసి ' **మార్షల్ లా** ' ను ప్రకటించారు. అన్ని రాజకీయ పార్టీలను రద్దుచేసి, నేతలను అరెస్టు చేసారు. గఫార్ ఖాన్ మీద అరెస్టు వేటుపడింది. ఆయన వృద్ధాప్యాన్ని పరిగణనలోకి తీసుకుని 1959 ఏప్రిల్‌లో విడుదల చేసినట్టే చేసి, 1961లో ఆయనను, ఆయన సహచరులను మళ్ళీ జైలు పాల్జేసారు. ప్రపంచంలో ఎవ్వరూ వెళ్ళనన్ని ఎక్కువసార్లు, ఎక్కువ కాలం జైళ్ళలో గడిపి రికార్డు సృష్టించిన ఆయనను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ Prisoner of the Year గా ప్రకటించింది. అంతర్జాతీయంగా వచ్చిన ఒత్తిడి వలన ఆయనను విడుదలచేసి, చికిత్స నిమిత్తం ఇంగ్లాండ్ పంపడానికి పాకిస్థాన్ ప్రభుత్వం అంగీకరించింది.

1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ భారతదేశం వచ్చారు. ఈ సందర్భంగా హిందూ-ముస్లింలను ఐక్యతను ఆశిస్తూ జరిగిన నిరాహార దీక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు. 1971లో వలస జీవితాన్ని ముగించి ఆయన పాకిస్థాన్ వెళ్ళిపోయారు. పాకిస్థాన్‌లో పరిస్థితులు మారాయి. ఆయనను మరోమారు అరెస్టుచేసి, ఆయన స్థాపించిన **జాతీయ అవామీ పార్టీ**ని నిషేధించారు. ఈ విధంగా పలుమార్లు

అరెస్టులు చేయడం, ఏదో ఒక కారణాన్ని పేర్కొంటూ విడుదల చేయటం గఫార్ ఖాన్ జీవితంలో భాగమైపోయింది. 1985లో భారత జాతీయ కాంగ్రెస్ స్వర్ణోత్సవాలకు గఫార్ ఖాన్ తన కుమారుడు ఖాన్ వలి ఖాన్‌తో కలసి మరోమారు భారతదేశం వచ్చారు. 1987లో చికిత్స నిమిత్తం భారతదేశం వచ్చిన ఆయనను **' భారత రత్న '** అవార్డుతో భారతీయులు గౌరవించారు.

భారత ఉపఖండంలో గాంధీజీకి ప్రతిరూపంగా నిలచిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 98 సంవత్సరాల పండు వయస్సులో **1988 జనవరి 20వ తేదీన కన్ను మూసారు.** ఆయన అంత్యక్రియలు జలాలాబాద్‌లో జరిగాయి. భారత జాతీయోద్యమంలో అద్భుత చరిత్ర సృష్టించిన ఖుదా-యే-ఖిద్మత్‌గార్ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అంతర్ధానమయ్యారు.

## ప్రశంసల జల్లు

1929లో ప్రారంభమై 1948లో అదృశ్యమై పోయిన **ఖుదా-యే-ఖిద్మత్‌గార్లు** స్వాతంత్ర్యోద్యమంలో పోషించిన అద్వితీయమైన పాత్ర, స్వజనులచే మాత్రమే కాకుండా ప్రపంచ ప్రజలందరి జేజేలు అందుకుంది. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అభ్యర్ధన మేరకు వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో పర్యటించిన మహాత్మాగాంధీ ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌ల కార్యక్రమాలను అధ్యయనం చేసాక మాట్లాడుతూ, **' ఖుదా-యే-ఖిద్మత్‌గార్ కార్యకర్తల్లా ఓ వెయ్యిమంది తయారయితే చాలు, బానిసత్వమనే సామాజిక రుగ్మతను దేశం సరిహద్దులను దాటించవచ్చు '** అని ప్రశంసించారు. గాంధీజీ తన పర్యటన పూర్తిచేసుకుని వెళ్ళిపోతూ, ఖుదా-యే- ఖిద్మత్‌గార్ కార్యకర్తలు అహింసా సిద్ధాంత భావనను వారు మరింత విస్తృతమైన భావనలో అర్ధం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ భావనను మరింత సకారాత్మకంగా, లోతుగా అర్థం చేసుకుని ఆచరించాల్సి ఉందని హితవు పలికారు.

"...The Khudai Khidmatgars have set brilliant example in the practice of nonviolence to the extent to which they have understood it. But they now have to move a step further. Their conception of nonviolence has to be broadened and their practice of it, especially in its positive aspects, made fuller and deeper, but with all that the result is sufficiently striking to encourage me to carry on with the experiment with Khudai Khidmatgars, God willing it will succeed.."

ఒకసారి గఫార్ ఖాన్ మాట్లాడుతూ , **'....మహాత్మాజీ ! ఈ ఉద్యమకాలంలో దేశంలోని పలు ప్రాంతాలలో దౌర్జన్యాలు జరిగినాయి. కానీ పఠాన్‌లు ఏ దౌర్జన్యమూ చేయలేదే ?...'** మని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా, **' అహింసా మార్గం, ధైర్యం కలవారికే త్వరగా అలవడుతుందని నేను అనేక సందర్భాలలో చెప్పాను. పఠాన్లు దౌర్జన్యాన్ని వదలుకోవడం బలహీనతకాదు. బలం ఉండటం వలననే. అందువలన ధైర్యం కలవారి అహింసా మార్గం ఎట్లా ఉంటుందో వారు చూపెట్టగలిగారు...'** అని గాంధీజీ అన్నారు.

ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లలో కన్పించిన అనూహ్యమైన మార్పును పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బహుధా ప్రశంసించారు. **' తన బిడ్డలు, సోదరుల కంటే ఆయుధాన్ని**

**అతిగా ప్రేమించి, ప్రాణాన్ని అతి చౌకగా పరిగణించిన వ్యక్తులు, చిన్న అవమానాన్ని కూడా భరించలేక ప్రతీకారం తీసుకోడానికి కత్తులు, కటార్లు తీసుకుని వెంటపడే వ్యక్తులు, ఆకస్మికంగా మారిపోయి అత్యంత ధైర్యవంతులు, ఓర్పు వహించగల సైనికులుగా మారిపోయారు '** అని అన్నారు ( "...the man who loved his gun better tha his child or brother, who valued life cheaply and cared nothing for death, who avenged the slighest insult with the thrust of a dagger, had suddenly become the bravest and most enduring of India's soldiers.." ( Two Islamic Soldiers, by Damon Lynch, The Miligazette, 16-31, January, 2002)

ఈ విధంగా స్వాతంత్ర్య చరిత్రలో ఆత్మత్యాగాలతో, ఆత్మార్పణలతో, అద్భుతమైన సహనాన్ని, ఓర్పును ప్రదర్శించి, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రత్యేక చరిత్రను సృష్టించుకున్నారు. అయినప్పటికీ, ఈ అహింసా యోధులకు లభించాల్సినంత ప్రాముఖ్యత, ప్రాచుర్యం, గౌరవం లభించలేదు. ఈ భగవత్సేవకుల వాయవ్య సరిహద్దు రాష్ట్రం పాకిస్థాన్‌లో విలీనం కావటం, ఖుదా-యే-ఖిద్మత్‌గార్‌లు ప్రారంభం నుండి ముస్లింలీగ్‌కు వ్యతిరేకం కావటం, ఆ ముస్లింలీగ్ అధికార పగ్గాలను చేపట్టి, పాకిస్థాన్ పాలకపక్షంగా అవతరించటం లాంటి ప్రతికూల రాజకీయ వాతావరణం వలన ఖుదా-యే-ఖిద్మత్‌గార్ల చరిత్ర ఇటు భారతదేశంలోనూ, అటు పాకిస్థాన్‌లోనూ తగినంత గుర్తింపుకు నోచుకోలేకపోయింది. అయితే విశ్వవిఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాలు, పరిశోధకులు ఎంతో శ్రద్ధ చూపి, ప్రపంచంలో అహింసామార్గాన పాలకవర్గాలను ఎదుర్కొన్న ప్రముఖ ఉద్యమాలలో ఖుదా-యే-ఖిద్మత్‌గార్ ఉద్యమానికి అగ్రస్థానం కల్పించారు. పలువురు జిజ్ఞాసువులు పలు పరిశోధనలు సాగించి, వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో స్వయంగా పర్యటించి ఆనాటి భగవత్సేవకులను స్వయంగా కలసి విషయ సేకరణ గావించి, గ్రంథాలను రచించి ఖుదా-యే-ఖిద్మత్‌గార్ ఉద్యమం విశిష్టతను ప్రపంచానికి చాటటం సంతోషించ దగిన విషయం.

మన రాష్ట్రపతి జనాబ్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ 1955 డిసెంబర్ 12వ తేదీన **' తోడేళ్ళ పాలు చేసారు '** గ్రంథానికి పరిచయ వాక్యం రాసారు. ఆ వాక్యాలు ఇలా సాగాయి. **' తన వీర పురుషులను గౌరవించే తీరుతెన్నులను బట్టి, ఆ జాతి మర్యాదలు విదితం అవుతాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నిర్వర్తించిన పాత్రను చూస్తే, భారత-పాకిస్థాన్‌లు రెండూ, స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరైన వీరికి ఎంతగానో రుణపడి ఉండవలె. నేటి కాలంలో ఏ వ్యక్తి కూడా చేయజాలనంతగా, మహాత్ముని అహింసాతత్వాన్ని భారీ ఎత్తున ఆచరణలో అనుసరించి చూపిన కార్యశీలి, మహనీయుడు, పఠానులను సత్యాగ్రహ సైనికులుగా రూపొందించడంలో వారు చేసిన సాధన మాకందరకూ అచ్చెరువు కలిగించినది. ప్రస్తుతం ప్రపంచం సంఘర్షణలో ఛిన్నాభిన్నం అయి ఉన్నది. అసహన ద్వేషాలనే మేఘాలు ముంచుకుని వచ్చి, ప్రపంచాన్ని అంధకారమయం చేస్తున్నవి. ప్రపంచ మనుగడకు బెడదగా ఉన్న అణ్వాయుధ వ్యవస్థకు అహింసా శక్తి ఒక్కటే**

**ప్రత్యామ్నాయం. ఈ పరిస్థితులలో ఖాన్ గఫార్ ఖాన్ ఆదర్శమే విపన్న మానవాళికి ఆశాజ్యోతి. ఆయన అన్ని మతాలను సమ గౌరవంతో సంభావించే ముస్లిం. ఆయన సమతా దృక్పథం, మతాతీత ప్రజాస్వామ్య ఆదర్శాలలో అంకురిత విశ్వాసం, సర్వసమాన సౌభ్రాతృత్వభావం, సర్వస్వాన్ని, త్యాగం చేసైనాసరే స్వాతంత్ర్యాలను నిలబెట్టవలెననే పట్టుదల, క్షమించి విస్మరించాలనే ఔదార్యం అనుసరణీయాలు...'**

ఆనాడు విద్యావేత్త, గొప్ప ధార్మికుడు డాక్టర్ జాకీర్ హుస్సేన్ వ్యక్తీకరించిన భావాలు ఈనాడు విషమిస్తున్న జాతీయ-అంతర్జాతీయ వాతావరణంలో ప్రతి ఒక్కరూ మననం చేసుకుంటూ మసలుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. ◆

# గ్రంథ రచనకు ఉపకరించిన గ్రంథాలు - పత్రికలు

## ఆంగ్ల గ్రంథాలు


01. హూ ఈజ్ హూ ; ఇండియన్ మార్‌టిర్స్ - డాక్టర్ పి.యన్.చోప్రా
02. హిస్టరీ ఆఫ్ ఫ్రీడం మూవ్‌మెంట్ ఇన్ ఇండియా - డాక్టర్ తారాచంద్
03. హూస్ హూ ఆఫ్ ఫ్రీడం స్ట్రగుల్ ఇన్ ఎ.పి. ప్రభుత్వ ప్రచురణలు, 1983
04. హైలైట్స్ ఆఫ్ ద ఫ్రీడం మూవ్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ - డా. సరోజినీరేగాని
05. హిస్టరీ ఆఫ్ దక్కన్ (2 వాల్యూమ్స్) , జె.డి.ఇ. గ్రిబ్బలీ , 1990
06. ఫ్రీడం మూవ్‌మెంట్ & ఇండియన్ ముస్లిమ్స్,-శాంతిమోయ్ రాయ్, 1983
07. వహాబీ & ఫరాజీ రెబల్స్ ఆఫ్ బెంగాల్, శ్రీ నరహరి కవిరాజ్, 1982.
08. ది ఫకీర్ అండ్ సన్యాసి అప్‌రైజింగ్స్, అటిస్ కె. దాస్ గుప్తా. 1992
09. ది మోప్లా రెబలియన్ అండ్ ఇట్స్ జెనిసెస్స్, కానార్డ్ ఉడ్, పి.పి.హెచ్.,1987
10. మోపిల్లా ముస్లిమ్స్ ఆఫ్ కేరళ, రోనాల్డ్ ఇ. మిల్లర్. 1976
11. కేరళా ముస్లిమ్స్, సంపాదకులు : అస్ఘర్ అలీ ఇంజనీర్, అజంతా, 1995
12. ది కమ్యూనల్ ట్రయాంగిల్ ఇన్ ఇండియా, అశోక్ మెహతా, 1942
13. మోడరన్ ఇస్లాం ఇన్ ఇండియా, విల్‌ఫ్రెడ్ కాంట్‌వెల్ స్మిత్.
14. ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ముస్లిం బయోగ్రఫీ, నాగేంద్రకుమార్ సింగ్, 2001.
15. బాద్షాఖాన్, శ్రీ ఏక్‌నాథ్ ఈశ్వరన్, 2001.
16. మై లైఫ్ అండ్ స్ట్రగుల్ : ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, 1969.
17. డిస్కవరీ ఆఫ్ ఇండియా, జవహర్‌లాల్ నెహ్రూ, 1983.
18. ఇండియా విన్స్ ఫ్రీడం, మౌలానా అబుల్ కలాం ఆజాద్, 1995.
19. ది ముస్లిమ్స్ ఆఫ్ బ్రిటీష్ ఇండియా, పి. హార్డీ, 1972.
20. ది బెంగాల్ ముస్లిమ్స్ 1871-1906, రఫీవుద్దీన్ అహమ్మద్, 1996.
21. ముస్లిమ్స్ & ఫ్రీడం మూవ్‌మెంట్ ఇన్ ఇండియా, కామత్ చౌబే, 1990.
22. ఫ్రీడం ఫైటర్స్ ఆఫ్ ఇండియన్ మ్యూటినీ 1857, యం.పి. శ్రీవాస్తవ,1997.
23. ది రోల్ ఆఫ్ మైనారిటీస్ ఇన్ ఫ్రీడం స్ట్రగుల్, సంపాదకులు : డాక్టర్ అస్గర్ అలీ ఇంజనీర్, 1986.
24. రైజ్ ఆఫ్ ముస్లిమ్స్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్, డాక్టర్ రఫీక్ జక్రియా,1986.
25. సపరేటిజం అమాంగ్ ఇండియన్ ముస్లిమ్స్, ఫ్రాన్సిస్ రాబిన్‌సన్, 1994.
26. ముస్లిమ్స్ ఇన్ ఇండియా, యస్. అబుల్ హసన్ అలీ నద్వీ, 1980
27. ముస్లిమ్స్ ఇన్ ఇండియా, జైన్ నరేష్ కుమార్, 1979.

28. ఇండియన్స్ స్ట్రగుల్ ఫర్ ఇండిపెండెన్స్, బిపిన్‌చంద్ర, 1997.

29. కలక్టడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మాగాంధీ, భారత ప్రభుత్వ ప్రచురణలు.

30. ది గ్రేట్ మ్యూటినీ - 1857, క్రిస్టఫర్ హిబ్బర్ట్, 1978.

31. వహాబీ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా, డాక్టర్ ఖయ్యూం అహమ్మద్

32. ది పఠాన్ అన్‌ఆర్మడ్, ముకుళికా బెనర్జీ, 2002.

33. యాన్ అడ్వాన్స్‌డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా, శ్రీ ఆర్.సి.మజుందార్, 1996.

34. టిపూ సుల్తాన్, ప్రొఫెసర్ బి. షేక్ ఆలీ, 1995.

35. ఔరంగజేబ్ అండ్ టిపూ సుల్తాన్, డాక్టర్ బి.యస్. పాండే, 1996.

36. టూ సర్వెంట్స్ ఆఫ్ గాడ్ : శ్రీ మహదేవ్ దేశాయ్, 1935.


## తెలుగు గ్రంథాలు


01. స్వాతంత్ర్య సమర చరిత్ర, శ్రీ ముక్కామల నాగభూషణం, 1990

02. భారత స్వాతంత్ర్యోద్యమంః ముస్లింలు, సయ్యద్ నశీర్ అహమ్మద్, 1999.

03. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, ప్రచురణ : కృష్ణా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, 1984.

04. నా నెత్తురు వృధా కాదు, సంపాదకులు : నిర్మలానంద, జనసాహితి,1992.

05. భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు, సయ్యద్ నశీర్ అహమ్మద్, 2001.

06. తోడేళ్ళ పాలు చేశారు. శ్రీ ప్యారేలాల్, 1969 అనువాదం: శ్రీ జి. కృష్ణ.

07. కేరళలో రైతాంగ పోరాటం, టి.కె. రామకృష్ణ, 1987.


## కన్నడం


01. భారత స్వాతంత్ర్య సంగ్రామదల్లి ముస్లిమర పాత్ర, ఖుద్దం పబ్లికేషన్స్, 1999.


## హిందీ


01. హిందూస్థానీ ముసల్మానోంకా జంగ్-ఏ-ఆజాదీ మే హిస్సా, సయ్యద్ ఇబ్రహీం ఫిక్రి, 1999.


## పత్రికలు


01. మిల్లి గజిట్, పక్షపత్రిక, 16-31, జనవరి 2002, న్యూఢిల్లీ.

02. ఆంధ్రప్రభ, దినపత్రిక 21-01-1988, హైదరాబాద్.

03. గీటురాయి, వారపత్రికలు, హైదరాబాద్.

04. ప్రజాసాహితి మాసపత్రిక, జూలై 2001, విజయవాడ


## సావనీర్స్


01. సావనీర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జెక్టివ్ స్టడీస్, న్యూఢిల్లీ, 1998.

02. రాయల సీమలో స్వాతంత్ర్యోద్యమం, అనంతపురం, 1998.


◆◆◆




# భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు

( ప్రథమ, ద్వితీయ ముద్రణ )

## పత్రికల - ప్రముఖుల స్పందన

◆ '..1857 తిరుగుబాటు నుండి మనకు స్వాతంత్ర్యం లభించేంతవరకు ప్రాణ త్యాగాలు చేసిన ఎందరో ముస్లింలు చాలా మందికి పరిచయం లేదంటే అతిశయోక్తి లేదు. మేమే నిజమైన జాతీయవాదులమని చెప్పుకునే కొందరు స్వార్థపరులు మన పొరుగున ఉన్న పాకిస్థాన్ బూచిని చూపించి భారత ముస్లింల దేశభక్తిని వేలెత్తి చూపిన సంఘటనలు కోకొల్లలు. అటువంటి స్వార్థపర శక్తుల నోటికి తాళం పడేలా ప్రముఖ జర్నలిస్ట్, రచయిత సయ్యద్ నసీర్ అహమ్మద్ **'భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లింలు '** అన్న పుస్తకంలో అనేక త్యాగాల గూర్చి తెలిపారు. ముస్లింల దేశభక్తి విషయంలో జరుగుతున్న అసత్య ప్రచారాలు ఇటువంటి పుస్తకాలు అరికట్టగలవనడంతో అతిశయోక్తి లేదు.'

**- వార్త దినపత్రిక, 07-11-1999**

◆ '..భారత విభజన అనే అంశాన్ని ముందుకు తెచ్చి ఆ నేరాన్ని ముస్లిం సమాజం మీదనెట్టి...ముస్లిమేతర జనసమూహాలలో ముస్లింల పట్ల అనుమానపు దృష్టిని సృష్టించి పెంచి పోషిస్తూ ఆయా జనసమూహాల మధ్యన మానసిక అగాధం సృష్టించే ప్రయత్నాన్ని మతతత్వ శక్తులు విజయవంతంగా సాగిస్తున్నాయి. అందువలన భారతీయ జనసమూహాల మధ్య ఏర్పడిన దూరాన్ని తగ్గించాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితులలో ఎంతగానో ఉందని భావించిన రచయిత...ఆదిశగా సాగిస్తున్న కృషిలో భాగంగా ముస్లింస్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ జీవితాలకు కల్పించిన అక్షర రూపమే ' **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు** '.

**- ప్రజాశక్తి దినపత్రిక, 13-02-2000**

◆ **'..**భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్ర గురించి ఎవరికీ సరైన అవగాహన లేదు. ఈ అవగాహనను తెలుగులో ప్రాంభించిన తొలి చారత్రిక పరిశోధకునిగా సయ్యద్ నశీర్ అహమ్మద్‌ను పేర్కోనాలి. రచయితకు ఉండాల్సిన పరిణితి, విమర్శనాత్మక దృక్పధం..సమపాళ్ళలో మేళవించి **'భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు'** రచించారు...ఈ చిన్న పుస్తకం వెలుగులో చరిత్రపరిశోధకులు మరింత పరిశోధన జరిపేందుకు స్ఫూర్తి ఉంది.'

**- విజేత దినపత్రిక,17-05-2000**

◆ '..అమూల్యమైన సమాచారాన్ని ప్రోదిచేసి 32 పేజీల '**భారతస్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు**' అన్న చిన్న పుస్తకంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ రూపొందించారు...'

**– ఆంధ్రప్రభ, దినపత్రిక, 14-02-2000**

◆ '..త్యాగ చరిత్రకు వీర సంస్కృతికి వేల సంవత్సరాల చరిత్రగల మన దేశంలో ముస్లింల స్థానం ఎంత ఉంది? అనే ప్రశ్నకు సమాధానాలు వడ్డించిన విస్తరులుగా సుప్రసిద్ధ జర్నలిస్టు సయ్యద్ నశీర్ అహమ్మద్ అమర్చి పెట్టారు. ఆయన రాసిన పుస్తకం **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు** చరిత్ర చెప్పజాలని అనేక వీరగాథలకు సుదీర్ఘ సంస్కృతిలో ముస్లింల పాత్ర పెనవేసుకు పోయిన సంగతికి ఆయుష్షు పోస్తుంది.'

**– జనమిత్ర వారపత్రిక, యానాం, 20-02-2000**

◆ '..జాతీయ భావనలున్న ప్రతి వ్యక్తి చదివి తీరవలసిన పుస్తకం....32 పుటల్లోనే విలువైన సమాచారాన్నాందించారు...రచయితకు హృదయపూర్వక అభినందనలు..'

**– నడుస్తున్న చరిత్ర మాసపత్రిక, జనవరి 2000**

◆ '... Indian Freedom Struggle : Muslims is a tribute to those sincere freedom fighters whom we unfortunately forgotten.... Written in simple and lucid Telugu, the small book mirrors the perod since the entry of the East India Company into to August 15th, 1947... Naseer Ahamed begins his book with the role played and foundation laid for the freedom srtuggle by innumerable Muslim fakir, the wahabi movement and kings and sulthans long before the first war of Independence took place 1857.

**-Indian Express Daily News paper, 26-11-1999**

◆ భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసి ప్రచురిస్తున్న ...గ్రంథాలు ఆంధ్రదేశంలోని చరిత్రకారులు, పరిశోధకులు, దేశ శ్రేయోభిలాషులందరు అవశ్యం చదువవలసిన గ్రంథాలు. ప్రతీ గ్రంథాలయాన్ని అలంకరించవలసిన అమూల్య స్వాతంత్ర్యోద్యమ సాహిత్య రత్నాలు.

**–ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు శ్రీ పరకాల పట్టాభి రామారావు,**
**విజయవాడ, 13-07-2003**

◆ ఈ దేశంలోని ముస్లింలు ఎవ్వరికీ తీసిపోని విధంగా స్వాతంత్ర్యసంగ్రామంలో తమదైన మహత్తర పాత్రను నిర్వహించారు. అటువంటి అపూర్వ చరిత్రను తెలుగు పాఠకులకు అందిస్తున్న రచయిత నశీర్ అహమ్మద్‌కు ప్రతి ఒక్కరి తోడ్పాటు అవసరం.

**–ప్రొఫెసర్ యల్. వేణుగోపాల రెడ్డి,**
**వైస్ ఛాన్సలర్, నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు. 26-10-2003**




# భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లిం మహిళలు

### (ప్రథమ, ద్వితీయ ముద్రణలు)

## ప్రముఖుల - పత్రికల స్పందన

◆ '..భారత స్వాతంత్ర్య సాధనలో, అభ్యుదయ పరంపరలో భాగస్వాములైన ముస్లిం వనితల చరిత్రను వెలువరించి, హిందువులమే భాతర స్వాతంత్ర్యాన్ని సాధించామని, ముస్లింలకు భాగస్వామ్యం లేదని చాటే మరుగుజ్జులకు చెంపదెబ్బగా ఈ రచన శాశ్వతంగా నిలుస్తుంది...'

**-ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య, 12-6-1999**

◆ '..మీరు ప్రచురించిన **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు**, అనే గ్రంథం ఇటీవల వెలువడిన ఉత్తమ గ్రంథాలలో ఒకటని భావిస్తున్నాము. ఎందుకంటే భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు ప్రత్యేకించి మహిళలు ఎంత వీరోచిత పాత్ర నిర్వహించారో చాలా మందికి తెలియదు. భారత ముస్లింలందరూ స్వాతంత్ర్యోద్యమానికి దూరంగా ఉన్నారనీ, వారు స్వాతంత్ర్యోద్యమానికి వ్యతిరేకంగా ఉన్నారని, అపవాదు ప్రచారంలో ఉంది. అటువంటి అపవాదును పోగొట్టడానికి మీ గ్రంథం ఎంతో తోడ్పడగలదు. అభినందనలు.'

**-ప్రముఖస్వాతంత్ర్యసమరయోధులుశ్రీపరకాలపట్టాబిరామారావు,27-10-1999**

◆ '.. చరిత్ర గర్భంలో కలసిపోయిన ముస్లిం మహిళా ఆణిముత్యాల్ని వెలికి తీసి, స్వాతంత్ర్యోద్యమంలో వారు చేసిన త్యాగాల్ని, బలిదానాల్ని మీరు వివరించారు. మీ కృషిని అభినందిస్తున్నాను.'

**- ప్రముఖ రచయిత శ్రీ సి.వి. 18-06-1999**

◆ '...ముస్లింల దేశభక్తిని శంకించి అపోహలను ప్రచారం చేస్తున్న కుహనా జాతీయవాదులకు ఈ పుస్తకం చెంపపెట్టు అనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు..'

**-ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక** 12-08-1999

◆ '...భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం మహిళల గురించి తెలుగులో వచ్చిన మొదటి పుస్తకం ఇది...ఈ పుస్తకాన్ని తక్కిన భారతీయ భాషల్లోకి, ఆంగ్లంలోకి అనువాదం చేసి ప్రచురిస్తే భారత సమాజం మరింత సంఘటితం కావటానికి తోడ్పడుతుంది...'

**-నడుస్తున్న చరిత్ర, మాసపత్రిక ఆగష్టు, 1999**

◆ '..భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం మహిళలు వెనుకబడలేదని..బేగం హజరత్ మహల్ ముఖ చిత్రంతో వెలువడిన ఈ గ్రంథం ఈ రచయిత గ్రంథాలలో మణిపూస అని చెప్పవచ్చు..'

**-విశాలాంధ్ర దినపత్రిక, 13-07-2003**

◆ '...విదేశీ దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేయడంలో మైనారిటీ మహిళలు కూడా తమవంతు పాత్రను నిర్వహించారని, ఆ క్రమంలో అప్పటి సంప్రదాయాలను , కట్టుబాట్లను ఛేదించుకుని బయటికి రావడానికి కూడా సంకోచించ లేదని నిరూపించటంలో సఫలమయ్యారు రచయిత. మతవిద్వేషాలు సామాజిక వాతావరణాన్ని కలుషితం చేస్తున్న ఈ తరుణంలో ఇలాంటి పుస్తకాలు, అదీ స్థానిక భాషలలో రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది..'.

**– ఆంధ్రజ్యోతి దినపత్రిక 12–06–2003**

◆ '...నేడు ' సరిదిద్దే ' పేరుతో చరిత్రను కాషాయీకరించే సర్కారీ ప్రయత్నాలు సాగుతున్నాయి. దేశ విభజనకు దారి తీసిన పరిణామాలపై కూడా వక్రీకరణలు చేస్తున్నారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మొదట ప్రచారంలోకి తెచ్చింది హిందూ ఛాందసనాయకుడు వి.డి. సావర్కర్ కాగా ముస్లిం నేతలే మొదట ద్విజాతి సిద్ధాంతాన్ని తెచ్చారని వాదనలు ముందుకు తెస్తున్నారు. ఈ స్థితిలో నశీర్ అహ్మద్ చేస్తున్న కృషి అభినందించ దగింది.... మన దేశంలోని ముస్లిం మహిళలు కూడా ఆ పోరాట పటిమను, దృఢచిత్తాన్ని దేశ స్వాతంత్ర్య పోరాటంలో చూపెట్టారు. వారి ధైర్యసాహసాలను, పాఠకుల కళ్ళముందు ఆవిష్కరింపచేస్తుంది సులభ శైలిలో సాగిన ఈ పుస్తకం.'

**–ప్రస్థానం, త్రైమాసపత్రిక, జనవరి–మార్చి 2003**

◆ '...బురఖాలు ధరించే ముస్లిం మహిళలకు ప్రపంచం తెలియదని భావించే వారు అచ్చెరువొందే సంఘటనలతో పునర్ముద్రణకు నోచుకున్న పుస్తకం **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు**, పుస్తక పఠనం పై ఆసక్తి సన్నగిల్లిన నేటి పరిస్థితులలో ఈపుస్తకం...రెండో ముద్రణకు రావడం విశేషం...చరిత్రను శోధించి సేకరించిన సమాచారాన్ని సులభశైలిలో అందించటంలో మంచి కృషిచేశారు రచయిత.'

**–ప్రజాశక్తి ఆదివారం. 2003**

◆ ' స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ముస్లిం మహిళల గురించి సయ్యద్ నశీర్ అహ్మద్ రాసిన **భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు** స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం మహిళల పాత్రను వివరిస్తూ తెలుగులో వచ్చిన తొలి పుస్తకం ఇది...ఈ పుస్తకం చదవడం ద్వారా చరిత్రలో చిరస్థాయిగా నిలచిన అనేకమంది మహిళల వీరోచిత గాథలను, జీవితాలను తెలుసుకోవచ్చు. నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో అగ్రగణ్యులుగా వెలుగుతున్న మహిళలకు దశాబ్దాల క్రితంనాటి మహిళలు ఏ విధంగా తీసిపోరని నిరూపిస్తోంది ఈ గ్రంథం. అప్పటి మహిళల వీరోచిత గాథలు ఎంతో ఉత్తేజపరుస్తాయి. ఏదో విధంగా అణిచివేతకు గురౌతున్న నేటి మహిళలందరూ ఈ పుస్తకాన్ని చదివి కొంతైనా పోరాటపటిమను అలవర్చుకుంటే మహిళల అణచివేత అనేది ఏనాటికైనా రూపుమాసే అవకాశం అభిస్తుంది.'

**– వార్త దినపత్రిక, 23–11–03**

◆ "Advocate, Journalist Syed Naseer Ahamed has really done a tremendous job...It needs translation in all Indian languages.. A must for all intellecutals, students and all those who want to know about the brave women who brought Independence to our motherland..."

**-Indian Express, Daily News Paper, 25-06-1999**

◆ "..It is the first book of its kind in Andhra Pradesh in Telugu Language..."

**-Dalith Voice Fortnightly**
**July 16-31, 1999**

◆ "...Continuing the daunting task of bringing into lime light hundreds of unknown or unacknowledged Muslim martyrs, advocate-journalist Syed Naseer Ahamed came out with his book INDIAN FREEDOM STRUGGLE : MUSLIM WOMEN in Telugu."

**- Radiance Views Weekly,**
**6-12 July 2003**

◆ " This is useful for the students of history and the general reader who want to know more about Indian Freedom Struggle. It should be translated in English, Hindi and other Indian Languages."

**- The Milli Gazette, Fortnightly,**
**18-31 July 2003**




# భారత స్వాతంత్ర్యోద్యమం: ఆంధ్ర ప్రదేశ్ ముస్లింలు

(ప్రథమ, ద్వితీయ ముద్రణలు)

## ప్రముఖుల - పత్రికల స్పందన

◆ '... మంచి గ్రంథం రాసారు. సంతోషం. స్వాతంత్ర్యసమరంలో ముస్లిం యోధుల త్యాగాలను వెలుగులోకి తెస్తూ, మీరు ప్రచురిస్తున్న పుస్తకాలు గతంలో కంటే ఈనాడు ఎంతో అవసరంగా ఉన్నాయి. మంచి ప్రయత్నం చేస్తున్నారు. మీ కృషి విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను...'

**- ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య,**
**గుంటూరు,4-11-2002**

◆ '... ప్రచురిత చరిత్ర గ్రంథాలలో ముస్లిం స్వాతంత్ర్యసమరయోధుల గురించి సమాచారం చాలా తక్కువ. ప్రత్యేకించి గ్రంథం ఏదీ వెలువడలేదు...మీరు గ్రంధం ప్రచురించి సమాజానికి గొప్ప మేలు చేశారు... ఒక వర్గాన్ని మరొక వర్గం ఏదో ఒక నెపం మీద తప్పు పట్టే పాపిష్టి ధోరణి తలెత్తుతున్న పరిస్థితులలో ఇలాంటి గ్రంథాలు ప్రజలను విజ్ఞానవంతుల్ని చేస్తాయి...మీ కృషిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. మన స్వాతంత్ర్య సమరయోధులు పలికిన దేశభక్తి ప్రపూరిత సూక్తిమౌక్తికాలు మీ గ్రంథం విలువను ఇనుమడింప జేశాయి. ఆ మహనీయుల వాక్కులు తరతరాలకు స్ఫూర్తిదాయకాలు...'

**– శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, హైదరాబాద్, 24-11-2001**

◆ '...స్వాతంత్ర్య సమరంలో అనేక మంది ముస్లిం యోధులు పాల్గొని జాతి విముక్తి కోసం పోరాటాలు చేశారు. అలాంటి పోరాట వీరుల గురించి సంక్షిప్తంగా గ్రంథరూపంలో అందించటం అభినందనీయం..'

**– ఆచార్య ఎన్.గోపి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.**

◆ '...మన దేశ చరిత్రలో– ప్రత్యేకించి మన రాష్ట్రంలో చరిత్ర రచనలోని ఒక ముఖ్యలోటుని మీరు తీరుస్తున్నారు. ఇది ఒక మంచి పని. రెండోది, యివ్వాళ దేశంలో నెలకొన్న వాతావరణంలో సామాన్య ప్రజానీకానికి, విద్యాధిక మధ్యతరగతి వర్గానికి యిటువంటి గ్రంథాలు కనువిప్పు కావాలి...'

**– ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, 17-07-2003.**

◆ '...ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగమయ చరిత్రలకు ఆవరించిన చీకటిని తొలగించి భారత స్వాతంత్ర్యోద్యమ సమగ్ర చరిత్ర రచనకు ఎంతో దోహదం చేకూర్చారు...'

**– ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు శ్రీ పరకాల పట్టాభి రామారావు, విజయవాడ, 13.7.2003**

◆ '...ప్రముఖ పత్రికా రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ పరిశోధనాత్మక పంథాలో సాగించిన రచన ఇది. శతాబ్దాల సాహితీ, స్వాతంత్ర్య చరిత్రలో అట్టడుగున కనిపించకుండా పడివున్న పలువురు ముస్లిం వీరుల గాథల్ని తెలుగు పాఠకులకు అందించిన ఘనత ఈ రచయితకే దక్కింది. మన స్వాతంత్ర్యోద్యమంలో ఈ త్యాగధనులు నిర్వహించిన పాత్రను వెలికి తీసి తనదైన, సరళమైన శైలితో తెలుగు పాఠకులకు అందించారాయన...'

**– వార్త, దినపత్రిక, 07-10-2001**

◆ ' కనులకు కట్టినట్టు వర్ణించారు...స్వాతంత్ర్యోద్యమాలలో హిందువులతో కలిసి చేయి చేయి కలిపి, సరిసమాన కష్టాలనుభవించిన జాతీయ ముస్లిం నాయకుల జీవిత చరిత్రలు లేని లోటును కొంతవరకైనా తీర్చినందుకు అభినందించవలసిందే.'

**– ఆంధ్రప్రభ దినపత్రిక, 11-11-2001**

◆ '...ఈ పుస్తకం చదివితే మన దేశంలోని ముస్లింల పై కొందరికి గల అపోహలు దూరమవుతాయనడంలో అతిశయోక్తి లేదు...'

**– ప్రియదత్త, వారపత్రిక,** 7-11-2001.

◆ '...**భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు** అనే గ్రంథం రాసి చరిత్ర కళ్లు తెరిపించారు. తెల్ల దొరలకు వ్యతిరేకంగా స్వేచ్ఛా-స్వాతంత్ర్యాల కోసం పరితపించి, పోరాడిన అమానుల్లా ఖాన్...షహీద్ షోయాబుల్లా ఖాన్...మహమ్మద్ ఇస్మాయిల్...షేక్ గాలిబ్ సాహెబ్...అబిద్ హసన్ సఫ్రాని గురించి నశీర్ అహమ్మద్ గ్రంథీకరించకుంటే మనకు తెలిసేవారు కారు. 1857కు పూర్వం నుంచి స్వాతంత్ర్య పోరాటం వరకూ పాల్గొన్న వీరుల సమాచార్నాంతా సేకరించి, అతిశయోక్తులకు పోకుండా, వాస్తవికంగా రాసారు. ఇంత మంది ఘన చరిత్రవున్న ముస్లిం దేశ భక్తుల గురించి కనీసం పాఠ్యాంశాలుగా కాదు గదా చరిత్ర రచనలో సైతం విస్మరించబడటం పెద్ద కుట్ర. ఆ కుట్రను బద్దలు కొట్టిన నశీర్ అహమ్మద్ అభినందనీయుడు. **– ప్రజాశక్తి, దినపత్రిక,** 25-11-2001

◆ '...భారత స్వాతంత్ర్యోద్యమంలో రాష్ట్రంలోని ముస్లిం జనావళి త్యాగాలను తెలుసుకోగోరు ప్రతి ఒక్కరూ ఈ గ్రంథాన్ని చదివి తీరాల్సిందే..'

**– స్వర్ణాంధ్ర, సాయంకాల దినపత్రిక,** 22-11-2001

◆ '...చరిత్ర విద్యార్థులకు సైతం తెలియకుండా, యిదే అసలైన చరిత్ర అంటూ బలవంతంగా వల్లె వేయిస్తున్న దేశ చరిత్రలో దాగివున్న పార్శ్వాన్ని రచయిత ఈ పుస్తకం ద్వారా వెలికి తీసారు...ముస్లిం దేశభక్తి పరీక్షలకు గురవుతున్న తరుణంలో మాకూ ఓ చరిత్ర ఉంది, అది ఈ మట్టితో, మా దేహ, మానప్రాణాలతో ముడివడి వుందని నిరూపించే చక్కటి ప్రయత్నం ఈ పుస్తకం..' **– గీటురాయి, వారపత్రిక,** 16-11-2001.

◆ '... ఆణి ముత్యం ఈ పుస్తకం.. శ్రీ నశీర్ ఎక్కడా చారిత్రక పరిధి దాటకుండా సత్యనిష్టతో సత్యాన్ని సత్యంగా చెప్పడానికి ప్రయత్నించారు...పునరుక్తి దోషం లేకుండా తొట్రుపాటు లేకుండా ఆయన అందించిన విశేషాలు ఆసక్తి గొలుపుతున్నాయి.

**– ప్రజాపత్రిక, వారపత్రిక, రాజమండ్రి,** 21-09-2001.

◆ '... ముస్లింల దేశభక్తి పై ప్రశ్నలు కురిపించే...నిద్రానటులకు సమాధానం విషయం ఏమోగాని ముస్లింల స్వాతంత్ర్య పోరాటాల త్యాగమయ చరిత్ర స్వయాన ముస్లిం ప్రజానీకం పాలిట మాత్రం కల్పతరువుగా ఈ పుస్తకాన్ని భావిస్తానంటూ ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా, నశీర్ కృషిని ప్రశంసించిన తీరును, ఈ పుస్తకం చదివిన ప్రతి పాఠకుడు అంగీకరించక తప్పదు...ఈ రేఖా చిత్రాలను ఎంతో బలంగా, స్ఫూర్తిదాయకంగా, నిజాయితిగా ' కొండ అద్దమందు కొంచమై వుండదా? అన్న విధంగా చిత్రించారు రచయిత...ఇటువంటి విశేష సమాచారంతో తెలుగులో ఇంత వరకు ఇటువంటి గ్రంథం రాలేదు...'

**– ఎడిటర్, వారపత్రిక,** 3-9 అక్టోబరు, 2001.




# షహీద్-యే-ఆజం
# అష్ఫాఖుల్లా ఖాన్

( ప్రథమ ప్రచురణ మీద స్పందన )

◆ '... 32 పేజీల పుస్తకం **షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్** ఒక అద్భుత పరిచయంగా చెప్పవచ్చు. హిందూస్థాన్ రిపబ్లిక్ అసోషియేషన్ ముఖ్యనాయకుడు శ్రీరాంప్రసాద్ బిస్మిల్-అష్ఫాఖుల్లాల స్నేహం, సామరస్యం, ఉమ్మడి త్యాగం..వర్ణించిన క్రమం పాఠకుల్ని వదలనివ్వకుండా చదింవించగలదు.... అష్ఫాఖుల్లా ఖాన్ అమర చరిత్రను కష్టించి వెలుగులోకి తెచ్చిన మిత్రుడు నశీర్ అహమ్మద్ కృషి ప్రశంసనీయం. ఇది తప్పక చదవాల్సిన పుస్తకం.'

**- ప్రజాసాహితి, మాసపత్రిక, డిసెంబరు,** 2002

◆ '.. విస్మృతికి గురయిన అమర వీరుల చరిత్రను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంలో వెలువడిన చిరుపొత్తమే **షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్**. ..భారత జాతీయోద్యమంలో పాల్గొన్న ముస్లింల చరిత్ర గురించి మరుగునపడిన ముస్లిం దేశభక్తుల గురించి ప్రామాణికమైన పరిశోధనా గ్రంథాలను వెలువరిస్తున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషి ప్రశంసనీయం.

**- ప్రజాశక్తి, దినపత్రిక, అక్టోబర్** 6, 2002

◆ '...భారత స్వాతంత్ర్యోద్యమంలో ఈ గడ్డబిడ్డలైన ముస్లింల త్యాగాలను తెలుగు పాఠకులకు అందించాలన్న లక్ష్యంతో, అధ్యయనం-రచన-ప్రచురణను ఒక ఉద్యమంగా నిర్వహిస్తున్న ప్రముఖ పాత్రికేయుడు, న్యాయవాది సయ్యద్ నశీర్ అహమ్మద్ మూడు మాసాల వ్యవధిలో **షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్** అను మరో గ్రంథాన్ని రచించి ప్రచురించి తెలుగు పాఠకులకు అందించారు...'

**- విజేత, దినపత్రిక** 03-08-2002

◆ '...ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, అకాడమీలు చేయాల్సిన పనిని ఉడతాభక్తితో చేపట్టి, పరిమితుల మేరకు కొనసాగిస్తున్న రచయితను, ప్రచురణకర్తలను ఈ సందర్భంగా అభినందించక తప్పదు.'

**- స్వర్ణాంధ్ర, సాయంకాల దినపత్రిక,** 07-09-2002

◆ '...అష్ఫాఖ్ సింహం లాంటి జీవితకథను సయ్యద్ నశీర్ అహమ్మద్ తెలుగు పాఠకుల కోసం సరళమైన భాషలో అందించారు.'


**- వార్త, దినపత్రిక,** 09-02-2003

◆ '...భగత్ సింగ్‌కు .. స్ఫూర్తినిచ్చిన అమర వీరుడు అష్ఫాఖుల్లా ఖాన్ త్యాగ చరిత్రను యెంతో ప్రయాసపడి శ్రీ నశీర్ అహమ్మద్ పుస్తకంగా తీసుకొచ్చారు...మునుపటి కంటే చక్కని శైలితో, చారిత్రక విషయాలనూ, వారి భావనలనూ, యధాతధంగా కవితాత్మకంగా వ్యక్తీకరించి ఆనాటి చరిత్రను మన కళ్ళముందుంచారు. పుస్తకం చివరి వరకూ వురకలు పెట్టించి, చివరికి వచ్చేసరికి చదువరులలో చెరగని ముద్రవేశారు.'

**– గీటురాయి, వారపత్రిక,** 11-10-2002

◆ '...విప్లవ చరిత్రను పరిశీలించి, పరిశోధించి యువతరాన్ని ఉత్తేజపర్చేలా రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ చేసిన కృషి అభినందనీయం. అష్ఫాఖుల్లా ఖాన్ జీవిత కథనం పాఠకుడ్ని కదిలించేలా ఉంది. మనకు తెలియని చరిత్ర పాఠ్యాంశాన్ని చదువుతున్న అనుభూతి కలుగుతుంది...ఈ పుస్తకంలో ప్రతి అక్షరం చరిత్రకు దర్పణం పడుతున్నాయి.'

**– జనమిత్ర, వారపత్రిక,** 29-09-2002




# మైసూరు పులి
# టిపూ సుల్తాన్

**పత్రికల - ప్రముఖుల స్పందన**

◆ '..ముస్లింల పట్ల చెలామణిలో ఉన్న ఆరోపణలను పూర్వపక్షం చేస్తూ, వాస్తవాలను వివరించేందుకు ఆయన (నశీర్) తన రచనల ద్వారా కృషి చేస్తున్నారు. లౌకిక ప్రజాతంత్ర స్ఫూర్తిని పెంపొందించేందుకు తన వంతు పాత్రను నిర్వహిస్తున్నారు... భారత దేశంలోని ముస్లింల మీద సైద్ధాంతికంగాను, భౌతికంగాను దాడులు జరుగుతున్న ప్రస్తుత సమయంలో ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవవలసింది.'

**– ప్రజాశక్తి, దినపత్రిక** 02-06-2002

◆ '...టిపూ సుల్తాన్ మీద ప్రచారంలో ఉన్న అసత్య అరోపణలోని నిజనిజాలను కూడా ప్రస్తావిస్తూ టిపూ చర్యలను ఏవిధంగా వక్రీకరించింది, రచయిత తగిన రుజువులతో స్పష్టపర్చారు...నశీర్ చేస్తున్న కృషి సముద్రంలో నీటి చుక్కలాంటిదైనా ఎంతగానో ప్రశంసనీయమైంది.'

**– విజేత, దినపత్రిక** 01-07-2002

◆ '..టిపూను అన్ని కోణాల నుండి పాఠకుడికి పరిచయం చేస్తూ, పుస్తకంలోని ప్రతి అంశానికి ప్రామాణికత సమకూర్చటంలో రచయిత శ్రీ నశీర్ సఫలీకృతులయ్యారు. ...తెలుగులో ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను రాసి ప్రచురించిన తొలి పరిశోధనాత్మక రచయితగా ఆయన ఖ్యాతి గడించారు.'

**– స్వర్ణాంధ్ర సాయంకాల దినపత్రిక,** 02-07-2002

◆ '...ముస్లింలకు జరిగిన అన్యాయాలను, తప్పిదాలను సరిదిద్ది జనావళికి అందించే బాధ్యతను సయ్యద్ నశీర్ అహమ్మద్ తన భుజాలమీద వేసుకున్నారు...**మైసూరు పులి :టిపూ సుల్తాన్** అనే చిరు పుస్తకంలో రచయిత టిపూకు సంబంధించిన సమగ్ర చరిత్రను, వ్యక్తిత్వాన్ని చిత్రీకరించే ప్రయత్నం చేశారు...మంచి భాష, శైలి, అంతకు మించి మంచి ఉద్దేశ్యంతో... వెలువరించిన ఈ చిరు పుస్తకం ప్రతి ఒక్కరూ చదువదగింది.'

**– గీటురాయి, వారప్రతిక** 06-09-2002

◆ '..ఈ పుస్తక రచన చాలా పరిశోధనాత్మకంగా సాగింది. పుస్తకం పేజీల లెక్కన చూస్తే చిన్నదే అయినా, అంశాన్ని బట్టి బేరీజు వేస్తే ' **పిట్ట కొంచెం కూత ఘనం**' అనక తప్పదు...చారిత్రిక వ్యక్తుల వ్యక్తిత్వాల ఆవిష్కరణలో రచయిత చక్కని సమతౌల్యం, నిజాయితీ పాటించారు. ' **– ఎడిటర్, వారపత్రిక,** 14-20 ఆగష్టు 2002

◆ '..చరిత్రను వక్రీకరిచటంలో మన పెద్దలు పోటీ పడ్డారు. అందులోనూ ముస్లిం సోదరుల చరిత్రను మన దేశంలో వక్రీకరించబడినంత దారుణంగా మరే దేశంలో వక్రీకరించబడలేదు.అంతర్జాతీయ కమ్యూనిస్టుల త్యాగాలు ఎలా వక్రీకరించబడ్డాయో మనదేశంలోని ముస్లింల త్యాగాలు కూడా ఆలా వక్రీకరించబడ్డాయి...టిపూ సుల్తాన్ చరిత్రను మరోసారి గుర్తు చేస్తూ శ్రీ నశీర్ అహమ్మద్ చిన్న పుస్తకం రాసారు..కృషి ప్రశంసనీయం..'

**– ప్రజాపత్రిక, జాతీయ వారపత్రిక,** 02-08-2002

◆ పుస్తకం చిన్నదే. అంశం మాత్రం చాలా పెద్దది. దేశాన్ని బ్రిటీష్ వారికి తాకట్టు పెట్టిన హిందూ రాజుల చరిత్రలు ఈ దేశంలో భద్రంగా లిఖించబడ్డాయి. కానీ దేశం కొరకు చివరి రక్తం బొట్టు ధారబోసిన ' **దక్షిణ భారత దేశ నెపోలియన్** ' పేరొందిన మైసూరు పులి టిపూ సుల్తాన్ చరిత్ర మాత్రం మనకు తెలిసింది బహు తక్కువ. అ లోటు తీర్చడానికి టిపూ సుల్తాన్ జీవిత విశేషాలతో ఒక పుస్తకాన్ని రచయిత...తెలుగు పాఠకలోకానికి అందించడం విశేషం...చరిత్ర సృష్టించాలనుకొన్న ప్రతివారు టిపూ లాంటి అగ్గినిప్పు చరిత్రను చదివి తరించవలసినదే. **– జన మిత్ర వారపత్రిక, 7-7-2002**

◆ '...శైలి బాగుంది.చరిత్ర చెబుతున్నా కథనాత్మకంగా ఉంది. కొన్ని చోట్ల తెలుగు నుడికారం నిగారించింది. టిప్పూ మరణించిన ఘట్టం గుండెను కుదిపేసింది...లౌకిక ప్రభువుగా టిప్పూను అద్భుతంగా చూపారు. ఆయన మీద వచ్చిన ఆరోపణలను బలంగా తిప్పికొట్టారు...విదేశీ వస్తువుల బహిష్కరణలో ఆయన చూపిన చొరవ జాతీయ భావాలకు పతాక. ఇటీవల తెలుగులో జీవిత గాథల్లో గొప్పగా వచ్చిన పుస్తకం అనుటలో అత్యుక్తి లేదు...' **– ప్రముఖ రచయిత శ్రీ కత్తి పద్మారావు,** 30-05-2002

భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనసముదాయాల
మహోన్నత భాగస్వామ్యాన్ని వివరిస్తూ వెలువడిన

# సయ్యద్ నశీర్ అహమ్మద్

## రచనలు

**1. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం మహిళలు**

( ద్వితీయ ముద్రణ 2003, పేజీలు 80, వెల రూ 20-00)

**2. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లింలు**

( ద్వితీయ ముద్రణ 2003, పేజీలు 44, వెల రూ 10-00)

**3. భారత స్వాతంత్ర్యోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు**

( ద్వితీయ ముద్రణ 2001, పేజీలు 80, వెల రూ 30-00

**4. మైసూరు పులి : టిపూ సుల్తాన్**

( ప్రథమ ముద్రణ 2002, పేజీలు 24, వెల రూ 05-00 )

**5. షహీద్-యే-ఆజం అష్ఫాఖుల్లా ఖాన్**

( ప్రథమ ముద్రణ 2002, పేజీలు 24, వెల రూ 10-00 )

**6. భారత స్వాతంత్ర్యోద్యమం : ముస్లిం ప్రజాపోరాటాలు**

(ప్రథమ ముద్రణ 2003, పేజీలు 176, వెల రూ 50-00 )

**( తపాల లేక కొరియర్ ఖర్చులు అదనం )**

## రాబోవు గ్రంథాలు

**1. భారత స్వాతంత్ర్యసంగ్రామం : ముస్లిం యోధులు**

**2. చరిత్ర సృష్టించిన ముస్లిం మహిళలు**

**3. భారతీయ ముస్లిం సమాజం : అపోహలు - వాస్తవాలు**

**4. భారతీయ ముస్లింలు - స్థితిగతులు**


## ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్

**3-506, అప్పాఘర్, ఉండవల్లి సెంటర్ - 522 501,**

**తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.**

✆ 08645-272940, సెల్ : 94402 41727

e-mail : naseerahamed@yahoo.com

